
బాలభారతీయము.

కొత్తపల్లి సూర్యారావుచే



1935.

మనవి.

ఈయప్పకవికృత సంస్కృత బాలభారతమునకు, సాహిత్యపరిషత్పుస్తకభాండాగారమునందు రెండు తాళపత్రముల ప్రతులున్నవి. మూలమాత్రమే. దీనికి మనోహరనామకము మంజరీ త్రిస్థానపు వ్యాఖ్యానము గలదు గాని యది నాకు లభింపలేదు. నాకు దొరకిన రెండుప్రతులలో నొకటి యసంపూర్ణపుస్తకము. ఈ భారతమును సాధారణముగ తెలుఁగుదురు. పండితలోకమే యెఱుఁగుదురను. చాలనాళ్ళక్రిందట, బ్ర. కోలాచలము శ్రీనివాసరావుగారు దీనికిఁ బద్యములు రచియింపఁ బ్రారంభించిరి గాని, పూర్ణగ్రంథము దొరకమి, పవిత్రమైన గ్రంథముగానిని, నిరువది సర్గములకు నాల్గింటినిమాత్రమే తెనిఁగించి ప్రకటించిరి. వారు వ్రాసిన కావ్యములనువాదమును నాకిది సంపూర్ణగ్రంథము లభింపలేను. లభియించిన ముగించియుందురు. విజయనగరపండితులు నీ మూలము ప్రకటింప నున్నారని వింటినిగాని వారాపనికిఁ బూనఁగ లేదు. నాస్వేచ్ఛానిధానమునం గ్రమము దప్పకుండ నీవనరచనకు మొదలిడి యిట్లు ప్రకటింపఁ జాలితిని. ఆంధ్రకావ్యములవలె నాశ్వాసములక్రింద విభజించితిని.

అప్పకవి కృతమగు నలకీర్తికౌముదిలోని కొన్ని సర్గములు మాత్రము పరిషత్పత్రికలో నొకప్పుడు ప్రకటింపఁబడినవి. ఆసర్గముల నిచ్చిన బ్ర. పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారీయగస్త్యుఁ డనేకగ్రంథములను రచియించె ననియును నీతనికే విద్యానాథుఁ డను బిరుదు గలదనియుఁ జెప్పిరి. తత్కృతగ్రంథము

భారతబద్ధనిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున రచియింపుము." బు
ద్ధిమంతుఁడవు గావున సంగ్రహ "మధికధీయుక్తిమెయి" నొనర్పు
మనియు నన్నయ భట్టును గోరెను.

అక్కారణముననే సంస్కృత పండితుల కింపు జనింప నగస్త్య
కవిరచియించిన దానికిఁ దెనుఁగుపండితులకుఁ గాకున్న సాధార
ణాంధ్రులకైన నింపు జనింపవచ్చు ననియు భారత సార శ్రవణము
పరమార్థ మనియు మూలము ననుసరించి నేను దెనిఁగించితిని.
"సాధారణభాషాపరిచయముగలవాఁడ" నగుటను "పండితుఁడ
ను" గాకపోవుటచేతను నన్ను వంచించి దోషము లింద నేకము
లు పడియుండవచ్చును. అవి యచ్చుపనివాండ్ర లోపము లను
వాఁడనుగాను. పండితులకుఁ జూపకుండఁబ్రకటింపను బోలేదు.
కంబళభాజనభోజనమువంటి నాగ్రంథసంస్కరణము వారికిమిఁగుల
విసుగుఁబుట్టించినను జాలవఱకు శ్రమపడి దిద్దినందఁుల కాపండి
తులకు నమస్కారములు. క్షీరనీరన్యాయమున కలవాటు పడినపం
డితహంసలు నా తప్పులను విడిచి యొప్పులను గ్రహింపమనవి.

ఈనాపుస్తకమును దిద్దుటలోఁ సాయపడిన కాకినాడ
రాజకళాశాలలోఁ బండితులు విద్వాన్ శ్రీమత్తిరుమలపెద్దింటి
రాఘవాచార్యులుగారికిని, దీని కుపోద్ఘాతమును రచించిన
శ్రీమాన్ యామూణ్ణి వేంకట వీరరాఘవాచార్యులు ఎం. ఏ.
గారికిని, దీనిని ముద్రింపించి సూర్యాలోకనభాగ్యము నొదవిం
చిన యాంధ్రసాహిత్యపరిషత్తువారికిని నా నమస్కారశతము.

యువ, ఆషాఢము.
ది 2-7-1935.

కొత్తపల్లి సూర్యరావు,
కాకినాడ.

ప్రస్తావము.

'వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి' అని లోకోక్తి. అట్టియుత్కృష్టమగు మహాభారత మార్యవాఙ్మయమునందలి బృహత్తమగ్రంథరాజములలో నగ్రగణ్యము. అందుచే నంతవిపులమగు గ్రంథమును బఠించుటకుఁ దగిన తీరిక గాని యర్హత గాని యందఱకు నుండుట యరుదు. కావున నిపానములవంటి లఘుకావ్యముల ద్వారమున వ్యాసకవితామృతకూపమందఱకు సుగమముగా నున్నది. వాల్మీకిరామాయణమునకు బాలరామాయణము [రాజశేఖరునినాటకము], భాగవతమునకు బాలభాగవతము [ధర్మసూరికృతకావ్యము] రచింపఁబడినట్లే మహాభారతమునకుఁ గూడ బాలభారతము మొదలగు నామములతో ననేకలఘుకావ్యములు బయలువెడలినవి. భారతమునందలి ప్రధానకథ మహాకావ్యరూపమునను [ఉదా. అమరచంద్రసూరి 'బాలభారతము' క్షేమేంద్రుని 'భారతమంజరి' మాలధారి దేవప్రభసూరి 'పాండవచరితము'], చంపూరూపమునను [అనంతభట్టకృత 'చంపూభారతము'], నాటకరూపమునను [గంగాధరకవి 'భారతనాటకము'] ననేకగ్రంథములు వెలసినవి. ఇఁక భారతమునందలి కొన్నికథాభాగములు రూపకములుగా భాస రాజశేఖర భట్టనారాయణ విశ్వనాథాదులచే

ననేకములు రచియింపఁబడినవి. [ఉదా. భాసుని 'ఊరుభంగము, కర్ణభారము, దూతఘటోత్కచము, దూతవాక్యము, పంచరాత్రము, మధ్యమవ్యాయోగము'-రాజశేఖరుని 'బాలభారతము' భట్టనారాయణుని వేణీసంహారము; 'విశ్వనాథుని సౌగంధికాహరణము మొదలగునవి.]

సంస్కృతమున 'బాలభారత' మను పేరితో నమరచంద్రుఁడొక మహాకావ్యమును, రాజశేఖరుఁడు నాటకమును రచించినట్లు లిదివఱకే చెప్పఁబడినది. కాకమ్రాని గంగాధరకవి తెలుఁగున 'బాలభారత' మను ప్రబంధమును రచించెను.

—: అగస్త్యమహాకవి: [క్రీ.శ. 1294-1325] :—

సంస్కృతవాఙ్మయమునకు సేవయొనరించిన వారిలో నాంధ్రు లనేకులు గలరు. శ్రౌతభాష్యములు, దర్శనములు, అలంకార శాస్త్రము, నాటకము, నాట్యశాస్త్రము, మహాకావ్యము, లఘుకావ్యము, చంపువు, గద్యము, కావ్యనాటకాలంకారాదులకు వ్యాఖ్యలు, స్తోత్రములు, సంగీతశాస్త్రము మొదలగు శాఖలలో నాంధ్రు లనేకగ్రంథరాజముల రచియించి మించిరి. ప్రాతఃస్మరణీయులగునట్టిమహనీయులలో నీ యాంధ్రబాలభారతమునకు మూలగ్రంథ మగుసంస్కృత'బాలభారతము'ను రచియించిన అగస్త్యమహాకవి యొకఁడు. బహుగ్రంథనిర్మాతయగు దాక్షిణాత్యకవితల్లజుఁడు, రాజచూడామణిదీక్షితులు-

"శ్లో. జడాశయానాం హృదయం జగత్యాం
యస్యోదయా ద్యాతి తమాం ప్రసాదమ్

స ఏష సారస్వతమర్మవేదీ
విభాతి మాళ్లో విమహా మగస్త్యః'

[రుక్మిణీకల్యాణము, I స. 18 శ్లో.]

అని యగస్త్యుని బ్రశంసించియున్నాఁడు. [ఇట-జడాశయానాం (జలాశయానాం,) హృదయం, ఉదయాత్, ప్రసాదమ్, అగస్త్యః-అను పదములు శ్లేషింపఁబడినవి.]

కమలినీకలహంసనాటికయందు రాజచూడామణిదీక్షితుఁడిట్లు చెప్పియున్నాఁడు.

శ్లో. సుకవిహితమురారిబోధముద్రో
విలసదగస్త్యమహావికాసిబాణః
విలసతి భువి శారదావతారో
విహితమయూరవిజృమ్భణో విచిత్రమ్. [6 శ్లో.]

ఇట మురారి, అగస్త్య, బాణ, మయూర, శారదావతార అనుపదములు శ్లేషింపఁబడినవి.

దాక్షిణాత్యకవయిత్రి మతల్లి యగు మహారాణి గంగాదేవికూడ నీతనిడెబ్బదినాలుగుకృతులు నీతనివైదుష్యసంపదను, గావ్యనిర్మాణపాటవమును జాటుచున్న వని స్తుతించియున్నది.

'శ్లో. చతుస్సప్తతికావ్యోక్తివ్యక్తవైదుష్యసమ్పదే
అగస్త్యాయ జగత్యస్మిన్ స్పృహయే త్కో న కోవిదః.'

[వీరకంపరాయచరిత మను 'మధురావిజయము,' I స. 18శ్లో.]

—:అగస్త్యవిద్యానాథులయైక్యవాదము-

అగస్త్యునికాలము : —

'ప్రతాపరుద్రయశోభూషణము'ను రచియించిన విద్యానాథుని మొదటిపేరు 'అగస్త్యుఁ' డనియు, నీతని యపారపాండిత్యముచే నీతనికి విద్యానాథుఁ డని బిరుదు వచ్చిన దనియు నొకవాదము బయలుదేఱినది. ఈవాదమును బ్రారంభించిన పండితప్రకాండులు, నే నెఱిఁగినంతవఱకును, శ్రీయుతులు వేటూరి ప్రభాకరశాస్త్రులవారు. వీరు ముక్త్యాలలోఁ బ్రచురింపఁబడుచుండెడి 'సరస్వతీ' పత్రికలో దీనిం గూర్చి యొక వ్యాసమును బ్రకటించి, యం దీయైక్యవాదము సూచనమాత్రముగా వ్రాసిరి. అందులకుఁ 'బ్రతాపరుద్రీయము'నందలి [II కావ్యప్రకరణము, 61 శ్లో. 78 పు. వావిళ్లవారిప్రతి] యీ క్రిందిశ్లోకము ప్రమాణముగాఁ జూపిరి.

'శ్లో. ఔన్నత్యం యది వర్ణ్యతే శిఖరిణః క్రుధ్యన్తి నీచైః కృతాః
గాంభీర్యం యది కీర్త్యతే జలధయః క్షుభ్యన్తి గాధీకృతాః
త త్త్వాం వర్ణయితుం బిభేమి యదివాజాతోఽ స్త్యగస్త్యస్థిత
స్త్వత్పార్శ్వే గుణరత్నరోహణగిరే! శ్రీవీరరుద్రప్రభో!'

ఈవాదమున కీశ్లోక మంత ప్రబలప్రమాణము కాఁజాలదేమో యని కొందఱు పండితవర్యులమతము. కాని, దీనిని దృఢప్రమాణముగాఁ గైకొని, యగస్త్యుని 'నలకీర్తికౌముది'కిఁ దాము రచియించిన పీఠికలో శ్రీమత్పండిత పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రివర్యులు అగస్త్యవిద్యానాథుల యైక్యమును

స్థిరపఱచిరి. సంస్కృతసారస్వతము ను మథించిన సంస్కృత వాఙ్మయచరిత్రనిర్మాత లగు డాక్టర్ మాడభూషి కృష్ణమాచార్యులవారు కూడ నీయభిప్రాయమునే సిద్ధాంతీకరించియున్నారు. ఈవాదమునకుఁ బైప్రమాణము తగినంత బలము కలయది యైననుం గాకపోయినను బ్రమాణాంతరములను బట్టి దీనిని సిద్ధాంతీకరింప నగును. ఏలన-విద్యానాథుఁడు త్రిలిఙ్గదేశమునందలి యేకశిలానగరము [ఒరంగల్లు లేక ఓరుగల్లు, లేక వరంగల్లు]న రాజ్యపాలన మొనరించిన కాకతీయప్రభువగు రెండవ ప్రతాపరుద్రున కాశ్రితుఁడు. [క్రీ. శ. 1275-1325]. అగస్త్య మహాకవికూడ నీకాలముననే జీవించి యున్నట్టు లీక్రింది ప్రమాణమువలనఁ దెలియుచున్నది. సిద్ధనాథునికిఁ బౌత్త్రుఁడును, గంగాధరమహాకవికిఁ బుత్త్రుఁడును, 'కాదంబరీనాటక'కర్త యగు నరసింహాకవి కగ్రజుఁడు నగు విశ్వనాథకవి తన 'సౌగంధికాహరణ' మను ప్రేక్షణకమునఁ దన కగస్త్యుఁడు మేనమామ యని వ్రాసియున్నాఁడు.

'శ్లో. విశ్వనాథ ఇతి ఖ్యాతః కవి రస్తి యదుక్తయః
అకాఞ్చన మరత్నం చ విదుషాం కర్ణభూషణమ్' [3 శ్లో.]

అని తన్నుం గూర్చి చెప్పుకొని-

'శ్లో. వాచ స్తస్య కవే రుదారమధురా ఇత్యత్ర చిత్రం కిము
ప్రఖ్యాతః సకలాసు దిక్షు గుణిషు శ్రేయా నగస్త్యః సుధీః
వేధశ్చన్ద్రిముఖీకరాఙ్గుళిదళాసఙ్గక్వణద్వల్లకీ
వాచోయుక్తిసహోక్తిదర్శితసుధాజన్మాసయన్మాతులః' [4 శ్లో.]

వాణీవీణాక్వణనముం బోలినకవితాసంపద గల్గిన యగస్త్యుఁడు తనకు మాతులుఁడై యుండఁ దనకవిత యుదారమధురముగా నుండుటలో నాశ్చర్య మేమి యున్న దని విశ్వనాథకవి నుడివియున్నాఁడు. విశ్వనాథుఁడు క్రీ. శ. 13 వ శతాబ్దిలో నేకశిలానగరమున రాజ్య మొనరించిన కాకతీయప్రతాపరుద్రున కాశ్రితుఁడు. ఈవిషయము 'సౌగంధికాహరణ' ప్రస్తావనలో నిట్లు లున్నది.

'సూత్రధారః:—అద్య ఖలు నిఖిలరాజలోకమాళిమాణిక్యమఞ్జరీపుఞ్జకిఞ్జలితచరణారవిన్దేన, బృన్దారకనగరకామినీముఖాధివాసచతురయశఃకర్పూరజాలేన, వేలావనావలీవిశ్రాన్తనిజబలతురఙ్గఖురమృదఙ్గనినదమిశ్రితజలదతరఙ్గనిర్ఘోషణదుఃరవలిప్తదమనవీరభద్రేణ, రాజ్ఞా ప్రతాపరుద్రేణ సంభావితైరశేషవిద్యావిశేషసారసార్వజ్ఞధౌరేయమతిభిః సభాసద్భి రాహూయ సబహుమాన మాదిష్టోఽస్మి.'

మఱియు—కాంచీపురమున, క్రీ. శ. 1367 సం.ర ప్రాంతముల రాజ్యముచేసిన కంపరాయలకు రాణి యగు గంగాదేవి తిక్కయజ్వను, అగస్త్యుని, గంగాధరమహాకవిని స్తుతించి, విశ్వనాథుని దనకు గురువుగాఁ బ్రశంసించియున్నది.

'శ్లో. చిరం స విజయీ భూయాద్ విశ్వనాథః కవీశ్వరః
యస్య ప్రసాదా త్సార్వజ్ఞ్యం సమిన్ధే మాదృశే ష్వపి.'
[మధురావిజయము, I స. 16 శ్లో.]

విశ్వనాథకవిరాజు [క్రీ. శ. 1300—1384]తన 'సాహిత్యదర్పణము' నందు వ్యాయోగలక్షణమును వివరించుచు, దానికి లక్ష్యముగా 'సౌగన్ధికాహరణము' ను బేర్కొనియున్నాఁడు.

"శ్లో. ఖ్యాతేతివృత్తో వ్యాయోగః స్వల్పస్త్రీజనసంయుతః
హీనో గర్భవిమర్శాభ్యాం నరై ర్బహుభి రాశ్రితః
ఏకాఙ్కశ్చ భవే దస్త్రీనిమిత్తసమరోదయః
కైశికీవృత్తిరహితః ప్రఖ్యాత స్తత్ర నాయకః
రాజర్షి రథ దివ్యో వా భవే ద్ధీరోద్ధత శ్చ సః
హాస్య శృంగారశాన్తేభ్య ఇతరేఽత్రాఙ్గినో రసాః.
యథా'సౌగన్ధికాహరణమ్'' [VI పరి.231-33కారికలు]

కావున గంగాదేవిచే స్తుతింపఁబడి, విశ్వనాథకవిరాజుచే సూచింపఁబడి, కాకతీయప్రతాపరుద్రున కాశ్రితుఁ డయిన మన విశ్వనాథకవి క్రీ. శ. 1294-1325 సంవత్సర ప్రాంతముల జీవించియుండె ననుట సమంజసముగా నుండును. ఇతనికి మేనమామయగు నగస్త్యమహాకవి కూడ నాకాలమువాఁడే యగును. కావున విద్యానాథునికాలమున కగస్త్యునికాలము గూడ సరిపోవుచున్నది. అందువలన నీయైక్యవాదము సమీచీనముగాఁ గానవచ్చుచున్నది.

అగస్త్యుని సమకాలికులు:—

ఆంధ్రకవితల్లజులలో నీతనికాలమువారు.

1. తిక్కన సోమయాజి [క్రీ. శ. 1250]
2. ఎఱ్ఱాప్రెగడ [క్రీ. శ. 1280-1300]
3. కేతన

4. భాస్కరుఁడు

5. మారన

6. బద్దెన [క్రీ. శ. 1261]

సంస్కృతకవీంద్రులలో:—

1. ప్రతాపరుద్రదేవుఁడు: 'యయాతిచరిత' నాటకకర్త [1294-1325 క్రీ. శ.]

2. మేరుతుంగాచార్యులు: 'ప్రబంధచింతామణి' కర్త [క్రీ. శ. 1306]

3. వేదాంతదేశికులు: 'యాదవాభ్యుదయా'దికర్త [క్రీ. శ. 1268-1376]

4. సాయణాచార్యులు: వేదభాష్యకర్త.

5. అమరచంద్రుఁడు: 'బాలభారత' కావ్యకర్త [క్రీ. శ. 1250]

6. విద్యాధరుఁడు: 'ఏకావళి' కర్త [క్రీ. శ. 1282-1327]

7. భానుదత్తుఁడు: 'రసమంజరి, రసతరంగిణుల' రచియించినవాఁడు. [క్రీ. శ. 1280-1320]

8. గంగాధరకవి: 'సౌగంధికాహరణ' కర్తకు జనకుఁడు.

9. విశ్వనాథకవి: 'సౌగంధికాహరణ' కర్త.

10. నరసింహకవి: 'కాదంబరీనాటక' కర్త.

11. గంగాదేవి: 'మధురావిజయ' కర్త్రి.

విద్యానాథుఁ డనుబిరుదుగల యగస్త్యుఁడు ప్రతాపరుద్రనియొక్క మంత్రిగా నుండినట్లు కథలవలనఁ దెలియుచున్న

దని 'నలకీర్తికౌముది' పీఠికలో శ్రీసుబ్రహ్మణ్యశాస్త్రిగారు వ్రాసియున్నారు. విద్యానాథబిరుదమును బట్టి యీతఁడు విద్యాంగమంత్రి [Minister of Education, or Director of Public Instruction]గా నుండియుండు నని కూడ నూహింపనగును. మహాపండితులును, మహాకవులును గూడ హిందూ ప్రభువులకడ మంత్రులుగా నుండి రనుట కనేక తార్కాణములు గలవు. కవిసార్వభౌముఁ డగు శ్రీనాథుఁడు కొండవీటి ప్రభువునొద్ద విద్యాధికారిగా నుండెను. ప్రతాపరుద్రునియొద్ద మంత్రిగానున్న యగస్త్యవిద్యానాథుని 'బాలభారత' మహాకావ్యమునకు, కృష్ణదేవరాయలయొద్ద మంత్రిగానున్న తిమ్మరుసు [సాళ్వతిమ్మయదండనాథుఁడు] వ్యాఖ్యానము రచించుట ప్రశంసింపఁదగినది.

—: అగస్త్యవిద్యానాథునికృతులు: —

I. ప్రతాపరుద్రీయము, [ప్రతాపరుద్రయశోభూషణము]-కాకతీయ ప్రతాపరుద్రునికంకితముగా రచింపఁబడిన తొమ్మిది ప్రకరణములుగల యలంకార గ్రంథము. ఇందు, ప్రతిశ్లోకమునందును బ్రతాపరుద్రుని ప్రశంసయే కాననగును. ఈసందర్భమున రాజాంకితములగు విద్యాధరుని 'ఏకావళి', నరసింహకవి 'నంజరాజయశోభూషణము' మొదలగు నలంకార గ్రంథములఁ బేర్కొనఁదగును. తన గ్రంథమును నరాంకిత మొనరించినందులకై ప్రతాపరుద్రీయకారుని నిందించి, పోతనవలె, వారణాసిధర్మసూరి శ్రీరామచంద్రుని కంకితముగా 'సాహిత్యరత్నాకరము'ను రచించెను.

II. బాలభారతము:—*ఇరువదిసర్గములమహాకావ్యము. ఇది చంపు వని 'బర్నెలు'పండితుఁడును ['తంజావూరు తాళపత్రగ్రంథవివరణపట్టిక'], శ్రీయుత రంగస్వామి సరస్వతి గారును ['విజయనగరచరిత్రాధారములు'—'Sources of Vijayanagar History'—P. 143.] వ్రాసిరి గాని, యది సరికాదు. ఈకావ్యమున మహాభారతమునందలి ప్రధానకథ వర్ణింపఁబడినది. కృష్ణదేవరాయలమంత్రి తిమ్మరుసు దీనికి 'మనోహర'†మను నొకవ్యాఖ్య రచించియున్నాఁడు. ఆవ్యాఖ్య గద్యమిట్లు లున్నది.

"ఇతి శ్రీమద్రాజాధిరాజరాజపరమేశ్వర కర్ణాటేశ్వర శ్రీకృష్ణరాయశిరః ప్రధాన సకలాగమపారావారపారీణ సాళ్వ తిమ్మయదణ్డనాథవిరచితాయాం బాలభారతవ్యాఖ్యాయాం మనోహరాఖ్యాయాం పఞ్చమః సర్గః"

అగస్త్యబాలభారతమునందలి కొన్ని శ్లోకములు.

శ్లో. న జాహ్నవీయై శ్చ న యామునై శ్చ
న చాపరాసాం సరితాం పయోభిః

* ఈకావ్యముయొక్క వ్రాఁతప్రతులు—తంజావూరు సరస్వతీమహాలు గ్రంథనిలయమునందును [Tanjore Catalogue, Vol II, 2228; and Vol. VI, 2589.] మద్రాసునందలి ప్రాచ్యలిఖితగ్రంథనిలయమునను [Descriptive Catalogue of Sanskrit MSS. XX, 7784.]

ఆంధ్రసాహిత్యపరిషత్తునను గలవు.

†Tanjore Catalogue, Vol. VI, 2606.

యస్యోదయే నైవ సుజాతధామ్నో
బహ్వీయసీ మృద్ధి ముపైతి వార్ధిః. ౧-౧౩

2. కులే కురు స్తస్య పతి ర్ధరిత్ర్యాః
కులాద్రిసారః కిల జన్మ లేభే
అసమ్మితైశ్వర్యనతోఽపి చిత్రం
యస్యాతపత్రం సిత మేక మేవ. ౧-౧౪

3. నఖంపచ స్త్రీకుచమర్దనోచితః
కరీన్ద్రకుమ్భాహతి కేళిలమ్పటః
స తేన భీతాభయదానదీక్షితః
కుశాఙ్కురాదానవిధౌ కరః కృతః. ౨-౬౧

4. సుతై రుదారై స్త్రిదివో యథా ద్రుమైః
ప్రసూనధన్వేవ శరై ర్మనోహరైః
రరాజ భూతై రివ పద్మసమ్భవో
మహాద్భి రేభి ర్నృపతి స్స పఞ్చభిః. ౨-౬౧

5. శ్లాఘితా సుతవధం సుయోధనా
ద్విహ్వలా విదురభాషితామృతైః
సా నిదాఘమిహిరాతపాహృతా
ద్యౌరి వేన్దుకిరణై రుదశ్వసత్. ౩-౧౪

6. లలాటనేత్రజ్వలనోష్మతాపితాః
కపర్దసిన్ధోః పరిపీతపాథసః
ఫణామణీనాం కషణేన భోగినాం
శిలీముఖా శ్శాతముఖాః కిరీటినః. ౮-౩౬

7. న నిర్దయై ర్గాణ్డివతాడనై ర్వ్యథా
ముదం దధౌ మూర్ధ్ని విమర్దితేన్దుభిః
దధాన లీలాకలహేషు సజ్జతః
పదప్రహారై ర్దుహితు ర్మహీభృతః. ౮-౩౯

8. నిరన్తరై ర్గాణ్డివనిస్స్వనై ర్దిశో
మహాసురాణాం క్షతజేన సాగరమ్
సుతో యశోభి శ్చ హరే రపూరయ
ద్రసాతలం భోగవతీజలామలైః. ౮-౭౫

1II. నలకీర్తికౌముది:—ఇదియు నొకమహాకావ్యము. భారతప్రసిద్ధమగుకథను గైకొని, శ్రీహర్షుని 'నైషధీయచరితము'వలెను, కృష్ణానందుని 'సహృదయానందము' వలెను, అగస్త్యుఁడు కావ్యరూపమున రచించెను. ఇం దెన్నిసర్గము లున్నవియో తెలియదు. ఇందలి 2 వ, 4 వ సర్గములు మాత్రము 1930 వ సంవత్సరమున 'నాంధ్ర సాహిత్యపరిషత్పత్రిక' [19 సం. 1,2 సంచికల]లోఁ టీకతోఁ బ్రకటింపఁబడినవి. భారవి 'కిరాతార్జునీయము' నందుఁ బ్రతిసర్గము నాద్యంతములఁ గ్రమముగా 'శ్రీ'శబ్ద 'లక్ష్మీ' శబ్దాంకితమై యున్నది. మాఘుని 'శిశుపాలవధ'యందుఁ బ్రతిసర్గమును నాద్యంతముల 'శ్రీ'శబ్దాంకితమై యున్నది. శ్రీహర్షుని 'నైషధీయచరితము'నఁ బ్రతిసర్గము 'నానంద' పదాంకితమయి యున్నది. వీరనంది 'చంద్రప్రభచరితము' నందుఁ బ్రతిసర్గమును 'ఉదయ'పదాంకితాంతముగా నున్నది. అట్టులే 'నలకీర్తికౌముది'లోఁ బ్రతిసర్గాంతమున 'లక్ష్మీ' పదలాం

ఛన మనుబాధింపఁబడి యున్నది. కావ్యచిహ్నముల విషయము న మదీయ 'సంస్కృత సారస్వత చరితము—ద్వ్యర్థిత్ర్యర్థికావ్యములు'- అను వ్యాసమును గనునది. [ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, 24 సంపు. 2 సంచిక, 53పుట] ఇందలి 'భృంగానవాప్తి' [II స. 74 శ్లో.] అను శ్లోకమునకు వసుచరిత్రములోని 'నానాసూన వితానవాసనల' [II ఆ. 47 ప.] అనుపద్య మాంధ్రీకృతిగాఁ గానవచ్చుచున్నది. దీనిని గూర్చిన యైతిహ్యమును శ్రీయుతులు కొత్తపల్లి సూర్యరావుగారి 'మనవి'లోఁ గననగు.

IV. కృష్ణచరితము:—ఇది శ్రీకృష్ణుని చరితమును వర్ణించు గద్యకావ్యము[Burnell: *Tanjore Cata.* No. 10203.]

V. లక్ష్మీస్తోత్రము.

VI. లలితాసహస్రనామము.

VII. శివస్తవము.

VIII. శివసంహిత.

IX. సకలాధికారము.

X. మణిపరీక్ష:—మల్లినాథసూరి భారవికి వ్రాసిన 'ఘంటాపథ' వ్యాఖ్యలో [XII స. 40 శ్లో.] "కరిణాం ముక్తాయోనిత్వే ప్రమాణ మాహాగస్త్యః-'శ్లో. జీమూతకరిమత్స్యాహివంశశజ్ఖవరాహజాః। శుక్త్యుద్భవాశ్చ విజ్ఞేయా అష్టౌ మౌక్తికయోనయః' ఇతి." అని యుదాహరించియున్నాఁడు. ఈశ్లోకము 'మణిపరీక్ష' లోనిదే కావచ్చును.

XI. అగస్త్యనిఘంటువు:— దాక్షిణాత్య పండితకవి యగు ఘనశ్యాముఁడు భవభూతికృత మగు నుత్తరరామచరిత మునకు వ్రాసినవ్యాఖ్యలోఁ బలుసారు లగస్త్యనికోశమునుండి ప్రమాణముల నొసంగియున్నాఁడు. ఈనిఘంటుకర్త యగు నగస్త్యుఁడును మన 'బాలభారత' కర్త యగు నగస్త్యుఁడును భిన్నులు కారని తోఁచెడిని. గంగాదేవి, యగస్త్యుఁడు 74 కృతులను రచియించె నని తెల్పియుండ మనకుఁ దెలియవచ్చిన వింతవఱకే; ఇందు లభించినవి మఱియు స్వల్పము.

అగస్త్యనిఘంటువునుండి ఘనశ్యాముఁడొసంగిన యాకరములు*

౧. [3 వ పుట] - 'నమఉక్తా నమోవాకః' ఇత్యగస్త్యః.

౨. [36 పు] - 'న నా నో మేత్యభావేస్యుః' ఇత్యగస్త్యః.

3. [36పు.] 'వరాద్యతనయోరాద్యః ప్రథమ జ్యేష్ఠయోర్గురా'

౪. [43 పు]- 'సరటావిశేషే ప్రతిసూర్యకః.'

౫. [44 పు] 'త్రిషుప్రత్యక్షం' ఇతి- 'ఇవోపమాయాంచాలీకే' ఇత్యగస్త్యకేదాకా.

౬. [48 పు] - 'భూతం క్ష్మాదా.'

౭. [75 పు]-'మోహో మూర్ఛాపారవశ్య తమో మౌఢ్య భ్రమాదిషు.'

౮. [91 పు] 'వధూవరాణాం పితరో మిథః సమ్బన్ధినోమతాః'

---

* ఘనశ్యాముని వ్యాఖ్యతో- 'ఉత్తరరామచరితము'- ఆంగ్లపీఠిక, వ్యాఖ్యానువాదములతో-పాండురంగవామనకాణే పండితుఁడు ప్రచురించినది. తృతీయావృత్తి- 1929 బొంబాయి.

౯. [131 పు]-'ఐక్ష్వాకజనకాదిత్యావై దేహరఘువోదిశః.'
౧౦. [144 పు]-'ప్రమాదరహితం జ్ఞానం ప్రజ్ఞానమ్.'
౧౧. [149 పు]- 'అన్తర్ధానేచ విలయః'.

కాలక్రమమున నుత్పన్నము లని మన మనుకొనియెడి యీయగస్త్యనికృతులు బయలువెడలి రసికామోదమును జేయుఁగాక.

ఆంధ్రీకర్త.

ఈయాంధ్రీకర్తలు నలువదిసంవత్సరములనుండి యాంధ్ర సారస్వతప్రపంచమునకుఁ జిరపరిచితులు. బహుభాషావిదులు, బహుగ్రంథనిర్మాతలు. 'యాదృగ్గద్యవిధౌ బాణః పద్యబన్ధే న తాదృశః' అని భోజునిచే నిరసింపఁబడిన బాణునివలెఁ గాక వీరివాణి పద్యగద్యముల రెంటను వాఁడియైనదియే. వీరి గద్య శయ్య కమ్మచ్చునఁ దీసినట్టులుండి వ్యర్థపదరహితమై, ప్రౌఢబంధురమై, మూలమున కనన్యూనాతిరిక్తమై వెలయుచుండును. ఇతోధికముగ భాషాసేవ చేయునట్లుగఁ బరాత్పరుఁడు వీరిననుగ్రహించునుగాక.

ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యుఁడు యం. ఏ.,
అధ్యక్షుఁడు, 'ఆంధ్రగీర్వాణసాహిత్యపరిషత్తు'
ఆంధ్రగీర్వాణభాషోపన్యాసకుఁడు,
పిఠాపురరాజకళాశాల,
కాకినాడ, 15-8-35.

విషయానుక్రమణిక.

—: ప్రథమాశ్వాసము. :—

—: ద్వితీయాశ్వాసము. :—

ద్రుం డైంద్రాస్త్రంబు నొసంగుట కర్ణుని నాకంబునకుం గొనిపోవుట, ఊర్వశి యర్జునుని షండుండవుగమ్మని శపించుట, యింద్రుం డాశాపం బజ్ఞాతవత్సరంబున నుపయోగింపం జెప్పుట, పాండవులు బదరికాశ్రమమున నివసించుట, సౌగంధికాపహరణము, జటాసురవధ, అర్జునుండు కాలకేయనివాతకవచులం దునుముట, యింద్రరథముపై నర్జునుండు భూలోకమునకు వచ్చి యన్నదమ్ములం గూడుట, గంధమాదననివాసంబు.

—: తృతీయాశ్వాసము. :—

9 సర్గము. 86-96

ఘోషయాత్ర, గంధర్వులుదుర్యోధనుం గట్టి కొనిపోవుట, విజయుం డాగంధర్వుల జయించి దుర్యోధను విడిపించుట, దుర్యోధనుప్రాయోపవేశయత్నము, ద్వైతంబునుండి కామ్యకంబునకుఁ బాండవులువచ్చుట, తృణబిందునాశ్రమంబున సైంధవుఁడు పాంచాలిని హరించుట, పాండవులు వానిం గొట్టి ద్రౌపదిం దెచ్చుట, సైంధవుఁడు శివుంగూర్చి తపంబుచేయుట, కర్ణునికడకు సూర్యుండు వచ్చుట, యింద్రునికిఁ గర్ణుండు కవచకుండలమ్ములిచ్చి శక్తిని బుచ్చికొనుట, ఆరణేయోపాఖ్యానంబు, యక్షప్రశ్నంబుల కుత్తరంబు లిచ్చి పడినతమ్ముల ధర్మజుండు బ్రదుకఁ బొందుట, అజ్ఞాతవాసోపయోగంబుగ ధర్ముఁడు పాండవులకు వరంబు లిచ్చుట.

10 సర్గము. 96-105

విరాటునగరంబునఁ బాండవు లొరు లెఱుంగకుండ నుండుట, కీచకుఁడు ద్రౌపదిని మోహించుట, భీముఁడు తమ్ములతోఁగూడఁ గీచకుని జంపుట, పాండవులు విరాటపురంబున నున్నారని చారులమాటలంబట్టి గ్రహించి గోగ్రహణము మిషగాఁ గౌరవులు పాండవులం బట్ట యత్నించుట, సుశర్మపట్టిన గోవులను విడిపించుటకై భీమనకులసహదేవులను ధర్మరాజు విరాటునకుఁ దోడుపంపుట.

11 సర్గము. 106-114

కౌరవులు గోవులంబట్టిరని విని యుత్తరుఁడు విజయసారథ్యంబున వెడలుట, ఉత్తరకుమారప్రజ్ఞలు, భయపడిన యుత్తరునకుఁ దన్మొత్తింగించి యర్జు

నుండు తాను రథియై కౌరవుల జయించుట, నరుండుబొమ్మపాత్తికలకై కౌరవు లయుష్ణీషంబులను నుత్తరుచే గొనియించుట, సంవత్సరంబు గడచె నని పాండవులు సువేషంబులతో విరాటునికొల్వునకు వచ్చుట, పాండవులం దెలిసికొని విరటుం డుత్తర నభిమన్యునకుఁ బరిణయంబు సేయుట.

—: చతుర్థాశ్వాసము. :—

నార్జునకుమారు లిరువురు నన్యోన్యహతులై నేలంబడుటు, అభిమన్యునికై సుభద్రా విలాపము, అర్జునుండు సైంధవుం జంపం బ్రతినవట్టుట. కృష్ణుం డర్జును నియమంబున నిలుపుట.

—: పంచమాశ్వాసము. :—

16 సర్గము. **148-158**

కృష్ణుం డర్జునుం గైలాసంబునకుం గొనిపోవుట, శివప్రసాదము, సైంధవ రక్షణమునకై ద్రోణాదుల యత్నము, దుశ్శాసనానుజులం గొట్టుచున్న భీమునకుం గర్ణుడును భూరిశ్రవుడు నడ్డువచ్చుట. భూరిశ్రవసుని చేయిం గిరీటి నఱకుట. అతని ప్రాయోపవేశము, సైంధవవధ, కౌరవపాండవసేనల ద్వంద్వయుద్ధము, కర్ణుడు ఘటోత్కచునిపై శక్తిం బ్రయోగించి చంపుట, రాత్రియుద్ధము, ధర్మజునిమాటపై ద్రోణుం డస్త్రసన్న్యాసం బొనర్చుట, ధృష్టద్యుమ్నుండు గురునితల నఱకుట, పితృవధక్రోధముచే నశ్వత్థామ నిష్పాండవమునకై యాగ్నేయాస్త్రముం బ్రయోగించుట.

17 సర్గము. **158-163**

కర్ణుని సేనాధిపతిత్వము, శల్యసారథ్యము, దుశ్శాసనుని భీముడు చంపి రక్తపానము చేయుట, వృషసేనవధ కారణంబుగాం గర్ణుం డర్జునుం దలపడి పోరి మృతుం డగుట.

18 సర్గము. **163-170**

ఇప్పుడైనను సంధి సేసికొమ్మని దుర్యోధనునితోం గృపాచార్యుండు చెప్పుట, అతండు వినకుండుట, శల్యసేనాధిపాభిషేకము, ధర్మరాజు గదాయుద్ధమున శల్యుం జంపుట, నకులసహదేవులు శకునిం జంపుట, దుర్యోధనుని హ్రదప్రవేశము, భీమునివాక్యములకు దుర్యోధనుండు మఱుగు వెడలి వచ్చుట, గదాయుద్ధమున భీముడు దుర్యోధను తొడలు విఱుగంగొట్టుట, అశ్వత్థామ వచ్చి దుర్యోధనునోదార్చి యారాత్రికృపకృతవర్మలతోంగూడి పాండవశిబిరంబునం బడుట, శ్రీకృష్ణుండు పాండవులను శిబిరంబునుండి తొలంగించుట, ధృ

ష్టద్యుమ్న శిఖండుల దుర్మరణము. ఉపపాండవులం జంపె నని ద్రౌపది గురుత నయుని శిరోమణిని హరింప కున్నం జత్తు ననుట, భీముండు శిరోమణికై వెడలుట, బ్రహ్మశిరోనామకాస్త్రములతో నర్జునాశ్వత్థామలు తొడరుట. కృష్ణుండు మృతుండై పుట్టిన పరీక్షిత్తును బ్రదికించెద నని యశ్వత్థామను శపించుట, శిరోమణిహరణము.

19 సర్గము. 170-179

ధృతరాష్ట్రగాంధారులశోకము, రణహతులగు తమవారిం గాంచుటకు స్త్రీ లెల్లను వచ్చుట, పాండవులు ధృతరాష్ట్రగాంధారుల దర్శించుట, యుద్ధభూమిం బడినవారిం జూపి గాంధారి శ్రీకృష్ణుని శపించుట, మృతులకు ధర్మరాజు దహనాది సంస్కారములు గావించుట, ధర్మరాజు పట్టాభిషేకము, భీష్ముడు ధర్మజునకు నీతులు చెప్పి నిర్యాణము నొందుట, పరీక్షిజ్జననము, అశ్వమేధయాగము, శ్రీకృష్ణుడు ద్వారక కేగుట.

20 సర్గము. 179-188

యుధిష్ఠిరుడు తనపక్షమున యుద్ధములో మరణించిన రాజుల రాజ్యములను వారికుమారుల కొసంగుట, ధృతరాష్ట్రుని రాజుం గావించి ధర్మరాజతనియనుజ్ఞం [illegible]ంచుట, ధృతరాష్ట్రగాంధారులవనవాసము, యాదవకుల నాశ[illegible] గారణముగా సాంబునిగర్భమున ముసలము పుట్టుట, యాదవులు మున్నగువారు వారిలో వారు పోరి హతులగుట, కృష్ణబలరాములనిర్యాణము, ద్వారకనుండి యాదవాంగనలను గరిసగరమున కర్జునుడు తెచ్చుట. వజ్రుని పట్టాభిషేకము, పరీక్షిత్తునకుఁ బట్టముగట్టి పాండవులు మహాప్రస్థానమున కేగుట, ధర్మరాజుమాత్రము సశరీరముగ స్వర్గమున కేగుట.

శ్రీరస్తు.

బాలభారతము.

ప్రథమాశ్వాసము.

(లోకనాఁడు
యెను. అచ్చట
తో నాతనికై వేచి
దైనశంతనుఁడు నిర్మల
ప్తుఁ డయ్యెం గాని విస్మయ)

(1) అత్రినేత్ర సంభవ...
...మె లావణ్యముం గ్రోలినను దృప్తిచన
చాఘుఁడును బద్ధసంప
...ముం దామహీదేవేంద్రునకు నిష్కారణముగ
కెడమకన్ను నగు...
...ను. పురువంశశ్రేష్ఠులయంతరంగము సద్వస్తు
సదాశివుని చే శిరస్
...ముండను. కావున, గంగాదేవితో "నీవు పర
మిత్రుఁడు హిమవ
...ని యెడల నా రాజ్యమును శరీరమును బ్రాణము
యమునగంగా
...గా నెంచుకొనెదము." అనిన గంగ "నీ యింటికి వచ్చె
ఆచంద్రుని
...గాని, నే నేవిరుద్ధకార్యము చేసినను నన్ను నిషేధింప
యమున్
... దీని కంగీకరించితివేని నీయొద్ద నుందును. ఎదు రాడి
మునఁ
దుర్వినీతుని సంపద విడిచినయట్లు నేవిడిచి పోయెదను."
ముత్తై
...న, సమ్మతించి యాపతి తనరథముపై స్వపురమున కాసతిం
కుమ
...చ్చెను. మృగనాభిగంధమును రత్నద్యుతులును ప్రసరించు
కన
...యంతఃపురమునందు హిమాద్రికందరముల గంగాప్రవాహము
డవ
...లె నాయబల సంచరించుచుండెను. ఆమెమధురస్వభావము
యు
...కు వశుఁడై యారాజ్యలోకనాఁడును నిజాంతఃపురమును స్మరిం
విర
...పనే లేదు. ఆయింతియు శంతను నుపలాలనములచే మహాసుర
థిప్రసంగమును దలంపలేదు.

క్రమక్రమముగా నమ్మరాశియైన నూతనచంద్రులవంటి యేడుగురుపుత్రులం గని కనినంతన గంగలో విడుచుచుండెను. తన్ను వదలి పోవు నేమో యనుభీతిచే రాజు మిన్నకుండెను. అష్టమపుత్రుఁడు జనించినఁ జంపఁబోవుచున్నపుడు వాత్సల్యమున వెనుకటిమాటకు విరుద్ధముగ "నోసి! యెట్టినృశంసురాలవు! కులనిస్తారకుఁ డైన యీబాలు నేల చంపఁదలఁచితివి. ఇట్టి వారి నేడ్వురను జంపినను నీకుఁ దృప్తి కలుగ లేదా! దయతో నీపుత్రుని నాకు వదలితివా నీకుఁ గీర్తియు ను నా కయత్న పూర్వకముగఁ గురుకులవృద్ధియు నగును." అను నప్పలుకులు విని యప్పడఁతి చిఱునవ్వుతో "నృసింహా, నే నీబాలుం జంపను, నన్ను శివమౌళిభూషను జగత్పావనను భాగీరథినిగా నెఱుంగుము. ఒకప్పుడు విధిచోదితుఁ డైన యష్టమ వసువు ధర్మపత్ని యాదేశమునఁ దక్కిన యేడువురు వసువులతోఁగూడి వసిష్ఠాశ్రమములో నున్న హోమధేనువును హరించెను. దివ్య దృష్టి గలయామహర్షి వారి నెనముండ్రు మీరు మనుష్యులగుదు గం డని శపించెను. వారుప్రణతిప్రశాంతుఁ డగునావసిష్ఠుని శాపాంతమును వేఁడిరి."మీ రేడువురుఁ బుట్టినంతనె నింద్య మైనయాతనువులను ద్యజియింపఁగలరు. ఎవ్వఁడు భార్యావ శుఁడై యింతటిపనికిఁ గారణుఁ డయ్యెనో యా యెనిమిదవ వాఁడు మాత్రము స్త్రీవిముఖుఁ డై చిరకాలము భూలోక ములో నుండును." అనిన మునిపుంగవునిపలుకులపై సత్యలో

కమునుండి భూలోకమునకు జిగుచున్న పగిలింటిదీపములవలె నున్నయష్టవసువులను గాంచి నేనిట్లంటిని. "అన్నలార! నే నొకనాఁడు శుచినై బ్రహ్మసభలో నుండఁగాఁ బ్రవాహవేగమున నురుప్రవలె వాయువశమున నాయుత్తరీయము తొలఁగి పోయెను. దానికి హృష్టుఁడై చంద్రకళం గాంచిన కుముదమువలె మహాభిషుఁడు సంతసించెను. తక్కినసదస్యులు సిగ్గునఁ బద్మములవలె నిమీలితాక్షులైరి. అపుడుసత్యలోకాధిపతి నాయందు భావముఁగల మహాభిషుని గాంచి కోపించి పెదవులు వడఁక "నీవు కూడని పని చేసితివి, పర్వతమువలె నుండి యు న్ధైర్యముఁను వీడితివి. నీ కిది దైవయోగమునఁ గలిగిన వికారము. కావున నీవు మరల మర్త్యలోకమున కరుగుము. ఈగంగయే పుడమిపై నీపడఁతియై క్షీరసాగరము రీతి నిన్నుం జెందును. శ్రుతిగర్హితము లయిన యీమెక్రియలయందు నీకు వైమనస్య మెప్పుడు గల్గునో యప్పుడే యీమె నిన్నుఁ గాముకుని సిగ్గు విడిచినట్లు విడిచి నిజరూపముం బొందఁగల" దనిన వనజభవుని యనుమతిని నేను మనుజలోకమునకుఁ జనుచున్నదానను. సమదుఃఖాన్వితులైనమీయందును విధియుపకారమే చూపుచున్నది. మీరును బద్మషండమునుండి పుండరీకములవలెఁ గ్రమముగ నాగర్భంబునం బొడముఁడు. మిమ్మేడుగురను బుట్టఁగనే జలములో వదలిపెట్టెదను. కడపటి వాఁడు మాత్రము నాకుఁబుత్త్రుఁడుగా మధ్యమలోకమున నుం

డఁగలఁడు." అను నామాటల పరమార్థము గ్రహించి నాయం దువసువులు నిసువులై యుదయించిరి. వారి మోక్షమునకునై నే నీగర్హితమయిన కార్యము నొనర్చితిని. నీవే మహాభిషుఁడవు. నాయందు భోగము లనుభవించితివి. సమయవ్యాజమున శాపావసానము గావలసియున్నది. రెండవకుమారస్వామివలె నీయష్టమవసువు బాల్యము ను నాయొద్దనే కడపి నిచ్చుఁ జేరఁ గలఁడు." ఇట్లని జాహ్నవి తిరోధానము నొందెను.

ఆమెయందలి విరహావ్యథచేఁ గృశియించి చాపసహాయుఁడు గా శంతనుండు నిరువదియేండ్లు రాజ్యము పరిపాలించెను. అంత నొక్క దినమున మరల గంగాతీరమునఁ జరించున తనికిఁ దన్నదీదర్శనమున మనస్సు సంచలించెను. "ఇప్పటికి నా బాలుఁడు బాల్యము వీడి భుజాబలసమన్వితుఁ డగును. ఆతనిలబ్ధి నాకువర్ధాంతమున నబ్జషండము హంసకుబలె నానందకారణ మగును." అని చింతించుచుఁ దత్పరిసరములఁ దన ప్రతిబింబమునట్లు ధనుర్ధారి యై గంగాప్రవాహమును బాణజాలముచే నడ్డుకట్టుచున్న పుత్రుని ముహూర్తకాలము విస్మయముతో మోహావేశమునఁ జూచుచుండ నబ్బాలుఁడు మేఘములలో సూర్యునివలె గంగాతరంగములలో నంతర్ధానము నొందెను. మఱియొక్కక్షణములోఁ జిరకాలమునుండి విరహముచే క్షీణించిన భర్త నెఱిఁగి పాలసముద్రములోనుండి లక్ష్మివలెఁ బుత్రునితోఁగూడ, గంగ ప్రవాహములోనుండి వెడలి

వచ్చి శంతను చెంతఁ జేరి, "రాజా! ఇతఁడు దేవవ్రతుఁడు, నీపుత్త్రుఁడు. వసిష్ఠశిష్యుఁడై యశేషశాస్త్రపారమును, బరశురామశిష్యుఁడై సకలశస్త్రాస్త్రపారమును బడసెను. అలోకసామాన్యగుణములు గలయీబాలుని వలన నీవు ప్రీతి నొందెదవు" అని పలికి యతనిం గౌఁగిలించుకొని పుత్త్రు నొప్పగించి కన్నుల నీరు వెట్టుకొనుచు వెనుక వెనుకకుఁ దిరిగి వారిద్దఱిఁ జూచుచు నదీప్రవాహములోని కతికష్టమున నేగెను. శంతనుఁడు గంగావిరహదుఃఖమును దొలంగి శరదృతువు గడచినచంద్రుఁడు బుధునితో బలెఁ బుత్త్రునితోఁ దననగరమునకుఁ జనియెను.

శంతనుఁడు తనకుమారుని యువరాజుం జేసి భూభారమాతనిపై నిలిపి కళిందనదీతీరమున వేఁట సల్పువాఁడు, తత్కాలమున నేదో సుగంధము నాఘ్రాణించి యది యెచ్చటనుండి వచ్చుచున్న దని యెఱుంగఁ గోరి యోజనమాత్రము నడచి నదియొడ్డున నున్న దాశకన్యను దర్శించెను. మన్మథవృక్షమునఁ గుసుమగుచ్ఛమువంటి యాకన్నియను "నీ వెవ్వనిపుత్త్రికవు, నీ వేల యిం దున్నదాన" వని యడిగెను. "దాశరాజు నా తండ్రి, అతనినిదేశమున నే నీనదిని నావగడపుచున్నదానను." అనిన యామె పలుకులు విని సంతసించి యుచ్చైశ్రవుఁ డను దాశరాజుకడకుం బోయెను. అతఁడు సత్కరించి "యేమిపనికై మీ రీ భూభాగము నలంకరించినారు." అనిన శంతనుఁడు

తనసారథిం గనుసన్న నుత్తరం బి మ్మనియెను. ఆసూతుఁ "డో యుచ్చైశ్శ్రవ! ఈరాజు శరాసనవిద్యలో దశరథరామునిం బోలినవాఁడు. నీయదృష్టమున నీపుత్రికను దనరాజ్యలక్ష్మికి సహాయురాలిం గావింపఁగఁ గోరుచున్నాఁడు." అని వచింప సంతసించి, "మంచిది, నాకూఁతునకు జన్మించినపుత్రుని నీయనంతరమున రాజుంగా నియమింపంగలవేని యీసారథి చెప్పినట్లు నీవు నాపుత్రికం బరిగ్రహింపవచ్చును." అని దాశరాజు కురురాజునకు విన్నవింప దేవవ్రతునియందలి ప్రేమచే నీకార్యము దుష్కర మని తలంచి యాతఁ డొం డాడలేక దాశకన్యను హృదయమార్గమునఁ గొని యింటికి వచ్చెను. దేవవ్రతుఁడు నానాఁటఁ బ్రజ్వరిల్లుచున్న మన్మథాగ్నిచేఁ దప్తుఁడై కృశాంగుఁ డయిన తనతండ్రియుదంతమును సారథివలన విని పాండువర్ణశరీరమును గని యుచ్చైశ్శ్రవునికడ కరిగి యి ట్లనియెను. నాజనకుఁడు నీకుమారిని గోరఁగా నీవు రాజ్యాస్పదమడిగితి వఁట. అట్లే కా నిమ్ము. నేను నీదౌహిత్రుని నాతండ్రియనంతరమున రాజుగా నొనర్చెదను. నీవు కన్య ని మ్మనిన, నాశ్చర్యపడి దాశరాజు, భద్ర! గురుప్రీతిగా నీవు పల్కిన వాక్యము స్థిరముచేయఁ దగు నని నుడివిన యంతన "నందనుఁడను నాప్రతిజ్ఞను వినుండు, నాశరీర మున్నంతకాలము నేను బ్రహ్మచారినిగా నుందును. లోకములో నాత్మజులు లేనివారికిఁ బరలోకసుఖము లే దందురు. నేను బితృశుశ్రూష చేసి పుణ్యా

లోకముల నార్జించుకొందును.” అని యాధీరుఁ డుచ్చస్వరమునఁ బలుక భయవిస్మయములు పెనఁగొన గగనతలంబున దేవతలు నప్సరోంగనలు నీతఁడు భీష్ముఁడు భీష్ముఁ డని ప్రశంసించిరి. అంతటినుండి దేవవ్రతుఁడు భీష్ముఁ డనునామమును బుష్పవృష్టితోఁగూడ సంపాదించుకొనియెను. దాశరాజు సంతసించి తనపుత్త్రి నిచ్చెను. ఆమెను గొనితెచ్చి తనతండ్రిసన్నిధినుంచి నమస్కరించిన, శంతనుఁడు గాఁగిలించుకొని మందారసుమమరందపరిమళయుతమగుపుత్త్రుశిరస్సు నాఘ్రాణించి, పుత్త్రా! తండ్రులనుదనయులు తమతమస్వగుణములచే సేవించుచున్నారు గాని నీవలె నెవ్వ రిట్టిపని చేయఁగలరు? నీకు నేను బ్రీతుఁడనై వర మిచ్చెదను. మృత్యువు కాంక్షింపకుండఁగనే నీవు స్వచ్ఛందమరణము నొందఁగలవనిన పిమ్మట, దాశరాజును, మహాకులీనత్వము ను దన శరీరావయవములే వెల్లడిచేయుచున్న యీకుమారి యెవ్వతె యని శంతనుండు ప్రశ్నించెను. పూర్వము చేదిపతి యైనవసువు దేవదత్త మైన విమానముపై నాకసమునఁ జరించుచు నిజభార్య యగు గిరికాముఖచంద్రబింబమును స్మరియించెను. స్మరాతురుఁ డగునాతనివీర్యము కాళిందీనదిలోఁ బడియెను. అందు శాపవశమున మత్స్యమై యున్న యొకానొక సురకన్య దానిం ద్రావి గర్భిణి యయ్యె. నావారలు వలలు విసరి చేపలఁ బట్టుచుండఁగా నామత్స్యము దొరకినది. దానిని గోయఁగాఁ దద్గర్భమున

నొక బాలుఁడును బాలికయును శుక్తిలో ముక్తాఫలముల వలె నాకు లభియించిరి. వారిని నేనువసురాజున కగపఱిచిన నచ్చెరుపడి మాత్స్యుఁ డనునామ మిడి బాలుని దాను గ్రహించి బాలికను నాకు దయచేసెను. అని దాశరాజాకన్యకవృత్తాంతము చెప్పఁగ విని శుభాన్విత మగుదినమునఁ గాళీనామకయగునాకన్యను గిరిజను గిరీశుఁడు పోలె స్వీకరించి చాల కాల మామెతో విహరించెను. కాలక్రమమునఁ జిత్రాంగదుండు విచిత్రవీర్యుండు నను నిరువురు సుతులు శచీసమానయగునాకాళియం దుద్భవించిరి.

అనంతరము శంతనుఁడు జరాసంశ్లేషుఁడై నాకమునకు విచ్చేయ భీష్ముఁడు చిత్రాంగదుని పౌరవరాజ్యమునకుఁ బట్టాభిషిక్తుం జేసెను. ఆతఁడు భూతలమును నిష్కంటకముగఁ బాలించుచు సింధునదీసమీపమున స్వనామకుఁ డగు గంధర్వునితో యుద్ధ మొనర్చి చంపంబడియెను. సుతుఁడు హతుఁడైనకతనఁ బ్రజ్వలిత మైనసత్యవతిదుఃఖాగ్నిని భీష్ముఁడు విచిత్రవీర్యాభిషేకతోయములచేతఁ జల్లార్చెను. కాశిపతికూఁతుండ్రు మువ్వురకు స్వయంవరము జరుగు నని విని దేవవ్రతుఁడు విచిత్రవీర్యునికై వారిని దెచ్చుతలంపున రథ మెక్కి వారాణసికి బాణబాణాసనపాణియై వెడలెను. అధ్వశ్రమనివారకముగ గంగాతరంగములమీఁది శీతవాతములచే నెదుర్కొనఁబడుచు నేగి స్వయంవరసభలోఁ బీఠములపై మేరుశృం

గములమీఁది యేకుఁగుగున్నలవలె నున్న నృపకుమారులం
గాంచెను. అచ్చటికి వచ్చిన భీష్ముని జూచి వారెల్లవారు వృద్ధుఁ
డగు నీభీష్ముఁడు ప్రతిజ్ఞాభంగముగ నేల వచ్చె నని కరతాళ
ధ్వను లొనర్చి నవ్విరి.

అనేకులగు రాజులను వారివారి పూర్వవృత్తములను
జెప్పుచు నాప్తులు చూపుచుండఁగా నిచ్ఛలేనివారై యారా
జకన్యకలు వాయువశమున విద్యుత్వంతము లయిన మేఘలే
ఖలు పర్వతముల నతిక్రమించి నట్లులు రాజుల పీఠములనుండి
తొలఁగి చనుచుండిరి. భీష్ముఁడు జరాసమేతుఁ డగు తన్నుం
గాంచి యింకొకచోటికిఁ బోవుచున్న రాజపుత్రికల నీర్ష్యచే
తనువలెఁ బట్టుకొని రథముపైఁ బెట్టుకొని పురమువెలుపలికిఁ
బోయెను. సాల్వుఁడు మున్నగువారు వానిదారి కడ్డుసొచ్చిన
నెల్లర జయించి స్వయంవర యుద్ధమునందు వీరలక్ష్మితోడఁ
గూర్చి కన్యలను దెచ్చెను. ఆముగ్గురలో నంబ యనునది
సాల్వునియం దనురాగము గల దని తెలిసికొని వానియొద్దికిఁ
బంపివైచెను. అంబికాంబాలికలను దమ్మునకుఁ బాణిగ్రహ
ణము చేయించెను. ఆసాళ్వుఁడు శత్రునీత యగు నిన్నుఁ బరి
గ్రహింప నని విడువఁగా నంబ భీష్మునికడకు వచ్చి నీవే
నన్నుం బెండ్లియాడు మని కోరి దృఢవ్రతుఁడు గాన వానిచే
నిరాకరింపఁబడి దుఃఖించుచు నరణ్యమునకుఁ దపస్సుచేయఁ
బోయెను. పిమ్మట విధివశమున నావిచిత్రవీర్యుఁడు రాజయక్ష్మ

రోగపీడితుఁడై యెండకాలములోఁ గొండమీఁదిసెలయేఱు వలె దినదిన శోషణము నొంది మదగజముచేత నివాసవృక్షమువలె నాకష్టరోగముచేత హతుఁడు కాఁగాఁ గురుదేశప్రజలు పతిలేక నిరాలంబులై పక్షులవలె శోకించుచుండిరి.

(2) అనంతరము బ్రాహ్మణులచే విచిత్రవీర్యునకు యథావిధిగాఁ బారలౌకిక క్రియలు సమాప్తము చేయఁబడఁగా యోజనగంధ (సత్యవతి) సమీపమున నున్న భీష్మునితో నిట్లనియెను. వత్స! నీతమ్ముఁడు పంచత్వము నొందఁగాఁ జంద్రవంశము సంతానరాహిత్యమున సముద్రమథనమునకుఁ బూర్వము చైత్రరథమువలె శోభావిహీన మయి యున్నది. నీవు విద్వాంసుఁడవు. అఖిలవాఙ్మయమును సమస క్రియాకలాపమును నీవెఱుంగనిది కాదు. సమయోచితముగ నీవు కాశీరాజదుహితలయందు దేవరధర్మప్రకారము సుతోత్పాదనము చేయుము. అనిన విని భీష్ముఁడు, తల్లీ! నీవు చెప్పిన దంతయు నిజమే- నిశ్చయ తన నైజ మగు నుష్ణస్వభావమును విడిచినను గంగానందనుఁడు తనప్రతిజ్ఞను విడువఁడు. పరశురాముఁడు గొడ్డంటియగ్గిచేఁ బూర్వము రాజకులమును భస్మముచేయఁగా వారియంగనలయందు బ్రాహ్మణులచే సంతానము పడయఁబడినది. ఈపూర్వాచారప్రకారము జాగరూకురాలవైన నీయాజ్ఞచే నీకోడండ్రయందుఁ బ్రస్తుతకార్యసిద్ధి కొఱకు శ్రేష్ఠుఁడగునొకతపోనిధి విప్రుఁడు సంతాన ముత్పాదించుఁగాక. అనిన

నతని వాక్యములు విని లజ్జితురాలై యిట్లని యెను. పూర్వము
నేను గాళిందీనదిని బిత్రాజ్ఞ రేవుపడవ నడపుచు నొడ్డున
నున్న నాయొద్దకి సంతానకాంక్షియై పరాశరుఁడు వచ్చెను.
అతఁడు నాయెడల సహజముగ నున్న మత్స్యగంధమును
బోఁగొట్టి యీయోజనగంధత్వమును బ్రసాదించి, శాప
మిచ్చునేమో యను భయమున విధేయనై యున్న నన్ను
యమునాద్వీపమునఁ జీఁకటి కల్పించి పొందెను. తత్క్షణమే
నాయందు జటాశిఖావంతుఁ డగుముని యరణియం దగ్నివలెఁ
బొడమెను. అతం డనంత వేదవ్యసనుఁ డగుటచే జగత్తున వేద
వ్యాసుఁ డనుప్రఖ్యాతిని గడించెను. ఆముని, యోజనని! పని
గలయపుడు నన్నుం దలంచునది యప్పుడ సన్నిధి చేసెద నని
నాకు నమస్కరించి నాకన్యాత్వమునకు నిర్దోషత్వమును బ్రసా
దించిన తండ్రితోఁగూడఁ జనియెను. నాప్రథమపుత్రుఁ డగు
నతఁడు తన తమ్ముని భార్యలయందుఁ బుత్రోత్పత్తి నిం జేయఁ
గలండు. ఇది నీకు సమ్మత మేని, యిపుడే యాస్ఫురత్తేజుని
స్మరియించెదను. అనిన నావిషయమును విని విస్మయసమ్మద
ములం బొందిన దేవవ్రతుఁడు సమ్మతింపఁగా సత్యవతి హృద
యములోఁ బారాశర్యుని దలంచెను. చంద్రప్రకాశముతో
నాముని సాక్షాత్కరించెను. అతఁడు ప్రణామము చేయఁగా
లగ్నమైన లలాటమునందలి భస్మముచేఁ బవిత్రితము లైనపా
దములు గలసత్యవతి వాత్సల్యమునఁ బుత్రుం గౌఁగిలించుకొ

నియెను. అమ్మా! నీయూహ నాకుఁ దెలిసినది. అట్లే చేయుదును, గాని నావైరూప్యమునకు మఱందం డ్రసహ్యించుకొనకుండఁ జేయు మని యాతం డంతర్హితుం డయ్యెను. దేవతలకుఁ గూడ నాదృతుఁ డగునతఁడు తిరోధానము నొందిన పిదప, వంశాంకురమునకై చేయుచున్న పని గాని కీడు కాదని యనేకనిదర్శనములతో నత్త కోడండ్రను బహువిధముల బోధించి యతికష్టముమీఁద నావిషయమునకు విధేయురాండ్రను గావించెను. అంబికాంబాలికలు రాత్రివేళఁ దల్పముపై శుచిర్భూతహృదయలై పతిని ధ్యానించుచు విశాఖానక్షత్రములు చంద్రునికొఱకట్లు మునిరాకకై యెదురు చూచుచుండిరి. అపుడు వ్యాసుఁడు జటాజినధారియై యంబికానివాసమునకు వచ్చెను. ఆతనివిరూపతకు నసమ్మతగంధమునకు నేవపడి యామె కన్నులు మూసికొనియెను. అట్టియామె నట్లే యనుగ్రహించి యిలువెడలి తల్లికడకు వచ్చి యయుతగజబలుఁ డగుపుత్త్రుఁ డుదయించుం గాని మాతృదోషమున నంధుం డగు ననిన విని యసంతుష్టయై రెండవకోడలియందు భూవలయ మంతయు స్వభుజాబలమున గెల్చి యేలం జాలునట్టి వానిం గను మని కోరెను. వల్లె యని తల్లిశాసనమున నంబాలికకడకుం జనియెను. ఆమెయు లజ్జచేఁ దెల్లఁబోయెను. జననీవికార కారణమున బలశాలియైన ను బాండుశరీరుఁడు జనియించు నని తల్లితోఁ జెప్పి వ్యాసుఁ డదృశ్యుఁ డయ్యెను.

క్రమక్రమముగ నాదేవులు ధృతసత్త్వుఁడగు ధృతరాష్ట్రుని భుజచండిమశ్రీనలరారు పాండువునుం గనిరి. గుడ్డివాఁడగు మనుమనిం గాంచి వసుపుత్రి కృతార్థురాల ననుకొనలేదు. కావున నామె మరల నంబికను జటూక్తులచే నొప్పించి వ్యాసుని రప్పించి నియోగించెను. ఆతని యేవపురూపునకు బెదరి యారాజకాంత తనపరిచారికను బంపెను. అది యలంకృతయై విలాసాలసమందగమనమున మునియంతికమునకుం జనియెను. దానియనురాగమునకుఁ గంఠస్వరయోగమునకు నలరి సంగీతమునకు మృగము వశమైనట్లు గాత్రము పులకింప మునిరాజు వశుఁడై యనంతరము మాతకడకుం జని నామెమ్మద్దికి నీకోడలిదాసి వచ్చినది కావున, మునిశాపగోచరుఁడైన యముఁడు విదురుఁడై పుట్టును. ఇంక మరల న న్నీకర్జమునకు నియోగింపకు మని తపోవనమునకుం బోయిన పిదప, శూద్రస్త్రీ, సత్క్రియాఫలమువంటి పుత్రుని బడసి శోభించినది. కురువంశవర్ధను లగునమ్మువ్వురు కుమారులును భీష్మునిచేఁ బెంపఁబడిరి. క్రమంబున సకలవిద్యల వారు దక్షులై దర్పమగుయౌవనదశం బొందిరి. శుభముహూర్తమున ధృతరాష్ట్రుని గులక్రమాగత మగుసింహాసనమునఁ బ్రతిష్ఠించి యతనికిఁ బాండుని సేనానిగను విదురు నమాత్యునిగను నియమించెను. శౌర్యమున, వినయమున, నూర్జితురా లగుగాంధారిని ధృతరాష్ట్రున కిమ్మని భీష్ముఁడు దూతముఖమున గాంధారరాజును

గోరెను. తనతండ్రి తన్నంధునకుఁ బెండ్లిచేయ నున్నాఁడని తెలిసికొని యరుంధతీదేవికీర్తిని మించిన పాతివ్రత్యకీర్తి గలయా రాజపుత్త్రి తనకన్నులకుఁ బట్టములను గట్టివైచికొని యెను. వృద్ధామాత్యపురోహితానుమతమున సుబలకన్యక ధృతరాష్ట్రునికిఁ బత్నియై నదులయందు సముద్రునకు గంగవలె యాతని యంతఃపురమున ముఖ్యురాలయ్యెను. యాదవభర్త యగు శూరుఁడు తనసుతను మేనత్తయనపత్యతాశోకమును వారించుటకై కుంతుగాఁ నొసంగెను. ఆకుంతిభోజుఁడు వసుదేవుని చెల్లెలి నుద్యానలతను వలెఁ బెంచి యొక్కనాఁడింటికి వచ్చిన క్రోధనుఁడగువసంతుఁ డనుముని నారాధింప నియోగించెను. ఆకన్యకందుకక్రీడవీడి లీలావిహంగపోషలాలనము మాని సఖీజనసల్లాపము లుల్లంఘించి నిత్యమును నమ్మౌనియాజ్ఞచొప్పున నుపచారము చేయుచుండెను. ఎప్పుడయిన నొకసారి తనవయస్యకుఁ బత్త్రవల్లరీలేఖన మవసరమైన ఖేదపడు నాపృథాకన్యక ముని యెంతటి కష్టకార్యము చెప్పినను క్షణకాలములోఁ జేయుచుండెను. అందు నిరపాయముగ నొక్కసంవత్సర ముండి యాముని నిజస్థానమున కేగుచుఁ బ్రసన్నుండై పృథ కొక్కమంత్రము నుపదేశించి యీమంత్రప్రభావమున నీ వేదేవతను బ్రియంపడి పిల్చెదవో యాదేవత నీకుఁ బ్రీతిమైఁ దనతోఁదుల్యుఁ డగునొక్కపుత్త్రుని బ్రసాదించు ననుచుఁ జెప్పి సంతోషముగాఁ దిరోధానము నొందెను. ఆతనిచనినయనం

తరమునఁ గుంతి మంత్రమహిమం బరీక్షించుటకయి మేడమీఁది నుండి యుదయించుచున్న సూర్యునింగాంచి ప్రార్థించెను. ఆసూర్యుఁడు పీతవస్త్రధారి యుఁ గవచకుండలకిరీటాంగదహారశోభితుండు ను వికాసముఖుండు నై వచ్చి కరజాలముతోఁ బద్మినిని వలెఁ బృథను గౌఁగిలించికొనియెను. "దిననాథ! కన్యకను, పితృవశంగతను, నీవు, ధర్మవిదుండవు, నన్ను విడువు," మని ప్రార్థించుచు వడంకుదానిని రోషముతోఁ గాంచి "పిలువఁగా వచ్చినవాని నిరాదరించెద వేని నిన్నును నీకు మంత్ర ముప దేశించిన దేశికునింగూడ నాశాపసర్పపాశమున బంధించి వైచెదను. కాంక్షితమును దీర్చెద వేని, యదితి నన్నుఁ గన్నట్లు నావంటి సుతుని నీవు గాంచెదవు. సర్వామరస్వరూపుఁడ నైన నా ప్రభావమున నీకన్యకాభావము చెడదు." అనుచు భానుఁడు నవ స్మృతిచేత ను లజ్జాస్మితముఖాంబుజముచేత ను సమ్మతించిన కెటెంగి శరత్కాలమేఘములోనికిఁ గాంతితోఁగూడి చనినట్లు పృథతో శయనాగారములోనికిం జని యధికోజ్జ్వలాకృతి యగు నగ్ని యందువలెఁ దన తేజస్సును బృథయందుఁ బ్రవేశపెట్టి ప్రసాదామృతదృష్టిగర్భ మగుచూపుతో నామెను వీడ్కొనియదృశ్యుఁ డయ్యెను. పిమ్మట నాకుంతి యింద్రునకుఁగూడ నీప్సితార్థ ప్రతిపాదకుఁ డగుపుత్రుని సముద్రవేల చింతామణింబోలెఁ బ్రసవించెను. అపవాదశంకిత యై సఖీజనసహాయమున నాకన్య భుజగ మువలెఁ గుండలకంచుకోజ్జ్వలుఁ డగునబ్బాలుని గంగలో వదలి

పెట్టెను. గంగాప్రవాహము పంజరములోని సింహముంబోలిన మందసములోని శిశువును దరంగడోలాశతలాలనమున మెల్లగ సూతపురసమీపమునకుఁజేర్చెను. అచ్చటికివిలాసార్థమువచ్చిన రాధాతిరథు లనుదంపతులు పెట్టెలోనున్న పట్టెని దీసికొని యానందించిరి. వా రిరువురచేఁబెంపఁబడి యాబాలకుఁడు రాధేయుఁడనునామముం గాంచెను. ఆతనిమొదటిపేరు కర్ణుఁడు. పరశురామునియొద్దఁ గొన్నినా ళ్ళస్త్రవిద్యను నేర్చెను. కొంతకాలమున కుస్వయంవరములోనితరరాజులనుమెచ్చక పృథ పాండురాజును వరించినది. సుజాతమగునైరావతమునుగాక యభ్రము వితరగజములను మెచ్చునా! ధన్వి యగుభీష్ముఁడు మద్రరాజును జయించి జయశ్రీవంటి యతని సుతను మాద్రినిం దెచ్చి పాండునకు సహధర్మచారిణినొనర్చెను. ఒకనాఁడు పాండురాజు భోజమద్రరాజకన్యకలతోఁగూడి వేఁటకై హైమవతవనములకు సపరివారుఁడై చనియెను. ఏనుఁగులను, సింహములను, ఖడ్గమృగములను, నితరమృగములనుఖండించెను. వధింపఁబడినజంతురక్తబిందువులతోఁగూడిన యాతనివక్షముమీఁది ఘర్మజలమును వేఁటవలనిశ్రమమును హిమవద్గిరియందలి వాతపోతములు హరింప నొక్కతావున నుండి యనురాగమున నాయెదుటఁ గ్రీడించు మృగమిథునము నందలి మగలేడిని గొట్టెను. అది తత్క్షణమే యఱచుచు నేలఁబడి ముని యై కన్నులవెంట నశ్రువు లోడ రాజుతో ని ట్లనియె. "నేను, కిందముఁ డను మునిని, స్మరశరతాడితుండ నయి మృగత్వ

ముం బొంది నామగువతోడం గ్రీడించుచు నీశరతాడనమున నాప్రాణములం గోల్పోవుచుంటిని. నీవును నిట్టిసమయమునందే యమసదనమునకుం బోఁగలవు.” అని యసువులు విడిచెను. పతికిఁ జితి పేర్చి యగ్ని యిచ్చి యందఁ గిందమపత్నియు బ్రుం దెను. పాండురాజు విషణ్ణుఁడై వేఁట చాలించి విరక్తుఁడై భార్యలతోడఁ గూడఁ దపస్సు చేసికొనుటకు మునిపల్లెలకుఁ జని తనవెంట వచ్చినపరివారమును బురమునకు మరలించెను. శతశృంగపర్వతమునం దారాజు విషయసుఖములతోపాటువిభూ షణముల నుజ్జగించి జటావల్కలధారి యై సభార్యుఁడై చిరకాల ము తపస్సు గావించెను. అప్పు డాతని భీతాభయదానదక్షమైన మృదుకరమును గుశాంకురఖండనమునకై యలవాటు చేసెను. ధనుర్గుణాకర్షణకర్కశమైనవ్రేళ్లు గలయాతనిహస్తము సమిద్వి భంజనము చేయుచు వేదనం జెందకుండెను. ఆతపోవనమే యాతనికి రాజ్య మయ్యెను. మృగములు వినీతములై సమీ పమునం దిరుగుచుండెను. అంతశ్శత్రువులను జయించి విశేష ముగఁ దపోమయధనము నం దాతఁ డార్జించెను. ఒక్కనాఁ డారాజు కుంతితో నిట్లనియె. “వ్యాసమహర్షి సపర్యచేసి నా వదినెగారు నూర్గురుపుత్రులం గాంచుగర్భముం దాల్చిన దఁట. తమోపశాంతి చేయు సుతుఁ డనునానందమును బొందుపుణ్య ము నేను జేసికొనలేను. ఎన్నియాగములు గావించినను నెంత రాజ్యము సంపాదించినను నపుత్రకుఁడు వ్యర్థుఁడు. జననిమొడి

లోఁ గూర్చుండి స్తన్యపానము చేయుచున్నపుత్త్రుని ముఖదర్శనము చేయలేని తండ్రి పితృదేవతలహృదయమును శోకవహ్నిచేఁ దగులఁబెట్టును. కావున నాకాంక్షితమును నీవు పూరింపుము. నేను శాపోపహతుఁడను, తపస్విని, నీవు ప్రతాపశాలి వలనం బుత్త్రులఁ బడయుము." అనినఁ గుంతి, "నాథ! గర్హితము, నెన్నఁడు నీనోట వెడలనిదియు నగు వాక్యముం బలికితివి. ఈపృథ నిన్ను వినా మఱి యొక్కపతి నాశ్రయించునా! నది సముద్రమును విడిచి చౌటిపడియలోని కేగునా" యనియెను. అనేకనిదర్శనములు చూపించి మరలమరలఁ బ్రార్థించినపార్థివుని కాపృథ మునిదత్తవరప్రభావముం దెలిపెను. దానిం బ్రశంసించుచు నాతఁడు ధర్ము నాహ్వానము చేయు మనియెను. ఆధర్ముని ప్రసాదమున గర్భిణి యై సుముహూర్తమునఁ గుంతిభోజనందన యుధిష్ఠిరుం డనుపుత్త్రుం బ్రసవించెను. ఆబాలుని జన్మసమయమున దేవతలు సంతోషించిరి. పుష్పసుగంధముతోఁడి వాయువులు దిక్కులను వెదచల్లెను. పుత్త్రముఖదర్శనమున రాజుగాత్రము పులకాంకిత మయ్యెను. కుంతికిఁ గొమరుఁడు గలిగినవార్త విని సుబలరాజసుత నాగర్భమును నేను జిరకాలమునుండి ధరించుచున్నదానను, ఇఁక సహింపంజాల నని ఱాతితోఁ గొట్టుకొనియెను. నెత్తురుతోఁ గూడినమాంసపుముద్ద క్రిందఁ బడినది. తత్క్షణమున వ్యాసుఁడు వచ్చి సంధ్యారాగయుక్త మగు గగనగర్భమునుండి పడిన సూర్యబింబమురీతి నున్నయాపేశిని గాంచి

దుఃఖించుచున్న గాంధారి నూరార్చి "వత్స! నామాట వృథ గాదు. ఇమ్ముద్దలో నూర్వురు పుత్రులు నొక్క పుత్రియుం గలరు." అని నూటొక్క భాగముగా దానిని విడఁదీసి నేతికుండలలోఁ బెట్టించి 'యీకుంభములలోనుండి వారియంత వారెనిర్గమించెదరు, మీరు భద్రముచేయుఁ'డని యామహర్షి చనియెను. నాగకాంత నిజాండములను రక్షించునట్లు గాంధారి యాభాండములను దన యింట భద్రముచేయించెను. అక్కడ మరలఁ గుంతి భర్త యాజ్ఞ చొప్పున వాయుదేవు నాహ్వానించెను. పుష్పసౌరభయుతుఁడైన మారుతుఁడు లతం గౌఁగిలించికొనినట్లు కుంతిని బరిరంభమున గౌరవించినఁ దత్సంపర్కమున రాక్షసాంతకుఁ డగుభీముఁడు, తొల్లి యంజన కాంజనేయునిభాతిం బుట్టెను. ఆబాలుని జన్మమునకు సంతసించిన వాయుదేవుఁడు వనమునందలి వృక్షకోరకచ్ఛలమున నానందాశ్రులు రాల్చెను. అతనిస్నేహితుఁ డగునగ్ని హోమకుండమునం దలలెత్తి జ్వాలాముఖమున నర్తనముచేసెను. భీముఁడు పుట్టుటకు ముందుగా నాదినముననే నిశాముఖమునందు హస్తినాపురములో మానధనాగ్రగణ్యుఁ డగు సుయోధనుఁడు పుట్టెను. అతని పుత్రోత్సవతూర్యనిస్వనముతో నక్కలు తమయూళలు గలిపినవి. పౌరులప్రమదాశ్రువులతో నాకసమునుండి పడు రక్తధారలు మేళవించినవి. మూఁకుండ్లు మూసిన తక్కిననూఱుకుండలలోనుండి క్రమక్రమంబునఁ దొంబదితొమ్మండ్రు దుశ్శాసనాదులును దుశ్శల యనుకన్యకయుం బొడమిరి. గాంధారి యనవ

రతపరిసరవర్తు లగు శతసంఖ్యాకపుత్రులతోఁ గూడికొని శతదళ ములతోఁగూడినకమలకర్ణికవలెఁ బ్రకాశించెను. అక్కడఁ గుంతి భర్తృనిదేశమున నింద్రప్రసాదమున ఫాల్గునమాసమున నుత్తర ఫల్గునీనక్షత్రమున నర్జునుం గనియెను. ఆసమయమున శతశృం గపర్వతమున మందారపరాగవర్షముతో సకలమునిసమక్షమున నచ్చరలు సంతోషనృత్యముంగావించిరి. పతియానతిని గుంతీదేవి తనమంత్రమును మాద్రి కుపదేశించెను. ఒక్కనాఁడే యశ్విను లను బ్రార్థించిన యామె నకులసహదేవు లనుబిడ్డలను గాంచె ను. ఈసుతపంచకలాభమునఁ బాండుభూపాలుఁడు పంచకల్పక ములతోడి స్వర్గమువలెఁ బంచబాణములతోడి మన్మథునివలెఁ బంచభూతములతోడి సృష్టికర్తయుం బలె నలరారెను. దాన దక్షము లైనవారిహస్తములు ధాత్రీకరాంగుళములం బుచ్చు కొన్నవి. మణిస్థలములందు సంచరించుటకుఁ దగినవారిపాదము లుటజాంగణములందు నలఁగినవి. పాంసుకేళీరతులు, తపోధనో పలాలితులు, సింగంపుజడలనూడఁబెఱుకువారు నగునాబాలురు తపోవనములోని గజకలభములం బోలిరి. క్రమముగ నుపనీతు లై సకలశ్రుతిస్మృతుల నభ్యసించిన వారిం గాంచి కేవలభరతవం శజులేగాక సజ్జనులును గృతార్థు లయిరని ప్రశంసలు వెడలెను. వారికి యౌవనము వచ్చినంతట లోకులనేత్రములకుఁ బద్మము లం గాంచిన తుమ్మెదలకువలె నానందము కలిగెను. వారిభుజ ములకు ధైర్యమును వక్షములకు వైశాల్యమును స్వరము

నకు మంద్రవృత్తియు నేత్రములకు స్నిగ్ధత్వమును దత్కాలమునఁ బొడసూపెను. ఇట్లుండ నొక్కపుడు కుహూముఖమునకుఁ గుశలోదయమును మన్మథగజమునకు మదోదయమును వాయువులకుఁ బురుటిల్లును నైన మధుమాస మాసన్న మయ్యెను. గాలివలన లేచిననూతనచూతపరాగము వసంతలక్ష్మి చీరలకుం బురుగుపట్టకుండ వేసికొను పటవాసపిష్టమువలె నుండెను. మన్మథమంత్రవాదులకు మోహనచూర్ణము నయ్యెను. సకలపుష్పగంధములచేత నష్టదిక్కులుఁ బరిమళింపఁజేయు మాధవునకు మాలతీసౌరభశోభను గల్గించుశక్తి లేకపోయెను. ప్రపంచములో సర్వసమర్థుఁ డెవ్వఁడు? అశోకవృక్షములనుండి గాలికి రేఁగిన పుష్పాడితిట్టలు కోపించినమన్మథుఁడు వియోగులపైఁబ్రయోగించునాగ్నేయాస్త్రములవలెఁ గనఁబడియెను. మధుద్రవస్వేదమిళితము లైన కేసరకుట్మలములు వసంతసంపర్కమున లేచిన వనలక్ష్మిపులకలవలెఁ దోఁచెను. అంతట దక్షిణదిశనుండి వచ్చువాయువు లనెడుయమభటులవలన లాగఁబడినమనస్సు గలవాఁడగుపాండురాజు మద్రరాజపుత్రితో వనమునకు వయాళివెడలెను. కేసరములనుండి వెడలు శీతలశీధుశీకరములచేతను గలకంఠపంచమనాదములచేతను నతనిమనంబునఁ జిరకాలమునుండి నిద్రించు మనోజుఁడు లేచెను. పుష్పగంధగర్భిత మగు మాధవీలతామండపములోఁ జేరి మునిశాపమునకు వెఱచి కంపించుచున్న మాద్రిని బలాత్కారముగఁ బరిగ్రహించి యతిశీఘ్రకాలములో నసువులు విడిచి మన్మథశయ్యవంటి

పూలపాన్పునఁబడిపోయెను. అట్లుపడినమగనిం గాంచి వస్త్రము మీఁదఁగప్పి క్రొత్తదుఃఖమునను భయమునను మాద్రి నేలంబడి కొంతతడవు కరుణముగ నేడ్చెను. అది విని పుత్త్రసహిత యై పృథవచ్చి విధివ్యాధునిచేఁగొట్టఁబడిన తనపతికుంజరముం గనుఁగొనియెను. పుత్రసహిత యై కొంతసేపు పతిపైఁ బడి యాక్రందించి యక్కడకు వచ్చి యోదార్చు బ్రాహ్మణులశాంతవచనములచే నొక్కింత దుఃఖ మాఁపుకొని నంతటఁ గన్నుల నీరు కాల్వలై పాఱ మాద్రి కుంతిపాదములపైఁ బడి యిట్లు చెప్పెను. నావలన మనపెనిమిటి దివంగతుఁ డయ్యెను. నేనొక్కక్షణకాల మాలస్యము సహింపను. ఆయనయొద్దికి నన్నుఁ బంపుము. అనాథులను నాబిడ్డలను నేనురక్షింపఁజాలను. అనినఁ గార్యగతి నిక్కమారసి పృథ తెల్పినవాక్యములకు నకులసహదేవులు శాంతించి తండ్రితో నేగుతల్లిం గూర్చి చింతమానిరి. పితృమేధకర్మలయందు నిపుణు లగుకశ్యపాదివిప్రులసాయమున యుధిష్ఠిరుఁడు ధైర్యముతోసమయోచితక్రియాకలాపమునిర్వర్తించెను. మాద్రి తపస్వులకెల్లరకు క్షమింపుఁడనినమస్కరించివారిశుభవాక్యములనుస్వీకరించి నాతప్పు మన్నింపుమని కుంతి కంజలి ఘటించి పుత్త్రులంగౌఁగిలించుకొని వారికన్నీరు దుడిచి చితికిఁ బ్రదక్షిణముచేసి శుచిస్మితముఖియై చితాగ్నియందుఁ బ్రవేశించెను. సభార్యుఁ డగుపాండురాజునకుఁ బాండవులు ప్రేతకర్మము సమాప్తము చేసిన యనంతరము శతశృంగమునందలి తపశ్శాలులు కుంతిని బిడ్డలనుహస్తినా

పురమునకుఁ గొని వచ్చిరి. తమ్ముఁడు మృతినొందె నని యాంబి కేయుఁడు చాల దుఃఖించి యాతనిబిడ్డల నుపలాలించుచుఁ గొంత కొంత శాంతుఁ డయ్యెను. పెద్దతండ్రి ప్రాపునఁ బాండవులు పితృ మరణశోకమును మఱచిరి. పాండవులలో ద్వితీయుఁడగుభీముఁడు, వీథులలోఁ బొంసు క్రీడలు చేయునప్పుడు వైనతేయుఁడు కాద్ర వేయులను బాధించునట్లు ధార్తరాష్ట్రులను దినదినమును బాధించు చుండెను.

(3) ఒక్క నాఁడు పద్మగంధము వహించిన గంగానదిలోఁ జిరకాలము క్రీడించి వెడలి గుడారములలోఁ జేరి భుజించి శ్రమ నివారణముగ విశ్రమింప, నీఁతలాడినకతమున నలసి వృకోదరుఁ డొడలు తెలియనినిద్ర నుండెను. నదీతరంగములమీఁదినుండి వీచు శీతలవాతము లాతనిం బరవశుం జేసినవి. దుర్యోధనుఁడు పెద్దపెద్దతీవలతోఁ దనవైరి యగుభీముని గట్టి భోగిబద్ధ మగుమం థరమును వలె సింధుగర్భమునం బడవైచెను. భీముఁడు మేల్కాంచి తీవత్రాళ్ల కట్లం ద్రెంచికొని నీటిలోనుండి బైటి కేతెంచి మరల నిద్రించుచుండెను. దుర్యోధనుఁడు మరల విషోరగములచేతఁ గఱపించెను, దానివలన నిద్రపట్టక గాఢ్పుపట్టి నల్లులను నలంపిన ట్లాపాములను నలఁపివైచెను. మఱునాఁడు దుర్యోధనుఁడు విందు చేయుచుననియుందఱను బిలిచి భీమునికివిషమును గబళగోపితము గాఁదినిపించెను. దుర్భరగరళభోజనమునవివశ్వాలుఁ డైన మరుత్సు తునిమరల శూలములు గ్రుచ్చఁబడిన గంగనీటిలోఁ బడవైచెను.

పర్వతనిభ మైనశరీరమునకు దైవవశమున శూలములు గ్రుచ్చు కొనలేదు గాని యగాధ మగునన్నదిలో నోడలు తెలియకుండ నాగలోకమువఱకు నడుగునకుఁ బోయెను. అధోలోకములో విహరించు నాగకుమారులు నతనిపూర్వవిషబాధనుఁ దమ నూతనవిషప్రయోగముచే మరలఁజేసిరి. తెలివితెచ్చికొని బంధ నము లూడ్చికొని కఱచుపాముపిల్లల దర్పమెల్ల నడంచుచున్న భీముని వాసుకి చూచి తనయింటికిఁ గొనిపోయెను. అతనికి హితముం గోరిన నాగపతి యాజ్ఞచే నాగకుమారులు పదివేల యేనుఁగుల బలము నిచ్చుదివ్యరసమును ద్రావించిరి. వారువెట్టిన పానుపుపై నెనిమిదిదినములు సింధువునొడ్డున నీరముం గ్రోలిన వారివాహామునట్లు శయనించెను. భీముఁడు నీటిలో మునిఁగి చచ్చెను, మరలఁ దేలలే దనుతలంపున దుర్యోధనుఁ డిష్టులతో నిజపురమునకుం జనియెను. కుంతి భీముఁడు కనఁబడక యితరు లతోఁ గూడి సింధుతీరమున వనములలోఁ, గొలఁకులలోఁ, బుర ము వెలుపల వెదకుచుఁ దిరుగఁదొడఁగెను. దుర్యోధనుఁడు చంపి యుండు ననుశంకచే విహ్వల యగు నామె విదురవాక్యామృత మున వేసవిలో సూర్యకిరణములచే శోషించిన యాకాశము చంద్రకిరణములచేఁ జల్లఁబడినట్లుదేఱెను. తొమ్మిదవనాఁడు మేల్కొ నిభీముఁడు బలముచేరి వాసుకి నియోగించిన నాగకుమారులవ లన మోవఁబడి శీఘ్రముగా జాహ్నవీజలమార్గమున రసాతలము వెలువడి భూలోకమునకు వచ్చెను. మోయుటచే నలసిన పడ

గలు గలపన్నగకుమారులను దిరిగి పొమ్మని సెలవిచ్చి నీరోగియై వచ్చి యన్నలకు హర్షమును బౌరులకు విస్మయమును ధార్తరాష్ట్రులకు శోకమును గలిగించెను. సకలవిద్యలును గౌతమునితోఁ జదివిన పిదప భీష్ముఁడు పాండుసుతులను ధృతరాష్ట్రతనయులను గృపునియొద్ద నస్త్రవిద్యాభ్యాసమునకై పెట్టెను. ఆకృపాచార్యుని వలన ధనుర్విద్యాపాటవమును బ్రాగల్భ్యమును సంపాదించినను బుత్త్రుల కతనికంటె విద్యాధికునియొద్దఁ జెప్పింపఁ దలంపు గలిగి యస్త్రగురునికయి వెదకించెను. గుణోత్తరు లయినవారుచ్ఛ్రితవస్తువునకై వాంఛింతురుగదా! పరశురామునికడ సకలాస్త్రసంపదను గడియించిన మహారాజశ్శాలిని ద్రోణాచార్యుని హాస్తినాపురమునకు రావించెను. విక్రమముతోఁడి విద్యాన్వితుఁడు ద్రోణుఁడు విధివంతముగ సత్కరింపఁబడి సభలో భీష్మునితో ని ట్లనియెను. "ద్రుపదుఁడును నేను నగ్నివేశునియొద్ద నస్త్రవిద్యకై సహాధ్యాయులమయి యుంటిమి. అపు డతఁడు నాతో, హితుఁడా! నాతండ్రియనంతరము నేను రాజ్యమునకు వచ్చినపుడు ని న్నర్ధరాజ్యపదమున నియోగించెద నని పలికెను. కాలక్రమంబునఁ బైతృకం బగురాజ్యమును నామిత్త్రుఁడు సోమకుఁడు పొందెను. సేవచేయుటవలన ధర్మవిప్లవ మగుననుశంకచే నిస్పృహుఁడ నై యొక్క నాఁ డతనిసకాశమున కేగితిని. అపుడీనాకుమారుఁడు ముగ్ధుఁడు. దుగ్ధకాంక్షి యై పిండిగలిపిన నీరము లే క్షీరము లనుకొని తుష్టిఁజెందు వీని దైన్యమునకై ఖిన్నుఁ

డనై నీచయాచనను గర్హించుచుఁ, బండితుఁడు కూడనిపని చేసి యైనను గుటుంబరక్షణము చేయక తప్పదు గావున నాయజ్ఞసేనునికి నేను నీపూర్వమిత్త్రుఁడ నని తెలిపితిని. అతఁడు కోపకలుషీకృతముఖుఁడై యపహసించుచు నిట్లు పలికెను. దుర్గతిబ్రాహ్మణుఁడవగునీకును, రాజనైననాకును గాజునకును రత్నమునకును గూడికవలె సఖ్య మెట్లయినది. అనిన నామాటలచే నవమానితుఁడనై నీసన్నిధికి వచ్చితిని. మహాస్త్రపారగు లైననీమనుమలకు వారిమనోరథములను బూర్తి గావించెదను." అనిన నలరి గంగానందనుఁడు, మొదట ధనమును, బిదపఁ బౌత్త్రవర్గమును నాగురునకు సమర్పించెను. రేణుకాతనయపాదరేణుపూత మైన శిరస్సుగల ద్రోణుఁడు వారినాయుధపరిశ్రమమునకు నియమించెను. భూతలమునకుఁ దిలకమువంటి యర్జునునిచేత సగుణ మైన శరాసనమును ద్రోణాచార్యునిచిత్తమును నిత్యము నాకర్షింపఁబడుచుండెను. ఒకనాఁడు తనయాజ్ఞచేతనే శిక్షితాస్త్రుఁడై యర్జునునికంటె నధికుఁడైన యేకలవ్యుని గురుఁడు గురుదక్షిణగా వాని దక్షిణాంగుష్ఠము నడిగిపుచ్చుకొని యాతనితో సమానునిగావించెను. ద్రోణాచార్యుఁ డొకప్పుడు వారిగుఱిఁబరీక్షించుటకై చెట్టుచివరకొమ్మమీఁదఁజిన్నపిట్టవంటి యొకలక్ష్యమును నిలిపినఁ దొక్క యర్జునుఁడుమాత్త్రమే లక్షించి యాకృత్త్రిమపక్షిశిరమును నితరధనుష్మలమత్సరముతోఁగూడ హరించెను. స్నానమునకై నీటిలోదిగుచు మొసలి కాలు పట్టుకొనఁగాఁ గష్టపడిన గురుఁడు ఫల్గు

నాస్త్రములచేతనే సుఖముం గాంచి మెచ్చికొని యాతనికిదివ్యాస్త్రము లిచ్చెను. అర్జునుని యస్త్రకౌశలము నెఱుకపఱుచుటకై ద్రోణుఁడు శిల్పులచే నొక రంగస్థలమును నిర్మింపించి మంగళబలులు నిర్వర్తించి రాజపుత్రులతోఁ గూడి యచ్చటికివచ్చెను. అదిచూచుటకై వచ్చి పౌరులు జానపదులురాజులు ననేకములగు మంచములపై గూర్చుండి రంగము నలంకరించిరి. దేవవిమానములచే నభఃస్థలము పూరింపఁబడినది. గురుపూజ గావించి ధర్మజముఖ్యులుధనుర్ధారులైస్థూలసూక్ష్మ చలాచలలక్ష్యములయందుఁదమ నైపుణిం గనఁబఱిచిరి. పిమ్మట నాయుధవిశేషములగు ఖడ్గములు, ముద్గరములు మొదలగు వీనితోఁవినోదించి నేర్పు మెఱయించిరి. పిదప గుఱ్ఱముల నడిపించి, యేనుఁగులం ద్రోలి, రథ మెక్కి యనేకరీతులఁ జమత్కారముల యుద్ధోపయోగవిధములఁ దమతమ సామర్థ్యములఁ బ్రకటించిరి. గదలు చేఁబూని భీమదుర్యోధనులు సాలవృక్షములం జేకొన్నయేనుఁగులవలె రంగమున కవతరించిరి. మండలప్రచారములతోఁ గుప్పిగంతులతో నుభయులును గదాఘాతము లొనర్చుకొంచు వేడుకలుచూపుచుఁ గ్రమక్రమముగా నయ్యది క్రోధము విజృంభించి యుద్ధముచేయుటలోనికి దింపుట గాంచి యశ్వత్థామ వారిగదావిహారమును మానిపించెను. అనంతరము గురుని యానతి నర్జునుఁడు గురుపాదవందనముచేసి కవచధారి యై ధనుర్ధరుఁ డయి రంగభూమి నలంకరించెను. అగ్ని, వారిధర, హస్తి, కేసరి, వ్యాల, గరుడ, తిమిర, సూర్యాదిదైవ

తము లగుదివ్యాస్త్రములను సభ్యులకు సవిశేషముగఁ గనఁబఱిచెను. అపుడు సింహసంహననుం డగుకర్ణుఁడు సింహనాదముచే దిక్కులు నిండించుచు రంగములోనికి దిగివచ్చెను. అతఁడును గురుశాసనమున నర్జునుఁడుచూపిన ధనుర్విద్యావినోదములకంటె నధికవినోదములను గనఁబఱిచెను. ఆనేర్పు చూచి యందఱు నచ్చెరుపడిరి. పాండవులు ప్రీడితులైరి. దుర్యోధనాదులు సంతోషించిరి. నీతోద్వంద్వయుద్ధము చేసెదను రమ్మని కర్ణుఁడు పార్థుని బిలిచెను. నీనాయంతరము తెలిసికొనకుండఁ బ్రేలుచున్న నిన్ను నాశరములు పరముం బొందించు నని యర్జునుఁడు పలుకఁ, గర్ణుఁడు, నిలు రంగములోఁ జక్కగ నిలుము, నే నీరంగగృహదేవతకు నీశిరఃపద్మమును బలిచేసెద ననియెను. ఈమాటలు విని కృపుఁడు "పౌరవుఁ డగు నర్జునుఁడు సూతపుత్త్రుఁడ వగు నీతో యుద్ధముచేయఁ" డనిన నాతఁడు సిగ్గుపడియెను. దుర్యోధనుఁడు లేచి యపుడు కృపాచార్యునితో ని ట్లనియె. "ఆచార్య! నీ విట్లు పలుకఁదగదు. లోకవిఖ్యాతపౌరుషము గలవానికులమును బండితులు గర్హింపరు. పురాతనుఁ డగునారాయణుఁడు స్తంభములోఁ బుట్టెను. క్రౌంచ వింధ్యపర్వతముల గర్వ మడంచినకుమారాగస్త్యులవలె నీవును ద్రోణాచార్యులును శరకుంభసంభవులు గదా!" అనిపలికి మంత్రవిదుఁ డగుదుర్యోధనుఁడు కర్ణుని బంగారు కలశముల జలంబున నంగరాజ్యమున కభిషేకించి తన కాతనిని సఖునింగాఁ జేసికొనియెను. పరస్పరోపకారు లైన వారిరువురును

పాండవులను లక్ష్యము చేయరైరి. ఈరీతిగా నస్త్రవిద్యాసాగర పారగులైన శిష్యుల నందఱంగూర్చికొని యొక్కనాఁడు ద్రోణుఁడు వారితో "మీా రువ్వెత్తుగఁ బోయి కయ్యంబున నోడించి ద్రుపదుని బట్టితెచ్చి నాకు గురుదక్షిణ యిం" డని కోరెను. ఆగురుని మాటలను శిరస్త్రాణములుంబోలె శిరసావహించి పటహానిస్వనములతో బలములం గొని రాజకుమారులు ద్రుపదుపురమునకు బైలువెడలిరి. కుంభజన్ముఁ డగుద్రోణునివలనఁ బ్రేరేపింపఁబడిన యీాసేనలు పరివహానామకవాయువుచేత రేఁపఁబడిన మేఘములు మేరుమేఖల నాక్రమించినట్లుద్రుపదనగరముచుట్టును నాక్రమించెను. పౌరవసేనలోని గజఘీంకారము వినినద్రుపదబలము మేఘధ్వని వినినసింహములు సహ్యాపర్వతకందరములలోనుండి వెడలినట్లు పట్టణమునుండి వెడలెను. సోమకులచేతను గురుకుమారుల చేతను నిర్మింపఁబడిన సజ్జనవినుతమైన యారణ మర్జునసైన్యవేదమునకుఁబ్రణవత్వమును బొందెను. సృంజయరక్తముచే రంజింపఁబడిన భూమిని విశిఖజాలవర్షము గురిపించుచుఁ బార్థతుఁడు కౌరవశతమును బరిభవించెను. బాణములచే ధనువులు విఱిచి ఖడ్గధారియై చని యర్జునుఁడు గురువైరిని సృక్వలోలజిహ్వుఁడైనరాహువు చంద్రుని బట్టుకొనినట్లు పట్టుకొనియెను. కౌరవపాండవులు ద్రుపదుని గురుసన్నిధికిం దెచ్చిరి. సిగ్గుచేఁ దలవంచికొనిన ద్రుపదునితో ద్రోణుఁడు, "క్షత్రియప్రవర! పూర్వమునీవు బ్రాహ్మణుఁడవని నన్నవమానించితివి. ఇపుడు దానికి ఫల మిట్లు నాశిష్యునివ

హాముచేతఁ బొందితివి. అర్ధరాజ్యము నా కిచ్చితివా, యర్ధాసన మిచ్చిన కుబేరునితో శివునకువలె నాతో నీకు శాశ్వతసఖ్య మగును." అనిపలికిసత్కరించి పంపఁగా నాతఁడొనర్చిన పరాభవమును బార్థునిపరాక్రమమును దలంచుకొనుచు నిజపురమునకుఁజని యంతటినుండి ఋశ్యశృంగునివంటి తపస్విద్వారమున ద్రోణునితల ద్రెంచుసుతుని ఫల్గునప్రణయిని యగుసుతను గాంచుటకు ద్రుపదుఁడు యత్నము చేయసాగెను. జాహ్నవీతటతపోవనమున నున్న యుపయాజునికడకు యాజపోదితుఁడై యేగి పెక్కుగోవుల నిచ్చి తనకాంక్షితముం దెల్పెను. అతఁ డనుజసహితుఁడై వచ్చి ద్రుపదుని చేతఁ బుత్రకామేష్టిని యథాశాస్త్రముగఁ జేయించెను. సవనాంతసంభృతమైన హవిస్సును యజమానగేహినిచేత హోమముచేయించెను. అంతటఁ గుండాగ్నిలోనుండి ధనుర్బాణములుఁ గవచముఁ గిరీటము ధరించినపుత్రుఁడు పొడముదెంచెను. యాజముని మరల హోమముచేయింపఁగా నగ్నిజ్వాలలోనుండి రక్తపంకజషండములోనుండి లక్ష్మివలె నొక్కకన్యక యుద్భవించెను. ఈకృష్ణ, యర్జునవికాసకారిణియుఁ బ్రావృట్కాలము పద్మవనమునకువలె క్షత్రియకులమునకు క్షయకారిణియు నగు నని గగనవాణి పలికెను. పృషతుఁడు తనకర్జునుఁడు చుట్టమగు నను నానందముతో ద్రోణునివలనిభయముం దలంపఁడయ్యెను. ద్రోణుఁడు విరోధి యగుద్రుపదపుత్రునిగూడఁ దనశిష్యునిగాఁ జేసికొని యస్త్రపారంగతునిం జేసెను. సత్పురుషులకుఁ బ్రాణముకంటెఁ గీర్తి

ప్రియముగదా! ధృతరాష్ట్రుఁడు యౌవరాజ్యమునకు యుధిష్ఠిరుఁడు తగు నని తలంచెను. ధర్మజుని బుద్ధికౌశలమునకు దుర్యోధనుఁడు సహించువాఁడు కాఁడు. జ్ఞాతిదాహమునకు వైరము పుడకలు లేకుండ మండునగ్నియని లోకులు చెప్పుదురు. ఒకనాఁడు దుర్యోధనుఁడు రహస్యముగాఁ దండ్రికడ కేగి "తాత! యిపుడు ప్రజలు ధర్మరాజును గోయిలలు చైత్రమును బొగడినట్లు పొగడుచున్నారు. ఆతఁడే యువరాజైనయెడల మేమందఱము హతాశులము కావున నీ వాలోచింపు"మని వేఁడెను. అది విని ధృతరాష్ట్రుఁడు "నాయనా! నీ విట్లనఁ గూడదు. యుధిష్ఠిరుఁడు తండ్రియగుపాండునివలెనే నాకు భక్తుఁడు. నాకు స్నిగ్ధబంధువు. ప్రజాహితుఁడు. దీనిని నీవు వారింపలేవు. భేదబుద్ధిని దుర్మతమును బోఁగొట్టుకొని పాండవులను స్నేహభావమున భజింపుము." అనవుడుఁ దనయుఁ డిట్లనియె. నేను గర్ణునితో స్నేహము చేయుటచేత భీష్ముఁడు, గురుఁడు, గురుపుత్త్రుఁడు, నతనిమేనమామయు నాయందుఁ బక్షము వహింతురు. సహోదరహితుఁ డైనపాండవాగ్రజుఁడు మాజోలికి రాలేఁడు. నీయనుజ్ఞపై వారు వారణావతమునకుఁ బోయినయెడల మాకు భయము లేదు. పాండవు లిందే నివసించిరా జనులలో వేరుపాటి మాకుఁ బెకలించుటకు వలనుగాని పెనుమ్రాఁకులవంటివా రగుదురు. అని పలికిన దురాత్మునివాక్యము, మదగజము స్వచ్ఛోదకహ్రదమును గలంచినట్లు ధృతరాష్ట్రునిమనస్సుం గలంప ధర్మతనయుని బిలిచి "వత్స! పుణ్యశతమువలనఁ గాని లభ్యముగాని వారణావతము

నకుఁ జని శంకరోత్సవమును జూచుట మంచిది. నీ కచ్చట నివసిం చుట కిష్ట మేని క్రొత్తగా నిర్మింపఁబడిన మనభవనమునం దుండి తమ్ములతోఁగూడి భూపాలనము చేయుము.” అనినఁ బెద్దతండ్రి వాక్యములలోని విక్రియను గనిపెట్టి బుద్ధిమంతుఁడు గావున ననుజసహితుఁడై కుంతీనందనాగ్రజుఁడు బైలుదేఱి పోయెను.

(4) కౌరవసచివుఁ డగుపురోచనుఁడు వారణావతమునకు ముందేపోయి పాండవులను దగ్ధముచేయుటకై లక్కతో నొక్క హర్మ్యమును నిర్మించెను. పౌరలోచనచకోరుఁ డైనధర్మజుఁడు పురముం బ్రవేశించి దుష్టమంత్రి చూపినజతుగృహముంజొచ్చెను. ఆహారవస్తువులలో విష ముండు ననియు నీయిల్లు దహనశీలమైన దనియు సూతుఁడు చెప్పినయాప్తవాక్యములవలనఁ బురోచను నియెడలఁ బాండవులు శంకించుచునే యుండిరి. వారికి దినదిన ముం బురోచనుఁడు తెచ్చి యిచ్చు వస్త్రములుఁ జందనాదివిలే పనద్రవ్యమును స్వీకరించునపుడు రహస్యముగఁ బరీక్షింపకుండ నుపయోగింపకుండిరి. పగలు వేఁటనెపమున గృహమున నుం డుటలేదు. రాత్రులందుఁ బా మున్నయింటిలోవలె మేల్కని యుం దురు. ఒక్క దినంబునఁ బురోచనుండు నిద్రించుచుండ నింటి కగ్ని దరికొల్పి విదురునిచేఁ బంపఁబడిన ఖనకునిచేఁ ద్రవ్వఁబడిన సు రంగములోనుండి పురబహిఃప్రదేశమునకుఁ బాండవులు తల్లి తోఁగూడ వెడలిపోయిరి. పాండవవైరి యగుపురోచనుఁడు కాలిపోయినంతనే పార్థస్నేహితుఁ డగు నగ్నిదేవుఁ డట్టహాసము

ను. పురోచనునిప్రోత్సాహముచే విషఫలములం దెచ్చియిచ్చు
వనేచరి సపుత్రకయై యాయింటం బరుండి మృతినొందెను. మఱు
నాఁడు పురజనులు వచ్చి భస్మముచేఁ గప్పఁబడిన సారంగముం
దెలిసికొనలేక యాచచ్చినవారు కుంతితోడి పాండవులే యని
విచారించిరి. ఈ వార్త కరినగరమునకుఁ దెలిసి యందలిజనులహృద
యములలోని సంతోషముచల్లాఱినట్లు లక్క యింటిలోని యగ్ని
యుఁ జల్లాఱెను. పాండవులు మృతినొంది రని దుర్యోధనాదులు
పైకిదుఃఖమును లోనసంతోషమును బొందుచు నెండవేఁడిమిచేఁ
బై కుష్ణమును లోన శైత్యమును గలనీటికొలనువలె నుండిరి.
బిలములోనుండి వెలువడి తల్లిని నన్నదమ్ములను బుజమున నె
క్కించుకొని భీముఁడు వనప్రదేశములు కాలిత్రొక్కుడుచే బడ
ల్పడ మదగజమువలెఁ బోవుచుఁ దనగమనవేగమునకుఁ దాళఁ
జాలక వివశులై నిద్రాముద్రితముఖు లయినవారి నొక్కసమస్థల
మున నిలిపి వారిని గాచుకొనియుండెను. అక్కడ నొక్కసుంద
రాంగి పాండవుల కడవిలో నిర్బాధముగా నుండఁజూచుటకై వ
చ్చిన వనలక్ష్మివలె వచ్చి భీముంగాంచె. ఆమె సమీపించి దంతకాం
తులతోఁ జీఁకటిని బోఁగొట్టుచు "నయ్యా! మీ రెవరు ? మీ
యొద్దనున్న వీ రెవ్వరు ? ఇట్టియడవిలోని కేల వచ్చితిరి? ఇందు
హిడింబుఁ డనురాక్షసుఁడు గలఁడు. అతనికిఁ జెల్లెలను నేను. మీ
రు వచ్చినట్లు మనుష్యగంధమును బసిగట్టి చంపి తెమ్మని నన్నుఁ
బంపినాఁడు. నీవు నాకంటికి మన్మథునివలె గనఁబడుచున్నవాఁడ
వు. వసంతాగమనమునఁ దీఁగనువలె నీరాకను నాయం దనురా

గపల్లవములు పొడముచున్నవి. ఈరక్కసిరూపును వదలి నీవెు
ద్దికి ధైర్యముతో వర్షాకాలాంతమున నది సముద్రునికడకు వలె
నిర్మలనై వచ్చెదను. మన మిచ్చట విలంబము చేసితిమా నాపైఁ
గోపగించుచు నాయనుష్యాయుఁడు రాఁగలఁడు. నాకరగ్రహణ
ము చేయును. నిన్నెత్తుకొని గగనమున కెగసిపోయెదను."
అనిన విని పవననందనుఁడు నవ్వి "యీయన నాయన్నగారు,
వివాహమంగళ మీయనకే కాలేదు. నేను నిన్నెట్లుపెండ్లిచేసి
కొందును. అట్లయిన నీవలన నేను బరివేత్త నయ్యెదను. అడవి
లో బడలి నిద్రించువారిని వీరిని విడిచి పెట్టి యెవ్వఁడో దుష్టు
లుగొలుసు కఱకు వచ్చు నని భయపడి పోవువాఁ డెవ్వఁడు.
యూథురాలవు గాని పురుషులను రక్షించు స్త్రీ యెుందుఁగలదు.
నీవు మాకుఁ బరభయనివారణము చేయఁగలదానవా! ఈవృ
కోదరుఁడు మీయన్నతో నెట్లు పోరునో చూచుచుండుము."
అని చెప్పుచుండ రోషవహ్నికణములు గురియుచున్న కన్నుల
తో బొమముడిగల మెుగముతోఁ గాఱుచున్న నెత్తురు నాకికొ
నుచు రాక్షసుఁడు వారిమెుదుటికి వచ్చెను. చీ, నాకులమున నీ
వు చెల్లెలివై తప్పఁబుట్టితివి. నీవు మొదల నరుల నెత్తురు ద్రా
వుటయందుఁ బ్రియము గలదానవు. ఇప్పుడు నరులనే ప్రియపడి
యున్నదానవు. అని తోఁబుట్టును దిట్టి భీమునితో, నీ వీనిశాచరి
నేలపొందెదవు, నాకత్తి మొనం జచ్చి సురలోకమున సురకాం
తలం జెందెదవు రమ్మని యెను. వా రిరువురునుం గలియఁబడిరి.
రాక్షసుఁ డొనర్చిన సింహనాదమునకు వనమంతయు గగ్గోలు

పడి నిద్రించుచున్న కుంతియు, నందనులతోఁ బిల్లలసింగమువలె నులికిపడి లేచెను. సాక్షాద్విజయలక్ష్మివలె నచట నిలిచియున్న హిడింబను హిడింబునితోఁ బోరుచున్న భీముని వారు చూచిరి. వజ్రపాతముంబోని పిడికిటిపోటులతో నసురవిశాలవక్షమును బీడించి, మధుదానవుని నారాయణుఁడు చేసినట్లు భీముఁడు పిండి పిప్పి చేసెను. తెల్లవాఱుచుండఁగాఁ బక్షులు రాక్షసుని నెత్తురు ద్రావుటకు వలె వృక్షాగ్రములనుండి లేచినవి. తమోమయుఁడయినరాక్షసాధమునిబడల్పఱిచినయుచ్ఛ్రితకరుఁ డగుభీముఁడు పాండవమానసంబులను వలెనే కరప్రసారముచేయుచు సూర్యుఁడుదయించి పద్మములను వికసింపఁజేసెను. మన్మథార్తయైన హిడింబపైఁ గరుణించి తల్లియానతిని బుత్రోత్పత్తివఱకు నుండని మ్మనిధర్మజుఁడు భీము నొడంబఱిచెను. ఆనియమమునకు సమ్మతించి నదానితోఁగూడ నిహతరాక్షసమైన వనమునుండి వెడలి శాలిహోత్రుని సరస్సునొద్దనునకుం జని పాండవులు పరాశరాత్మజుని దర్శించిరి. ఆరక్కసి సుందరస్త్రీరూపముం దాల్చి పగ లంతయుఁ దనప్రభావముచే నిర్మింపఁబడిన గృహములయందు భీమునితో విహరించుచు రాత్రులయందుఁ గుంతీసపర్య చేయుచుండెను. ఇట్లు కొంతకాల మిచ్ఛావిహారములతోఁ బురూరవస్సహితయైన యూర్వశివలె నక్కాంత భీమునితో నెంతయు సంతసమున నుండెను. అంతట వజ్రపాతమును సహించు ఱొమ్ముగల ఘటోత్కచుఁ డనుకుమారుని భూదేవి యాదివరాహసంపర్కమున నరకుం గన్నట్లు కని హిడింబ యానందించెను. ఆబాలుఁడు పుట్టిన

తోడనె మేనువెంచి మీసలు దంష్ట్రిలు మెఱయ నిలిచి మీకుఁ గోరినకార్యమున సాయముచేయ వచ్చెదను, సెలవిం డని మ్రొక్కి తండ్రుల ను వీడి తల్లిని వెంటఁ గొని యెక్కడకో వెడలి పోయినాఁడు.

తరువాతఁ బాండవులు బ్రాహ్మణవేషములు దాల్చి వేత్రకీయపురమునకుం బోయి యొకబ్రాహ్మణునియింట విడిసి భిక్షావృత్తిని వర్తించుచుండిరి. వారియింట నొకనాఁడు తమయిరువురు బిడ్డలం గౌఁగిలించుకొని పెనిమిటికడ నేడ్చుచున్న విప్రాంగనను జూచి కుంతి నీవంతకుఁ గతం బే మని యడిగెను. అమ్మాట కా బ్రాహ్మణి "యమ్మా! యీనగరపరిసరమున యమునానదియొడ్డున దారుణుఁడైన బకుఁ డను మొఱకురక్కసి యొక్కం డున్నాఁడు. వాఁడు ప్రతిదినమును నిండ మీఁదఁబడి యనేకులను బట్టి చంపుచుండఁగాఁ బౌరులందఱును గూడి, యిట్లు మమ్ము బాధింపకుము, నిత్యము నిలువరుసను నీ కొక్కని బంపుచుందు మని సమయము చేసిరి. ఈప్రకారము బ్రాహ్మణులనుండియుఁ రాక్షసుఁడు భుజాబలమున వేతనము సంపాదించుకొనుచున్నవాఁడు. ఇన్నాళ్లకు మాకు వంతు వచ్చినది. ఈభాగధేయమునకు వంశాంకుర మగు పుత్రుని బంపుదునా పరలోకఋణముం దీర్చు కూఁతుం బంపుదునా! భర్తయే పోయిన సంసార మెట్లు నడచును. నన్నుఁబంపుటకు నాపతి యొప్పకున్నాఁడు. పరు నెవ్వనినైనఁగొని పంపుటకు నాయొద్ద ధనములేదు. ధనమునకుఁ బ్రాణముం గోల్పోవువాఁ డెవ్వఁడు. ఇందు కని యేమియుఁ దోఁపక చేతనైనపనిగదా

యని పనవ్రుచున్న దాన" ననినఁ గుంతీదేవి యి ట్లనియె. "అమ్మా నాపుత్రులలో నొకని నిచ్చెదను. అతఁడు మిగుల బలశాలి.వానిం బలిగా నంపుము. వాఁడు మంత్రవేత్త. రాక్షసులం జంపఁగలండు" అనిన వాక్యములకు విప్రదంపతులు సంతోషపడిరి. తల్లిశాసనముపై భీముండును సిద్ధపడియెను. పాండవులు హర్షముం జెందిరి. పౌరులు విస్మయము నొందిరి. బ్రాహ్మణులు భీమునికి భోజనము పెట్టిరి. రక్తగంధము, రక్తమాల్యములు, రక్తవసనములుం దాల్చి బల్యన్నముతో నిండినబండిని దోలుకొని కుంతీసుతమధ్యముఁడు పురంబు వెలుపలికి వచ్చి, రాబందులు, జంబుకములుఁ, గాకులు మొదలగునవిచుట్టుకొనినదియు, మనుష్యకపాలాస్థులతోఁగూడినదియుఁ, గీచురాళ్లు రొదచేయుచున్నదియు,దుర్గంధము వలచునదియు నగుమాంసభోజనుని యడవిని సమీపించి,యీరాక్షసుని జంపినపిదప శవస్పర్శ చేసిననేను బండిలోనున్న యన్నము తినుట తగ దని ముందే నిర్భయముగ భుజింప మొదలుపెట్టెను. అట్లు చక్కగా మెక్కుచుఁ దనకడకు రామియే గాక యట్టహాసముచేయువాని నసుర చూచి దంతములు గొఱికికొనుచు వచ్చి భీముని ప్రక్కలోఁ బిడికిళ్లతోఁ బొడిచెను. వానిపోటులకు లక్ష్యముచేయకయే యాతఁడు మరలమరల మిగిలినపదార్థములను దినఁ జొచ్చెను. ఏనుఁగుమాంసముం దినుచున్నసింహము నక్కకూఁతలకు బెదరునా. ఓరీ, నాకొఱకై తెచ్చినయన్నమును నీవే తినుచున్నాఁడవా, బ్రహ్మచారీ, ఆయన్నము తినినని నొక్కమాటు మ్రింగితినా నిన్ను వేఱుగా నన్నమును వేఱుగాఁ దినవలసినశ్రమ

కొంతనాకుఁదలఁగును. నీవెందుఁబోఁగలవు. అనినబకునిమాటలు వినియు మాటలాడక భుజియించి చేతులుకడిగికొని కడుపు తడవికొనుచు "నోరి నృశంసుఁడా, మనుష్యవధగావించి మంచియశస్సును సంపాదించితివి. నీకు శక్తియున్నచో నిదిగో హిడింబుని జంపివచ్చిన నన్నుఁ దాఁకి నాయెదుట నిల్చి నీపరాక్రమముం జూపుము." అనిన దానికిఁ గనలి మనుజాశనుఁడు పెద్దచెట్టొకటి పెఱికి తెచ్చి వానిపై విసరెను. ధూతపత్రపటలమును గృతరవమునైన కేళిపక్షినివలె భీముఁ డావృక్షమును బట్టుకొనియెను. కొంతసేపు వారిరువురును ఱాలు ఱువ్వుకొని, చెట్లు విసరికొని గ్రుద్దులాడియు ఖేచరస్తుతిపాత్రులైరి. ద్వంద్వయుద్ధమున నలసినబకుని బాండవుఁడు కడకాలుపట్టుకొని విసరి యెత్తినేలఁగొట్టి కొట్టెను. గొంతు పిసికివైచెను. చచ్చినరక్కసు నీడ్చుకొని లేడిపిల్లను బట్టుకొని గుహకువచ్చు సింగమువలెఁ బురమునకుఁ దెచ్చెను. ఆతనిని బ్రాహ్మణులు, తల్లి, యన్నయు, నాశీర్వచనములతోఁ గౌఁగిలించుకొనిరి. పౌరులు స్తోత్రములతో సంభావించిరి. వజ్రాయుధముచేఁ దెగిన పర్వతమువలెఁ బురద్వారముకడఁ బడియున్న బకునిం గాంచి పౌరులు భయమును విస్మయమును బొందిరి. ఏకచక్రపురిలోనివా రెల్లరుఁ బులిచచ్చిపోయిన వనములోని లేళ్లవలె విచ్చలవిడి నెల్లెడల విహరింపఁదొడఁగిరి.

మార్గమునఁ బోవుబాటసారులవలన ద్రుపదునికూఁతునకు స్వయంవరము జరుగు నని విని పాండవులు వేత్రకీయపురమునుండి ద్రుపదపురమునకు బైలుదేఱిరి. దారిలో వేదములను

విభజించినవాఁడును భారతకవియు నగువ్యాసుఁ డెదురుపడి సులభద్విజాకృతుల నున్నవారితో ని ట్లనియెను. లక్కయింటి యనలమునుండి తప్పించుకొన్నా రని యు, బ్రతికి యున్నా రని యు మిమ్ము గురువృగారివలనఁ దెలిసికొని తనకొమార్త స్వయంవరమునకుఁ బాండవులు రాఁగల రని పార్షతుఁడు నిశ్చయించుకొనియెను. మీరు మార్గశ్రమమున కోర్చి త్వరితముగ ద్రుపదపురికిం జనుండు. నావాక్యమును నయోనిజ యగుకన్యనుస్వీకరింపుఁడు. పిమ్మట నభ్యుదయము౦ బొందఁ డని తపోధనుఁడు వెంచేసెను. పిదప రాజపుత్రులు రాత్రివేళ జాహ్నవీనది యొద్దనునకు ఫల్గునుఁడు కొఱవికట్ల వెలుఁగున మార్గము చూపఁగాఁ జేరిరి. అక్కడ స్త్రీలతోఁ గూడి జలకేళి యొనర్చుచు నుద్ధతుఁ డగుచిత్రరథుఁ డెదుర్కొనఁగా నర్జునుఁడు వానిరథమును బాణాగ్నిచే దగ్ధముగావించెను. నిర్జితుఁడైన చిత్రరథుఁడు ఫల్గునునితో సఖ్యము చేసికొని, మీరు ధౌమ్యుని బురోహితునిగాఁ జేసికొనుఁ డని చెప్పఁగా నట్లే చేసికొని యాతనితోఁగూడి పాండవులు నడువ సాగిరి. పథికులు, సార్థవాహులు, బ్రాహ్మణులు తోడు నడువఁగాఁ బృథాసూనులు పాంచాలరాజనగరమునకుఁ జనిరి. అది కృష్ణాస్వయంవరమునకై వచ్చిన రాజకుమారులకొఱకు నిర్మింపఁబడిన గృహములతో నిండి తొల్లింటికంటె మనోహరముగా నుండెను. ఒక్కకుమ్మరియింటఁ గుంతిని విడిచి ద్రుపదభావిజామాతలు, కనకమంచములు గలదియు నలంకృతులయిన రాజపుత్రులు గలదియుఁ దూర్యశంఖారావములచేఁ బిక్కటిల్లినదియు నగు

స్వయంవరగృహమునకుఁ జనిరి. చెలులతోఁ గూడి పీఠముల న డుము నిఖిలరాజలోకవీక్షణనీలోత్పలమాలికను దాల్చిన కృష్ణను గాంచి పాండవు లొక్కమాఱుగాఁ బంచబాణవిద్ధు లయిరి. అం తట ధృష్టద్యుమ్నుఁడు వచ్చి రంగమధ్యమున నిలిచి యొక్క గట్టి ధనుస్సును, దృఢసాయకములును, గగనమునఁ జలించుచున్న లక్ష్యముం జూపి "రాజముఖ్యులార! ఈధనుస్సు నెక్కు వెట్టి యీబాణములతో నాకాశమున వ్రేలాడు శరవ్యమును నిపుణు లయి యెవ్వరు పడఁగొట్టెదరో వారు నాచెల్లెలిని బెండ్లియాడఁ గల" రని చెప్పెను.

ఇది కౌండిన్యగోత్రజుం డగు కొత్తపల్లి సూర్యరావుచే నాంధ్రీక రింపఁబడిన యగస్త్యకృత బాలభారతమునందుఁ

ప్రథమాశ్వాసము.

శ్రీరస్తు.

బాలభారతము.

ద్వితీయాశ్వాసము.

(5) అనంతరము ధృష్టద్యుమ్నుఁడు తనసోదరిని రాజమంచమధ్యమునకుఁ దీసికొనివచ్చి యామెకు రాజులం జూపి వీరు వీ రని చెప్పఁదొడఁగెను. "ఇతఁడు దుర్యోధనుఁడు. ఈతని యైశ్వర్యముం గాంచి కుబేరుఁడు లజ్జించి యుత్తరదిక్కున నెక్కడనో వాసము చేయుచున్నాఁడు. ఈరాజు తమ్ములు దుశ్శాసనాదులు రత్నఖచితశిరస్కులై శేషుని నాగకుమారులవలెఁ బరివేష్టించియున్నారు. ఈతండు గాంధారరాజు, శకుని. వీని కక్షవిద్యయందుఁ బాండిత్యము మెండని చెప్పుదురు. ఇతం డశ్వత్థామ. ఈగురుపుత్త్రుఁడు సాక్షాత్పినాకియే. ఇతఁడు కర్ణుఁడు. సహజకవచకుండలధారి. జీమూతవాహనశిబిదధీచులపిమ్మట దానమున నీతఁ డధికుఁడు. ఈతఁడు బలరాముఁడు. కైలాసమువలె శ్వేతశరీరుఁడు. నీలాంబరమును నాఁగలియు ధరించినవాఁడు. యమునానది నీబలశాలి రెండుగాఁ జీల్చినాఁడు. ఈతండు నారాయణుఁడు. యదువంశమున నుద్భవించెను. ఇతఁడు కల్పవృక్షమును హరించినంతట శచీముఖము నందనవనమువలె విచ్ఛాయమును బొందెను. వీరు సాత్యకిప్రభృతివృష్ణ్యంధకభోజకుమారులు. వీరివలననే యీకృష్ణుఁడు నక్షత్రగణమధ్యమునఁ జంద్రునివలెఁ బ్రకా

శించుచున్నాఁడు. ఈరాజు జరాసంధుఁడు. పదునెనిమిదిసారులు కృష్ణుఁ డీతని కోడె నని పరాఙ్ముఖ యయినదో, శూరగుణానురక్తయో గాని లక్ష్మి యెల్లపుడు నీతనియొద్దనే యుండును. ఈనృపాలుఁడు ప్రాగ్జ్యోతిషాధిపతి. సుప్రతీక మనుగజ మీతనివాహనము. అది వైరిస్త్రైరవక్త్రాంబుజకాననమును నిష్కారణము మథించుచుండును. ఈశిశుపాలుఁడు చేదిపతి. శౌరి నీబలశాలి తృణమువలె గణించును. మద్రరా జీతండు శల్యుఁడు. వీనిబాహుబలమువలననే మద్రదేశీయులు నిస్తంద్రులై సుఖించుచున్నారు. ఈనీలుఁడు మాహిష్మతీపురనాయకుఁడు. వీనిమహిమవలననే యుద్ధములలోఁ గేవలము నగ్ని దేవుఁడు నచ్చి యీతనికి బాసట యగుచుండును. ఈవీరందఱును నీస్వయంవరమునకు వచ్చియున్నవారు. ఈలక్ష్యము నెవ్వరు కొట్టెదరో వారిని వరింపు" మని వివరించెను.

తదనంతరము రాజులొక్కొక్కరు లేచి యీకన్య నాకే దక్కు నీయంత్రము నేనే కొట్టెద నని యహంపూర్వకముగా ధనుస్సుకడకు వచ్చుచుండిరి. ధనురారోపణమునకై యత్నించు యదువీరులను గృష్ణుఁడు వారించి బ్రాహ్మణమధ్యమున నున్న పాండవులను బలరామునకుఁ జూపించెను. రంగస్థలములోనున్న బాణాసనముకడకుఁ గొందఱు రాలేకయే పోయిరి. వచ్చియుఁ గొందఱు పట్టలేకపోయిరి. పట్టియుఁ గొంద ఱెత్తలేకపోయిరి. ఎత్తియుఁ బలువు రెక్కువెట్టలేకపోయిరి. ఎక్కువెట్టఁ గలిగినవారిలో నీలుఁడు మినుపగింజంత తక్కువగ, శల్యుఁడు పెసరగింజయంత లోపముగ, మగధరా జావగింజమాత్రము కొఱఁతగఁ, గర్ణుఁడు

వెండ్రుకవాసి వెలితిగను, గుణము నాకర్షించి విడిచిరి. ఇట్లుదుర్యో ధనాదు లెల్లవారు యత్నించి విఫలమనోరథులైన పిమ్మట బ్రాహ్మణబృందములోనుండి గజహస్తమువంటి హస్తములు గలయర్జునుఁడు లేచి వచ్చెను. ధనుస్సు దరికి వచ్చి, చూచి, పట్టి, యెత్తి, యెక్కిడి, బాణముసంధించి,లక్ష్యముంద్రుంచి యితరరాజుల యాశలతోపాటు దానిని నేలఁ బడఁగొట్టెను. అపు డతనిమీఁదఁ బుష్పవర్షము కురిసెను. రెండవమన్మథునివలె నున్న యతనిపైఁ గృష్ణ పద్మపుంజనిభము లగు కటాక్షవీక్షణములం బ్రసరింపఁజేసి కహ్లారమాలఁ గంఠమునఁబెట్టెను. దానిచే నాపాండవుఁడు గైరికనిర్ఝరము వెడలు నంజనాద్రివలె నొప్పెను. తర్వాతఁ దక్కినరాజులను లక్ష్యముచేయకుండఁ గన్యను శుల్కచాపమును గ్రహించి యతఁడు రంగమునుండి వెడలెను. ఈమూఘుఁడు ద్రుపదుఁడు రాజుల నవమానించి బ్రాహ్మణున కిచ్చినాఁడు. వాఁడు రాజపుత్రిం గొని పోవుచున్నాఁడని సహింపక వానిని గొంద ఱెదిరించిరి. వృక్షపాణి యైనభీముఁడు సాయముగ నర్జునుండు వారి కెదురు దిరిగెను. మాదండములతోఁ గమండలువులతో నీరాజలోకమును సంహరించెద మని లేచినవిప్రులను జిఱునవ్వుతో నతఁడు వారించెను. కర్ణునితో నర్జునుఁడును శల్యునితో భీముఁడును బోరిరి. వారిని వారివారిపక్షములవారు శ్లాఘించుచుఁ జూచుచుండిరి. ద్విజాతి యని కర్ణుఁడు తీక్ష్ణబాణములను విడువక యర్జునునిచేఁ దీక్ష్ణబాణవిద్ధుఁడై బ్రాహ్మణతేజమును మనము వారింపలేమని మరలి పోయెను. భీముఁడు బాహుయుద్ధమునఁ బడఁగొట్టి

యు శల్యుని మేనమామ యని విడిచెను. వీరు లగుపీ రిరువురు వెన్నిచ్చినపిమ్మటఁ గృష్ణవాక్యములచేత రాజులు కోపమును విస్మయమును లజ్జయు భయమునుం బెనఁగొన నిజపురములకుం జనిరి. పాండవులు కృష్ణాసహితులై కులాలగృహమునకు వచ్చి యింటిలోన నున్నతల్లితో "నమ్మా! మే మొకభిక్ష తెచ్చితి" మని చెప్పిరి. "నాయనలార! రసప్రౌఢిమను మీరు పంచుకొని భుజింపుఁ" డని లోననుండియే పలికి వెలుపలికి వచ్చి కన్నియం జూచి లజ్జావతియు ధర్మభీతయు నై నిలిచెను. అపుడు ధర్మజుఁడు తల్లితో, నీవచనము వృథకాదు. ఈకన్యయందు మాయందఱ డెందంబులు నార్ద్రమైనయవి" యనియెను. ద్రుపదుఁడు వీరు క్షత్రియు లని బాణధారణాదులచేఁ దెలిసికొని పురోహితు నంపి రాజగృహమునకు రావించెను. మీరెవ్వ రెక్కడనుండి వచ్చితిరని యడుగఁగా ద్రుపదునకు మృత్యుముఖమువంటి లక్క యింటిలోనుండి తప్పించుకొని వచ్చిన పాండుసూనుల మని ధర్మజుఁడు చెప్పెను. సంతోషించిన యారాజు తనబాహుబలంబునం బడసిన యీకన్యక నర్జునుఁడు సుముహూర్తమునఁ బాణిగ్రహణము చేయుఁగాక యనికోరెను. మే మేవురము నీకన్యను బెండ్లి చేసికొందుము. అందఱమును సమముగాఁ బంచుకొని భోగించుటకు మాలో సమయము జరిగినది, యనిన వారిపల్కులకు, పల్వురొక్కతెకు భర్త లగుట యెట్లని సందేహించు ద్రుపదుని కడకు వ్యాసుఁడు వచ్చి రహస్యముగా నాకన్యకుఁ బంచపతిత్వకారణమును స్పష్టముగా నెఱిఁగించుటకై యిట్లనియె.

ఈకృష్ణ తొల్లి నాలాయని యను పతివ్రత. అతికోపనుఁడు వృద్ధుఁడుఁ గుష్ఠరోగియు నగుమౌద్గల్యునికి భార్యయై యతని నారాధించుచుండెను. ఆతఁడు చిరకాలమున కీమెను బరీక్షించుటకై ప్రసన్నుఁడై చిత్తమెఱింగి తానే యైదువిధములై భోగించుచుండెను. రెండవజన్మమునం దింద్రసేనయై వానితోన యిన్నారి భోగంబు లనుభవించెను. ఆముని మఱియు భోగేచ్ఛ విడువని యింద్రసేనతోఁ, దపోవిఘ్నభయమున "నీవు తపస్సు చేయుము, నీనియమములకు గిరిశుఁడు ప్రసన్నుఁడై వరము లిచ్చు" నని చెప్పి పోయెను. తపం బొనర్చు నామెకడకు వచ్చి యీశ్వరుఁడు "చాలును, నీకఠోరతపంబునకు మెచ్చితిని, మఱి యొక జన్మమున నీవు పంచపతులం బొందెదవు. ఓకల్యాణి! దుఃఖమును విడువుము. గంగానదీతటమునకుఁ బోయి తత్కాలమున నక్కడ నున్న యొకపురుషుని నాయొద్దికిఁ గొనిరమ్ము." అని చెప్పి యంతర్ధానము నొందెను. గంగ కేగి కన్నీరెల్లఁ బద్మము లగుచుండ స్నానముచేయుచుండఁగా యదృచ్ఛగా నింద్రుఁ డక్కడకు వచ్చి యెవ్వతెవు, నీవేల యేడ్చె దని యడిగెను. కారణము చెప్పెదను గాని నాతో ర మ్మని శంకరునికడకుఁ బిల్చుకొని పోయినది. కాంతాయుతుఁడై కైలాసమున జూదమాడుచున్న యొకయువకుని గాంచి యింద్రుండు "నే నింద్రుఁడను నన్నవమానించి స్త్రీలోలుఁడవై యక్షక్రీడ గావించుచున్నాఁడవా" యని యఱచెను. దేవియుం దేవరయు నొండొరుల గనుంగొని చిఱునగవున నాడుకొనుచుండఁగనే యింద్రుఁడు స్తంభించుకొనిపోయెను. చే

తిలోని వజ్రము జాఱిపడియెను. ఆట చాలించి దేవుఁడు గుహా ద్వారముం దెఱచినఁ దనవంటివారి నైదుగుర నింద్రుల నాఁడుం ద్రుఁడు చూచిన పిమ్మటఁ గృద్ధుఁడై శివుఁడు, నీవు నీపదమును విడిచి మనుష్యుఁడవై యనేకకష్టములను నీపాపమునకు ఫల మనుభవింపుము. పదచ్యుతులయిన యీయేవురతోఁ గూడి——అని శపింపఁబోఁగా వడంకుచు నింద్రుఁడు, "నీదాసుఁడ ను, నాయపరాధమును క్షమియింపుము, కోపముం గొన్నదాని కీశిక్ష చాలును," అని ప్రార్థించెను. క్షమించితి నీ విక్కడనుండి వీరిసాయమున భూలోకమున కేగి క్రమముగా, ధర్మ పవ నేం ద్రాశ్వినులభాగములం బూని యీమెకుఁ బతి వగుము." అని ప్రభువు సెలవిచ్చెను, గాన, నీవు వీరిని వారినిగానే తలంపుము. ఆశ్రీయే యీకృష్ణ యని యెంచికొనుము. అని తిరోధానము నొందిన వ్యాసమహామునివాక్యములపై విస్మయానందములతో ద్రుపదుఁడు వెనుకటి శివునివాక్యమును బాండవులమోహమును దెలిసికొని యైదుగురకు వివాహము చేయుటను సమ్మతించెను. మఱునాఁడు పాండవులు పెండ్లికొడుకులవేషములతో వివాహ మండపమునకు వచ్చిరి. ధౌమ్యాదిపురోహితులు వివాహవస్తు వులను సంగ్రహించిన పిదప ద్రుపదుఁడు ధర్మజునిచేయిపట్టుకొని వైదూర్యసోపానయుత మగువేదికపై నెక్కించెను. పుణ్యస్త్రీలు ద్రౌపది నలంకరించి తీసికొని వచ్చి బంగారుపీఠముమీఁద వరుని ప్రక్కను గూర్చుండఁబెట్టిరి. అనంతరము ధూమోపేత మగునగ్నికి వధూసమేతుఁడై ధర్మసూనుఁడు ప్రదక్షిణము చేసిన నది భృంగ పరివృతమైన రక్తపద్మమును వధూసహిత యగు హంస వలగొన్న

ట్లుండెను. గురువు చెప్పినట్లు కృష్ణలాజహోమముకృశానుజ్వాలలలోఁ గావించెను. అది వాయువేగమున సముద్రమునందలి యలలను తెమ్మలను బ్రవాళజ్వాలములోఁబడ వేసినట్లుండెను అవ్వల శత్రుసీమంతినీసీమంతకుంకుమాంక యోగ్యమైనవధువు పాదమును వరుఁడుపట్టుకొని సన్నికల్లు మెట్టించెను. ఈప్రకార ము తెక్కిన నలువురుపాండవులచేత ఘర్మోదకార్ద్రకరమును బట్టించిరి. అది పుష్కరచారువైన కరిణీహస్తమును యూథపగజములు పట్టుకొన్నట్లొప్పెను. మంగళాచారములు నిర్వర్తింపఁబడినపిమ్మట మామ యల్లుండ్రకు ధనము, రథములు, గజములుఁ, దురంగములును, వేలకొలఁది యరణమొసంగెను. ఈమహోత్సవమును ధార్తరాష్ట్రులు విని సహింపక సేనాసమేతులై ద్రుపదుపురము ముట్టడించిరి. వారిని ద్రుపదసేన యెదిరించినది. ఇరువాఁగులవారికి దుర్దమమైనయుద్ధము జరుగుచుండఁగా రథము నెక్కి పురము వెడలి పాండవులువచ్చిరి. రాధేయుఁడు శకునియుననుకొఁలుగల కురుబలగజము దుర్యోధనుఁడను విషము చేతఁ గలఁతనొందింపఁబడి ద్రుపదసైన్యముం ద్రొక్కుచుండ నర్జునుఁడు తనశస్త్రమంత్రప్రభావమున దానివిషము దింపివైచెను. భీమసహాయుఁడైన యాతఁడు కురుసైన్యమును వినాయకసహాయుఁడయిన కుమారుఁడు గజాసురచమువును వలెమర్దించెను. పరాజితులయిన కర్ణాదులు పురోచనుని దిట్టుకొనుచు విఱిగిపోయి సధ్వజములతోడి డొల్లరథములతోవిన్నబోయి నిజపురమునకుఁబోయిరి. జయశ్రీయుతులైనపార్థులు ద్రుపదనగరమునకుఁ మరలి శ్రీకృష్ణునికరుణచేఁ గొంతకాల

మక్కడనుండిరి. దుర్యోధనుని తలతిక్క కుదిరిచిన భీష్మాదుల మంత్రముచేత ధృతరాష్ట్రుఁడు ధర్మరాజు నర్ధరాజ్యమున నిలుపుటకై కరినగరమునకుఁ బిలిపించెను. తమ్ములతోఁగూడి సమగ్రైశ్వర్యయుతుఁడై హేతిశోభితుఁడై శ్రీకృష్ణరక్షితుఁడయిన ధర్మజుని వీక్షించి దుర్యోధనాదులు తప్పఁ దక్కినవారలెల్లరు నానందించుచుండిరి. ఒక్కశోభనమైనముహూర్తమున యుధిష్ఠిరు నభిషిక్తుం జేయుటకు మంత్రివృద్ధసమేతుఁడైన ధృతరాష్ట్రుఁడు మండపములకు వచ్చెను. మేడిమ్రానితోఁ జేయఁబడిన భద్రపీఠముపై ధర్మజుని గూర్చుండఁబెట్టెను నతనియభిషేకసూచకమగుశంఖధ్వని పౌరులయానందకరతాళధ్వనులతో విజృంభించెను. వ్యాసుఁడు ధౌమ్యుఁడు మున్నగు ద్విజప్రముఖులు కొందఱు మంత్రపూతములుఁ గుశాంకురోపేతములు నగురత్నకుంభములలోనిజలము నభిషేకించిరి. ఆసువర్ణరత్నకుంభముల నుండి ధర్మజునిశిరస్సుపైనుండి క్రిందఁబడు జలధార యుదయరాగముతోఁడి పూర్వపర్వతమునుండి వెడలు వెన్నెలనిగ్గువలె నగపడియెను. రత్నస్థగితము రత్నకంబళశోభితమునగు సింహాసనమును ధర్మజుఁడలంకరించినంతనె నిఖిలధరావలయమునతని దక్షిణభుజమునకు స్వాధీనమయ్యెను. ఆతనిపరాక్రమాంకూరములవంటి కర్పూరదీపకళికలను రత్నపుఁబళ్లెరములలో నుంచి పురంధ్రు లారాత్రికలెత్తిరి. మదగజము నెక్కి యలంకృతమైన పురీరమణీయతను జూడ వెడలినంతఁబుష్పకీర్ణమైన రాజమార్గము తారకితమైన నభోమార్గమును మించెను. నభోవీథి నలంకరించిన సూర్యునివలె నూతనాభిషిక్తుఁ డగుధర్మ

రాజు రాజమార్గమున కలంకారమయ్యెను. జలపూర్ణకుంభము లతో నేనుఁగులనెక్కి పురంధ్రులు రాజులను వెంబడించి నల్ల మబ్బులలోని తటిల్లతలవలె నలరిరి. పురప్రదక్షిణము చేసి నిజా వలోకన నిష్పందపక్ష్మలగులు గలయువతీగణము ఏవాతపద్మో జ్జ్వలకమలినీషండమునందలి రాజహంసవలె నా రాజహంసవిల సిల్లె. ప్రజ్ఞాచక్షుం డగు పెద్దతండ్రి యాజ్ఞచేఁ దమపూర్వులయిన యాయువు మొదలగువారు నివసించిన ఖాండవప్రస్థమునకుఁ దమ్ములతోఁ గూడి చని, యిక్కడ నివసించుట యెట్లు, గృహావసతి యేదియని తగిననివాసమునకై యోజించుచుండఁ గృష్ణానుజ్ఞచే విశ్వకర్మ వచ్చి యెదుట నిలిచి నమస్కరించి "రాజా! హరి యానతి నిచ్చుట నీకొఱకై హరిప్రస్థ మనుపురమును నిర్మింప వచ్చితిని." అని ధర్మసుతుని యనుమతిపైఁ ద్వష్ట చదునైన ప్రదేశమున హేమరత్నాత్మకమై భూలోకాలంకారమగు నగర మప్రయత్నముగ నిర్మించెను. అభిజాత మగుదివసమున బ్రాహ్మణులచే నుచితపూజలు చేయఁబడినపిదపఁ బార్థివుఁ డుత్తుంగధ్వజాలంకృత మగు మార్గమున నుచ్ఛ్రితగజాధిరూఢుఁడై చని నిజగృహప్రవేశము గావించెను. స్నిగ్ధవర్ణమును మధురాకృతియు దినదినప్రవర్ధమాననవోపచారమును నుదారప్రకృతియు నగునానూతనపురిని రెండవద్రౌపదినివలెఁ బొంది యారాజానందించుచుండెను

ఒకనాడు నిజనూతనపురీవిలాసాలోకనకౌతుకియగు రాజును విశ్వకర్త హర్మ్యాగ్రమునకుఁ దీసికొనిపోయి చూపి యి

ట్లనియె. "మహారాజా! యిటుచూడుము. నీబాహుపంజర గుప్తమైన యీపురము మీఁదనున్న స్వర్గపురిని దనధ్వజహస్తములచే నిరసించుచున్నట్లు లున్నది. కేళీకూళుల సోపానములందలి యింద్రనీలమణులకు నిందీవరము లను భ్రమచే భ్రమరములువచ్చి పరిమళభేదముచే వానివానివిభాగమును జేయఁజాలుచున్నవి. ఏణీలోచనములచే నిండిన నీలజాలవాతాయనములు విలోలమీనములు గలయమునాజలమునందలి సుడులనుబోలుచున్నవి. ఈపురమునందలి మేడలమీఁది ధ్వజపటమారుతముచేఁ బడిశ్రమము వాసి సూర్యతురంగములు నానామణిజాలసంపర్కమున వివిధవర్ణములుగలవి యగుచున్నవి. ఈనగరమునం గలసౌధములపై మెలంగునంగనలు ముఖసామ్యమునకు వచ్చినసుధాంశునికి రెండవప్రక్కను గంటికాటుకపూసి కళంకిని జేయుచున్నారు. ఆయాగర్భగృహములలోని మణిదీపకాంతులకు లోఁగి చీఁకట్లు వెలికిఁబోవుచున్నట్లు గవాక్షములలోనుండి ధూపధూమరేఖలు వెలువడుచున్నవి. రాత్రులలో రేఱేనిశీతకిరణములచేఁ గరఁగి జలజలధారలుగాఁ బడుచంద్రకాంతశిలలుగలహార్మ్యములు జలయంత్రమనోహరత్వమును ధిక్కరించుచున్నవి. నున్నని భిత్తికలుగలగృహములలో దాఁగుడుమూఁత లాడుచున్న కన్నెలు గోడలలోఁ గనఁబడు ప్రతిబింబములకు ముగ్ధలయి చాలసేపటికిస్పర్శసుఖమునఁ దమచెలులనుగని పట్టుచున్నారు. ఉద్యానవనములలో డాఁగిన వాతపోతములు "కిటకీల"మార్గమునఁ

బడుకటిండ్లు ప్రవేశించి యలసి నిద్రించు కాంతల స్వేదాంబు ముక్తామణిజాలమును హరించుచుండును. ధ్వజవస్త్రములంబోలిన శ్వేతమేఘకదంబము మేడలమీఁది నీలరత్నప్రభలచే నావరింపఁబడి యందు విహరించు నెమిళ్ళకుఁబ్రావృట్కాలమేఘములవలె హర్షముం గలిగించుచుండును.” అని యీవిధముగా స్వనిర్మితమైన పట్టణమును వర్ణించిచూపిన స్వర్గస్థపతిని సత్కరించి పాండవాగ్రజుఁడు పంపివైచెను. కృష్ణాదులెల్లరు నాతని యనుమతిపై నిజనగరంబులకుం జనిన వెనుక వీణామునిచను దెంచి పూజింపఁబడి రహస్యముగ నిట్లనియెను. “రాజా! నా మాటలు నీవు విననలయును. స్త్రీలవలనఁ బురుషులకుఁగల హాములు సంభవించును. స్నిగ్ధురాలగు ద్రౌపదివలన మీరుభేదమునుబొందఁగూడదు. పూర్వము బ్రహ్మావరమున సురలకవధ్యులైన సుందోపసుందు లనునన్నదమ్ములు తిలోత్తమయను నచ్చరలేమకతంబునఁ బోరాడిరి.” అని పలికిన సాక్షాదగ్నిహోత్రునివంటి యానారదుఁడు సాక్షిగాఁ బంచపాండవులు నిట్లు సమయముం జేసికొనిరి. “కృష్ణ మనలో నొక్కొక్కరియొద్ద నొక్కొకయేఁ డుండవలయును. ఒక్కనియొద్ద నున్నపుడు వేఱొక్కఁడుచూచెనా వత్సరకాలము పురము వెడలి పోవలయును” అని యిట్లు వారు ప్రతిజ్ఞచేసికొనిన యనంతరము ముని వెడలిపోయెను. సత్యసంధులైన పాండవులు కృష్ణను గూఢముగా నుంచుటయే హిత మనుకొనిరి. అట్లే యాద్రౌపదియు వారిని యమమునకు బద్ధురాలై భృంగమాల యాయాఋతువులం బొడమిన పుష్పగుచ్ఛముంబలె ననుసరించుచుండెను.

(6) ఒక్కనాఁ డొకబ్రాహ్మణుఁడు రాజద్వారముకడకు వచ్చి చేతు లెత్తి వడిగా "నాయాలమందను దొంగలు తోలి కొనిపోవుచున్నారు. మీరడ్డుపడుం"డని మొఱవెట్టుకొనియెను "నీపసుల మరలించెదను వెఱవకు"మని యర్జునుఁడు ధనుర్బాణములకై శస్త్రగేహమునకుం జని యచ్చో ధర్మరాజుతో విహరించుచు ద్రుపదరాజపుత్రింగాంచి సమయవిరోధ మయ్యెననితలంచుచు నన్నకు నమస్కరించి విల్లునమ్ములుంగొని చని మ్రుచ్చులం దెరలించి గోవులం దోలుకొనివచ్చి విప్రునకర్పించి యన్నగారి సెలవుంగొని నియమానురోధముగ వర్షపర్యంతము తీర్థయాత్రలు చేయ నుత్తరదిక్కుగా బయలుదేఱెను. కూడవచ్చు ఘాడమివేల్పులను జాహ్నవీతీరమున నిలిపి తీర్థములోనికి సాయంకాల స్నానమునకుదిగి మునిగెను. నదీగర్భములో నాగరాజతనయ యగునులూపిని దర్శించెను. అంగజాతుర యగుసక్కన్య యతని నిజగృహమునకుం గొనిపోయెను. ఆకాంత కాంక్షితముందీర్ప నిలావంతుఁ డనుసుతుఁడు తత్కాలమున నుదయించెను. ఆబిడ్డని గాంచి సంతసించుచు నందా రేయిగడపి మరల జలగర్భమునుండి గాండీవి వెడలివచ్చి జరిగినవృత్తాంతమును దోడిబాడబులకుం దెలిపి యచ్చెరువునొందించెను. ఆతఁ డోలి నుదగ్దిశం గల సకలతీర్థములు సేవించి తూరుపుదిక్కునకుఁ దిలకమువంటి మహేంద్రపర్వతమునకు వచ్చెను. ఆభూధరమునఁ గొన్నిదినములు నివసించియుండెను. అందెప్పుడును మొగలిపూదుమారముచే సూర్యరశ్మి కనఁబడకుండఁ బవళ్ళు దుర్ది

నములై యుండెను. రామసేతుచిహ్నములు గలిగిన దక్షిణ దిక్కునకు నుహేంద్రగిరివనమార్గమున వచ్చెను. తమ్ములపాకు తీవ లల్లుకొనిన పోఁకమ్రాఁకులు గలచోళదేశమును దాఁటి మణులూరుపురమునకు వచ్చెను. అది పాండ్యరాజధాని. పౌర జనానందకరముగ నచ్చట మలయధ్వజునిపుత్రిని జిత్రాంగ దను బెండ్లియాడి కొంతకాల మందుఁగడపి నవముక్తాఫలశీత లములైన తామ్రపర్ణీతరంగముల మీఁదినుండి లేచుపవనము లతో నెదుర్కొనఁబడి నడచి హరిచందనగంధబంధురంబు లగు మలయభూధరకందరంబులందుఁదిరిగి యేనుఁగుఁగదుపులువిహ రించు నొడ్డులుగల లవణసముద్రతీరమున సేతుదర్శనము చేసి రఘురాముని స్తుతించెను. తిరిగి మామగారియూరికివచ్చి తన కై విరహమున మితభూషణయై కృశించి పాండుగాత్రియైనట్లు గర్భచిహ్నములతో నొప్పు చిత్రాంగదను దర్శించెను. ఆయం బుజనేత్ర బభ్రువాహనుఁడనుపుత్త్రుని దామ్రపర్ణి మణిని, మల యము దక్షిణానిలపోతమును గనినట్లు గనియెను. పాండ్యుఁ డల్లునిసమ్మతిపై దౌహిత్త్రుని దనకులవర్ధనునిగా రాజ్యభారము సిగ్రహించి చిరకాలమున కనపత్యదోషమును బోఁగొట్టు కొనియెను. అక్కడనుండి కదలి పడుమరదిక్కునకు యతివేష మునఁగ్రీడి సుభద్రాలాభమునకై ప్రయాణము చేయ నూహిం చె. యాదవులను వశము చేసికొనుటకు హరిసాహాయ్యముకావ లయును. అతఁడేగదా మనమేలుఁ గోరువాఁడు. అని నిశ్చ యించి శ్రీకృష్ణుని సాయమునకై ధ్యానించెను. అంతనే రథ ముపై శౌరి సారథిద్వితీయుఁడై వచ్చి చాలకాలములకుం గంటి

నని పొంగి రైవతకాద్రిపై నాతనినిల్పి తాను నగరమునకుఁ జనియెను. అనంతర మనంతుఁడును పౌరులకు రైవతకోత్సవ ము చాటించెను. స్త్రీపురుషులు ముదమున వివిధవిధముల నయ్యద్రిపైఁ బూజగావించుచు వినోదింపసాగిరి. అక్కడకుఁ జెలికత్తెలతోఁగూడి వచ్చి యుత్సవమున న్మెలఁగు నేత్రోత్స వకారిణి యగుసుభద్రనుగ్రీడి పొడగాంచెను. రమణీయక్షీరా బ్ధియం దుద్భవించిన సాక్షాల్లక్ష్మివలె నున్నసుభద్ర యాపురు షోత్తముని హృదయహారిణి యయ్యెను. పర్వతసానుతలంబున నల్లమబ్బులో వెలుఁగు మెఱుఁగుఁదీవవలె నున్నయాదవిఁ గాంచి నవనీపమువలె నవనీపకుమారుఁడు పులకాంకితుఁడ య్యెను. అనురాగమే మూర్తిభవించినట్లున్న నవకాషాయ వస్త్రము శరీరము నలమికొన, సుభద్రపై దృష్టినిలిపిన కుహ నాయతినిగాంచి కృష్ణుఁ డిట్లనియెను. అనన్యలభ్యమగు నేవ స్తువును నీవు దలఁచుచు నీపర్వతముమీఁద నుంటివో యద్ది యరుణాధరబింబము నాయతాక్షము నగుచు నీకుసన్నిధియై నది బలరాముఁడును సకలయాదవులును నీయభిలాషమున కిష్టపడరు. రాజపుత్రునకు విహితమయిన బాహుబలము నుప యోగించి యీబాల హరియింపఁదగినది. అని పల్కి యదూ ద్వహుఁడు ద్వారవతికిఁ జేరెను. ఆతని చెల్లెలిపైఁ బొడమిన విరహము చేతనైన యర్జునునితాప మతితీవ్ర మయ్యెను. ఆప ర్వతముమీఁది దావవహ్నినిగూడఁ జల్లార్ప నేర్పుగలిగిన ప్రావృట్కాలవర్షములును నర్జునుని యప్పటియాతాపజ్వాలలను జల్లార్పలేకపోయినవి. మదనబాణబాధితుఁ డైనయర్జునుఁడు

వడగండ్లుగురియు మేఘవాతములను నవకందళులు లేచినప్ర
దేశములను మత్తమయూరముల కేకలను సహింపఁజాలఁడ
య్యెను. అభిజాతస్మితచంద్రికలతోడి ప్రియురాలిమోమను చం
దురుని జూచినను వానిహృదయము మోహమనుచీఁకటిలో
మునిఁగియే పోయినది. ఈతనితురీయాశ్రమస్వీకరణమును దన
వారికిఁ దెల్పకుండ హరి హలిప్రీతికై కన్యాభవనమున నుండ
నియమించెను. అతిథియందు నిర్వికారిణి యగుసుభద్ర సపర్య
లలోఁ గొన్నిప్రొద్దులు గడపెను. చిరకాల ముండుటచేఁ జన
వును విశ్వాసమును గలసుభద్ర యఘ్రడపు డర్జునుని సన్నిధిని
గూర్చుండి యాభుజముల నాకిణాంకములు గలచేతులను
జూచి యితఁడు సవ్యసాచియే కాని యతి కాఁడని పూర్వపు
బంధువులు చెప్పుకొను మాటలనుబట్టి గుర్తించెను. ఆవిషయ
ము నిశ్చయించుకొనుటకై "స్వామీ! మీర నేకతీర్థములు
సేవించియున్నవారలు. ఏప్రదేశములలోనైనఁ దీర్థయాత్ర
లకై వెడలినపార్థుఁడు మీదృష్టిగోచరుఁ డయ్యెనా? అతఁ
డిపు డేదేశము నలంకరించుచున్నాఁ" డని యడిగెను. ఓప్రి
యురాలా! ఆతనిని జ్ఞాపకము చేయుటచేత నాయొడలు పుల
కిత మగుచున్నది. ఆతఁడే యితఁడు, నీయెదుటఁ గృత్రిమ
యతివేషమున మన్మథార్తుఁడై యున్నవాఁడు. అనిన గగు
ర్పాటుతో నానందబాష్పములు విడుచుచుఁ జఱునవ్వుతో.
నిలువంబడియెను. ఈరాత్రి పెద్దలు నిశ్చయించిన యఖిలోద
య హేతువైన మిత్రముహూర్త మున్నది. మదనజ్వరపీడితుఁ
డనగుననున్నఁ బాణిగ్రహణము చేయనిమ్మనిపలుక నుద్యానవన

లతాగృహములలో నున్న చెలులయొద్దకు సుభద్ర చనఁగా నామెను వారు దేవకి చెంతకుఁబంప దేవకీవసుదేవుల కిష్టమైనసుభద్రార్జునవివాహమును బలరామునకుఁ దెలియకుండ జరిగింపవలయునని కృష్ణుఁడు గిరికోత్సవమున కని బలరాముఁ ద్యవిష్టబంధువులను శేషో ద్వీపమునకుఁ దీసికొనిపోయెను. ఆరాత్రి విజయుం డింద్రునిం దలంచెను. సుభద్ర కృష్ణునిం దలంచెను. వారిరువురును శీఘ్రముగా వివాహము గావింపఁ దలఁచి ద్వారకకు వచ్చిరి. ఇంటికి వచ్చినశచీసహితుఁడయిన యింద్రు నుపేంద్రుండు బహూకరించెను. శచీపురందరు లిరువురుఁ దమశరీరములమీఁది యాభరణములతో వధూవరుల నలంకరించిరి. పిమ్మట వసిష్ఠమునివచ్చి వారి నగ్నిసన్నిధికిఁ దెచ్చి కూర్చెను. ఋషులుం బెద్దలు నాశీర్వదించిరి. పుణ్యాంగన లారతు లెత్తిరి. దంపతులనులాలించి యింద్రుఁడు కృష్ణుని యనుమతివడసి స్వర్గమునకుం బోయెను. హరియు నంతరీపమునకుం జనినపిమ్మట నతనియాదేశము ననుసరించి యర్జునుండు రథమెక్కి సుభద్ర తోలుచుండఁగా స్వపురమునకు బైలుదేఱెను. పురరక్షకులనుగూడ లెక్కసేయక సుభద్రనర్జునుఁడు హరించుకొని పోయెనని ద్వీపాంతరములో నున్న బలుఁడువిని యదువృష్ణికుమారులతోఁగూడి కోపగించి విజృంభించుచుండఁ గృష్ణుండు శాంతవాక్యములతో వారిని నివారించెను. భార్య రథము గడుపుచుండఁ గవ్వడి వివిధదేశములు గడచి యన్నగారి సన్నిధికిం జనియెను. మఱునాఁడు రామకృష్ణులు పాండవులయొద్దికి వచ్చి కుశలప్రశ్నముం జేసిరి. కొన్నినా

ళ్ళందుండి రాజసత్కృతుండై బలరాముఁడు ద్వారవతికింజని నపిమ్మటఁ గృష్ణుఁడు వాసవసూనునితో వినోదముగా నందుఁ గడపుచుండెను. కొన్నినాళ్ళ కర్జునున కభిమన్యుం డనుతన యుండు జనియించెను. ద్రౌపదియును బాండవులవలనం బ్రకృతి యింద్రియములవలన విషయములం గనినట్లు ప్రతి వింద ప్రముఖపుత్ర పంచకముం గాంచెను. ఆబాలురకు మురభంజనుండు సకలాస్త్రవిద్యలుం గఱపెను. పాండవులవలన నుపలాలింపఁబడుచుఁ బరసాధనకర్మలం బ్రవీణులై సంధివిగ్రహాదుల మూర్తులవలె నాపుత్రకులు సంచరించుచుండిరి. జీవలోకహర్ష కారియు నవమన్మథాకారుఁడు నగునభిమన్యుఁడు ఋతువులలో వసంతమువలె శోభించెను. కృష్ణున కానందము గల్పింప నొకప్పుడు పరభృష్టస్వరదీనత కుపదేష్టయు విరిసిన దిరిసెనపూవులశోభ గలదియు నగు దీర్ఘవాసరములఋతువు సమీపించెను. పరుషమైన యెండచేఁ బుట్టు తనగుణములపరితాపమును బోఁగొట్టుటకుంబోలె హిమవత్పర్వతప్రాంతమునకు సూర్యుఁడు తనరథమును మరలించెను. గ్రీష్మఋతువు పొడమఁగ నె ధారాగృహాస్తికము లయినరాజమార్గములును నర్తితతాళవృంతము లగుగృహములును బురము నలంకరించెను. గంధపంకచర్చలును మృణాలహారములును గలసుదృశల వక్షోరుహములు కాముకులకుఁ దాపోపశాంతి కయ్యెను.

అక్కాలమునఁ గృష్ణార్జునులు హిమవారియుతము లగు యమునాతీరవనములందు విహరింపవిచ్చేసిరి. వారియొద్దికి బ్రాహ్మణ వేషమున నగ్నిదేవుండు వచ్చెను. తనజ్వాలలవలె వెలుం

గు జటాజలమును దుగ్ధాహుతులచే నిర్మలములైన జందెము లను హవిరామోదయుత మగుహిరణ్యపద్మమువంటి ముఖ మును నల్లనిసిచయమును గలయగ్నిభట్టారకుఁడు దృష్టులు మిఱుమిట్లుగొలుపు పిశంగనేత్రములతో వారిని దీవించి యాఁకలిగొంటినని దీనవాక్యములతోఁ బలికెను. అపుడు నీయార్తి నివారించెద మని వారభయ మీయఁగ నే నేను జాతవేదుఁడను, నాకన్నము భోజ్యము గాదు, గొప్పపర్వత ములు నుగ్రసత్త్వములును బెద్దవృక్షములును గలకాఱడవులు గల ఖాండవవనమును నేనాసించితిని. తనస్నేహితుఁడగుతక్ష కుం డం దుండుటచే, నాఖండలుండు దాని రక్షించుచున్నాఁ డు. ఉద్ధతు లగుదైత్యులు నురగులు నందు నిరపాయులై యున్నారు. నేను స్వతంత్రించి దానిని దగ్ధముచేయం జాల కున్నాఁడను. నేను విజృంభించినపుడెల్ల వర్షములచేఁ బాక శాసనుండు చల్లార్చుచుండును. మీరు నాకు సాయము చేసితి రేని సహస్రాక్షులు సహస్రసంఖ్యలు వచ్చినను నేనుభీతిల్లను, దానిం దగులంబెట్టి నాకాంక్షితముం దీర్చుకొందును. పురు షులకు సుసహాయమునం గదా కార్యములు సిద్ధించును. అని కృష్ణబోధితుఁడై వహ్ని సముద్రములోనుండి గాండివ మను ధనుస్సును, నక్షయసాయకములుగల బత్తలికల రెంటిని, తెల్లగుఱ్ఱములం బూన్చినరథమును దెచ్చి యర్జునున కిచ్చెను అతఁడు కపికేతువు గలయాతేరిపైఁ బాండురాశ్వములు సకి లించుచుండ నెక్కి ధనుర్ధారియై ఖాండవప్రళయముం దెలుపు గాండివజ్యానాదము గావించెను. కృష్ణార్జునుల సహాయముం

బొంది యాయనలుఁడు ఖాండవమును సమీపించి ఘోరాకారముగ నిజతను వృద్ధిపింపఁ దక్షణమాత్రమున వనమునంతను నేర్చుటకుఁ జాలినంత విశాలరూపముం దాల్చెను. చటులకల వింక నీలమును గపోతయూథధూమ్రమము నగుధూమము వెడలెను. చీఁకటుల పుంజములవలెఁ గుంజములలోనుండి కుంజరములు భీతిల్లి పరువులెత్తెను. వేఁడికిఁ జెట్లచివరి క్కెక్కినఫణులు గాలిచేఁ గంపించినకొమ్మలలోనుండి యగ్నిలోఁ బడియెను. చమరీమృగములు తోఁకలుగాలి తొందరపడి యుఱికి మంటలలోఁ బడియెను. ఆడవి యెల్లెడ వ్యాపించి మిన్నులుముట్టిన శిఖాజాలముతో నింద్రునిపద మాక్రమించుకొనువానివలె నట్టహాసముతో నాయగ్ని దేవుఁడు పెరిఁగెను. ఇటునటుఁ బరుగెత్తి తప్పుకొనిపోఁజూచు జంతువులను బాండవుఁడు తనబాణముల నరికట్టి మంటలలోఁ బడఁగొట్టెను. ఎగురంబోవు సర్పములనింద్రనందనుండు ఖండింప నపుడు చిందినఫణామణులు గగనమున కెగురు స్ఫులింగములను వృద్ధిపొందించినవి. ఆ యగ్ని దేవుఁడు పర్వతముల నన్నింటిని గడ్డిపరకలవలె గాల్చివేసెను. విష్ణుచక్రముచేఁ దెగని రాక్షససమూహమును దఱుగనికూరవలె నంజుకొనియెను. అపుడు ఖాండవములోని తక్షకుఁడు మృతినొందునని వజ్రివర్షయుతము లగుమేఘములను బంపెను. వెనువెంటనె కుపితుఁడై తాను నువెల్ల యేనుఁగునెక్కి బైలుదేఱెను. దవవహ్నిని దర్శించునట్లు మేఘములు గర్జించినవి. వర్షించుపెద్దమేఘములకును నర్చిష్మంతుని నుండి వెడలుధూమమునకును భేదము కనఁబడలేదు. కాని మెఱు

పులచేతఁ గొంత మేఘధూమములం దెలిసికొనఁ దగియుండెను ఐరావతతుండసన్నిభము లగువర్షధారలు జగదండమండపమునకుండు స్ఫటిక స్తంభములవలెఁ గనఁబడియెను. జలదములచే ననలుఁడు హీనసత్త్వుఁడగుచుండ నర్జునుఁడు బాణజాలముచే వనముమీఁద వర్షధారలు పడకుండ విశాలమగు శాలను నిర్మించెను. మీఁదినుండి పడుచున్న వర్షధారలు పొగతోఁ గలసి శరవితాన భవనమునకు రంగులగోడలవలె నుండెను. మంటలు పెచ్చుపెరిఁగినకొలఁది నిలువలేక కొడుకు నెత్తుకొని మీఁదికెగురు తక్షకపత్నిని విజయుఁడు నఱికివైచెను. వర్షాసారముచే క్షణకాలము మోహవశుఁడైన వానింగా నర్జునునొనరించి యింద్రుం డాయగ్నిలోనుండి తల్లితోఁ గఱచికొన్న మిత్రపుత్రు నశ్వసేనుని రక్షించెను. శీర్షమాత్రుఁడై నిలిచిన యాయశ్వసేనుఁడును భానుసూనుఁ డగుకర్ణుని శరణుచొచ్చెను. వనభంగము గావించినందులకును సుహృత్ప్రియను వధించినందులకును మహేంద్రుఁ డతికుపితుఁ డయ్యెను. ఇంద్రునకు సాయముగా వచ్చిన వసురుద్రాదులు సన్నద్ధులైనఁ గృష్ణార్జునులు వారి నెదిర్చిరి. వివిధాయుధవర్షముం గురిపించువారిని లెక్కసేయక విముఖులంజేయు నాపురుషద్వయమును నారదుఁ డాకసమున నిలిచి తలయూడించుచుఁ బొగడంజొచ్చెను. ఇతరదేవతల నందఱ నోడించిన తన తనయుని శౌర్యమును సహింపక బలభేది దారుణపాషాణములను వర్షించినఁ దననిశితవిశిఖములం జెండాడి యర్జునుఁడు విజృంభింప గగనమునందు "మహేంద్ర! వీరు నీహితులు, వీరితో నేల

యాలము చేసెదవు. ఇయ్యిరువురు భూమిలో నవతరించిన నరనారాయణులు, వీరితోఁ దుల్యులు లేరు. వీరిని మన్నింపుము." అని వినఁబడియెను. ఆవాక్యములువిని బలవైరి త్రిదివమునకుం జనియెను. గరుడధ్వజకపికేతనులు శంఖములంబూరించిరి. ఇంద్రుండు వెడలిపోయినంత వానితో వానిసైన్యమువలెనేమేఘములును మరలెను. అగ్ని ఖాండవమును జక్కగాఁ గాల్చి భక్షించి తృప్తింబొందెను. హుతాశనునితాపమునకు వెఱచి తక్షకగృహమునుండి నిర్గమించు మయుఁడు మృత్యువువలెనున్న యగ్నియెదుటఁ జక్రధరుఁడైనకృష్ణునిగాంచి భీతిచే నర్జునునిశరణుచొచ్చెను. విజయుం డభయమొసంగిన ననలుఁడు వానిని విడిచిపెట్టెను. అతఁడు వాగియనుమతింబడసి త్రిదివమునకుంజనియెను. కృష్ణపార్థు లిరువురుం దమతమయుద్ధవిశేషములం బ్రశంసించుకొనుచు హస్తిప్రస్థమునకుం దిరిగివచ్చిరి.

(7) ఉపకారమును మఱవని మయుఁడు ధర్మరాజాస్థానమునకు వచ్చెను. కృష్ణుడు ప్రీతుండై యింటికి వచ్చినయాతనిం గాంచి ధర్మరాజునకు మంచి సభను నిర్మింపుమని యాజ్ఞాపించి చిరకాలముక్రిందట విడిచివచ్చిన తల్లిదండ్రులను దర్శింపద్వారకకువిచ్చేసెను. మయుఁడు రాక్షసులకు వడ్రంగి. కావున, నాతఁ డిదివఱకుఁ దనకు వృషపర్వుం డిచ్చినవియు, బిందుసరస్సులో సంగ్రహించియుంచినవియు నగురత్నాదికములచే నొకవిచిత్రసభను నిర్మించి తనకింకరులచే మోపించుకొనివచ్చి ధర్మరాజునకు సమర్పించెను. సంతుష్టుండైనరాజువలన బహుమతుల నంగీకరించి, మరలిపోవుచు యువనాశ్వపుత్రుని గదను

భీమునకును, దేవదత్త మనువరుణశంఖము నర్జునునకును నొసంగెను. నారదుఁడొక్క సారివచ్చి యుధిష్ఠిరునితోఁ దానిదివఱకందందు సందర్శించిన సభల వృత్తాంతములం జెప్పి మీతండ్రి పాండురాజు యమసభనుండి నాముఖమున మీకుఁ గొన్నిమాటలు పంపినాఁడు వినుము. హరిశ్చంద్రుండు రాజసూయము గావించి యింద్రసభలో నున్నాఁడు. నీవును దమ్ములచే దిగ్జయము చేయించి వారు సంగ్రహించిన ధనముతో దుర్లభమైన యాక్రతువును జేయుము. అట్లుచేయంగలిగితివా యింద్రుని యర్ధాసనమును నీవు పొందఁగలవు. ఇవి నీతండ్రి నీతోఁజెప్పుమనిన మాటలు, నాకనుజ్ఞయిమ్మని యంతర్హితుండయ్యెను.

శ్రీకృష్ణుడు వచ్చి నీవు రాజసూయయాగము చేయం దలంపు గలిగియున్నాఁడవు. మగధరాజైనబృహద్రథసుతుఁడుజరాసంధుఁడు జీవించియుండఁగా నీకాపని సాధ్యముకాదు అతనికిఁ జైద్యుఁడు సేనాధిపతి. రాజులజయించుటకై భూమియంతయుం దిరిగి భగదత్తుఁడు మొదలగు వారినందఱఁ బాదాక్రాంతులనుగాఁ జేసికొనియెను. నేను బదునెనిమిది మాఱులు వానితోఁ బోరాడితిని. వానికివెఱచియే నాతోఁ గూడ యాదవులు భూమినివిడిచి సముద్రమధ్యమున నింద్రునికి బెదరిన మైనాకునితో నితర పర్వతములువలె ద్వారకలో వసియించుచున్నారు. వాఁడు శివుని బూజించుట కని రాజుల నెనిమిదివేలమందిని బట్టి తెచ్చి చెఱలో వైచి యున్నాఁడు. నిస్సారులైన వారి పాదములకుం

పగిలించిన సంకెలల గలగలలు గిరివ్రజపురము నలబలము గా వించుచుండును. అతండు చండకౌశికునివరమున నితరుల కజ య్యుఁడై యున్నాఁడు. వానిశరీర మేయాయుధమునకు ను లొంగదు. అతిథిసత్కార మాతనికిం బ్రియము. వానిని నియుద్ధమున జయించుటకు మారుపవనతనయుండే సమర్థుఁడు. సముద్రమును మథించుటకు మందరమే యుండవలయును. ఆరాజు వధియింపఁబడి సమస్తరాజచక్రముం గారావిముక్తము గాఁగా వా రందఱు నీకు వశు లయ్యెదరు. నీకు శుభము గల్గును. ఇతరులు నిన్ను విని నీకు భయపడి నీద్వారమును సేవింతురు. అని చెప్పి భీమార్జునుల నిరువురను దీసికొని జరాసంధుని జంపుటకు గిరివ్రజపురమునకు శ్రీహరి పర్వతతటమును భేదించుటకు రెండుదంతములతోడి యేనుఁగువలె బైలువెడలెను. బ్రాహ్మణవేషముల వివిధదేశములు దాఁటి పురంబు సొచ్చి రాజమార్గమున వైశ్యులిచ్చిన వస్త్రమాల్యములను దాల్చి వీరత్రయము శత్రుగృహమునుం బ్రవేశించెను. అతిథిసత్కారము గావించి పీఠములపైఁ గూర్చుండంబెట్టి జరాసంధుఁడు వారివిరుద్ధవేషములు ధనుర్గుణాకిణాంకము లైనహస్తములుం జూచి, మీ రెవ్వరు, నాయొద్దకేల వచ్చితి రని యడిగెను. కృష్ణుఁడు నీతో బాహుయుద్ధము చేయవచ్చితి మని చెప్పెను. గోపకుఁ డని కృష్ణుని దిరస్కరించి చిన్నవాఁ డని యర్జునుని విడిచి యిదివఱకు భీమునిపౌరుష మాతఁడు వినియుండుటచే వానితోడను నియుద్ధముచేయ సమ్మతించెను. కుమారుని రాజ్యమున కభిషిక్తుం జేసి వ్రతుం డిం

ద్రునితోఁ బోలె భీమునితోఁ బోరుటకు సన్నద్ధుం డయ్యెను. భీముఁడును నడుము గట్టెను. ఇరువురును గలియంబడి మండల ప్రచారములతోఁ బాదఘట్టనముల భూమి కంపించునట్లును ముష్టిఘాతముల గగనమునందలి దేవతలుభీతిల్ల నతిదారుణయుద్ధముం గావించిరి. ఇట్లు పదేనుదినములు పోరి ఖిన్నుఁడైన రాజును బవనసుతుఁడు వాయుబలమున విఱిచి రాజులదుఃఖములతోపాటు వానిప్రాణములను బోఁగొట్టెను. మగధరాజును జంపి తిరిగి వచ్చినయగ్రజును నమస్కరింపఁగా నశ్రువర్షముతోఁ గౌఁగిలించుకొని యుధిష్ఠిరుఁ డింక నాయజ్ఞము నిర్విఘ్నముగా జరగు నని తలంచెను. కృష్ణుఁడు కొన్నిదినంబు లుండి ద్వారకకు వేంచేసినపిదపఁ దమ్ములకు యాగవిధానముం దెలిపి దిగ్విజయమునకై నలువురను నాలుగుదిక్కులకుం బంపెను.

ప్రయాణభేరీనినాదము చక్రవాళమువఱకు వ్యాపింప భీముఁడు తూర్పుదిక్కునకుఁ బైలుదేఱెను. దశార్ణదేశీయులు భీమునిరాకకు బెదరి తత్సైన్యపాదపాంశుపుంజమువలె గిరిగుహాంతరములు చొచ్చిరి. అక్కడక్కడ రాజులను జయించి జయస్తంభములు నాటుచు నంగదేశమునకు వచ్చి కర్ణునితో యుద్ధముచేసి యోడించి వానివలన విశేషధనమును బొందెను. కాశీపతియొద్దినుండి వానిభయమును ధనమును హరించి పౌండ్రకవాసుదేవుని గెల్చి వంగదేశమున గజరక్తప్రవాహముతోడ గంగానదిని రెట్టించి కళింగరాజును జయించి యందందు సంపాదిం

చిన రాజద్రవ్యమును బెద్దయేనుఁగులపైఁ బెట్టికొని భీముఁడు పూర్వదిశనుండి స్వపురమునకు వచ్చెను.

ఖాండవదహనముచేఁ బొగచూరిన కేతనము గలరథముపై గాండీవధారియై యెక్కి యర్జునుఁడు విశేషసేనతో నలకాపురముచేనలంకరింపఁబడిన యుత్తరదేశమునకు బైలుదేఱెను. సాళ్వాదు లయినరాజులపైఁ గురిసిన శరవర్షమున ధనవర్షముం దనపైఁ గురిపించుకొని ప్రాగ్జ్యోతిషపతితో యుద్ధము గావించి జయించి యవనపద్మములకు ద్విరద మయ్యెను. అక్కడనుండి హిమవత్పర్వతప్రాంతము నాక్రమించి పార్వతీయు లగు పలువురను జయించి యడవియేనుంగుల దంతములతోపాటు తత్సదృశమైన కీర్తిని సంపాదించెను. ఏనుంగులమందలచే మానససరస్సులోని పద్మషండముల నలఁగఁద్రొక్కించుచు గంధర్వమండలమును జయింపఁ బోయెను. ఆతనిని నిషధనిర్ఝరశీకరములచేఁ జల్లనైన హేమకూటపర్వతకాననగంధవాయువు లెదుర్కొనినవి. చిత్రరథుని నిర్జించి నమేరువృక్షములుగల మేరుపర్వతము సమీపమునకుం జనియెను. తురంగబలముతో గగనతలచుంబి జంబూవృక్షాగ్రములు గలజంబూద్వీపమున కరిగి యాచెట్లనీడల సర్వఖేదములు వాసినసైన్యముతోఁ గుబేరుని లోఁపఱుచుకొని యధికధనముం గొని యాదిక్కునుండి మరలెను.

ఏదిక్కున సూర్యచంద్రులును నక్షత్రసమూహమును నిజతేజమును గోల్పోయి ప్రకాశరహిత మగుట తటస్థించుచున్నదో యాపడమటిదిక్కునకు సైన్యసహితుండై సహదేవుఁడు

చని తీక్ష్ణముగఁ బ్రకాశించెను. త్రికర్తదేశాధీశులచే విశేషధనముం గొని యాదవరాజురాజ్యము మీఁదికి బలరజఃకలుషితపశ్చిమాద్రియై లేచి యాతనిచేఁ గానిక లంది నిజదేశమునకు మరలివచ్చెను.

నకులుఁడు దక్షిణదిక్కునకు వెడలి నిర్జితులైన నీలాపులచే సేవింపఁబడుచు నగస్త్యుని పాదచిహ్నములు గలిగిన పాషాణములతోడి శృంగములచే మనోహరమైన వింధ్యపర్వతము మీఁదఁ గొంత నడచి రేవాతటవృక్షములకుఁ దనయేనుఁగులను గట్టి యాపర్వతము మఱింత పెద్దదియైనట్లు జనుల కగపఱిచెను. కావేరీతీరమునం జని పోఁకపూఁబాళెలనుండి స్రవించు మధువుచే నంధకారితమైనచోళదేశముం జొచ్చి యారాజులు దెచ్చి యిచ్చిన యేనుఁగులచెవులు తనసేనాకలకలముచే గింగురెత్త దక్షిణవారిధితీరమున లంకాపురముం జేరం జని ఘటోత్కచుని విభీషణునికడకుఁ బంపెను. ఆరాక్షసరాజు పంపిన రత్నోపేతచతుర్దశసువర్ణతాళవృక్షములను దనవిజయధ్వజములనుగా గ్రహించి స్వపురమునకు ససైన్యుఁడై వచ్చెను.

నాలుగుదిక్కులనుండి వారు విజయము నొంది యజ్ఞమునకై ధనము దెచ్చిరని విని శ్రీకృష్ణుఁడు ద్వారకనుండి హరిప్రస్థమునకు దయచేసెను. ఆమహాత్ముని యనుజ్ఞపై సుదినమున ద్రోవదితోఁగూడి ధర్మతనయుఁడు దీక్షితుఁడై యశేషమునియుతముగ వ్రతప్రారంభము గావించెను. నానాదేశములకును లేఖలు వ్రాయించి క్రతుదర్శనమునకు రప్పించిన నృపాలురతోడను,

ఋత్విక్కులమంత్రములచే నాహూతులైన దేవతలతోడను క్రతుశాల పూర్ణమయి యొప్పెను. అధ్వరకాలమున నెగసిన పొగయను మేఘము గగనమున కేగి త్రిజగన్మానసజలాశయమునం గలరాజకీర్తికలహంసములను బాఱఁగఁద్రోలెను. వివిధదేశముల నుండి కానుకలను దెచ్చిన నరనాథవర్యుల నభీష్టములచేతను, దేవతలను హోమముచేతను, భూసురులను దక్షిణలచేతను ధర్మరాజు హృష్టులం జేసెను. సభాభవనములోఁ గృష్ణుఁ డగ్రపూజనము నొందె నని శతవిధముల నిందించి చేదిపతి యాతని చక్రధారచే ఖండితశిరస్కుఁ డైనపిమ్మట నిర్విఘ్నముగా సప్తతంతువును బూర్ణము గావించి యవభృథస్నాన మొనరించి ద్వైపాయనాదిఋషులను భీష్మాదిబంధువులను బూజించి సత్కరించి నిజనివాసములకుఁ బంపెను. శ్రీకృష్ణుని సమీపించి యీక్రతువును నే నాచరించుట దుష్కరమే గాని మీసహాయమున నిర్విఘ్నముగా నొనర్పఁగంటి నని మ్రొక్కి యామహాత్ముని నిజపురమునకుం బంపించెను. దుర్యోధనుఁడు హస్తినపురమునకుం జని పాండవుల యైశ్వర్యమునకుఁ గన్నుకుట్టి కోపపరీతమానసుఁడై కాలసర్పము స్వవిషవహ్నులచేఁ బరితపింపఁబడినట్లు పరితాపము నొంది శకునిని బిలిచి రహస్యమునఁ దనయభిప్రాయము నెఱిఁగించి, నారాజ్యమువలన నేమిలాభము? ఇందఱు తమ్ములవలన నేమిప్రయోజనము? భీష్మాదు లున్న ఫలమేమి? పూర్వపశ్చిమ సముద్రతీరములకు మేరువు మొదలు లంకవఱకుఁ గలనాలుగు దెసలుం జయించి తమ్ములు తెచ్చియిచ్చిన ధనముంబట్టి ధర్మజు

నిం గాంచిన నాకు నిమేషమైన శాంతి కలుగుటలేదు. ఈర్ష్యచే దగ్ధహృదయుఁడ నగుచున్నాఁడను. ధర్మసుతునిచేఁ జూపింపంబడిన సభారమణీయతకు దానివింతలకు భ్రమసితిని. మణిస్థలము లను బుద్ధితో సరస్సులలోఁ బడితిని. దానికి నన్నుం గాంచి యాజ్ఞసేని నవ్వినది. ఆనవ్వు నన్ను శల్యమువలె బాధించుచున్నది. కావున లెండు, కర్ణాదులైన మీరెల్లరు సమరసన్నాహ మొనర్పుఁడు. నానిశాతబాణాఘాతముల వారైనను వారిఘోర నారాచాసారముచే నేనైనను నేలం గూలవలయును. అనిన నల్లుని మాటలు శకుని విని, యుద్ధము వలదు, వారి నింద్రుండైనను జయింపలేఁడు. నేను జూద మాడించి వారి నోడించెదను. నిస్సంపన్నులగువారిని నీదాసులను జేసికొనుము. అనిన మంచి దని తనతండ్రికడకుం జని దుర్యోధనుఁడు, దురోదరమునకుఁ బాండవులను బిలిపింపు మని కోరిన, ధృతరాష్ట్రుండు పాండవప్రియుండైనను దైవబలమునఁ గుమారుని దురాగ్రహమునకు సమ్మతించి యొకమణికాంచనరమ్యం బగుసభాభవనమును నిర్మింపించి పాండవులను దాను గట్టించిన సభను జూచుట కనుమిషతోఁ బిలిపించెను. పిలువ వచ్చినవారివలన దుర్యోధనుని దుష్టహృదయమును దెలిసికొనియు ధర్మజుఁడు పోవుటకే నిశ్చయించెను. అహితకాంక్ష గల దైవమే సజ్జనుల వివేకముద్రను హరించును గదా! సానుజుఁడై కౌరవపురికిఁ బాండవాగ్రజుండు వచ్చి సత్కరింపఁబడి బంధువులం గూడి యుండెను. ద్రౌపది

యుఁ గౌరవవధూసమేతయై తారాగణప్రకాశము నెండవలెవా రికాంతిని దిరస్కరించెను.

ఆదినముగడపి పాండవులు మఱునాఁడు సాంధ్యకృత్యములు దీర్చి యుచితవేషములతో దుష్టగ్రహములతోఁ గలసి యితరగ్రహములు నభఃస్థలమును బలె జూదగాండ్రతోఁ గలసి సభాస్థలముఁ బ్రవేశించిరి. అపుడు శకుని, ధర్మరాజుతో, "మన ము జూదమాడుదము. సామ్రాజ్యమును సుఖమును గలనృపా లురకు జూద మొకవినోద మని పెద్దలు చెప్పుదు" రనియెను. "మామ! కితవము వైరహేతువు, దీని నేల కీర్తించెదవు. మమ్ము జయింప నిష్టమేని యక్షములేల శస్త్రములెనచో నస్త్రములం బట్టుఁడు. యోధులకుఁ గీర్తిం దెచ్చునది యదియ"యని కుంతీ నందనాగ్రజుండు వలుక, మరల శకుని, "వినోదమునకై చేయు నీపనిలో నీకనిష్టశంక యేల. ఇం దపాయము గల దని తలంతు వేని నీవుమానవచ్చునులే" యనినఁ గుపితుఁడై, యుధిష్ఠిరుఁడు నేను"జూదమునకు యుద్ధమునకు నాహూతుఁడనై మరలువాఁ డనుగా"నని సిద్ధుఁడయ్యెను. "ధనమునొడ్డువాఁడు సుయోధనుఁ డును వానికొఱకు కాడువాఁడు శకునియు"నని వా రనిరి. జోడు కుదురకపోయినను యుధిష్ఠిరుఁడు దానికి సమ్మతించెను. ప్రజ్ఞా చక్షుఁ డగుధృతరాష్ట్రునియెదుట నిఖిలరాజలోకముచే నిండిన సభలో వారిరువురును క్షత్రియకులాంతకహేతుకమైన జూదము ను బ్రారంభించిరి. ధర్మజుఁడు వరుసగ శఠుఁడగు శకునిచే భూషలు, ద్విరదములు, నరదములు, తురగములు, పరిచారకులు,

కోశాలయములు, బ్రాహ్మణమాన్యములు ద్రిక్క భూములును, బురములును నొడ్డి యోడిపోవుచుండెను. పిమ్మటఁ బుత్రుల నైదు గుర నొడ్డి యోడెను. తరువాత నకులసహదేవులను బిదప నర్జును భీముని బణముచేసి యోటువడి తన్నొడ్డుకొనియోడెను. అపుడు శకుని నీ కింక ధనము లేదు ద్రౌపది యొక్కతియ యున్న దనినవ్వుచుఁ బలికిన, నావేశముచే నామెను గూడ నొడ్డెద ననిన యన్నమాటలు భీముఁడు కర్ణకఠోరముగా విని కోపగద్గదముగ నెంతధూర్తుఁడైనను జేయనిపని, పూజ్యురాలిని జూదములో నొడ్డుచున్నా రని యన్నగారికై యఱచెను. అర్జునుఁడు భీముని తో, మన మందఱము నన్నగారిసొమ్ము. ఆయన మనల నిష్టము వచ్చిన ట్లుపయోగించుకొనును. నీవు మిన్నకుండు మని వారించెను. ద్రౌపదినిగూడ నోడిపోయెను. అప్పుడు దుర్యోధనుఁడు సింహగర్జనమువంటి గర్జతోఁ గర్ణునివంకఁ జూచెను. ద్రౌపది నిట్లు దీసికొనిరమ్ము, నే నామెను దాసిగా నియమించెద నని వేత్రహస్తుని కాజ్ఞయిచ్చెను. వాఁడేగి తీసికొనివచ్చెను. ఆకాంత సభలో నిలిచి ధృతరాష్ట్రసూనుల కుత్పాతమేఘరేఖవలెఁ గన్నీరుపెట్టుకొనుచు, సిగ్గుతోడ మెల్లఁగ "నే నోడిపో లేదు. నాకు దాస్యము చేయవలసినది లేదు. తాను ము న్నోడిపోయి పరతంత్రుఁడై నన్నుఁ బణనకర్మమున నియోగించె" ననినఁ గర్ణుఁడు, పాంచాలీ నీ వోడిపోలేదా, రమ్ము రమ్ము, గృహసమ్మార్జనము చేయుము. సిగ్గు చాలింపుము. అనేకభర్తలుగలది కులట వంటిదే. నీకు హిత ముపదేశించెదను. అర్ధరాజ్యమును బో

గొట్టుకొని దాసు లయినపాండవుల నవమానించి నీకిష్టమున్న వానిని గురునందనులలో నొక్కని వరించితివా ద్రుపదుఁడు తనకుఁ దగినసంబంధము గడించికొనినవాఁ డగు ననుచుండ ధుర్యోధనుఁడు తమ్మునితోఁ ద్రుపదపుత్రిని నాయొద్దికిఁ దీసికొనిరమ్మని పలికెను. వాఁడు కాలభుజగమును బట్టఁబోయిన ట్లామెకడకుఁ బరుగెత్తెను. వానిరాకం గాంచి భయమంది పరుగెత్తు నామత్తకాశిని రాజసూయావభృథస్నానపూత మయిన కేశపాశమును బట్టుకొని యాకర్షించుటచేఁ బుష్పమాల్యములు రాలుచుండఁగాఁ గటూక్తు లామెకు వినిపించి చండసమీరము శరత్కాలమేఘమును బోఁద్రోలినట్లు పతులయెదుటఁ గట్టినపుట్టంబును విప్పసాగెను. అన్నగారిమతము ననుసరించిన భర్తలను దెలిసికొని, విన్నఁబోయిన భీష్మాదికురువృద్ధులనుం గాంచి, హా కృష్ణా! యదునాథ! యని యామె యాక్రందనము చేసెను. రత్నములయొడ్డాణము సడలించి దుశ్శాసనుఁడు చీనాంబరములను విప్పుచుండఁగా భక్తార్తిభంజనుం డగుశ్రీహరిప్రభావమునఁ దాదృశవస్త్రములు శరీరమునం బుట్టుచుండెను. ఎన్నికోకలు విప్పినను దఱుగక గుట్టలుగాఁ బడుటచే నాదుష్టుఁడు తనయత్నము విఫలము కావుటం జిన్నవోయి నిలుచుండెను. సభ్యు లెల్లరు నాశ్చర్యము నొందిరి. అపుడు కుపిత మగుభీమమేఘము ప్రియావమానమారుతముచే వేఁడినీటిబిందువులు రాల్చుచు రాజన్యవంశదవానలమువంటి కోపాగ్ని ముఖమునం దాల్చెను. క్రూరదృష్టులు గలిగినకన్నులయొద్ద నుండుటకు భయపడినట్లు

కనుఱెప్పలు మీఁదికి లేచిన వంకరబొమలు కోపవహ్నిశిఖా రేఖలవలె నొప్పెను. నిండారిన పులకలతో సమర్థలక్ష్మి భీముఁ గౌఁగిలించుకొనినను ద్రౌపదికి సంతోషమే కలిగినది. పొదుగఁ బడిన వజ్రశకలములకాంతు లనెడునపదేశముచేత రాఁబోవుసం గరవిహారముం దెలుపుచున్న తనదుగదను రక్తోత్పలములవంటి నేత్రములతోఁ బూజించి త్రిప్పుచు సభలో నిట్లు వాయునంద నుఁడు పలికెను. అందఱు రాజులును నాప్రతిజ్ఞను వినుండు. మావనితకేశాంబరాకర్షణము చేసిన పాతకివక్షమును నేను యుద్ధములో నఖముఖములం జించి యేనుఁగునెత్తురును సింహ ముత్రావిన ట్లందలినెత్తురుం ద్రావెదను. రమ్ము, నీకిది తగినది, కూర్చుండు మని యెవ్వఁడు ద్రౌపదికిఁ దనయూరుప్రదేశముం జూపించినాఁడో యాదుర్యోధనునితొడలను వానిమూర్ధమునమ్ము లను జంపినపిమ్మట నీగదతోఁ జూర్ణముచేసెదను. అని పలికిన పిమ్మట నర్జునుఁడు లేచి యతిక్రోధమున ధను వెక్కిడి యిట్లు పలికెను. ద్రౌపదిని దుష్టోక్తులతోఁ గలంచిన యాకర్ణుని నిఖిల పుత్రమిత్రబంధుసహితముగా సమీకములో నానిశాతసాయక ముల హాతునింగావించెదను. అనిన వీరి భీకరవీరవాదము నంధ నృపాలుఁడు విని కృపగురుప్రముఖులు చెప్పఁగా ద్రౌపదిని క్షమింపు మని వేఁడికొని ధర్మజున కోడినరాజ్యాదికమును మరల నిప్పించెను. గెల్చుకొనిన సర్వమును బాండవుల కిచ్చి దుర్యో ధనుఁడు కోపముతోఁ దంష్ట్రిం గాంచి యి ట్లనియెను. నీమూాల మున మే మందఱమును హాతుల మైతిమి. చిన్నప్పటినుండి నా

యందు బద్ధవైరము గల వీరు ద్రౌపదీపరాభవముచేఁ జేయఁ బడిన ప్రతిజ్ఞలుగలవారై రాజ్యమును మరలఁ బొంది మన్మునచి రకాలములోఁ గూఁకటిప్రేళ్ళతోఁ బెకలించివైచెదరు. కావున నీవు మిన్నకుండుము. మరల జూదమునకుఁ బిలిచెదను. మామ యీసారి మంచితంత్రముం బన్నుచున్నాఁడు. దానితోఁ బాండవులు నాశ మొందెదరు. ఎవ్వరు జూదములో నోడెదరో వారు పండ్రెండువత్సరములు వల్కలములు ధరించి వనవాసము చేసి పదుమూఁడవయేఁడు పరులకుఁ దెలియరాకుండ సంచరింపవల యును. ఆయజ్ఞాతవాసములో వైరులచేఁ దెలిసికొనఁబడిరయేని మరలఁ బండ్రెండేండ్లు వనవాసమును నొక్కయేఁడాది యజ్ఞాత వాసమును జేయవలయును. అను నీమాటలు ధృతరాష్ట్రుఁడు విని సంతోషించుచు గాంధారి వల దనుచున్నను మరల ధర్మ రాజును బిలుచుటకు సేవకులం బంపెను. విధి నుల్లంఘించుటకు సమర్థు లెవ్వరు? ఈసారి యర్ధమార్గముననె శకునికైతవమునకు లోఁగి ధర్మతనయుఁడు మరలి వచ్చి యాతని నియమములకు సమ్మతించి సురకార్యమునకై కలి చేసినప్రేరణమునఁ దమ్ముల మాటఁ జెవింబెట్టక పాచికలు వైచెను. మనము గెల్చుకొంటి మని శకుని కేక వైచెను. తనమాట జవదాఁటని తమ్ములతో సత్యసంధుం డగుధర్మతనయుఁడు వల్కలములు ధరియించినంతనె జనులను శోక మావహించినది. కర్ణుఁడు, కౌరవులు గెల్చుకొన్నారు, మీ రీపురిభూమిలో నుండరాదు, పొం డనఁ నందఱకడ ననుజ్ఞగొని వెడలిపోవుచు ధర్మజుఁడు తల్లితో నమ్మా! నీపుత్రు

లు పంతములు నెగ్గించుకొని వైరులను సంహరించి రాజ్యముం జేకొని నిన్నోదార్పవచ్చెద రని దుఃఖించుచున్నకుంతిని విదురునింట విడిచి తమ్ములతో నడవికి నడచెను. ధృతరాష్ట్రుఁ డిది యంతయుఁ దలఁచుకొని తలఁచుకొని గుండె బ్రద్దలగున ట్లేడ్చుచుఁ బంపినరథములపై వారు గూర్చుండి వెంబడివచ్చుపౌరులను వారించుచు వైరిధారుణి నతిక్రమించిరి.

(8) కిమ్మీరవధముచే భీమసేనుఁడు నిర్బాధము గావించిన కామ్యకవనములోనుండి పోయి ధౌమ్యాదిగురుజనులతోఁ గూడి పాండవులు ద్వైతవనములోఁ గొంతకాలము నివసించిరి. అర్జునుఁ డక్కడనుండి వ్యాసమహామునివలన నధిగతవిద్యుఁడై తపస్సుచేఁ బురారిని మెప్పించి పాశుపతాస్త్రమును సంపాదించుటకు హిమాద్రికి వెడలెను. అనేకదేశములు గడచి మృగనాభిగంధముగల యాపర్వతరాజమును గాంచెను. అయ్యద్రి దశదిశలను దనకీర్తిప్రసారమువంటి మంచును వ్యాపింపఁజేయుచుండును. ఆభూధరతటములందలి యిందుకాంతమణులప్రకాశములోఁ దెల్లనైన యితరగజములలోనుండి తనపెనిమిటియైన యైరావతమును నాలుకొమ్ము లుండుటంబట్టి యభ్రమువు తెలిసికొనఁ గలుగుచున్నది. ఆనగరాజు సానువులలో నస్తమించినసూర్యునికిరణశకలములు మిణుఁగురులనుబోలగా నున్నఱాతిబండలలో నంటుకొని రాత్రులయందోషధిచ్ఛలమున నక్కడక్కడఁ గనంబడుచుండును. అం దహీంద్రనిశ్వాససమీరణములలోని విషాగ్ని దగిలిశోషించినయగురుద్రుమాఁకులు తమధూమవిశేషముచే ఖేచ

రాంగనల కేశపాశవాసనను బోలుచుండును. అట్టిభూభృచ్ఛిఖరశేఖర మగునింద్రకీలముపై నర్జునుఁ డెక్కిన నాకాశనదీప్రవాహమునందలి తరంగశీకరము లతనియధ్వశ్రమమును నివారించినవి. ఆసమీపమున నొక్క యాశ్రమమున వ్రతియై స్నానపాటలము లైనజటలు ధరించి పల్లవములు తుఱిమినమౌళితోఁ బార్థుఁడు కల్పవృక్షమును బురుడించెను. ఫలములఁ, బర్ణముల, జలమున, వాయువుచేఁ గ్రమక్రమముగా జీవధారణము చేయుటం గృశశరీరుఁడై దినదినము బహుళపక్షక్షపాకరునివలె నుండెను. అగ్నిమధ్యమునఁ బాదాగ్రమున నిల్చి దృష్టి సూర్యునిపై నిల్పి బాహు లెత్తి జపము చేయునాతనికిఁ జాంచల్య మోష్ఠమునందు మాత్రము చూపట్టెను. ఆతనియుదగ్రతేజమునకు వెఱఁగందిన మహర్షులవలన వానివిషయమును విని భక్తవరదుఁడగుహరుఁడు తత్క్షణమునఁ గిరాతవేషమును ధరించెను. ఫణీంద్రవేష్టిత మగుజటాజూటమును గగనసింధుగర్భిత మగుశశిఖండమును గలశంకరుఁడు నవబర్హధారియుఁ గేతకీగర్భపత్రాళియు నయ్యెను. ద్వీపమదగంధలేపనముచే గళకాళిమయును మౌక్తికమాలికచే నస్థిమాలయు నపహ్నుతములు గావించెను. కృష్ణాజినముచేఁ గప్పఁబడిన నిజాజినవసనముతోఁ గోటిప్రదేశమున వ్రేలాడుచమరీవాలము గలధనుస్సును బట్టుకొని హరిసూనుని సమ్ముఖమ్మునకు మెల్లనఁ బరమాత్ముఁడు బైలుదేఱెను. ఆయన వెంబడిని బల్లవపాటలాంశుకయై ముంజేతివఱకును జాఱు గాజుగడియములు దొడిగి గురివెంద పేరులు మెడను గీలించి మనశ్శి

లాపంకసుందర మైనదంతతాటంకయుగళరుచిరముఖచంద్రునితో నెమిలికన్నుల వతంసముగఁ గూర్చికొని వన్యపల్లవములు తుఱుముడం దుఱిమి సమానవేషముగల సఖీజనముతో నంబిక వచ్చెను. లుబ్ధకవేషధారు లగుప్రమథులుపెక్కురు వెంట నంట నొకరి నొకరు చూచినవ్వుకొనుచుఁ బార్వతీపరమేశ్వరులు హిమాద్రి ప్రస్థరములపై నడచుచుండిరి. ఆప్రభుద్వంద్వము తనపై నిలువఁగనే హిమవద్గిరి నదీవేగశబ్దము నుడిగించి దవానలవిప్లవమును జల్లార్చి నీరంధ్రతుషారవర్షమును గొంచెము చేసెను. మన్మథాకారు లగునాయూదిమదంపతులం గాంచి విమానచారులును వనదేవతలును బుష్పవర్షములతో స్తుతియించిరి. మన్మథుని దహించిననాఁటిభస్మముతో వ్యాప్తమైన స్థాణువనమునకు వచ్చి వారిరువురును లజ్జచే నమ్రముఖులైరి. కర్ణికారచ్ఛవి గల భవుఁడు వసంతునివలె నవ్వనమునుం బ్రవేశించి తపోవనబహిః ప్రదేశమునఁ బ్రమథగణమును నిలిపి యర్జునుని సమీపించెను. దూరమున నుండఁగనే తపస్సు చేయుచున్నను మూఁపునఁ దగిల్చికొనినధనుస్సుతోఁ గృశశరీరముతో నున్నయర్జును శంభుఁ డంబకుఁ జూపి యామెకరుణ కాతనిం బాత్రునిం గావించెను. అపుడు మూకనామకదానవుఁడు వరాహవేషముం దాల్చి గిట్టల యొరయికచే ఱాళ్ళలో స్ఫులింగములు వెడల ముట్టె త్రోపున వృక్షములను బడఁగొట్టుచుఁ బరుగున వచ్చుచుండఁగాఁ జూచి సవ్యసాచి తనతపస్సును భంగముచేయుటకై యెవ్వఁడో వైరులు పంపిన రక్కసియే యయి యుండు నని వానిం జంపం దలంచి

లేచి కాలు భూమిమీఁదను శరము కార్ముకముమీఁదను దగి లించెను. అంతలో గజాసురాంతకుఁడు వచ్చి నేను గుఱి చూచి కొట్టఁబోవుచున్నాఁడను, నీవు తొలఁగు మని ధనుః పాణియై వారించుచున్నను లక్ష్యముచేయక కూటవరాహము పైఁ బార్థుఁడు బాణమును విడిచెను. ఆతని బాణముతోడనే పందికళేబరముపై శివునితీక్ష్ణబాణమును బడియెను. అయ్యది పశ్చి మపర్వతముపైఁ బడుసహస్రకిరణునివలె నుండెను. ఆసాయక ద్వయము దంష్ట్రాంకురవిద్యుత్ప్రకాశము గలకిటిపై నంటి పూ ర్వపశ్చిమవాయువులు రెండును మేఘమును హరియించినట్లు హరించినవి. అర్జునుఁ డపుడు మాయాకిరాతునితో "లుబ్ధక! నీకు వేఁటకాండ్ర మర్యాద తెలియదు. ముందు నేను విడువఁ గాఁ దగిలిన బాణము పోత్రిని జంపినది. తర్వాత నీవు దానిపై బాణమును విడిచితివి." అనిన నప్పుడు హాదేవుఁ డిట్లనును. "ఓయి! యీమృగమును నేనును నావారును సుదూరమునుండి తఱిమి కొని వచ్చుచున్నాము. దయాపరుఁడను గాన నీపై విడువవల సిన బాణమును దీనిపై విడిచితిని. నీబాణమును నీవు తీసికొ మ్ము. తపస్వివి గావున నిన్ను విడిచితిని." అని మందస్మితముగఁ బలికిన వాని దుఃశ్రవములైన పలుకుల కర్జునుఁడు కన్ను లెఱ్ఱ వాఱఁ బెదవులు గొఱికికొనుచు, నీవు కిరాతుఁడవు, వనేచరుఁ డవు, లోకములోని బాహుబలశాలుల నెఱుఁగవు. స్త్రీలయెదుట వికత్థనుఁడ వై ననిన్నుఁ గోలము పోయినయోలమునకు నా కోల పంపించివైచును. అని బాణజాలమును వడిగవర్షించెను.

దానికి సూర్యరశ్మి కానరాకుండ గగనము నిండిన యాబాణముల నమ్మహాదేవుడు చూర్ణము గావించెను. అర్జునుఁడు విడుచుబాణములు లలాటాగ్నిలోఁ గాల్పఁబడి శిరస్థగంగాప్రవాహములోఁ జల్లార్పఁబడి పదునెక్కి చూడాభాగమునందలి ఫణిఫణామణులనుశిలలపై నూరసి వాఁడిగలవి యైనవి. రాజకుమారముని ప్రయోగించిన వాఁడి శరములు పురహరుని శరీరముపై మెల్లఁగ గ్రుచ్చుకొనుచు భక్తిచే సమర్పించు పువ్రుదండలవలె నుండెను. శివునిమహిమచే నాతనిరెండునిషంగములలోని శరములును క్షయమయ్యెను. రణకౌతుకి యగుమునివేషధారి కిరాతవేషధారిపై విల్లెక్కుడించి దానితో మోదఁదొడఁగెను. నిర్దయుఁడై ప్రహరించు విరోధిదెబ్బలు చంద్రపాదమర్దనమువలెను, ప్రణయకలహమునాఁటి గిరిరాజపుత్రి తాడనములవలెను నలకాధిపహితునకు హితములే యైనవి. తలపైఁ బగతుఁడు వేయువ్రేటులచే నొడలు తెలియకుండిన కుండలీంద్రుని గంగాంబుశీకరములచేతను దుషారకిరణకిరణములచేతను సేదదేర్చుచు నిటలాక్షుఁడు వినోదించెను. శివుఁడు తనమహిమచేఁ జాపమును హరింపఁగా నర్జునుఁడు మట్టిలోఁ బొదిపి చేతి నెత్తురు తుడిచికొని చక్కనిలు మని కిరాతుని గలియఁబడి మల్లయుద్ధమునకుఁ దొడఁగెను. హరార్జునులు కొంతసేపు గుద్దులాడి బాహువులతోఁ జుట్టుకొని నేలంబడిరి. అప్పటి వారియైక్యతనిర్ఘరములతోడి మంథరపర్వతము భుజంగేద్రవేష్టనమునం బొల్చిన ట్లుండెను. మేరువప్రప్రతిమ మైనయీశానునియురమున నలఁగి పాండవము

ధ్యముఁడు పరవశుఁడై కొంచెము సేపునకుఁ దెలివొంది నంది
వాహనుని బూజించి యభయము వేఁడికొనియెను. తాను
సైకతలింగమునకుఁ బూజచేసిన కుసుమములే విస్మయముగాఁ
గిరాతుని శిరస్సున నర్జునునకుఁ గనఁబడియెను. అమితానంద
మునఁ బాదములపైఁ బడి మ్రొక్కిన నతని యెదుటఁ బ్రమథ
గణసమేతుఁడై వృషభవాహనము పై నాయుమారమణుఁడు
ప్రత్యక్ష మయ్యెను. నే నొనర్చినదారుణ కృత్యమునకు నాథా
నన్ను క్షమింపుమని ప్రార్థించిన, నీశ్వరుఁడు, నేను సంతోషించితిని,
నాశిరస్సున గంగాప్రవాహమును, జంద్రలేఖయుంబలె నీధను
ర్యష్టిప్రహారములు గూడ ధరించితి నని యపహరించిన ధనుర్బా
ణములను దూణీరములను నిచ్చి సమంత్రకముగఁ దనయస్త్రము
నుగూడ దయచేసి సపరివారముగఁ గిరిశుఁడు తిరోహితుఁ
డయ్యెను. ఆపాశుపతాస్త్రము తనకుఁ జేచిక్కఁగనే యర్జునుఁ
డు, నే నీదుర్లభాస్త్రముచే భీష్మాదికురువీరులనే కాదు సురా
సురులఁ గూడ జయింపఁగల నని తలంచెను. పిమ్మటఁ బ్రీతులై
యమకుబేరవరుణులచే నొసఁగఁబడిన దివ్యాస్త్రములు గలయర్జు
నుని, దనయైంద్రాస్త్రమును గూడ నిచ్చుటకై యింద్రుండు తేరి
పై స్వర్గపురమునకుఁ గొనిపోయెను. ఱెప్పవేయక చూచునప్స
రఃస్త్రీలోకము పరివేష్టింప నింద్రుం డర్ధాసనమునఁ గూర్చుం
డఁబెట్టుకొనినపు డాతఁడు జయంతునికంటెను బ్రేమపాత్రుఁడుగాఁ
బరిగణింపఁబడియెను. సాక్షాన్మన్మథబాణమువంటి యూర్వశి
యర్జును ననుసరింపఁగోరి, మాతృభావముతో నాతఁడు తిరస్క

రింప "నీవు వర్షధరుఁడవు గ" మ్మని శపియించెను. ఈవార్త విని యింద్రుండు విస్మయమంది మెచ్చి యీశాపమున వచ్చువర్షధరత్వము నిన్నజ్ఞాతవాసమున వర్షము ధరించు నని శాపావధియు నుపయోగమును గరుణించెను. సాక్షాద్భవునివలెనే జంభవైరియుఁ దనకు దివ్యాస్త్రములం గటాక్షింపఁ గృతలక్షణుఁడు స్వీకరించి మిత్రుఁడైన గంధర్వరాజువలన సంగీతకళాకౌశలమును బొందెను. స్వర్గమునుండి దిగివచ్చిన రోమశమునివలనఁ దనతమ్ముని దివ్యాస్త్రలాభాదికమును విని ధర్మతనయుఁడు సానుజుఁడై యామునిని ముందుంచుకొని తీర్థయాత్రలు చేయుచు నర్జునుఁడు వచ్చువఱకు, సంతోషముగఁ గడపుచుండెను. క్రమముగా నుత్తరదిక్కునకుఁ జేరి పుళిందాధిపుఁ డగు ఘటోత్కచునిభుజములపై ననేకదుర్గమపర్వతముల నతిక్రమించి బదరికాశ్రమమును జొచ్చెను. అచ్చటనారాయణసంగతుఁడైన నరుఁ డనుమునివలన నాదరింపఁబడి ద్రుపదరాజపుత్రితోఁ బాండవులు, చిరకాలము నివసించిరి.

ఒక్కనాఁడు వాయుదేవునిచేఁ దేఁబడిన సుగంధసౌగంధికపుష్పపరిమళము నాఘ్రాణించి నాకీపుష్పము కావలయు నని ప్రియసాహసుఁ డైనభీముని ద్రౌపది కోరెను. అట్లే తెచ్చెద నని గదాసహాయుఁ డై వాయుతనయుఁడు తత్పరిమళముచొప్పునుబట్టి ఘోరవనములలోని వృక్షములను జంఘాఘాతముల సొల్వడఁ జేయుచుఁ బోయి యెదుట నిశాచరాస్త్రవ్రణకంపుఁడును గంధమాదనతుల్యుండును నగు నాంజనేయునిం గాంచెను. ఆతఁ

డు భీముఁడు కోరినంతఁ, దాను సముద్రమును లంఘించినప్పటి సూక్ష్మరూపమును దరువాత సౌగంధికమున్న సరోవరమార్గము ను జూపించి, యనంతరము నిభృతుఁడైనపాండవునకు రామ కథోక్తులతోఁ దనదివ్యరూపమును గనంబఱిచెను. ఆహనుమ యనుమతిని బవనకుమారుఁడు కుబేరయోషిత్తైలికాలాలిత తరంగములు గలయాసరస్సుం జొచ్చి సౌగంధికములనుసాహస మునఁ గోయుచు సరోవరరక్షకులైన యక్షసైనికులం బాఱఁ ద్రోలి తత్తీరమునకు ఘటోత్కచుఁడు తీసికొనివచ్చిన తనయన్న దమ్ములను గలసికొని తాను గోసినపుష్పములను దనమనఃప్రియ కిచ్చెను. ఒక్కనాఁడు వేఁటకై వచ్చి జటాసురుఁడు కుబేరపర్వ తముపై విహరించు పాండవులను ద్రౌపదితోఁగూడ సోమకుఁడు వేదములను హరించినట్లు హరించెను. వేగముగఁ బరువెత్తుచు భుజములపై నున్నవారిలో భీమునిబరువుచేఁ గంపించి మూఁవటి వానిచే నేనుఁగువలె మందవేగమున నడువఁజొచ్చెను. అక్కార ణమున నక్కడ వారి నెల్లడించి హిడింబవైరిని గలియఁబడి పో రఁదొడంగెను. బకవైరి వానిం గిట్టి కత్తితోఁ దల నఱికి క్రిందఁ బడవైచెను. అఱచుచు నేలంగూలిన యారక్కసుని తలవిధము కొండమీఁదినుండి పడు గండశిల ననుకరించెను. అనంతర మ మ్మహావన ప్రదేశమును విడిచి యర్జునునిరాక కెదురు చూచుచుఁ గుబేరవనములోని దివ్యర్షితపోవనములోఁ గొంతకాలము నివ సించిరి.

ఇంద్రుఁ డర్జునునితో, నీవు కృతాస్త్రుఁడవు గావున నాకు గురుదక్షిణగా సముద్రమధ్యమున నున్న నివాతకవచులను రాక్షసుల సంహరింపు మని కోరి, శిరస్సునఁ గిరీటము పెట్టి తనరథ మెక్కించి దేవవిజయమునకై తనయుని బంపెను. దేవతల యాశీర్వాదములతో నతఁడు స్వర్గము నిర్గమించి నల్లమబ్బులు గలగగనమును డిగ్గి సువర్ణవప్రచ్ఛవు లను కేసరములు గల సముద్ర మనునిందీవరముకర్ణికవంటి రాక్షస పట్టణమును గాంచి దేవదత్తమును బూరించెను. ఆశంఖనాదము విని యసురులు సముద్రముతోపాటు కలవరపడి ఘోషించుచుఁ బురము వెడలి మూఁడుకోట్లు సింహనాదములచే నా శంఖధ్వనిని గ్రిందుపఱుచుచు వచ్చిరి. ఎల్లరును భుజంగమోపమంబు లగు శస్త్రములు ధరించి తేరులపై గౌరులపై వచ్చి వివ్వచ్చుని యుగాంతవహ్నిని జలధులువలెఁ జుట్టుముట్టిరి. గాండీవి గాండీవనిస్వనములచే దిక్కులను, రక్కసులరక్తముచే నర్ణవమును, యశస్సుచేఁ బాతాళమును నిండించి జయముం గొని బయలు వెడలుచుండఁగా బ్రహ్మవరముచే మనుజులకు జయింపఁగూడని వైహాయసపట్టనస్థులు హిరణ్యపురవాసులు దారిలో నడ్డుకొనిరి. అందలి పులోమవంశ్యులును గాలకేయకులజులును బలివంగడమువారును నగుదానవులను జంపుటకై కిరీడి పాశుపతాస్త్రమును ధ్యానించి ప్రయోగించెను. ఆమహాస్త్రమునుండి కొన్ని యురగములుఁ, గొన్ని గరుడపక్షులుఁ, గొందఱురాక్షసులుఁ, గొన్ని యేనుఁగులు, గొన్ని సింగములుఁ, బెక్కులు తరక్షువులుఁ బుట్టి

యసురులను మర్దించి పట్టనము నుజ్జ్వలాగ్నిచే దహించినవి. అవ్వల సంతోషముతో నాకమునకుం జని యింద్రునిచే బహూకరింపఁబడి యింద్రరథముమీఁదనే వచ్చి పార్థుఁడు తనయన్నదమ్ములను గలసికొనియెను. వారందఱును గంధమాదనపర్వతముపైఁ గొంతకాల ముండి రోమశుని దివంబున కనిపి ద్వైతవనమునకు వచ్చిరి.

ఇది కౌండిన్యసగోత్రజుం డగు క్రొత్తపల్లి సూర్యరావుచే నాంధ్రీకరింపఁబడిన యగస్త్యకృత బాలభారతమునందు

ద్వితీయాశ్వాసము.

శ్రీరస్తు.

బాలభారతము.



— తృతీయాశ్వాసము —

(9) ద్వైతవనమునకుఁ బాండవులు వచ్చిరని తెలిసికొని దుర్యోధనుఁడు తనయైశ్వర్యమును వారికిం జూపుటకు ఘోషయాత్ర యనుమిషపై నధికబలముతో నబలాయుతుఁడై యక్కడకు వచ్చెను. ఆతని నింద్రనియుక్తు లయిన విశ్వావసుపుత్రాది గంధర్వు లెదిరించిరి. ఆయిరువురసేనలకును గృతాంతుఁడు యజ్వగా నుండు యుద్ధక్రతువు జరగినది. అంసులకు సింహనాదములను మంత్రములచే నాహూతులై దేవతలు సన్నిధిసేసిరి. వీణతీఁగలుమీటుకొనువారికి ధనుర్గుణములతో నేమిపని యనుచుఁ గర్ణుఁడు గంధర్వయోధులపైఁ గవిసెను. అతనిబాణజాలముచే నొప్పింపఁబడి నలుదిక్కులకుఁ బాఱుసైన్యమును మరలించుచుఁ జిత్రసేనుఁ డనుగంధర్వుఁడు రాధేయున కడ్డువచ్చెను. శరమునకు శరము బాణమునకు బాణము నస్త్రమున కస్త్రమును బ్రయోగించి వారించుచున్న మాయావి యగుగంధర్వుని కోడి కర్ణుఁ డొత్తగిల్లెను. దుష్టోరగముపై గరుడుఁడువలె వేగముగ గగనచారి గంధర్వుఁడు దుర్యోధనునిపైఁ బడి నిర్జించి రజ్జువులచే బంధించి యింద్రునకు సంతోషముగ రథముపైఁ బెట్టికొని కొనిపోవుచుండఁగా దుర్యోధనాంతఃపురస్త్రీ లాక్రోశించుచు హోమశాలలో

నున్న ధర్మరాజుశరణు చొచ్చిరి. నమస్కరించి వివర్ణులై యున్న వారి దైన్యముఖములం గాంచి భీముఁడు నవ్వుచు "రాజ్యపదస్థుఁడగు కౌరవుఁడు ససైన్యముగ దరిద్రులము నేకాకులము నగుమమ్ముఁ జూడవచ్చినాఁడా? అదృష్టవశమున గంధర్వపతిచే బంధింపఁబడి కొనిపోఁబడుచున్నాఁడా? బాల్యమునుండియు ననపకారుల మైన మాకుఁ గష్టములం గల్పించుచు సభలోఁ గృష్ణకుఁ బరాభవము గలిగించిన ఫలము ననుభవింపవలదా! కాఁదలఁచినపని గంధర్వులు చేసినారు." అనియుల్లసమాడుచుండ, ధర్మజుండు "తమ్ముఁడా నీ విపుడ ట్లనరాదు. ఇది సమయము కాదు. జ్ఞాతులకు వారిలో వారికి వైరము తగును గాని పరులచే నికారము గలిగి నప్పు డొప్పరికింపరాదు. అది చాల నింద్యము. మీకన్నలయె నుట సురవాంశికుఁడు మీజ్ఞాతిని గట్టుకొని పోవుచుండ నుపేక్షించిన యెడల జగత్ప్రసిద్ధ మయినభారతవంశమునకుఁ గళంకము రాకమానదు. కావున శరణాగత లైనయీమానినుల యవమానము నీఁగుటకై మీరు ధనుర్ధారులై రెండు. శత్రువునుగొట్టి బంధువును విడిపించి తెండు. యశస్సుకంటె మనకు వేఱొక మహత్తరమైన వస్తువు లేదు". అనునన్నగారివాక్యములు విని పాండవులు సాయుధులై చనిరి. గంధర్వులు వారిం గాంచి వెనుకకుఁ దిరిగిరి. మాయన్నగారిని విడువుఁడు. మీరు విడువరేని మీయవలేపమును రూపడంగించెద మను నర్జునువాక్యములు చెవిఁబెట్టక వారిపైబాణములను విడిచిరి గాని సుయోధనుని విడువక యాకసమున నెగిరి పోవుచుండఁ దనయస్త్రప్రభావమున నర్జునుఁడు

మార్గనిరోధమును గావించెను. ప్రళయకాలమేఘములనుండి కురియువర్షమువలె శరములు గురిసి కాలాగ్నిజ్వాలలవంటి విశిఖంబులు వఱపి యన్నిటి కన్ని ప్రతిక్రియలుసేయు పాండవుని సామర్థ్యమునకు మెచ్చి స్నేహితుఁ డైనగంధర్వుఁడు, దుర్యోధను నితోఁ, లేడికొమ్ము చేతికిఁ గట్టుకొని 'సద్యఃకంద'మను క్రతువు చేయుచున్నధర్మరాజునొద్దికి వచ్చి "రాజా! మీకు హితముగోరు స్వారాజు నాజ్ఞచేఁ దనయైశ్వర్యమును జూపి మి మ్మవమానింప దుర్బుద్ధితో వచ్చిన యీతనిని గట్టి పట్టుకొని పోవుచున్నార" మని, ధర్మజునియనుమతిని నతని నక్కడ డించి ససైన్యుఁడై చిత్రసేనుఁడు పాండవులం గొనియాడుచు మింటితెరువున నిజపురమునకుఁ జనియెను. త్రాళ్లలోఁ గట్టువడి యవాఙ్ముఖుఁడగుదుర్యోధనునిం గాంచి ద్రౌపది చేయడ్డుపెట్టుకొని నవ్వెను. నరేంద్రుఁడు నాగేంద్రకేతనుని కట్లువిప్పించి త్రాళ్లబిగింపులచే నరదలువడిన యొడలుగల యాతనిని మరల నెప్పుడు నిట్టిసాహసము చేయకు మని హస్తినాపురమునకుఁ బంపివైచెను. ప్రాభాతికశీతకిరణునివలెఁ గాంతిరహితుఁడై పోవుచు మార్గమునఁ దనవారితోఁ గౌరవుఁ డి ట్లనియెను. వైరులచేఁ గరుణింపఁబడిన యీయాయుసులను విడిచెదను. అవమానముం బొంది జీవించుటకంటె మరణము మంచిది. ఈవార్తను వినియున్న భీష్మాదులను జూచుటకు నాకు మొగము చెల్లదు. ఈరథగజాదిపరివారముతో మీ రెల్లరును నగరమునకు నేగి దుశ్శాసనుని రాజుం జేసికొనుఁ డనిన విని దుశ్శాసనుఁడు కన్నుల నీరువెట్టుకొనుచు నన్నపాదములమీఁదఁ బడి,

ధీరులకుఁ దగనివిచారము మానుము, పురమున కెప్పటియట్ల చని రాజ్యపాలనము సాగింపుము, కార్తవీర్యునివంటివారికిఁ గట్టఁబడిన దశకంఠుఁడు లంకారాజ్యమును బాలింపలేదా! ఆత్మవధము పాప మందురు. రమ్ము, వృద్ధులను నంధులను దల్లిదండ్రుల విపన్నుల మమ్ముఁ బాలింపుము. అనినఁ గర్ణుఁడు, మిత్రమా నీ కించుకంతయుఁ దెలియదు. సంతోషసమయములో దుఃఖించుచున్నాఁడవు. ద్యూతములో నీకోడిన నీదాసులు పతివైన నీకుఁ బ్రియము చేసిరి. లే లెమ్ము. ఇట్టి నీయుద్యమమును గాంచి యెవ్వరైన నవ్వఁగలరు. నీవు రాకున్న మేము మాత్రము పురికిఁ బోయెదమా. సూర్యుఁడు లేనిదే కిరణము లెట్లుండును. అని యోదార్చినపిమ్మట శకుని, నీవు వ్యర్థముగా వగచెదవు, నీయట్టివాఁడు వగచిన సిరి దిగనాడి యేగును, నీవు సత్యముగాఁ గృతఘ్నుఁడవు, నిన్నుఁ బాండవులు రక్షించిరి గావున నిర్మత్సరుండవై, నేను జూదములో నపహరించి నీకిచ్చిన రాజ్యమును వారి కిచ్చివేయఁదగినది, నీ వట్లుచేయలే దనియెను. వారిమాట లేమియుఁ బాటింపక రత్నభూషణాదు లుజ్జగించి వల్కలనములు గట్టి మౌనియై ప్రాయోపవేశముం జేయ రారాజు సిద్ధపడియెను. వాలవ్యజనాది చిహ్నములు విడిచి కుశతల్పశాయినియై రాజ్యలక్ష్మి విడువలేక యాతని ప్రక్కనే యుండెను. దుశ్శాసనుఁ డప్పుడు లేవదీసి రథముపై నెత్తి పెట్టి, దుఃఖింపకుము, భయమువలదు, మేమందఱమును జరుగఁబోవు యుద్ధములో గెల్పు తెచ్చెదము, శత్రుసంహారము గావించెదము, శాంతింపు మనినఁ గర్ణుఁడు నే

నర్జునుని జంపెద నని ప్రతిజ్ఞచేసెను. ఆమాటపైఁ గొంత యూ శ్వాసము నొంది పురమునకు దుర్యోధనుఁడు వచ్చెను. పాండవులు వన్యమృగములచేఁ బ్రార్థింపఁబడి దయాళువు గావున ద్వైతమునుండి కామ్యకమున కేగిరి.

అక్కడఁ దృణబిందుఁ డనుమహాతపశ్శాలియాశ్రమము నందుఁ గొంతకాల ముండి యొక్క దినమున వేఁటకై ధనుర్బాణములం బూని పాండవులు చనిరి. ఇంతలో సాల్వపురమున కేగుచుఁ గామ్యకవనమధ్యమునకు వచ్చిన సబలుఁడగుసైంధవుఁ డుటజద్వారమున నిల్చిన ద్రౌపదిం గాంచి మన్మథ వివశుఁడై సీతను రావణుఁడువలెఁ బట్టి రథముపైఁ బెట్టుకొని పోవుచు నామె యాడు పరుషవచనములకు సంతసపడుచుండెను. ఆమత్తునికృత్యము మరలి వచ్చినపాండవులు రోదనము చేయుచున్న దాదిముఖమున విని కోపావిష్టులై జయద్రథుని వెన్నాడిరి. ఆసేనావనములోఁబడి యిటునటు జూఁచుఁగు శూరసింహమును బట్టుకొనఁ బోవువారికి మరల వేఁటాడుచున్నట్లె యుండెను. హృతబంధువర్గుఁడును ధృతనిశితశరవ్రణుఁడు నైన సైంధవుఁడు ధైర్యమును ద్రుపదరాజపుత్త్రిని గూడ విడిచి పలాయితుఁడయ్యెను. సత్పురుషులు ప్రారంభించిన నిరంతరాయ మగుక్రియాఫలమువలె మబ్బువిడిచిన వెన్నెలను జకోరమువలె, వైరివదలిన ద్రౌపదిని బాండవులు మరలఁ బొందిరి. అన్నగారితో నామెను బర్ణశాలకుఁ బంపి భీమార్జునులు వెఱచి పాఱిపోవుచున్న సింధురాజురథమును గూడముట్టిరి. ఎందుఁబోయెదవు నిలువు మని

యదలించి మఱియు వేగమున గుఱ్ఱములం ద్రోలుచున్న వాని సూతుని గుఱ్ఱములను వెనుకనుండియే తనశరలాఘవమున నర్జునుఁడు పడఁగొట్టెను. భయకంపితుఁడై సైంధవుఁడు రథమునుండి దుమికి యుఱుకెత్తు చుండఁగా భీముఁ డతని వెన్నుచఱచి లేడిని జివ్వంగివలెఁ బట్టి పడఁద్రోసి ఱొమ్ముక్కి గుద్ది త్రొక్కి యన్నగారి యాజ్ఞపైఁ జంప నోర్లక జుట్టుపట్టి యీడ్చికొని పర్ణశాలకడకుఁ దెచ్చెను. లజ్జచేఁ దలవాంచిన యాతని గాంచి యజాతశత్రుఁడు "నీ వొనర్చినపనికి, దుశ్శలమొగము చూచి నిన్ను విడిచిపెట్టితి మింక నెన్నఁడు నిట్టి యకార్యములో సాహసింపకుము, పొ" మ్మని విడిచిపెట్టిన నట్లే యని నమస్కరించి పోయి గంగాతీరమున శివుని ప్రసాదము వడసి పాండవులను జయింపవలయు నని తపస్సుచేయఁ గడఁగెను. సాక్షాత్కరించిన పశుపతి నీవు పార్థుని దక్క నలువురను నివారించెద వనువరము దయసేయ దానికే సంతసించుచు నిజపురమునకు వచ్చెను.

ఒక్కనాఁడు కర్ణుఁడు తల్పముపైఁ బరుండి యుండఁగా బ్రాహ్మణవేషమున సూర్యుఁడు వచ్చెను. శయ్య డిగ్గి నమస్కరించి బ్రాహ్మణవేషధారివి నీ వెవ్వరో మహాత్ముఁడవు, కాకున్న దృఢార్గళబద్ధ మగు నాయిల్లు సొచ్చుటకు శక్తి యితరుల కెక్కడిది. ఓభగవానుఁడా, యీమానవునిచే నేమిసేవ చేయించుకొనఁ జిత్తగించితివి సెలవి మ్మనిన, నేను సూర్యుఁడను, నీవు నా తనయుఁడవు, కుంతియందు నీయుత్పత్తి, నీవు నాభక్తుఁడవు, కావున హిత ముపదేశింప వచ్చితిని. పార్థ ! నీ యొద్దికి విప్రవేష

మున నింద్రుఁడు వచ్చి నీకవచమును గుండలములును యాచిం చును. సహజము లైనవీని నీవీయవలదు. ఇతరము లగు ధనా దులచేఁ దృప్తినొందింపుము. అట్లొనర్పవేని నీవు రణమున వధ్యుఁడ వయ్యెదవు సుమ్మా'' యనినఁ గర్ణుఁడు, దేవా, యిట్లాడఁ జెల్లునా, నావ్రతము నెఱుఁగవా? అర్థివ్రజతోషణమే నాకెక్కుడు. కోష్ఠులు వడసి వికసన్ముఖులై చనువిప్రసత్తముల ముఖములుగాంచి కిరణజాలముచే వికసించిన యరవిందములం గాంచి ననీవలె ముద మందుదును. తన్ను యాచించిన వాని కీకర్ణుఁడు ప్రాణములైననిచ్చివేయును. ఇంద్రునకు నాయందుఁ గలగౌరవము చెడినచో నాకీర్తికే హాని యగును. త్రిలోకనాథుఁ డగు శతమన్యుఁడర్థి యఁట, రాధేయుఁడు దాత యఁట, శరీరమునే యిచ్చివేయవలసిన యీవిషయములోఁ గుండలములుఁ గవచము నేమిలెక్క! పాండవులకు హితము గోరి యానాకమునుండి యీలోకమునకు దిగి దేహి యన్నదే చాలును. ఆతఁ డడిగినవి సమర్పించి స్థిరకీర్తిని నేనస్థిరవస్తువులచే నిల్పెదను. నాయందు దేవరకుఁ బ్రీతియేని నీపై నా కెక్కుడుభక్తి యేనిం గరుణింపుము. నేనిదే వేఁడుకొనుచున్నవాఁడను. ఇంద్రుని ప్రార్థనను వ్యర్థముచేయరా దనుకొను నన్ను క్షమింపుము. ఇట్లను పుత్రునిమాట విని యశ్రునేత్రుఁ డగుచు, వత్సా! నీతలం పది యే యైనయెడల నీ కిం కొకహితము చెప్పెదను. కవచకుండలము లిచ్చెదవేనియు నాతనియొద్దినుండి శక్తి నడిగి పుచ్చికొనుము. బహురాక్షసహారణనిపుణమైనయాశక్తి నీకుఁ బోరులలో జయ మొసంగు నని చెప్పి,

యినుఁ డంతర్ధానమునందెను. స్వప్నసాక్షాత్కారమును జిత్తంబున నుంచికొని వియత్తలమునుండి యాఖండలుని రాకం బ్రతిపాలించుచుఁ గర్ణుఁ డుండెను. సుకృతులు కీర్తినే గదా యాశించెదరు. ఒక్కనాఁడు బలియొద్దకి వామనుండు వచ్చినట్లు బలారాతి సూతసూతికడకు వచ్చెను. సజ్జనులకు సహాయముచేయుటకై మహాత్ములు గూడ నొకప్పుడు నీచవృత్తి నవలంబించుట వారి కదిక్రించుఁదనముం దేను. ఆశీర్వదించి నీకవచకుండలమ్ములు నాకిమ్మని యింద్రుఁ డడిగెను. ఇవిగాక వే ఱొండువస్తువులను గోరుకొమ్మని యనియు నొల్లని వానిం గాంచి నవ్వుచు, నిన్ను నింద్రుం డని నే నెఱుఁగుదును, నీకుఁ గావలసిన వీనిం గొనుము, నాకుమాత్రము విపక్షక్షయముం జేయు నీశక్తి నొసంగు మని కర్ణుఁడు కోరెను. పాకశాసనుం డాశక్తి ప్రభావము నుగ్గడించి యిది నీశత్రువులలో నొక్కనినే చంపి మరల నాయొద్దకి వచ్చునని చెప్పి యిచ్చెను. దైత్యరక్తబిందురంజితమైన శక్తిని బుచ్చుకొని కత్తితోఁ దనశరీరమునుండియొలిచి యానందాస్రుబిందువులే కాని రక్తబిందువులు రాలకుండఁ గవచమును బుచ్చెను. తోలొలిచి యిచ్చినట్లె శరీరమునంటుకొన్న తనుత్రమును దీసి యిచ్చియుం గించిత్తును వికృతి నాతఁడు పొందలేదు. కనుఱెప్పవ్రాలలేదు. చే యేనియు వడంకలేదు. నెత్తురు గ్రమ్ముచున్న కర్ణుని శరీరము నింద్రుఁడు ప్రాతఃకాలభానుని జూచినట్లు చూచి యానందించెను. మఱియు విస్మితుఁ డయ్యెను. కుండలమ్ములం గత్తెరించి యిచ్చెను. ఈ యీవిచేఁ గర్ణుఁడు భువిలోనుండియు దివిలోని

కల్పకములం గ్రిందుపడినవానిం జేసెను. ఇంద్రుఁడు కర్ణుని కవచ కుండలములే గాక నూతనయశస్సును గూడ స్వీకరించి స్వర్గమునకుం జనినవార్త ధార్తరాష్ట్రులు విని దుఃఖించిరి. పాండవులు సంతోషించిరి.

ద్వైతవనములోఁ బాండవు లుండఁగా నొక్క నాఁడొక శ్రోత్రియుని కుటీరమున నొక్క యరణిని ఒక జింక తన కొమ్మున కుంజిక్కించుకొని యరగఁ బోవుచున్నదని చెప్పెను. నొక్క ముని సంభ్రమముతో వచ్చి "రాజా! చెట్టుకొమ్మకుఁ దగిలించుకొన్న నాయరణిని లేడి యొక్కటి కొమ్మునకుఁ గీలించుకొని వాయువేగమునఁ బోవుచున్నయది" దని చెప్పెను. అరణి లేకున్న నగ్నికార్యమునకు విఘ్న మగు నను తలంపున ధర్మజుఁడు సానుజుఁడై దానియడుగులబడిం బరువెత్తెను. క్షణకాలము భూమిపై క్షణకాలమంతరిక్షమున శృంగాగ్రలగ్నారణియగు హరిణము వారికన్నులకును బాణములకును లక్ష్య మగుచునే యెలయించికొనిపోయెను. చాలసేపు దానిని వెదకుటలో నలసి పాండవులు మధ్యాహ్నసమయమున దప్పిగొని వనగజములవలె నొక్క మఱ్ఱినీడను జేరిరి. నకులుఁ డావృక్షాగ్రమున కెక్కి సుదూరమున నొక్కసర స్సున్న దని తెలిసికొని తాను ద్రావి పత్రపుటములతో నన్నలకు నీరు దెచ్చుటకై పైలుదేఱి నీరాకరతీరముం జేరి పద్మముల పైవ్రాలినజాలపాదజాలముచే రమణీయ మగు నాకొలనిలోనికి దిగియెను. నాప్రశ్నముల కుత్తరము లిచ్చి మఱి నీవు నీరు త్రావు మనునశరీరవాణి వానికి వినఁబడియెను. పిపాసార్తితుఁడైనయతఁ డామాటల నాదరింపక కమలగంధబంధురం బగు నుదకమునుం గ్రోలి చేతులు చాచికొ

నుచు మూలము ద్రెవ్విన చెట్టువలె గట్టునఁ బడియెను. నకులుఁ డాలసించె నరసి రమ్మని సహదేవుని వారు పంపిరి. అతఁడును గగ నవాణి ననాదరించి నీరు త్రావి యన్నవలె నయ్యెను. అతఁడును విలంబముచేయుటచే నర్జునుఁడు వెడలెను. అర్జునుఁడు నట్లే గా వించి పడిపోయెను. భీముఁడు పిమ్మట వారిజాడ నారయ వచ్చి విసంజ్ఞుఁడై యొరగెను. కారణ మరయ యుధిష్ఠిరుఁడు వ్యాకుల చిత్తుఁడై దుఃఖముచేతను దూపచేతను బదములు తొట్రుపడ వ డంకుచుఁ దడాగమునకు వచ్చి చేతసరహితులైన తమ్ములం జూ చి భయార్తుఁడై వారిపై నేడ్చుచుఁ బడియెను. కొంతసేపునకు లేచి, యే మిది! వీ రెవ్వరితోడను బోరినట్లు లేదు, దైవమే వధించిన ట్లున్నది. ఇం దొరు లెవ్వరును గానరారు. శరీరములపై శస్త్రాస్త్రక్షతులు గానరావు. ఈసరసిలోనినీరు విషదూషిత మే మో- వీరు లేనినాఁడు నాబ్రతుకు వ్యర్థము. ఏకాకినై నేను వచ్చుట దూరమునుండి చూచియే యాజ్ఞసేని ప్రాణములు విడు చును. నే నిందే దేహముం జాలించితినా యాత్మహత్య గావిం చుకొన్న దోషము వచ్చును. హా! నే నేమిచేయుదును! ఈదుః ఖము నెట్లు సహింతును. హా! యని ధరణిపై నొరగెను. అపు డొకయక్షుఁడు వచ్చి వారిపాటునకుఁ గారణము నాతనికిం దెలు పువాఁడై తాపశాంతి యొనర్చి యి ట్లనియె. "రాజా! యీచె లువు నాది. నీతమ్ములు నాప్రశ్నముల కుత్తరము లీయక జలము ను జలమునం బానముచేసి నావలననే నేలఁబడిరి. నీవైనను నా మాటలకుఁ బ్రత్యుత్తరము లీయక నీరుపయోగించితివా వారిగ

తికే పోయెదవు. ముందు నామాటలు కర్ణపుటములం ద్రావి పిమ్మట నీరముం గరపుటములనెత్తి త్రావుము. నాప్రశ్నలకు స్ఫుటమైన సమాధానములం జెప్పు" మనిన వానిమాటల కన్నింటికిం దగినయుత్తరము లిచ్చినం బ్రీతుండై యక్షుండు మెచ్చి, నీతమ్ములలో నొక్కని బ్రదికించి యిచ్చెదను, వీరిలో నెవ్వరు కావలయు ననిన, నాకు నకులుండు గావలయు నని ధర్మజుండు కోరెను. విరోధియూథమథనసమర్థులయిన భీమార్జునులను విడిచి సవతితమ్ము నేల కోరికొంటివో నాకుం దెలియం జెప్పు మని యక్షుం డడిగెను. నాకుం గుంతీమాద్రు లిద్దఱును సమానలే. కుంతి కగ్రజుండను నే నున్నట్లే మాద్రికిం బెద్దకొడుకు గూడ నుండుట న్యాయ మని నేను గోరికొంటి నని యుధిష్ఠిరుండు పలికెను. "నేను ధర్ముండను, నీహృదయము నరయుటకై మృగమనై ముని యరణిం గొని వచ్చితిని. నీసోదరు లందఱు బ్రదికెదరు, చూడు" మనునంతనె భీమాదులు నిద్రనుండి లేచినట్లు లేచిరి. పిమ్మట నాధర్మదేవత మీకుం బదుమూండవయేట మీరేవేషము వేసికొన్నను బరులు మి మ్మానవాలుపట్టంజాలకుండునట్లు వర మిచ్చితిని. ఇదిగో మీబ్రాహ్మణుని యరణి, కొం డని యిచ్చి యదృశ్యుం డయ్యెను. అనంతరము పాండవులు వైతానహోమధూమముచేం జీకట్లు గ్రమ్ము తపోవనమునకు మరలివచ్చిరి.

(10) పాండవులు పదుమూండవయేం డన్యులకుం దెలియకుండ మత్స్యరాజపురములోం గడపం దలంచి తమవారి నెల్ల ద్వారకకుం బంపియుపప్లావ్యమునకుం బోయి యందొక్క శ్మశాన

వాటికలో నున్న జమ్మిచెట్టుపైఁ దమయాయుధము లన్నియుఁ గట్టకట్టి పెట్టి—ధర్మజుఁడు యతి, భీముఁడు పాకగవృఁడు, అర్జునుఁడు పేడి, నకులుఁ డశ్వశిక్షకుఁడు, సహదేవుఁడు గోపాలకుఁడు, పాంచాలి సైరంధ్రియుం గా మాఱువేసములు పూని విరటుఁ డున్న సభలోని కొక్కరొక్కరే ప్రవేశించిరి. ధర్మరాజు ధర్మగుణము మూర్తమైనట్లు కాషాయములు గట్టి దండమును గమండలువును బట్టి నృపులెల్ల బలసి కొలువ నున్న నరపాలుని సమ్ముఖమ్మునకు సంధ్యారాగముచే భిన్నమయిన మెఱుఁగు గల మబ్బు చంద్రునివంకకు వలె వచ్చెను. సభ్యులందఱును బీఠములు డిగ్గిన, వారితో విరాటుఁడు, సామరుఁడైన యింద్రుఁడు గురుని వలె నాతని నెదుర్కొని నమస్కరించెను. ధర్మరాజు దీవించెను. రాజు "భట్టారక యెం దుండువారలు, ఏమిటి కిట విచ్చేసినారలు, సెలవిం" డన, నాపేరు కంకుఁడు, ధర్మభూరుహమును గా నన్ను నరు లెఱుంగుదురు, పాగచారిత్ర తుష్టుఁడనై వాసవప్రస్థమున నుండువాఁడను. జూదమునఁ బరులచే ధనము గోల్పడి వనవాసమునకు వచ్చితిని. తీర్థయాత్రలు గావించుచు మార్గవశమున నీపురముం జొచ్చితిని. నే నిం దొక్క వత్సరము వసింపఁదలంచితిని. అనంతరము కార్యసాధనమునకై వెడలి పోయెద ననిన కంకునిమాటలకు రా జలరి తనయర్థాసనమునఁ గుబేరుఁడు ధూర్జటిని గూర్చుండఁబెట్టుకొనినట్లు కూరుచుండఁబెట్టుకొనియెను. పిమ్మట భీముఁడు మలినవస్త్రధారియై భూమి గ్రక్కదలఁ బదము లిడుచు గరిఁటె చేతఁ బట్టుకొని వచ్చి సభ ప్రతిధ్వని

యిచ్చునట్లు సభ్యులు విస్మితు లగునట్లు గంభీరధ్వనితో నర పతికి మ్రొక్కి, నాపేరు వలలుఁడు, పార్థగృహమున వంటలవాఁ డను, తత్సమదివ్యవ్యఞ్జనశాలి వగు నిన్నుం గొలువ వచ్చితిని. నన్ను నీయొద్ద నుంచుకొంటివా నాపాకరుచికి మెచ్చుకొందు వనిన, రాజు, మంచిది నీవు నాపాచకాధ్యక్షుఁడవుగా నుండు మని నియోగించెను. ఊర్వశికోపమున సంభవించిన షండత్వ మును వహించి యర్జునుఁడు కంచుకముచే మూయఁబడిన జ్యా ఘాతములుగలభుజములతో మీఁగాళ్ళవఱకు వ్రేలాడు కౌశేయ ముతో నూపురధ్వనులతోడి పదములతో వేణీబంధముతో స్త్రీవేషధారియై వచ్చెను. ఆతనిం గాంచిన స్త్రీపుంరూపమిశ్రి తుఁడైన శంభునివలెఁ దోఁచి, యీతఁ డెవ్వఁడో, యనర్హ వేష మున వచ్చుచున్నాఁ డని యెల్లరుఁ దలంచుచుండ సమీపించి "నేను బృహన్నలను, శక్రప్రస్థములోఁ గృష్ణాస్నేహమున నుం డువాఁడను. నీకన్యకాంతఃపురమున నీ కిష్టమైన నుందును, గాం ధర్వకళ నేర్పఁగలను, నీయిష్టముం దెల్పు" మన సమ్మతించి భూపతి యాయర్జునునికి గుణోత్తర యగునుత్తరను శిష్యురా లిం జేసెను. అంతట నకులుఁడు కశాపాణియై వచ్చెను. ఆతని సౌందర్యముంగాంచి యచ్చెరువందు నృపునితో, నాపేరుదామ గ్రంథి, ధర్మజుని గుఱ్ఱములను శిక్షించుచుండువాఁడను. కొంత కాలము నీకడ నుండి నీతేజులఁ బెంప వచ్చితి ననిన లెస్స యని యతని నశ్వశాలకుఁ బాలకునిం జేసెను. పిదప సహదేవుఁడు గోపవేషముం దాలిచిన కృష్ణుని వలె వచ్చి జాతినైచ్యముం

జూపు మాటలతో మ్రొక్కి విరాటునితో నిట్లనియె. నేను దంత్రీ
పాలుఁ డనుపేరివాఁడను, పాండవులయాలమందను గాచువాఁ
డను. నేను బరిపాలింతునేని నీధేనువులు హృష్టపుష్టములు
నిరామయములు బహుక్షీరములు నగును. అనినం బొంగి రా
జేంద్రుఁడు వానిని గోగణపాలకునిం జేసెను. ఒక్కింత తడవు
నకు ద్రౌపది సుశ్యాసనాకృష్టకేశపాశమును ద్రిప్పుచు రాజ
మార్గమునం జనునది సుధేష్ణకంటఁ బడియెను. ఆమె పిలిపింపఁ
గా గంగానదిం జేరు కాళిందివలెను మెల్లగా సమీపమునకు
వచ్చిన నామెరూపమును గాంచి యిమ్మెలఁత రూపాధిదేవత
యొక్కొ యని వెఱఁగుపడుచు నిక్కాంతను మారాజు దర్శించె
నా నన్నుజ్జగించు నని సంశయించు చుండంగా, నేను సైరం
ధ్రిని, నాపేరు మాలిని, పుష్పమాలాకళాభిజ్ఞురాలను. నిన్ను
సేవింపవచ్చితిని. నా కైదుగురు గూఢచారు లగుగంధర్వులు
పతులున్నారు. వారిరక్షణలో నున్న నన్నెవ్వరును దాఁకలేరు.
తాఁకిరా వారిపాలికి నేను గాలపన్నగము నగుదును. అనిన
నారాణి సమ్మతించి నిశ్శంకముగ నాయొద్ద నుండు మనియెను.
అక్షవినోదములఁ గంకుఁడు భూమీశుని సంతోషపెట్టుచుండె
ను. తక్కినవారును దమతమ యధికారములలో సుగుణములం
గనఁబడుచుచుండిరి.

ఒక్కపుడు కీచకుఁడు సుధేష్ణాభవనమున నున్న సైరం
ధ్రిని గాంచి స్మరబాణములచే యమునికి గుఱియయ్యెను. నీ
వెవ్వతెవు. ఇక్కడ కేల వచ్చితివి? ఈరాజగృహలక్ష్మివా? ని

ర్భాగ్యునకు లక్ష్మివలె నాకెన్నఁడును గనఁబడవైతివి! భూషణాలమ్ములైన నీయవయవములు వానిం దాల్పవేల? ఎంత సగుణములైన సూక్తు లయినను నలంకారవిరహితములు శోభింపవు. నవయౌవనశోభితుని నొక్క సుకృతిని భజింపుము. వృక్షావలంబనము లేని పుష్పలతయు శోభింపఁజాలదు. నాతో నాక్రీడావనములోని మయూరివలె సంచరింపుము. అని పలుకుచున్న ననాదరముతో నంతఃక్రోధము గలయాయింతి లోనికిం జనియెను. సింహబలుఁ డను నాకీచకుఁడు తనయక్క యక్కడకుఁ జని ప్రసంగించి యామె యెంత చెప్పినను వినక తనయింటికి మాలినిం బంపుమని నిర్బంధించెను. అనర్థమును శంకించుకొనుచునే కేకయాత్మజ సైరంధ్రిని బంగారుగిన్నెయిచ్చి మధువుదెమ్మనితమ్మునిగృహమునకుఁ బంపెను. సువర్ణపాత్రను జేతఁబట్టుకొనిన యాద్రౌపది సాక్షాత్పద్మవలె నొప్పెను. అంతటఁ బాము న్నవల్మీకములోనికివలెఁ బులియున్న గవిలోనికింబోలె భీతచిత్త యగుచు సూతునిగృహమునకుఁ జనియెను. ఆమెను గాంచి విధిచేఁ బ్రబోధింపఁబడినవానివలెఁ దల్పమునుండి లేచి యెదురు వచ్చి "నీవు నాయింటికి లక్ష్మివలెనే వచ్చితివి, నావంటి సుకృతి నేఁడేజగత్తులో నొక్కండు నుండఁడు-ఇదిగోఁ బ్రసారితతల్పము, కూర్చుండుము, నా నిమిత్తమై నీకరములుం బాదములుఁ జాల శ్రమకోర్చినవి" యనిన నవ్వనిత నేను సుదేష్ణ మధువుకొఱకుఁ బంపిన వచ్చితిని, దానిం గొని పోయెదను, నాతో నీవు భాషింపకుము, నావుఁడు నీవు పుష్పమధువుఁ గొనిపో రాలేదు, నీయధరామృ

తమధువుం గొని తెచ్చితి వని యాతఁడు చేయి చాఁచి పట్టుకొనఁ బోయిన నామెను దప్పించుకొని విరటునికొలువులోనికిఁ బరువెత్తి పోయెను. కీచకుఁడును వెన్నంటి తలఁటిమి పట్టి లాగి పడఁద్రోసి కుపితుఁడై మత్తకరి లతనుబోలెఁ ద్రొక్కెను. ఆసాధ్వి ధూళి బ్రుంగిన మేనితో రుధిరము గ్రక్కుచుఁ గీచకోత్పాతసూచక మగు నకాలమేఘమువలెఁ బొడకట్టెను. భీముఁడు వానిని సహింపక, కీచకారణ్యదావాగ్నివంటి రక్తనేత్రాంచలములతోఁ గాంచెను. ఆ కోపమును నివారించుటకై ధర్మసుతుఁడు-"ఓయి వలల, యీవృక్షము ప్రాంగణమున మనోహరముగా నున్నది. దీని నేల నఱకఁ జూచెదవు. ఇంత పెరిఁగినచెట్టును గొట్టుట కిది కాలము గాదు, దీని నీడను మన మందఱము సుఖముగా నున్నారము. నీవంట కిది యుపయోగింపదు, పలువుర కిష్టములేని పని దారుణముగాఁ జేయఁ గడంగకుము. అందఱకు నిష్టమైనపనిలోఁగార్యసిద్ధి యుండును-ఓయింతీ, నీవు లేచిపొమ్ము, నీదుఃఖమును గాలాంతరమున నీపతులు శాంతి నొందించెదరు." అని యోదార్చినంతట నామె లోనికిం జనియెను. భీముఁడు శాంతించెను. కీచకుఁడుద్రొక్కినవేణి నాడించుచుఁ బగదీర్చుకొనుటకయి కృష్ణసర్పమువలెఁ గృష్ణ గోఁజుచుండెను. చీఁకటిచేనిండినరాత్రివేళఁదమస్సుచేనావరింపఁబడిన హృదయముతో నావనిత భీముఁడున్న వంటయింటిలోని కేగెను. పూర్వము మృగమదచర్చితదేహముతో సుధూపదీపితగృహము న శయనించునతఁడు మసిగుడ్డలతోఁ గట్టుపొగచేఁ బొగచూరిన వంటయింటిలో శయనించెను. వానిని దుఃఖితయై చూచి గంద

మఱుఁగఁదీయుటలో మోటదేఱిన చేతితోఁ దట్టి "యేమి నీవైరి పెద్దనిద్దురఁ జెందనిదె నీ కెట్లు నిద్రపట్టినది లే లెమ్మ"ని లేపినది. అతఁడు కన్నులు నులిమికొనుచు లేచి చూచి కౌఁగిలించుకొని యర్ధరాత్రమున నేల యిట వచ్చితివి? ఏల మంచులో వాడిన పద్మమువలె నీమోము మస్రుక్లిన్నమై యున్నది? అనిన, నమ్మగువ యిట్లనియె. "ఏల యట్లడిగెదవు. నాదుఃఖకారణము నీవెఱుఁగవా! మీయదృష్టముకొలఁది మాఱువేసములు వేసికొని పరసేవ చేయుచు సుఖించుమీకు సిగ్గేమి, మానమేమి, కీర్తి యేల, భార్య యేల. అప్పుడు దుశ్శాసనుం జూచుచు నుపేక్షించితివి. నేఁడు కీచకునిఁగాంచి మిన్నకుంటివి. ఆనాఁడు తలవట్టి యీడ్వఁబడితిని. నేఁడు పడఁద్రోసి తన్నంబడితిని. మీయన్న వేఁడి చల్లాఱినది. నిర్వీర్యుఁడర్జునుఁడు. కవలు ముగ్ధులు. నీవొక్కఁడవు నెట్లున్నావో తెలిసికొనవలయును. అడవిలో నాకు సంభవించిన యవమానము లన్నియు నీవలననే శమించినవి. ఇపుడును నీవే రిపునిషూదనము చేసెద వని యీత్రెస్సిన వెండ్రుకలను బట్టుకొని వ్రేలాడుచున్నదానను. ఆక్షుద్రుఁడు నీచేతఁ జంపఁబడకపోయెనా ప్రతిక్రియం జూడనోపని నాయీప్రాణములను ధరింపఁజాలను." అని యేడ్చుచు భీమునిక్రోధమును వృద్ధిపొందించెను. అపుడన్నగారు వారింపకున్న నింతదనుక నీదుఃఖమును జూడఁగలిగి యుందునా! నేనొక్కటి చెప్పెదను వినుము. రేపు వాఁడు నిన్నడిగెనేనిఁ "నాట్యశాలలోనికి రాత్రి రమ్ము. నేను నాపతులకుం గనఁబడకుండ వచ్చుటకు వచ్చి యుందు నని సంకేతముం జెప్పుము.

నే నపు డక్కడకుం జని చీఁకటిలో వానిం బోకార్చెదను." అని యోదార్చి యామెను బంపి భీముఁడు నిద్రించెను.

మఱునాఁడు సింహబలుఁడు సిగ్గుమాలి మరల మాలినిని వేఁడుకొనవచ్చెను. తదనుగుణముగా నామె భాషించెను. "ఎంతమృదువుగా మాటలాడినది! ప్రియు రాండ్రప్రియాలాపములు సంగమాతిశయముం గూర్చును, నేను శచీపతినిగూడ నతిక్రమించిన భోగశాలిని. ఈనాఁటి రేయున్నది. అది నాసుఖవిశ్రాంతికారణము." అని సంతోషించుచుండఁగా సూతునియాయువుతోఁగూడఁ బగలు ముగిసినది. చీఁకటి తనకు ముందు మృత్యువువలె నడచుచుండఁగ వాఁడు నాట్యశాలకు వచ్చెను. అంతకుమున్నె బకాంతకుఁడు తత్సదనముం బ్రవేశించి మృగమునకై మెగ మెదురుచూచుచున్న పెబ్బులి మొగము పెట్టుకొని యుండెను. ఎవ్వరో యున్న ట్లులుకు డగుచుండ నది మాలిని యే యనుతలంపునఁ గీచకుఁడు సమీపించి "నేను ధన్యుఁడను, పులకభూషితగాత్రుఁడనైన న న్నాలింగనమున సంభావించి యనంగతాపార్తిని దీర్పుము. పలుకవేమి, నే నాలసించితి నని మేలమాటయా! కోపమా! నేను నిన్నుం దాడించితి ననుకోప మున్నచో నూపురధారణక్లేశము లేనిసిపాదముతో నిపుడు నన్నుఁ దాడింపుము, దానితో నీకోపము తీఱునేమో!" అనుచున్న మాటలు స్తంభాంతరితుఁడై వినుచు స్త్రీస్వరముతో "నా కిట్టిసంతోషసమయమునఁ గోప మేల? నాపతు లగుగంధర్వుల ప్రభావమును నీ వెఱుఁగవా? నన్ను సాధారణకాంతనుగా భావింపకుము.

నాయూరుపీడనముచే రంభాలింగనసౌఖ్యమును బొందెదవుచూడు” మని వంగి పరిరంభణము చేయునట్లు కీచకుని కేశములు పట్టుకొని వంచెను. ఆపట్టివంచుటలో స్త్రీసామాన్యమున కిట్టిశక్తి లేదని వాఁడు గ్రహించెను. భీముఁడొక్కపోటు డొక్కలోఁ బొడిచెను. ఇరువురుం గలియఁబడి నియుద్ధము గావించిరి. పెనుగాలిచే విఱువఁబడిన వృక్షమువలె సర్వాంగములు నలఁగినశవమును దనభార్యకుఁ గనఁబఱిచి విడిచి వడముడి తనవంటయింటిలోనికిం జనియెను. ఆమె భయపడి కేకలిడిన రంగపాలుఁడు తెలిసికొని తెలిపింపఁగా సూతునియనుజులు వచ్చి యన్నయున్నస్థితికిఁ గతము నెఱఁగి ద్రౌపదిని గూడ వానితోఁ గట్టి కొనిపోయి దగ్ధముచేయవలయు నని యామెం బట్టుకొనిరి. నన్నుఁ గీచకానుజులు పట్టుకొన్నా రని యఱచిన యఱపు భీముఁడు విని యేతెంచి క్రుద్ధుఁడై వారివెంట గంధర్వుఁ డనుమిషపైఁ బిశ్రృవనపర్యంతఃపుంజని యందలి పెద్దచెట్లం బెఱికి వారిని వానితో మోఁదిచంపి పిశాచసముదాయమునకుఁ దృప్తి గావించెను. జనులందఱును గంధర్వుఁడనుభయమునఁజూడఁజాలక పాఱిపోయిరి. కట్లువిప్పి ద్రౌపదిని విడిపించి సంతసించునామెతో భీముఁ డిట్లనియె:- నీకపకృతి గావించిన సూతుని భ్రాతృశతయుతముగ హతముగావించితిని. నీకు హితము చేసితిని. ఇట్లే ధార్తరాష్ట్రశతమును గూడఁ నిపతితముం జేయఁగలను. నీవు లోనికిం బొమ్ము. నీవు గంధర్వ వనుభయమున సుధేష్ణ తమ్ములను ద్రుంపించినదాన వని

యయినను నిన్నుఁ దోలఁగింపఁజాలను." అని తనవలనికిఁ దానుఁ బోయెను.

కౌరవులు పాండవులను వెదకించుచుఁ జారులవలన నొక్క స్త్రీనిమిత్తమై యెనుగురు గంధర్వులు కీచకులను జంపి రని తెలిసికొనిరి. దుర్యోధనుఁ డాస్త్రీ ద్రౌపది యనియుఁ గీచకులం జంపినవాఁడు భీముఁడే యనియు బుద్ధిచే గ్రహించెను. విరాటు నిగోవులం బట్టితిమా వానికై యుద్ధమునకు వచ్చువారిలోఁ బాండవు లుందురు, వారిని గుర్తించి సంవత్సరము పూర్తికాలేదు మీరు మరల నడవికిఁ బొం డని పంపెద నని యొకవంకఁ ద్రిగర్తాధిపతిని రమ్మని రెండవవంకఁ దాను బైలుదేఱుటకు నిశ్చయించెను. ఒకవైపునఁ ద్రిగర్తులు వచ్చి మత్స్యరాజుగోవులం దోలుకొని పోవుచుండిరి. వత్సరకాలము పూర్తియైన దని ధర్మరాజు లెక్కచూచి స్నేహితునికి హితము చేయ భీమనకులసహదేవులను విరాటుని సైన్యముతోఁ బ్రభుమంత్రోత్సాహశక్తులవంటివారిని వారివంకకుఁ బంపెను. బలవత్సైన్యముతో విరటుఁడు సుశర్మ నడ్డుకొనియెను. మాత్స్యత్రిగర్తులకు శరకృత్తశిరఃపతనధ్వనులనెడుదుందుభిధ్వానములతోడి యుద్ధము నడచెను. భానుఁడు పశ్చిమాబ్ధి కరిగెను. పిదపఁ గాలపుఁగాలశరీరమువలె సంగ్రామరంగమంతయుఁ జీఁకటి యలమెను. నలువురు పాండవవీరులును త్రైగర్తవీరులను దత్సేనను మర్దించి దిగ్గజములు కడలినొత్తిన బలె గంగాతీరమున విశ్రమించిరి. ఓడి లజ్జించి పసువుల నప్పగించి సుశర్మ నిజపురమునకుఁ బోయెను.

(11) మఱునాఁడు కొందఱు గోపకులు వచ్చి కౌరవు లు పసువులం బట్టుకొని రని స్త్రీజనమధ్యమున నున్నయుత్తరు నితోఁ జెప్పిరి. నాకు సారథియే యుండిన సత్వరముగఁ బోయి కౌరవులను మర్దింపనా, తొల్లి యర్జునుఁడు ఖాండవదహనకా లమునఁ జూపిన విక్రమము నాహస్తము చూపనున్నది యని యుత్తరుఁడు ప్రజ్ఞలు పలికెను. ఆమాటపై నుత్తర, యన్నా! మాలిని నాతో, బృహన్నల రథమునడపు నేర్పు గలిగియున్నట్లు చెప్పుచున్నది యనిన నద్భుతపడి పిలిపించి, బృహన్నలా! నాకు సారథి కావలయును, నేను కౌరవసైన్యమర్దనమునకై యేగ వలసియున్నది. నీవుంటివా నాకు జయము నిశ్చయ మని తొడి గికొనఁ గవచ మిచ్చిన నవభిజ్ఞునివలెఁ దిరుగవైచి తొడిగికొనిన దగ్గఱనున్న స్త్రీలెల్లరుఁ గుండలము లల్లాడ నింద్రనీలముద్రి కాంగుళులు ముఖముల కడ్డుపెట్టుకొని నవ్విరి. అంతట నతఁడు రథమెక్కి గుఱ్ఱముల నడిపింప నుత్తరుఁడు స్త్రీలయాశీర్వాద ములను గ్రహించుచుఁ బట్టనము వెలుపలికిఁ జనియెను. రథవే గమునకుఁ బెదరిన యదియుపోలె వాయు వెనుకకొనుట మాని వనపుష్పగంధముం దెచ్చి యర్జునుని సేవించెను. అంతఁ గురు కుమారమత్స్యరాజకుమారుల సైన్యము చతురంగబలముచే నెగ సిన పాంసువర్ణధూళిచే మంచుగప్పినకాననమువలెఁ గనుపట్టెను. సముద్రోపమ మయినయాసేనాద్వయముం గాంచి యర్జునుఁడు తనబాహునౌకలఁ దరింప నిశ్చయించెను. ఉత్తరుఁడు తటిపుజ్జ్వ లశాతహేతికాంతులచే నొప్పుకౌరవసైన్యముం గనుంగొని ప్రి

యురాలివలె భీతిచేఁ గౌఁగిలింపఁబడిన చెమ్మట లొడలు నిండ వ ణఁకుచు ధనుస్సు నేల నానుకొని నిలిచి నాలుక యెండ రథ ముడిగి పాఱిపోవఁ దొడఁగెను. తనమేనినుండి సుగుణములుజా ఱిపోయినట్లు భూషణములును జాఱుచుండ రొఁజుచు శ్రమపడు చుఁ బరువెత్తువానిని బృహన్నల చూచి పట్టుకొన వెంబడిం బ రువెత్తఁగాఁ దద్గమనమునుబట్టి కౌరవులు మాఱువేసములో నున్న ఫల్గునుఁ డని శంకించిరి. లోకములో గుణవంత మైనవస్తు వు గూఢముగా నున్నను గుణములచేఁ దెలిసికొనఁబడుచుండు ట గలదు. పోయి పట్టుకొని మట్టుపఱిచి మరలించిన పార్థుని నుత్తరుఁడు, నీకు ధనమిచ్చెదను నన్ను వదలుము, కౌరవులు బాహుబలశాలులు, వారితో నేను బోరఁజాలను. ఈమృత్యు ముఖమునుండి తప్పించుకొన్న నామనస్సు మాయమ్మమొగముఁ జూడఁగోరుచున్నది. రణభీరువులను రక్షించిన మహాత్ములకుఁ బుణ్యము గలుగును. అని బతిమాలిన గాండీవి యనునయించు చు,"నోయి, భయపడకుము, ధైర్య మవలంబింపుము. నీ వింటి కడఁ బల్కినప్రజ్ఞలు వినిన స్త్రీ లిపు డిట్లు పోయితివా తప్పక నవ్వెదరు. కావునఁ బాఱిపోవుటకంటె వైరులచేఁ జచ్చుట యై నను మంచిది. బొమ్మలకుఁ గౌరవులచీరముక్కలు తెచ్చిపెట్టు మనిన నీచెల్లెలిమొగము నేను రిక్తహస్తములతోఁ బోయి చూ డఁజాలను. నీవు రథముఁ దోలుము. నేను గౌరవులను బసువు లతోపాటు తృణభక్షకులం గావించెదను."అని బెద రుడిపి రథ మెక్కించి తానురథియు నాతఁడు సారథియుఁ గాఁ దమయస్త్ర

ములు దాఁచిన రుద్రభూమిలోని జమ్మిచెట్టుకడకు రథముందోలించెను. ఉత్తరునిం జెట్టెక్కించి తనకుఁ గావలసినధనుర్బాణములను గిరీటమును దీయించి పుచ్చుకొని, "యీదివ్యాస్త్రము లెవ్వరివి యేల వారిందుఁ బెట్టి"రని యుత్తరుఁ డడిగినఁ బాండవులు తమయస్త్రభార మంతయు నీవృక్షముపైఁ బెట్టి నీతండ్రిని గొలువఁబోయిరి. వా రొక్క సంవత్సర మజ్ఞాతవాసముచేయుచున్నారు. నే నర్జునుఁడను,యతి ధర్మరాజు,అడబాల భీముఁడు, అశ్వపాలుఁడు నకులుఁడు, గోపాలుఁడు సహదేవుఁడు, మీయమ్మకడ నున్నమాలిని ద్రౌపది"యనిన యర్జునునిహస్తలక్షణములం గాంచి సంతసించి నా కింక నిరుమ్మఁడు వచ్చినను భయము లేదు. కౌరవసైన్య మెంత! నీబాహుబలరక్షితుఁడ నయిన నాకేమితక్కువ యని యుత్తరుఁడు ధైర్యవంతుఁ డయ్యెను. ఫల్గునుఁడు తనపేడితనమును విడిచి స్వచ్ఛమయిన విజయవేషముతోఁ గిరీటియై కవచమును దొడిగి గాండీవమును బట్టుకొని కవదొనలు గట్టి ధనుష్టంకారము గావించి పూర్ణపౌరుషశాలియై శంఖమును బూరించెను. ఆధ్వనికిఁ గౌరవసైన్యము కలఁగి తనయందలి సత్వసంతతిచేయు నలజడిచే మ్రోయుప్రళయకాలసముద్రము వలె నల్లకల్లోల మయ్యెను. అప్పటి సైన్యధ్వని యాదివరాహకంఠఘుర్ఘురధ్వని ననుకరించె ననవచ్చును. అర్జునుని గాండీవదేవదత్తముల ధ్వని ద్రోణాచార్యులు మాత్రము తెలిసికొని, "జాగ్రత్త! తప్పక యిప్పుడు మనకర్జునుఁడు గనఁబడును. సాయుధులరై సిద్ధముగ నుండుఁడు, హరుఁడు హరిహా

యుఁడు మున్నగువారిచే దివ్యాస్త్రములఁ బడసి వచ్చుచున్న ఫల్గుననితో నెవ్వరు పోరఁగలరు. అతఁడే యిప్పటివీరులలో నగ్రేసరుఁడు.” అనినఁ గర్ణుఁడు కోపించి శత్రువుల నేల నీ వట్లు ప్రస్తుతించెదవు. ఆతనితోఁ గయ్యముచేయుటకై మేమందఱము వచ్చితిమి గాని మత్స్యరాజుతోఁ బోరుటకుఁ గాదు. ఈనాధనుస్సునుండి వెడలుబాణములు పాండవమధ్యముని తలద్రెంచుటకై యెదురుచూచుచున్నవి. ఈదుర్యోధనుఁడే నిష్కంటకముగా ధరణిం బరిపాలించును. అనిన గురుం డిట్లనియె. ఓయి! కర్ణ! వ్యర్థప్రగల్భము లేల. నీపరాక్రమమును నర్జునుపరాక్రమమును మనరాజు దుర్యోధనుఁడు గంధర్వయుద్ధములోఁ దెలిసికొని యున్నాఁడు. అనిన రారాజు విజయుఁడే వచ్చునెడల యుద్ధము ప్రసక్తియే యుండదు. అజ్ఞాతవత్సరము ముగియలేదు. మనము వారిని మరల వనమున కనుపవచ్చును. అనిన భీష్ముఁడు విని, యర్జునుఁడు శాస్త్రవేత్త. సంవత్సరముపైఁ గొన్నిదినములు కూడఁ గడచినవి. అట్లు కానినాఁ డీసుకృతి యేల బైలుపడును. చరితార్థుఁడైన ధర్మజునకు నీవు యథాంశము భూమి నిచ్చితివా నీవు కీర్తిని బొందెదవు, లేదా, యాకీర్తిని బొందెదవు. విక్రము లయినతమ్ములతోడి యాతఁడు నిన్ను విడువఁడు. అనిన రాజు నవ్వుచు “వత్సరము పూర్తికా నిమ్ము. కాకపోనిమ్ము. ధర్మరాజునకు గోష్పదమాత్రమైన భూమి నీయను.” ఇట్లు రాజరా జనుచుండఁగా గంభీరధ్వనితో విజయునిరథము వారిని సమీపించెను. ఆతఁడు శంఖధ్మానముచేతనే పశువులను వెనుకకు మరలించి భీష్మాదివీరు

లపై బాణజాలమును బఱపెను. సభయులై సురసిద్ధచారణులు
గగనతలమునుండి చూచుచుండ నొక్కొక్క రథికునిపైఁ బర్వ
తముపై వర్షమువలె శరాసారమును గురిసి సూర్యరశ్మి కాన
రాకుండఁ జండకాండములతో నూర్ధ్వభాగము గప్పి యెనుం
గులను నడగొండలును వీరబాహుశతంబులను [illegible]లును గల
నెత్తురుటేఱులను వెడలించెను. అశ్వత్థామయుఁ దుశ్శాసనునిచే నా
హవములో నిల్చిన వీరభటులను వరించుటకై యప్సరలు నభం
బున నిండిరి. గాండీవిదెబ్బలకు సారథి మడిసినపిమ్మట విఱిగి
కర్ణుఁడు పరువెత్తెను. కార్ముకము విఱిగి ధ్వజము తెగి గురుఁడు
నాతనికొడుకును భీష్ముఁడును మూర్ఛితులైరి. జన్యమున విహ్వ
లుఁడై విగతచ్ఛత్రుఁడైన దుర్యోధనుని గాంచి యొక్క బాణము
ను విడిచెను; దానిచే నాతఁడు నిద్రపోయినట్లు పడిపోయెను;
ఏనుంగులపై మావంతులు, నేలపైఁ బదాతులు, గుఱ్ఱముల
మీఁద సాదులు, రథములపై యోధులు నిద్రపోయిరి. పిడికిట
నుండి కైదువులు జాఱఁ గన్నులు మూఁతపడి యున్నవీరులను
జచ్చిరని నక్కలు చేరవచ్చియు నిట్టూర్పులచేఁ దొలఁగి పోవు
చున్నవి. నారదుఁడు రణభూమికి వచ్చి పడియున్న యోధులన
డిమి యర్జునుని గజయూథముం జంపి నడుమ నిల్చిన సింహము
నట్లు తలంచెను. స్వచ్ఛములు, వెలగలవి, రంగులుగలవి,
యప్పుడే,; ధరింపఁబడినవి యు నగు కౌరవుల వస్త్రములనుండి
యుత్తరునిచేతఁ గొన్నిముక్క లుత్తరకొఱ కర్జునుఁడు గత్తి
రింపించి ఖండితవస్త్రు లగు వారిని గాంచి యరుణునిచే హరింపఁ

బడిన కాంతులుగల నక్షత్రముల నుదయసూర్యుఁడు చూచినట్లు చూచియానందించెను. గగనము వఱకు వ్యాపించిన కిరీటిశంఖ ధ్వని శ్రుతిశూలమువంటిదే గాని తాము నిద్రించుచుండుటచేఁ గౌరవులు కొంత బాధను దొలఁగించుకొనిరి. అంతట నర్జు నుఁడు తిరిగి పోఁదలఁచి భయంకరమైన యస్త్రము నుపసం హరించి యొక్క నమస్కార బాణమును భీష్ముని పాదములకడఁ బడు నట్లు వేసెను. దానిరహస్య మాపితామహుఁ డెఱుఁగును. అం దఱును లేచి యర్జునుని గానక సిగ్గువడి తలలువాంచి హతశే షులతో హస్తినాపురమునకుఁ జనిరి. తనయాయుధముల నెప్ప టియట్ల జమ్మిచెట్టుపైఁ బెట్టించి పూర్వాకృతితో నుత్తరుని రథము పైఁ గూర్చుండఁబెట్టి తానే రథమును నడపుచుఁ బురందరసూ నుఁడు పురముం దరియవచ్చెను. అంతకపూర్వ మింటికి వచ్చిన విరాటుఁడు తనకుమారుని విజయమును విని మిగుల సంతోష పడియెను. సజ్జనసంయోగమున సత్పురుషులకుఁ బునఃపునశ్శోభ నములు కలుగుచుండును. ఆధనంజయుఁడు భూమింజయునితో “రాజకుమార, నీవిజయమును నీవారికిఁ జెప్పుము. ఇది నీవుచె ప్పుకొనుటకు సిగ్గుపడెదవేని నన్నుఁగూర్చి తండ్రిగారితో రేపు చెప్పుము.” అనిన వల్లె యని నగరు ప్రవేశించి యుత్తరుఁడు బొ మ్మలపాత్రికలకుఁ గోసితెచ్చిన వస్త్రపుఁదునుకలను జెల్లెలికిచ్చె ను. బృహన్నల నాకుఁ దెచ్చియిచ్చె నని యాచిత్రవసనభాగ ములను గొని సఖులతోఁ గూడ నుత్తర యానందించెను. రథ మును శాలకుఁబంపి యుత్తరుఁడు తండ్రిని దర్శించి నమస్కరిం

చెను. చిరుఁగులు పడిన మైమఱువులోనుండి వెడలు నెత్తుగల పుత్రుని విరటుఁడు కౌఁగిలించుకొని యాప్తునున్న కంకుని వైపు గనుంగొనుచు, "వత్స నిన్నుఁ గనిన సూతపుత్రి యర్జునుఁగన్న కుంతివలె వీరమాత యైనది. నీ వెట్లు ద్రోణాచార్యాదులతోఁ బోరఁగలిగితివి ! నీవిజయ మిదివఱకే వినియున్నను మరల నీము ఖమున వినఁ గుతూహలపడుచున్నవాఁడను." అనిన నుత్తరుఁడు లజ్జించుచు: "తండ్రీ, కౌరవు లెవ్వరిచే జయింపఁబడువారు. ఆసైన్యముం జూచి భయమందిన నాయొద్ది కొక్క సురసూనుఁడు వచ్చి సాయముచేసి జయ మిచ్చినాఁడు. అచిరకాలములో నీ వాతనిం జూడఁగలవు. వేయేల నాసర్వశుభములకుఁ గారణము మన బృహన్నలయే." అనిన నతనిం బిలిచి రాజు బహువిధముల గౌరవించి తన్నుఁ బుత్రవంతులలో నుత్కృష్టునిగా నెంచుకొనియెను.

మఱునాఁడు పాండవులు దివ్యమాల్యానులేపనములు దివ్యాంబరంబులును ధరించికొని విరాటుని కొలువుకూటమునకు వచ్చిరి. దుర్దశనుండి తొలంగి ముదితయైన ద్రౌపది రాత్రిసంబంధ హిమబాధనుండి విముక్తమైన పంకజాకరము పగటియందువలె శోభించెను. పీఠములపై నున్న వారిచేతులలోని దీప్తహేతులు మలయాద్రితటమునం జందనాలంబితసర్పములవలెఁ బ్రకాశించెను. విరటుఁడు సపుత్రకుఁడై సభాభవనమునకు వచ్చి వారింగాంచి "యెవ్వరు మీరు. నిశ్శంకముగా మహాసనములపైఁ గూర్చుండి" రని కొంచెము గర్వముగాఁ బలికిన నర్జునుఁడు

నేవీరులు దేవతలపీఠములయం దైనను గూరుచుండుట కర్హులు,నీ కొలువులోని పీఠములు వీరి కేమిలెక్క. యతివేషమున నీయొద్దను న్నవాఁడు ధర్మజుఁడు. చతురంబుధిమధ్యభాగవర్తులగు రాజన్యు లందఱు నితనికి మ్రొక్కిరి. నీచే మహాసాధ్యశ్రుఁడుగాఁ జేయఁ బడినయాతఁడు భీముఁడు. ఈతని నవసౌగంధికగంధిల మైనయ శస్సు యక్షకన్యకాకర్ణావతంసములకు మెఱుఁగువెట్టుచున్నది. ఈయిరువురును మన్మథవసంతభవులవంటివారు నకులసహదేవులు నీ కడ మావులకు గోవులకుఁ బాలకులై యుండిరి. రాణియొద్దనున్న మాలిని ద్రౌపది. ఆమెకారణముననే యర్ధరాత్రమున భీమునిచేఁ గీచకుఁడు భ్రాతృశతయుతుఁడై హతుఁడయ్యెను. అని యనుచు న్నంత భీముఁడు లేచి, యీపల్కువాఁడె యర్జునుఁడు, ధనుర్ధారు లకును దపశ్శాలులకును దలకట్టు. ఈతనిపరాక్రమమును బరీ క్షింపఁగోరివచ్చి యుద్ధములో విజితుఁడైన సగణుఁడైన యీశ్వరు నియశస్సు ఖాండవదహనధూమముతోఁగూడి మాలిన్యముం జెందినది. దేవమునిగణము గొనియాడ నూఁగాడించుచుండు తన శిరస్సునను, రాజమౌళి గాండివముదిరుగవేసిమోఁదిన యర్జునుని ప్రహారమునకుఁ దాళఁజాలక గంగ కల్లోలపడునట్లు లాడించెను. యుద్ధములో విరోధికబంధములను ధనుర్గుణధ్వనితో నాడించు నీయర్జునుఁడు నీయింట మృదంగవాద్యములతో నాఁడుపిల్లల నాడించినాఁడు. అని పావని పలుక, నుత్తరుఁడు లేచి,"తండ్రీ యీ సుకృతియే నన్నుగోగ్రహణకాలమున నుద్ధరించినవాఁడు" అనిన మత్స్యరాజు సంతసించి వారికి బహుమతు లొసంగి యుత్తరను

విజయునకు సమర్పించిన నతఁ డాకన్యను వసుదేవుని ... నిచ్చెను. ఈవార్తదూతముఖమున శ్రీకృష్ణుఁడు విని సుభద్రతోఁ గూడ వచ్చి వసువృష్టిచే నర్థులను దృప్తులఁ జేసెను. ద్రుపదుఁడు, మగధరాజు, కేకయనృపాలుఁడు మొదలగు రాజబంధువులతోఁ గూడి యొక్క మంచిముహూర్తమున విరటుఁ డభిమన్యున కుత్తరను వివాహముగావించెను. ఆవివాహమునకు వచ్చినవారును ధౌమ్యాదివిప్రవృద్ధులతో సమస్తబంధువులతోఁ బాండవు ... తకాలము సుఖముగ నందు నివసించిరి.

ఇది కౌండిన్యసగోత్రజుం డగు ... సూర్యరాయుచే నా... రింపఁబడిన యగస్త్యకృత బాలభారతమున
తృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

బాలభారతము.



చతుర్థాశ్వాసము.

(12) అనంతరము ధృతరాష్ట్రుఁడు లోభబుద్ధి యగుదుర్యోధనునుండి రాజ్యమును, బలిచక్రవర్తికడనుండి వామనుఁడు హరించినట్లు హరింపవలయు నని బంధువులతోఁ జెప్పెను. దూతముఖమునఁ దెలియఁజెప్పఁబడిన నరనాథవరులు సైన్యప్రవాహములతోడ వచ్చి ధర్మజజలరాశిం గూడినవి. నేను మరల వచ్చెద నని యదునాథుఁడు మత్స్యపురమునుండి ద్వారకకు సూర్యుఁడుదయపర్వతమునుండి పశ్చిమపర్వతమునకువలెఁ జనియెను. వివిధదేశప్రభువులను మాకు యుద్ధమునఁ దోడ్పడుం డని పిలిచి పార్థుఁడు కృష్ణుని బిలుచుటకై ద్వారకకుం జనియెను. అక్కడకు దుర్యోధనుఁడును వచ్చెను. సనకాదికులచేఁ పూజింపఁబడినకృష్ణుని వాసగృహమును దుర్యోధనుఁడు సొచ్చి క్షీరసాగరమునఁ శేషతల్పమునందువలెఁ బానుపునఁ బవ్వళించిన వానిం జూచి మానధనుఁడు గావున నతనిశిరోభాగమున నుంపఁబడిన పీఠముపైఁ గూర్చుండెను. పిమ్మట నర్జునుఁడు వచ్చి శిష్యునివలెఁ బాదసమీపమునఁ బీఠముపైఁ గూర్చుండెను. హరి నిద్రనుండి మేల్కాంచి నిద్రారక్తకన్నులతో నెదుట నున్నవిజయునిం జూచి ప్రక్కకుఁ దిరిగి తలదిక్కున నున్న దుర్యోధనునిం గాంచెను. వారు వచ్చుటకుఁ

కారణ మడిగి ముందు వచ్చినను బిమ్మటఁ గనంబడిన సుయోధ నునకును వెనుక వచ్చినను ముందు గాన్పించిన యర్జునునకును సమముగా సాయము చేయఁ గోరి, నారాయణ గోపాలురు పదికోటులు యోధులున్నారు, వా రొక్క భాగము—శస్త్రము ముట్టకుండనూరకుండు నే నొక్క భాగము—ఈ రెంటిలో మీ కే భాగ మెవ్వరి కిష్టమో వారు కొనుఁ డనియెను. యుద్ధము చేయకుండు నీవు నా కెందులకు, పదికోటులు నారాయణులే కావలయు నని దుర్యోధనుఁడు మూర్ఖుఁడై యెంచుకొనియెను. యుద్ధము చేయనక్కఱలేదు, నీవు నాపక్షమున నున్నం జాలు నని బుద్ధిశాలి యర్జునుఁడు కృష్ణుని గోరికొనియెను. దుర్యోధనుఁడు నారాయణగోపాలురను దీసికొని పోయినవెనుకఁ గృష్ణుఁడు నవ్వుచు, నేమోయి! శస్త్రరహితుఁడనై నేను నీ కేమి ప్రయోజనము, న న్నేల కోరికొంటి వని యర్జును నడిగినఁ, నతఁడు [illegible]డించి, దేవా! నీవు సారథివై యుండినఁ జాలును, నేను శత్రుసైన్యమును నిప్పు లేకుండ దగ్ధము చేయఁగల నని ప్రార్థించిన మురారి సారథ్యమున కొప్పుకొనియెను. ఆశ్రితులను రక్షించుటకై మహాత్ములు నీచకర్మమున కైన నొడంబడుదురు. రెండుదినములు ఫల్గునుం డందుండి చక్రధరుని వెంట నిడుకొని ధర్మరాజునొద్దకు వచ్చెను. అక్షౌహిణులకొలఁది బలముతో భూమియదరఁ గొందఱురాజులు విరాటపురమునకును గొందఱు హస్తిపురమునకును వచ్చిరి. విశేషసైన్యముతోఁ బాండవులకు సాయముఁ జేయుటకై వచ్చుచున్న మద్రరాజు, శల్యుఁడు, మార్గ

మధ్యమునఁ దనకు సన్నిధి యలోపించు దుర్యోధనుని మెచ్చు కొని యాతనివంకకుఁ బోవ నిశ్చయించియు, మత్స్యపురికి వచ్చి ధర్మజునికడ కేగి నన్నుఁ గర్ణునికి సారథ్యము చేయు మందురు, అపుఁ డతనికిఁ బిఱికిమందు పోసి కలంచెద నని చెప్పి కౌరవసే నలలోనికిఁ దిరిగి వచ్చెను. అర్జునునియత్నమును సంజయుఁడు చెప్పెను. బంధువు లందఱుఁ జెప్పిరి. సంధిచేయ నొతచెప్పినను దుర్యోధనుఁడు వినకపోయెను. అప్పటినుండి యాతని కనేకదుష్ట చిహ్నములు తోఁపఁదొడఁగెను. అల్పకాలములో నాభారమును మహావిష్ణువు తేలికపఱుచును, శరణుచొచ్చిన నన్ను విడువఁ డని సంతోషముతో నృత్యము చేయుచున్నదియువలె భూమి కంపిం పఁదొడంగెను. యుద్ధమునకై వచ్చిన రాజులసైన్యమునుండి లే చిన ధూళి గగనమున కెగసి మరల ధరణిపైఁ బడుచున్నదో యనునట్లు పాంసువృష్టి గురిసెను. జరుగఁబోవు యుద్ధములోని రక్తనదులను గాంచి లించుకొనుట కెంచినదియుంబోలెఁ గల్లోల యుతము లగుతరంగములను బహుదూరమువఱకు సముద్రము వ్యాపింపఁజేయఁజొచ్చెను. గజతురంగపదాతుల శరీరముల నెత్తు రారంగేయుచు మృత్యుదేవతపాదములలాక్ష కరఁగపడుచున్నట్లు మింటినుండి నెత్తుటిచుక్కలు శిబిరములమీఁదఁ బడఁజొచ్చెను. హస్తినాపురముచుట్టును గంకగృధ్రాసులు మొలఁగుచు భావియు ద్ధములో సుగలశరీరములను గొఱికికొని తినుసంతోషమును వెలి పుచ్చుచున్నట్లు కనఁబడియెను. కౌరవవీరుల శరీరచ్ఛాయలలోఁ దలలులేని మొండెములు కనఁబడసాగెను. ఇంటింటను గృహ

సుల చెవులకు హాహాకారములు గగనమునుండి వినవచ్చుచుండెను. తాళవృక్షదీర్ఘములైనపిశాచములనేకులు పౌరుల వెంటఁ బోఁచుచుండెను. ఇట్టి యుత్పాతశతములు తోఁచు హస్తినాపురమునకుఁ, గౌరవపాండవులకు శాంతిని గల్పింపవలయు నని శ్రీకృష్ణుఁడు దూతయై విచ్చేసెను. ఆయనరాక విని సుయోధనుఁడు దక్కఁ దక్కినభీష్మాదికురువీరు లెల్లరు నెదురు చని మహోత్సవములతోఁ దోడ్కొనివచ్చిరి.

ఆచక్రిని దర్శింపవచ్చిన పౌరచక్రమువలనఁ గలిగిన సంకులధ్వని, భారము నోపలేక సముద్రధ్వనిరూపమున భూదేవి మొఱ్ఱ వెట్టుచున్నట్లు దోఁచెను. పురమునం దెల్ల మంగళమృదంగములు మొరసెను. కృష్ణసందర్శనాభిలాషిణు లగుస్త్రీలు కొందఱు సగముసగ మలంకరించుకొనుచు మేడలమీఁది మబ్బులలోని మెఱపులవలెను వచ్చిరి. ఒక్కవనిత చందనము పాదములకును లత్తుక శరీరమునకును బూసికొనుచు వచ్చెను. దీర్ఘికలో స్నానము చేయుచున్న యన్నులమిన్న యొక్క[illegible]చున్న తడివస్త్రముతోనె చూడవచ్చి గోపాలదేవసందర్శనమున ఘర్మబిందువులు మొలతెంచినదానిమ[illegible]ప్పెను. వేఱొక్కతె కుంకుమపంకమునుఁ బూసికొనఁదలఁచి పరవశయై ప్రతిబింబమునకుఁ బూయఁబోయి తనయద్దమును గళంకపఱిచినఁ జెలులు నవ్విరి. ఈతఁడు గోపికాచిత్తహారి, నీవు బైటికి రాకుము, ని నేత్రమును గూడ హరించునేమో యని యొక్కతె యొక్కతెను మేలమాడెను. వీథివెంబడి శ్రీకృష్ణునితో వచ్చు మచ్చెకంటుల గతి

నివాసించునదియుం బోలె సంకులంబున నాయూయిజనంబులకం టసరులు తెగి రాలినముత్తెములు శర్కరావర్షమువలెఁ దోఁచెను. మురారికిఁ దనచిత్తపద్మమునుగానుకపట్టుదానివలెఁ దొందరగ నొక్కసన్నముఖి లీలాకమలముం బట్టుకొని లక్ష్మివలె మేడమీఁది కెక్కెను. జగత్తులను జయించుట కొక్క సుష్ముఁడు చాలఁ డని తలఁచి ప్రత్యేకరూపములతో వచ్చినట్లు శ్రీకృష్ణుఁడు ప్రతియువతికిని వేర్వేఱుగాఁ గనఁబడియెను. ఒక్క చక్కనికాంత ప్రవాతకంపితమాకందలతవలెఁ గృష్ణసందర్శనమునఁ గంపించుచు స్తంభముఁగొని తనప్రతిబింబమును సఖి యని కౌఁగిలించుకొనఁబోయెను. పదియాఱితోఁ గలసి మేడయెక్కు నొక్క వనితకుఁ గృష్ణుని జూచినంతనె చెన్నుట పొడమి నిశ్వాసము లుప్పతిల్లెను. అదిసోపానోపహాణముచేఁ దనకుఁ గల్గిన దని సఖులతో నున్నముగఁ జెప్పెను. కాలమేఘమువంటి యాగోపాలునిదేహముం గాంచుచు ప్రేమవశంకఁ బులక లెగయ నొక్కలతాంగి గుల్మలములతోఁడి కడియుకొన్నవలెఁ గన్పట్టెను. సిఖనివచ్చు నచ్యుతునిపైఁ బౌరనారులు పుష్పాంజలులు చల్లిరి. అవి యాతనిపై మందరాద్రిపై నక్షత్రసమూహమునవలె నలరారెను. క్రమముగా రాజమార్గమునఁ గోటవాకిటికి వచ్చి రథము డిగి విదురుని హస్త మవలంబించి కృష్ణుఁడు ధృతరాష్ట్రగృహమును బ్రవేశించెను. అక్కడ ధృతరాష్ట్రుఁడు లేచి యెదురు వచ్చి యతిథిపూజలు గావించిన పిమ్మటఁ గృష్ణుఁడు తనమధురకుశలప్రశ్నములచే నమృతముచే దేవతలను బోలె వారిని దృప్తినొందించెను. అనంతరము విదురుని

యింటికిఁ జని పుత్రవియోగఖిన్న యగుకుంతిం గాంచి వివాదస లను గెలిచి సుఖులై వచ్చినసీపుత్రు లందఱను శీఘ్రకాలము లోనె చూచెద వని యోదార్చి యాహ్నికములు నిర్వర్తించి కొని మంచముపైఁ బరుండి దగ్గఱఁ గూర్చున్న విదురునితోఁ బాండవులరణసన్నాహమును జెప్పుచు నారాత్రి గడపెను.

మఱునాఁ డుదయమున బాలాతపము గాయు నప్పుడు గొడుగులనీడను సకలజనలోచనపద్మానందముం జేయుచుఁ గొండమీఁదికి సూర్యుఁడు వచ్చినట్లు ధృతరాష్ట్రుని కొలువు కూటమునకు శ్రీకృష్ణుఁడు వచ్చెను. అట్లు సర్వతోభద్ర మను పీఠరాజముపై నాసీనుఁడై ప్రజ్ఞాచక్షుం డగురాజుతో నిట్లనియె :— నేను కౌరవపాండవుల క్షేమమునకై మాట యిచ్చుటకై వచ్చితిని. నమ్ములై న పాండవులతో సపక్షపాతముగా నీకుమారులకు మైత్రిని సంధింపుము. ఉదగ్రశౌర్యులగు కేకయపాంచాలవిరాటవంశ్యులతో నీపుత్రులతో నీపౌత్రులతో గురుకృపభీష్మాదులతోఁ గూడియున్న నిన్నుం గాంచి న నింద్రుఁడుకూడ బెదరుగుండె వడఁడా! భేదము గలిగి యుద్ధ మొనరించి నీపుత్రులు పాండుపుత్రులం జంపెద రనుము. వారు వీరిని జంపెద రనుము. లేదా యిరువెగలవారును మరణింతు ర నుము. దానివలన నీకుఁ గలిగినలాభ మేమి యుండును. ప్రణామ ములు చేసి పాండుపుత్రులు "తండ్రీ నీసెలవుపై నిన్నిదినములు దుఃఖము లనుభవించి వచ్చితిమి. మాపాలు భూమి మాకు దయచేయు" మని నీతో మనవిచేయు మనిరి. కాపున నట్టివా

భాగ్యములను నీవు శాశ్వతవృద్ధికై స్వీకరింపుము. అట్లొనర్చితివా యన్ని దేశములనుండి వచ్చియుంతమువాదిరాజులును సబలురై క్షేమముగా స్వదేశములకుం బోయెదరు. అనిన విని ధృతరాష్ట్రుఁడు కృష్ణదేవునితో నిట్లుచెప్పెను. దేవా ! నే నేమిచేయుదును. నా పుత్రుఁడు నామాటలఁ జెవినిబెట్టఁడు. ఎట్లయిన నీవే సాంత్వన వచనములతో వానిని దుర్మార్గమునుండి మరలింపు మనికోరినంతటఁ గృష్ణునితో నేకాసనమునఁ గూర్చుండిన దుర్యోధనుని వంకకు హరి ముల్లాడఁ దిరిగిచూచి కృష్ణుండిట్లు పలికెను. రాజరాజ ! శశివంశమున జనియించి భీష్మాదులచే దిద్దఁబడి వైరివీర సంహారదక్షులైన సూర్యసుతప్రముఖులతోఁ గూడి యున్న నీమనస్సు నీతిమార్గమునుండి తొలఁగకుండుఁగాక ! దురంతములైన దుష్ట సచివుల యుపదేశములను వినక యుభయలోకశత్రువైన లోభమును విసర్జించి పాండవులతో మైత్రినెఱపి నిస్సపత్న మగుమహా మహారాజ్యమును భోగింపుము. అని యిట్లు బోధించుచున్నంత గాంధారి, తన కొడుకుతోఁ "పుత్రా ! యిదిగో నాబద్ధాంజలి ప్రణామము! దుఃఖజ్వరమును బోఁగొట్టు నౌషధము, మనయాప్తబంధు వగు నీజనకుని వాక్యామృతమును గ్రోలుము. అని బలికెను. భీష్ముఁడు, ద్రోణాచార్యుఁడు, నీకొఱకును, ద్రుపదవిరాటాదులు ధర్మజుకొఱకును ధనుస్సులందు బాణములను సంధింపకమున్న ధర్మజునితో సంధి గావించికొమ్ము. చిరకాలమునకు మరలఁ గౌరవపాండవులకు మైత్రి గలిగిన దని రాజులెల్లను నానందబాష్పములు విడిచెదరు, గాని, [illegible]

రక్తబిందువులను విడువరు. లోకము పాండవులతోడి సంధి వాక్యములను వినుట మంచిది కాని కుపితులైన [illegible] రణసింహనాదమును వినుట మంచిది కాదు. ఆ నాదముచే నీయొక్క సైనికులును గంతాశ్లేషము చేసికొనుటకై [illegible] చాఁపవలయునేగాని రణహతులైనవారి [illegible] లు చాపఁబడకుండుఁగాక." అనుచుండ దుర్యోధనుఁడు కృష్ణుని తో "నీపరమహితులు నాతో జూదమాడి యోడిపోయినారా, [illegible] మిత్రులు సర్వముం గోలుపోయి విపినములకుఁ బోయిరి. అప్పు డు నీ నీతులు వారికి బోధింపలేదా, వారు వినలేదా! అప్పు లోఁ గడునిడుమలం బడి చివరకు విరాటు[illegible] [illegible] ను సహాయముం జూచుకొని మామీఁదికి వారు [illegible] ము చేసి మమ్ముం జంపుదు రనుట హాస్యాస్పదము. నేను వారి సంహరించి రాజ్యము నైనను వారిచే సంహారితుఁడనై [illegible] మైన యూర్ధ్వలోకము నైనను గొందును. క్షత్రియునకు యశస్కర మైన దంతకంటె లేదు." అని చెప్పి లేచి [illegible] యెను. వానివెంటనే కర్ణసౌబలదుశ్శాసనులు [illegible] మూర్తీభవించి వెంబడించినట్లు చని కృష్ణుని బాధింపఁ జూచిరి. ఇట్లతఁడు తన్నవమానించి చనుటఁ జూచి యక్కడి సభ్యుల తో మురవైరి యిట్లనియెను. "ఈ కౌరవులు నన్నవమానించిరి. పాండవులను నిర్లక్ష్యము చేసిరి. ఇఁక వీరికులమున స్త్రీజనము మాత్రము మిగులును. ధృతరాష్ట్రుఁడు నిరాలంబుఁడై దుఃఖిం చును. నన్నుఁ గట్టఁజూచిన యీ వీరందఱుఁ దప్పక [illegible]

బడును. నాతండ్రి నవమానించిన నామేనమామను నేనేమి చేసితినో యెఱుఁగరా! దురాగ్రహుఁడైన యీదుర్యోధనుని నిగ్రహించిన యెడలఁ జంద్రవంశము కాళియనామకపన్నగము ను నిగ్రహించుటచేతఁ గళిందజాహ్రదము స్వచ్ఛపడినట్లు స్వచ్ఛమగు నని కోపించెను. అప్పుడు సాత్యకి లేచి, సంధి చేసికొనని యెడలఁ గౌరవశ్రీవినాశము తప్పదు. శ్రీకృష్ణుని బంధించినయెడలఁ బాండవులు నిరుద్యములై చేయివిడిచి కూర్చుందు రని యీ దుష్టుఁడు తలంచియుండును. ఈదుష్టచతుష్టయముచేత యదుభూషణుఁడే కట్టఁబడునేని నిప్పును గొంగున మూటగట్టఁ బడును. బాహువులచేతనే మహాసముద్రము దరింపఁబడును. హిమవత్పర్వతము తలపై మోయఁబడును. ఇదిగో నే నిపుడే దుర్యోధనుని వానిమిత్రులను భ్రాతృపుత్రశతము ఖండించెదను. పాండవులు చేసికొనిన ప్రతిజ్ఞ వ్యర్థమైన నగుంగాక! అని పలుకుసాత్యకి పలుకులు విని ధృతరాష్ట్రుఁడు పుత్రునితో "మూఢుఁడా! బలిని బంధించినవాఁడు నీచేత బంధింపఁబడునా? నీవే కృతాంతపాశములచే బంధింపఁబడియెద" వని నిందించెను. కృష్ణుఁడు నే నసహాయుఁడను నన్నుఁ గట్టిన మీకు బలము గలుగు ననుకొనుచున్నాఁడవా, చూడు నాయసహాయత, యని సభ్యు లెల్లరుఁ గనుఁగొనుచుండఁ దనవిశ్వరూపముం గనఁబఱిచెను. సభాసదు లాఘోరాకారముఁ గాంచి యడలిపోయిరి. అట్టహాసమున కష్టదిక్కులును మూర్ఛపోయినవి. ఆతనిశరీరమునందే బ్రహ్మ, దేవతలుఁ, బాండవులు, యాదవులుం గనఁబడిరి. సూర్యచంద్రు లంగు

ష్టమాత్రప్రమాణమున నొకమూల నతేం[illegible] [illegible]
బాహువులతో మిఱుమిట్లుగొలుపు కాంతితో [illegible]
న యామహాతేజస్సును మలపి, కృష్ణుఁ [illegible]
కృష్ణుఁ డేమి సంధానముచేయునో యని చూచుచున్న [illegible]
ఋషులు, గగుర్పొడిచిన దేహములతో, నా విశ్వరూపమును
దర్శించి యద్భుతమునంది చీరజటాజినము [illegible] నా[illegible]
దనృత్యము గావించిరి. ధృతరాష్ట్రుఁడును గన్నులు [illegible]
రూపముం జూచి "మాటలకుఁ దలఁపులకు [illegible]
గంటిని, దరిద్రునకు నిధిదొరికిన ట్లయ్యె" నని, [illegible]
తక్కినవా రాకాంతికిఁ గన్నులు మూసికొనిరి. "[illegible]! నా
దివ్యాకారముం గాంచిననేత్రములతో [illegible]
ల్లను, గరుణింపు" మనిన ధృతరాష్ట్రుని [illegible]
చెను. పిదప, సభాసదులార! రాజులార! చిరకాలము[illegible]
రాజులకు సమరము సమకూడినది. ఎన్ని యత్నములు చేసినను
సంధిసమకూడలేదు. కావున మీరందఱును పాండవులపరాక్ర
మమును దిలకించుటకు సైన్యసమేతులై [illegible] [illegible]
యల్కతో సయ్యాదవేంద్రుండు సభలోనుండి [illegible] సైన్యసు[illegible]
వవలాహమేఘపుష్పములను నశ్వములను గట్టిన [illegible]
దారుకుఁడు చేయూఁత యొసఁగ నెక్కి కూడ వచ్చు [illegible]
లోకమును నిలువుం డని వారించి యుచితపరివారములతోఁ బాం
డవుల కడకు వచ్చెను.

(13) భాగీరథీతీరమున సూర్యోపాసనమునుం జేయుచు ధ్యానస్తిమితుఁడగు కర్ణునికడకుఁ, గుంతి, యాతనిం గౌరవులలో నుండి మరలించి పాండవులలోఁ జేర్పవలయు నని తలంచి పోయెను. ధ్యానావసానమునంతకు వేచియుండెను. కన్ను తెఱచి కర్ణుఁడు తల్లిని జూచి, నేను రాధాసుతుఁడ నని పేరుచెప్పి యామెకుఁ గుమారుఁడు గౌరికిం బోలె నమస్కరించెను. ఆనందవశమునఁ గ్రమ్మిన దృష్టికష్టమిచ్చు బాష్పములను తుడిచికొనుచుఁ గుంతి కృతాంజలి యగుపుత్రున కిట్టు లనియెను. నీకు రాధతల్లిగాదు, సూతుఁడు తండ్రిగాఁడు. నీవు కౌంతేయుఁడవు. నీతండ్రి సూర్యుఁడు, నీతమ్ములను పాండవుల నెఱుఁగని శైశవములో నీవు కౌరవుల లోఁ గలసితివి. ఇపుడు తెలిసికొంటివి గావున నీకు వీరియొద్ద నుండుట తగదు. కోకిల చిన్నతనములోఁ జేసినను బెరిఁగినపిమ్మటఁ గాకులతోఁ జెలిమి చేయునా. అరివీరుల జయించి రాజసూయము గావించి యవభృథస్నానము చేయుటచేఁ బూతమైన శిరస్సుతో ధర్మరాజు నీకు మ్రొక్కనున్నాఁడు. శరీరములు దాల్చిన యముఁడు ననిలుఁడును వలె, భూమికవతరించిన చంద్రసూర్యులవలె నన్నదమ్ములగు కర్ణార్జునులు మైత్రితో మెలఁగినఁ జూచి లోకము సంతసించుఁగాక! అనిన విని కర్ణుఁడు తల్లితో, వీరవినోద కాలము సమీపించినయపుడు, జనని, నేను, వ్యక్తి నీపుత్రులతోఁ గూడితినేని నన్ను జను లేమనుకొందురో నీకుఁ దెలియునా! నన్ను బంగారుకలశములతో స్వయముగా నంగరాజ్యమున నభిషేకించి నయుడియకాక తనయర్ధాసనమునఁ గూర్చుండఁబెట్టుకొని నన్ను

నాబలమును విశ్వసించి చిన్నప్పటినుండి [illegible]
వైరముం బెట్టుకొని నాబాహుబలమున [illegible]
ముద్రమును దాటఁదలఁచు [illegible]
విడుతునేని చిరకాలమునుండి గడించుకొన్న [illegible]
విడుచుకొన్నవాఁడ నగుదును. నాబలమును [illegible]
న రారాజునకుఁ గృతఘ్నుఁడ నైతినేని [illegible]
గర్హింపఁబడినవాఁడ నగుదును. [illegible]
పాకును నీటిబిందువువలె నీయాజ్ఞ యు [illegible]
నను నీవు నాకడకు వచ్చి వ్యర్థముగఁ [illegible]
ర్జునుని దక్క దక్కినవారిం జంపను, [illegible] చంపుదును. [illegible]
యతని నేను జంపెదను, నాతోనో యర్జునునితోనో [illegible]
నయిదుగురు తనయు లుందురు. అని [illegible]
యుఁ దల్లియానతి నొనరింపజాలక తనయుఁడును [illegible]
కుం జనిరి.

శ్రీకృష్ణునివలె వచ్చిన జయము [illegible]
ర్తమున ధర్మరాజు వివిధశస్త్రాస్త్రములకుఁ [illegible]
మునకై కురుక్షేత్రమునకు బయలుదేరెను. [illegible]
తులవలన రేగినపరాగముచే జలాశయములు [illegible]
సముద్రములవంటి యేడక్షోహిణులసేనపాదప్రహారములచే [illegible]
డెను. బలము నడచుచుండఁగా భారముతోడి [illegible]
దిగుటచే శేషునితలలు బరువెక్కి రత్నకాంతిమినుకుమనఁ గన్నులు [illegible]
జ్జవడి గ్రుడ్లు మీఁదికివచ్చిన ట్లుండెను. సేనాపరాగముచే [illegible]

చు పశ్చాత్కరాసులు వెంటవచ్చు నేనుఁగులమదధారలచే మరల నిఁకుచునుండెను. గొప్పవారిరాక శ్రేయోదాయకము గదా! తమాలవృక్షచ్ఛాయలుగల సరస్వతీతటమును నడచివచ్చు రాజులసేనలను విజయుఁడువిడియించుచుండెను. అనేకవిధములగు పటకుటీరములచేతను, వివిధవస్తుప్రసారితాపణములచేతను, రథగజతురగాములచేతను, నృత్యగీతవాద్యములతోడను నావిడుసులు పట్టణములను బురడించుచుండెను. తర్వాత దక్షాధ్వర ప్రదేశమునకు శతమన్యుఁడేకాదశరుద్రులతోడ వచ్చినట్లు దుర్యోధనుఁడు పదనొకండక్షోహిణుల సేనను గూర్చుకొని కురుక్షేత్రమునకు వచ్చెను. భీష్ముని సేనాధిపతిగాఁ గురురాజభిషేకించుట విని తనసేనకు ద్రుపదపుత్రుఁడగు ధృష్టద్యుమ్ను నజాతశత్రుఁ డభిషేకించెను. జరుగఁబోవు యుద్ధమువలనఁ గలుగఁబోవు బంధుక్షోదనమును వినఁజాలక సీరపాణి యగుబలరాముఁడు సరస్వత్యాదిపుణ్యతీర్థములకు వెడలిపోయెను. భీష్ముఁడు తన్ను రాజు నెదుట అర్ధరథుఁ డనియె ననుకోపముచేత నాతఁడు పడువఱకు నేను యుద్ధములోనికి రానని కర్ణుఁడు మిన్నకుండెను. ఇది విని విషణ్ణుఁడయిన కురురాజునకు సైంధవుఁడు, నే నున్నాఁడను, పాండవులు నాపాలఁబడియెదరు చూడు మని ధైర్యము చెప్పెను. మొదట మదవతియై పుట్టి పిదపఁ బురుషుఁడైన శిఖండితో మాత్రము నే నెదిరింప నని యతనిజన్మవృత్తాంతమును దుర్యోధనుఁ డడుగఁగా నాపగాసుతుఁ డిట్లు చెప్పెను.

“నేను గాశిరాజదుహితల ముగ్గురి స్వయంవరమున [illegible]
బాహుబలమునం గొని తెచ్చితిని. పెద్దది సాల్వుని [illegible]
యని తెలిసి యాతనికడ కనిచితిని. తక్కిన యిద్దఱను నాత
మ్మునకుఁ బెండ్లి చేసితిని. సాల్వునికడకుఁ [illegible]
నీవు పరాపహృతవు గావున నిన్నొల్ల నని [illegible]
నక్కన్య నాయొక్కడకు వచ్చిన నేనును [illegible]
కనర్థకారి నయితి వని నన్ను వధించుటకై [illegible]
టకు మునీశ్వరు లున్నయెడపులకుఁ బోయినది. [illegible]
దలి మునులను సందర్శింప భగవానుఁ డగు [illegible]
ను. అతఁడు క్రౌంచపర్వతమును ఛేదించి హంసలకే [illegible]
యకులమును ద్రుంచి రాజహంసలను గూడ [illegible]
కుండఁ గావించెను. అమ్మునులచే [illegible]
మాపరశురాముఁ డీబాలిక తపస్సు చే[illegible]
విచారమునకుఁ గారణమే మని యడిగెను. [illegible]
గ్రమ్మ నావాని శ్రేష్ఠునకు యథావృత్తము నా[illegible]
నీవు శోకింపకుము. భీష్ముఁడు నాశిష్యుఁడు, [illegible]
గ్రహించినట్లే నిన్నును గ్రహించును. [illegible]
స్వీకరింపఁగలఁడు. నాచరిత్ర [illegible]
నక్కామిని, “స్వామీ, నా [illegible]
ఒక్కసారి విడిచినవారిని మరల నే నేల [illegible]
భీష్మునివధింప నెంచుచున్న దానను.” అనిన [illegible]
దీసికొని కురుక్షేత్రమునకు వచ్చి నావలనఁ [illegible]

యిట్లు నా కాజ్ఞాపించెను. "నీకతమున నీకామినిసుఖము భ్రంశ మయినది. కావున నీతమ్మునకుఁ బెండ్లి చేయుము." అనిన, నేను, దేవా! పరరక్త యైనది మాకు వల దని నిరాకరించితిని. అపుడు కుపితుఁడై యాపరశురాముఁడు "నీవు మిగుల గర్వించితివి, నీ వీయువిదను స్వీకరింపవేని నానిశితశరము నీశిరమును స్వీకరించు" నని బెదరించెను. నేనును గొంచెముకోపముతో, "నీబంధకిని నాయింట నుంచుకొనుట కిష్టపడను. ధర్మవిరుద్ధవాక్యములం బలుకుచున్న నిన్ను గురు వని యైన సహింపను. అధర్మవర్తి యైనగురుని మన్నింపరాదు. ఉద్వృత్తముచు బూను మని పౌరవులకు శాసింతువా! కావున నీతోఁ బోరుటకు సిద్ధముగా నున్నాఁడను, శస్త్రముఁ దాల్పుము. నిష్కారణముగ నీవు నాతోఁ గడంగితివి గావున నిన్నుఁ జంపినను బ్రహ్మహత్య గాని యకీర్తి గాని రాదు. నేనొక్కఁడనే రాజుల నందఱను జంపితి నని గర్వింపకుము. అప్పుడే యీగంగానందనుఁ డుదయించి యుండెనేని నీదోర్గర్వ మేమై యుండెడిదో!" అనిన నావచనములకుఁ గ్రుద్ధుండై క్షత్త్రహ్రదములలోఁ మునిఁగినయప్పటి పాటలవర్ణము గలజటాభారము విడియాడ నాపై బాణప్రయోగము గావించెను. ఇరువురమును సవష్టంభుల మై జాహ్నవి వచ్చి వారించినను వినక ఘోరయుద్ధము గావించితిమి. క్రౌంచచ్ఛేది, నిర్జితకార్తికేయుఁడు, కార్తవీర్యార్జునహంత, నిఖిలరాజలోకమృత్యువు నాపైఁదీవ్రబాణముల్వఱపెను. అన్యోన్యబాణములచే నాయములునాఁటి మొత్తపడు కోపముఁ గొనియున్న మాలో నాఁడు జయమును గురున కపజ

యమునా రానున్న సమయమున నాతల్లి దుఃఖించుచు వచ్చి నది. వైమానికులుగూడవిహాయసమునవిలువంగూడని యుద్ధము దట్టమున నాబలశాలి నాపై బాణదండమును ప్రయోగించెను. అప్పుడు బాధకు సహింపక వసువు లిచ్చిన ప్రస్వాపనాస్త్రమును నెల్లరు వలదు వల దనుచున్నను వానిమీఁదఁ బ్రయోగింపఁ బోవ నీగురువు నీచే నవమానముం బొందఁదగిన వాఁడు కాఁడుగదా యని గగనమున నొక్కవాక్కు విననచ్చెను. అప్పుడు నేను ధనుర్బాణములు రథముపైఁ బెట్టి తేరు డిగి పాదచారినై యామహాత్ముని సన్నిధికిం జని నమస్కరించితిని. ఆమహాత్ముఁడు "నేను నీచే జయింపఁబడితిని. నాకు సంతోషసమయ మిది. నీవంటిబాహుబలశాలి జగత్తులోన లేఁడు. శిష్యుఁడు తన్ను మించినయప్పుడే గురువునకు మెచ్చును." అనిపల్కి యంబతో, బాల! నన్నింతయు వేఁడితివి. ఈ భీష్ముని నేను గెలువంజాల నైతిని. నీయిచ్చవచ్చినట్లు చేయు మని తిరోహితుం డయ్యెను. అనంతరము నన్నుం జంపుటకై యాబాల యంబికాపతిం గూర్చి హిమవత్పర్వతముపైఁ దపస్సు సల్పెను. పురుషులకంటె వైరబంధము స్త్రీల కెక్కుడు గదా! సన్నిధి సేసి మహాదేవుఁడు నీ కేమి కావలయు నని కోరినపుడు "నాచే భీష్ముఁడు చంపఁబడవలయు"నని కోరికొన్నది. అంతటఁ గాలుఁడు గంగాధరుఁడు నవ్వుచు, "నీవీదేహమును విడిచిపెట్టి ద్రుపదునికి కుమారుఁడవై పుట్టుము. కాలక్రమమున నీవు పురుషుఁడవై భీష్మునిజంపుటకుఁ గారణమ వగుదువు." అని సెలవిచ్చి కాలాంతరమున మాయమాయెను. చేసినపిమ్మట నాకన్య రోషవహ్ని యుద్రేకింపఁ బ్రజ్వలితశాంతిగాని

వెన్నెలవలె దీప్తవహ్నిలోఁ బ్రవేశించెను. నాచేత నొకప్పు డో డింపఁబడిన ద్రుపదుఁడు నప్పుడు పుత్త్రార్థియై శంకరుంగూర్చి తప ముఁజేసి, వరదాత ప్రత్యక్షమయి "నీ కిపుడుపుత్త్రికయే కల్గును. అది కాలాంతరమునఁ బుత్త్రుఁ డగుం గాని నీవు కోరినట్లు భీష్మునిఁ జంపలేఁడు, కాని, వానిమృతికిఁ గారణ మగు" ననియె. భక్తవ త్సలుఁ డగుశమనదమనుం డిట్లు చెప్పిన కొంతకాలమునకు ద్రుప దుఁనికళత్త్రమునం డిశిఖండి కూఁతురై పుట్టెను. చక్కఁగా నొన ర్పఁబడిన క్రియకు ఫలసిద్ధివలెఁ దనతపస్సునకుఁ దగినపుత్త్రిక ల భించె నని ద్రుపదుఁడు సంతసించుచుండెను, గాని, పుత్త్రికను బుత్త్రుఁ డనువ్యవహారమున నతఁడు బాలునకువలె జాతకర్మాది సంస్కారములు చేయించుచు వచ్చెను. ప్రాయము వచ్చునప్పటికి దశార్ణదేశరాజయిన హేమవర్మ తనకూఁతును శిఖండికిఁ బెండ్లి చేసెను. పెండ్లికూఁతురు తననాథుఁడు పురుషుఁడు కాఁడని తెలి సికొని దాదిమూలమునఁ దండ్రికి వార్తయంపెను. అతఁడు కో పించి బలయుతుండై సంబంధిపై దాడివచ్చెను. తనమూలమునఁ గదా తండ్రి కవమానము గలుగనున్న దని శిఖండి పలాయన మొనర్చెను. ఒక్కరుఁడడవిలోఁదలఁద్రెంచుకొను యత్నము లాలో చించుకొనుచుండ నొక యక్షుఁడుంగా వచ్చి "యేల చచ్చెదవు, మానుము, నాపుంస్త్వము నీకిచ్చెదను. నీపని తీఱిన వెంటనే నా కు మరల దాని నిమ్మని దాని స్త్రీత్వమును దా నంగీకరించి, యొ క్కమాసము గడుపుబెట్టి యింటికిఁ జనియెను. శిఖండియు సం తోషముతోఁ దండ్రికడకు వచ్చెను. సత్పురుషుల కయత్నము

గానె శుభములు సంప్రాప్తమగును. శిఖండి తండ్రితోఁ దనవృత్తాంత మంతయుఁ జెప్పంగా మునుముందు పురోహితుని చేత వియ్యంకునకుఁ గోపశాంతికై వార్త పంపెను. హేమవర్మ సిగ్గువడి ముగ్ధ యగుపుత్రికమూలమున నిట్లైవచ్చితి నని శాంతి నొందెను. గడువు దాఁటుమనుండ యక్షునికడకు శిఖండి యేగెను. అతఁడు "మంచిది, నీవు సత్యవంతుఁడవు! ఈనడుమ నొక్కచిత్రము జరగినది. స్త్రీరూపమున సిగ్గుచే నేను యక్షునికొల్వునకుఁ బోకుండుటకుం గారణము నారసి "స్థూణుఁ డేఁడీ" యని యడిగి యొక్కనిచే విదితవృత్తాంతుఁడయి "నీ కింతగర్వమా! ఇట్లెవ్వరయినఁ జేయుదురా! నీ విట్టే యుండు" మని నాస్వామి కుబేరుఁడు నన్ను శాసించెను. నేను వేఁడికొంటిని, నీవు చచ్చినదాఁక నాకీ స్త్రీరూప మిట్లుండు నని శాపాంతము ననుగ్రహించెను. "పున నీవు పొమ్ము." అని స్థూణుఁడు శిఖండిని బంపివైచెను. శిఖండి మహానందముతో నింటికి వచ్చి ద్రోణాచార్యులతో బాణవిద్య నభ్యసించెను." అని యిట్లు భీష్ముఁడు శిఖండివృత్తాంతముం జెప్పిన, దుర్యోధనుఁడును నింతటిబలశాలి నాకు దొరకఁగాఁ బాండవులను జయించుట యెంత యని యారాత్రి సుఖముగాఁ గడపెను.

(14) ఆరాత్రి యుద్ధముఖమున సురత్వమునుం బొందు వీరులను వరించుటకు సురసుందరులు వచ్చిరి. నఱునాఁత రెండుపక్షములలోనున్న వీరులను లేపుటకై సముద్రఘోషమునంటి దుందుభిధ్వానము వెడలెను. చంద్రుఁడు నిజకులజులైనరాజులు

మృతు లగుట చూడలేని విధమునఁ గిరణము లనుకరములం బట్టుకొని పశ్చిమశిఖరిశిఖరముపై నిలిచి పడుమటికడలిలోనికి దిగిపోయెను. ఎత్తయిన ధ్వజపటపల్లవములచే రాల్పఁబడిన గగనమునందలి నక్షత్రములకు బదులు మదగజహస్తములనుండి మింటికి నెగయు శీకరము లాస్థానము లలంకరించెను. తెల్లవాఱుచుండఁగాఁ గుముదవనములనుండి వెడలి తుమ్మెదలు తక్షాల స్ఫుటితమత్తమాతంగగండమదధారలు గ్రోలవచ్చెను. ఏనుఁగులు, గుఱ్ఱములుఁ, దేరులు నెక్కినభటుల శ్వేతపతాకాధౌతవసనాదుల కాంతి తెల్లవాఱుచున్నను యుద్ధము చూడ ముచ్చటపడి వచ్చిన గడచిననాఁటివెన్నెలరాత్రివలె నుండెను. క్షణకాలములో నంతరిక్షముంగప్పుచు లేచినబలములకలకలముచే భయపడినదానివలె రాత్రి గడచిపోవుచుండఁగాఁ జక్కమాఱు రథాంగపక్షులు తమప్రియులను గౌఁగిలించుకొన్నవి. సమరవిహారకౌతుకమునఁ జిఱునగవుతో నిలిచినరాజముఖపంకజములను దర్శించుసంతసము గలవానివలె నుదయకాలమునఁ దామరసషండములు తమ పద్మముఖములను వికసింపఁజేసినవి. రణనిహతు లగుభూపతుల వరింపవచ్చినదివ్యవనితల కాశ్మీరపంకరాగమువలెనే యుదయభానుఁడు తనకిరణరుచిని గగనమును నిండించెను. విడిదపట్టులనుండి రణరంగమునకు వచ్చుబలద్వయమువలనఁ గలిగినజలనిధిక్షోభమువంటి ధ్వనిని విని వేగవంతమైన యశ్వసప్తకముం గట్టినతేరెక్కి చూచుటకువలెఁ బూర్వాద్రితటమునకు సూర్యుఁడు వచ్చెను. కదలుచున్న ధ్వజలతికావనములును, బర్యంత ప్రస్రుత

మదాపగాప్రవాహములును గల పర్వతములవంటి యేనుఁగులు పలుదెసలనుండి వచ్చి యీ బలజలరాశికి ద్వీపత్వము నాపాదించినవి. భూమిపాలుర భుజభూషణములయందును ఖడ్గములయందును బ్రతిబింబించు సూర్యుఁడు ప్రతిక్షణమును దన బింబమును భేదింతు రనుశంకచేఁ దన్నిధననివారణమునకై వచ్చిన ట్లుండెను. తమకర్ణశూర్పము లాడించుటచే నెగసినభూపరాగము గగనము నాక్రమింపఁగా ముసుఁగువడి యున్న సురవనితలు వచ్చుమార్గమున, మావంతులు చెప్పఁగా నీరు చల్లుచున్నట్లు దానకరులు తొండములెత్తి శీకరములు చల్లుచున్నవి. దట్టములగు నాలవట్టములపై నుండి సూర్యరశ్మి క్రిందికిఁ బడనీపక భూమి చీఁకటిపడఁగా రాజుల తేజోవంశములను కిరీటములలోని రత్నకాంతు లాతావున వెలుఁగును గలిగించుచున్నవి. అటువంటి కౌరవశౌర్యసాక్షిణి యైనరణభూమికిఁ బాండుపుత్రుఁడే తిలకమువలె నొప్పెను. దానికిఁ గారణము హనుమధ్వజమును గృష్ణసారథ్యమును గలతేరిపై విజయనాముఁ డనుష్ఠుఁడై యుంకియే. ఆరెండుసేనలును భూమివహింపక దుర్దాంతములై యసంఖ్యము లైనంతట భీష్మాదులగు మనుమలను పుత్రులను, బంధువులను, దనగాండీవాగ్నికి శలభము లగువారినిగాఁ దలంచి శోకాక్రాంతుఁడై దయార్ద్రహృదయముతో నర్జునుఁడు శ్రీకృష్ణునకి ట్లనియెను.

కృష్ణా! ఇందఱు బంధువులును, గురువులు, భ్రాతలును, బుత్రులు, మిత్రులు, రణరంగమునఁ గరుణలేని నాచేఁ జంపఁబడిన పిమ్మట దుష్కృత్యముచే సంపాదింపఁబడిన యపయశస్సుతోడి

రాజ్యమును భోగించుటకు నాకు వాంఛ లేదు. అని ధనుస్సును క్రిందఁబడవైచి సవ్యసాచి రథముపైఁ జదికిలఁబడియెను. కృష్ణుఁడు నవ్వుచు, నోకిరీటీ! శైలరాజసారుఁడ వగునీ కొక్క మాఱుగా నింతటి భీతిపుట్టినదేమి! త్రిలోకములలోని శూరవీరుల యశంబునకు నీవు మూలకారణుఁడవు. ఫలాభిముఖుఁడవై వీరోచిత మైనని జకులకర్మమునందు విముఖుఁడ వగుట నీకు యుక్తము కాదు. నీ బాధువులయందుఁ గరుణయే యున్న యెడల మొదట నేల రణోద్యుక్తుఁడ వైతివి. వీరందఱును మొదల నాచేత నిహతులైన వారే, వీరివధకు నీవు నిమిత్తమాత్రుఁడవు గమ్మని చెప్పి తొల్లి కౌరవసభలోఁ గనఁబఱిచిన విశ్వరూపమును నాతనికి రథముపైఁ గనఁబఱిచెను. ఆరూపములోఁ జరాచరప్రపంచమును, భీష్మాదులను వేయినోళ్లతో మ్రింగివేయుచున్న వాఁడే తనసారథ్యమునకు సిద్ధుఁ డయిన మహాపురుషుఁ డని తెలిసికొని యా మహాత్ముఁ డుపదేశించిన గీతాభూత మైన దివ్యజ్ఞానోదకముచే మోహపంకమును గడిగివైచికొని రథముపై బెట్టినధనువునువిజయాశతో విజయుఁడు చేతఁ బట్టుకొనియెను.

ఆమహారణము, సరేంద్రయువకసింహములకు వేఁటయు ద్రౌపదీపరిభవదావాగ్నికి వర్షమును రక్తపానముం గోరు దివ్యాస్త్రములకుఁ జలిపందిరియును నయి దారుణ మయ్యెను. పదాతి వర్గముచేఁ బ్రయోగింపఁబడిన భల్లములచేఁ దెగిన గజముల మీఁది శూరులతలలు హుంకారములతో గగనమున కెగయుచుఁ ద్వరితముగా నెగసిపోవు తమప్రాణములను వెంబడించు వా

నివలెఁ దోఁచెను. నారాచదళితము లైనవారణముల గండభాగ ములనుండి వెడలురక్తధారలు తగ్గునట్లు విసరికొను వానిచెవులు రక్తధ్వజపటములవలెఁ బొలిగలని కలంకారము లయ్యెను. గజ తురగబలమును శస్త్రపాణులై తెగనఱకుచు విరోధిసైన్యములో సంచరించురాజులు దంష్ట్రాకకచములతో జంతుకోటినంతను ప్రళ గుసముద్రములోని మకరనికరములవలెఁ బరికింపనైరి. నరపతుల కీర్తికాశము విజృంభించు రణశరజాలము పొడమఁగనె గగనము నావరించుకొనుచు గరుత్పర్వతులచేఁ గాదంబములు సుభటము ఖాంబుజములపైని వ్రాలినవి. యుద్ధమను నద్ధియందు భూపాలు రను మేఘములు భటులను జలకణములను విడువఁగా నవిప్రహా రణములను శుక్తులలోఁ బడి మౌక్తికములవలె దొరకిన సురకాం తలు గుణవంతములం గావించి వక్షఃస్థలములయందుఁ జేర్చుకొను చున్నారు. దిగంతములకు మొఱయుచుఁ బోవుచున్న ధానుష్కుల బాణములు దగిలి వారువచ్చుమార్గములోఁ బడిన యేనుఁగుల పీనుఁగులు త్రోవకడ్డమై తమవైరులను నడువనీకుండఁ జేయుచు వైరము నీఁగుచున్నవి. మూలమువఱకు నరపాలురచేఁ ఖండిం పఁబడిన శుండాలశుండలలోనఁ గలసిపోయిన రాజులబాహు వులు తమకును వానికిని గలభేదములను వలయాదిభూషణము లచే మాత్ర మెఱుకపఱుచుచున్నవి. సుభటులమీఁద దేవతలు వర్షించు పుష్పములయందలి మకరందవృష్టిచే నొడ్డుతెగి పాఱు రక్తవాహినులను బలపరాగరేణువులు చేరి మరల నడ్డుకట్టుచు న్నవి. హా! హే! యనుచు నొకరిపై నొకరు వైచికొను ముద్గర

ములు పరస్పరఘట్టనలచే దూరము తొలఁగుచుండ నందం దు త్తాత క్రీడలొనరించు కరులదంతములచేఁ దూలింపఁబడి మరల వారివారియొద్ది కవి చేరుచున్నవి. ఏనుంగులమీఁద నున్నజోదు లు పదాతివర్గముపై విసరుచక్రములు నేలఁబడిన యొక్కొక్కని యొద్ద నొక్కొక్కటి యుండ, సురసుందరులు వానిని జాఱిపడిన సూర్యమండలము లని శంకించిరి. సుభటులకృపాణములచే రాలి నకుంభికుంభస్థలములయందలి ముత్తెములు సేనామధ్యమునఁ దిసగుసురనారీమణుల వక్షఃస్థలములయందుఁ గరికుంభము లను భ్రమచే నంటుకొనుచున్నవి. తెగిపడిన రాజులగుండెకాయలను దిన దిగిన కంకగృధ్రాదిపక్షులు చిక్కు జీరుగాఁ బడిన వారినరము లను బ్రేవులను గాంచి తమకై యొడ్డినవల లని బెదరుచున్నవి. కాశ్మీరపంకమువంటి నెత్తురును గపాలపాత్రములలోఁ బోసి తెచ్చి, యొక్కరక్కసి గజదంత మానుకుంచెతోఁ దనప్రియురా లికపోలముపైఁ బత్త్రరచనఁ గావించెను. శూరవీరులసారనారా చము లుడువీథుల కెగురకుండఁగా నాఁపినందునఁ గ్రిందికి మరలఁ బడిపోవుసేనాపరాగముచే వాహినులు శుష్కించి పోవునేమో యనుభీతిచే రణభూమి రక్తప్రవాహములను బఱపించెను. తెగి పోయిన యేనుఁగులచెవు లను తామరపాకులను దొప్పలుగాఁ జేసి వానితొండములనుండి కాఱు మృణాలసన్నిభము లగుధా రలను బిల్లపిశాచములు త్రావఁజొచ్చెను. తనవీణెతంత్రులు చిం దుచున్న నెత్తురుచిత్తడిచేఁ జెమ్మగిలి మెట్లుజాఱినది కూడఁ దెలి సికొనకుండ సేనామధ్యమున నొడలు తెలియని యానందముతో

నారదుఁడు సంచరించెను. ఇట్లు జరుగుచున్న సంకులసమరముం గాంచి భీష్ముఁడు తనచండిమం గనఁబఱుపఁ బ్రయత్నించెను. ఆతని మునుములో బాణజాలముచేఁ దెగి యెడతెఱపిలేక సుభటాల దండనుమీఁదినుండి పడు యోధవర్యులు ప్రళయకాలవాయువులచే గిరినుండి పడుశిఖరములవలె నగపడిరి. పూర్వము క్రౌంచపర్వతమును భేదించిన పరశురాముని బాణములను ఖండించిన భీష్ముని బాణములు కొండలవంటి యేనుఁగులను గూల్చుటలో నేమిచిత్రమున్నది. వీరులకుఁ గూడ భయము గలిగించు ఘోరారావముతోడి శరములు పెద్దపెద్దయేనుఁగుల తలలను ఖండించి పడవైచి భూమిం గంపింపఁజేసినవి. తనయస్త్రలాఘవమును బ్రకటించు భీష్మునిం గాంచి యర్జునుఁడు మొదలగుయోధులు నాతోడనే నాతోడనే పోరుచున్నాఁడనికొని బాణములను విడువఁదొడఁగిరి. తమకు మంచిమంచి తె[illegible]లను బ్రసాదించుచున్న భీష్ముని మెచ్చి కురిపించు నప్సరఃస్త్రీలపుష్పములయందలి పరాగ మాతనిరథకేతనపటమునకుఁ బటవాసచూర్ణమయ్యెను. వింటియల్లెత్రాడు దగిలి తెగినకుండలములు గలవియు విశిఖములచే నఱకఁబడిన కంఠములు గలవియు నందండుఁ దూలిపడు కిరీటములు గలవియు నగు రాజులశిరములు భూమికి భారమును గల్పించినవి. ఈరీతిం దొమ్మిదినాళ్ళు రాజలోకతిమిరమును హరించుచు భీష్మసూర్యుఁడు ప్రజ్వరిల్లి పదియవనాఁడు శిఖండిని ముందిడుకొనివచ్చిన వివ్వచ్చున కెదురుపడి స్త్రీపూర్వప్రతిభటునితో నెదిరి యుద్ధముచేయ నని ప్రతినపట్టిన

వాఁడగుటచే నాతనిశాతబాణపరంపరకగ్గమై సూర్యుఁడుసాయం కాలమున నస్తాద్రిపైఁ బడినట్లు నేలకొరఁగెను. ఇట్లు సేనానాయకుఁడు పుడమిపైఁ బడియు నిది దక్షిణాయన మని దేవతలు తెల్పుటచే నుత్తరాయణము వచ్చునంతకుఁ బ్రాణములను విడువఁడయ్యెను. ఆయుధము దాల్ప నని ప్రతిజ్ఞ వట్టిన కృష్ణునంతవానిచేఁ గూడఁ జక్రము వట్టించియుఁ దనపంతము విడువని యాదేవవ్రతుఁడు నిహతుఁడైనఁ గౌరవసైన్యమువారే కాదు, పాండవులును దత్సైన్యములోనివారును గడుఁ జింతిల్లిరి.

(15) పదునొకండవనాటి యుదయమునఁ గురురాజు గురుండగు ద్రోణాచార్యునకు సైన్యపతిత్వాభిషేకము చేసి, గురువర్య, నీవు ధర్మరాజును బలమునఁబట్టి నా కొప్పగించితివా మరల వానిని ద్యూతమున నోడించి తమ్ములతోఁగూడ నడవికిఁ బంపించెద ననియెను. అప్పు డాపలుకు విని పెద్దయెలుంగున సేనాపతి, "యర్జునుఁ డతనికడ లేకుండినచో నీ వనిన ట్లతనిం బట్టి తెచ్చెద" ననిపల్కెను. తన ప్రతాపమునుం జూపనెంచి సేనాముఖమునకుఁ గర్ణకుండలాలంకారమువంటి గురుఁడు రణరంగమునఁ బ్రవేశించిన నసేకయోధులు విబుధత్వము నొందిరి. మొదటినాఁడు గురునివలన శంకించిన కిరీటి, ధర్మజునిపార్శ్వముననే, యుండెను, గాని, వదలియుండ లేదు. కుంభభవునిశరవర్షమునకు భీతినొందిన వానివలె భానుఁడు పశ్చిమాద్రిని మఱుఁగువడిన సేనలను మరలించి యెల్లరును విశ్రమించిరి. మఱునాఁడు నరపాలుఁడును గురుఁడును బురికొల్పఁ ద్రిగర్తరాజు పార్థుని గయ్యమునకు రమ్మని

పిలువఁ గృష్ణసారథియై యాతఁ డాకవైపునకుఁ జనియెను. అప్పుడు సన్నాహముతోడి కురుసైన్యము క్రీడి లేఁడని నిజ్రాంభించి పాండవసైన్యములోనికి సింహములేని వనములోని కేనుఁగులు చొచ్చినట్లు చొచ్చిరి. అక్కడఁ గౌరవపాండవుల సైన్యముల జన్యమును వేఱొక్కయెడ నర్జునునితోడి సంశప్తకులయుద్ధమును జూచుచుఁ గలహాశనముని యిచ్చటికి నచ్చటికి నాసులోనిగోటమువలెఁ దిరిగెను. యుధిష్ఠిరుని బట్టుకొనఁ దలఁచిన గురునిశరనికరములును మనోరథమును గూడ, ననిలసంభవుఁడగు భీముని యనలసంభవుఁడగు ధృష్టద్యుమ్నుని బాహువల్లసాహాయ్యమున విఫలమయ్యెను. భగదత్తుఁ డెక్కి వచ్చిన సుప్రతీకమను గజము పాండవసైన్యమును మందరము సముద్రమును గలంచినట్లు కలంచివైచెను. కొందఱను బాదములతోఁ గొందఱను దొండముతోఁ గొందఱను దంతములతోఁ దను మఱికొందఱను బృంహితములతో నా మత్తగజము పీటతాటము గావించెను. భగదత్తదంతి చేసిన స్వసైన్యనాశనమును నారదమునివలన విని యర్జునుఁడు పవనాస్త్రముచే శత్రుశేషమును దూలించి యతివేగమున నావైపునకు వచ్చెను. అది గాంచి యాసుప్రతీకము శుండాదండము చాఁచి చెవులు నిక్కించి పరుగెత్తుకొని వచ్చి యావీరు నెదుర్కొనిన దాని కుత్సాహాభంగ మగునట్లు రథమును ద్రిప్పిన దానిపై నున్న యోధుఁడు పార్థునిపై శక్తి ప్రయోగించెను. ఆశక్తి నతండు ఖండించెను. దానికిఁ గ్రుద్ధుఁడై నిరంకుశముగఁ జేతియంకుశము నభిమంత్రించి వైష్ణవాస్త్రమును గిరీ

టిని జంపు మని పంపెను. దానిం జూచి కృష్ణుఁడు రథమును దూరముగఁ దొలఁగించి సిద్ధవిద్యాధరాదులు చూచుచుండ శరణాగతరక్షకుఁడుగావున నావచ్చునస్త్రమును దాను గౌఁగిలించు కొనియెను. రథరథ్యములగిట్టల ధూళిచే నొప్పునాపురుషోత్తముని వక్షఃస్థలమునఁ గొంతసే పది గాలికి రాలి జాతిపైఁ బడిన దిరిసెనపువ్వువలెఁ గనుపట్టెను. విజయుని తీక్ష్ణబాణముచే బద్ధలైన యాయోధునిశిరమునుండి ముత్తెములు, కుమారశక్తిచేఁ జెగిన క్రౌంచశిఖరమునుండి యెగిరిపడు హంసలవలెఁ బ్రకాశించెను. ఒక్క కుంతముచే దంతములు విఱిగిన యాకరి తనప్రభువగు నరకాత్మజునితోఁ గూడ నేలఁ గూలెను. రక్తచర్చితో నేలఁ బడు నాభగదత్తుని శిరమును దక్షిణాలమున సూర్యుఁడు రక్తవర్ణమునఁ బశ్చిమాద్రిని బడుచున్నట్లుండెను. ఆనాఁడు రెండుసేనలు నాలము చాలించి శిబిరములకుం జనియెను. మూఁడవనాఁడు మరల నిషవాగులవారును మిగుల రణసన్నాహమున రాఁగఁ ద్రికర్తలక్ష్మునని రారమ్మని పిలిచిరి. ఆయాహ్వానముపై నాతఁడు వారివంకకుఁ జనియెను. ఇంకొకవంకఁ గౌరవులు పన్నిన దుర్భేద్యమగు పద్మవ్యూహమును బాండవసైన్యములు చూచి భీతినందెను. కాని ధర్మరాజునాజ్ఞపై నపు డభిమన్యుకుమారుఁడు బాలభావమున సహస్రసంఖ్యాకము లగుబాణములతో సహస్రకిరణుఁడు పద్మషండముమీఁది కేగినట్లు పద్మవ్యూహముమీఁదికిఁ జనియెను. పరాక్రమమున లోనఁ బ్రవేశించి పఱుఁగెంచుపెరములను, వైరివీరశిరోధిబృందములు, మింటి కెగసి వట్టమై వ్యూహా

కారపద్మమునందలి పరాగమువలె నొప్పెను. [illegible]
డ్డనముం బ్రవేశింపఁజూచి పాండవయోధు [illegible]
హారదత్తమైన వరగర్వమునఁ జేసి ధు [illegible]
ర్వతమువలె నడ్డగించెను. అప్పు [illegible]
రుఁడు పార్థతనయుఁడై [illegible] లకు [illegible]
దులకును దగిన పరాక్రమమును [illegible]
వలన భారము తగ్గునని సంతసించి భూమికి [illegible]
శరములచేఁ జంపఁబడి యానేలాబను రాజు [illegible]
వును గల్పించినవి. రణరేణువులు పడిన వని గొలుపుకొనుటకై
తనశరీరమునందలి కవచమును విప్పికొనిన యింద్రుఁ డపుడు తన
వేయికన్నులతోడను మనుమనియుద్ధకౌశలమును గాంచఁగలిగి
తినని సంతసించెను. లక్ష్మణకుమారునిపై నభిమన్యుఁడు పరఁగిం
చిన శరములు మొదటను, గానువికారమునఁ దేవస్త్రీలు ప్రస
రింపఁజేసిన లోచనములు పిమ్మటను బడినవి. అభిమన్యుని ధను
స్సును గర్ణుఁడు ఖండించెను. గుఱ్ఱములను ద్రోణుఁడు చంపెను.
సూతుని కృపుఁడు దునిమెను. అశ్వత్థామ, హార్దిక్యుఁడు, బృహ
ద్బలుఁడును శరీరముపై శరములం బఱపిరి. అప్పు డతఁడు విర
థుఁడై పలుకయు వాలునుం గొని గగనమున కుఱికెను, నాచేఁ
జంపఁబడి దివికేగు వారెందఱో యని చూపఁజొచ్చిన [illegible]
ఱుకు తోఁచెను. ఆబాలుఁడు పెద్దనినాదముతో నసిఫలక
ముం ద్రిప్పుచు రేచకక్రమమునం దిరిగిన నది గగనమునఁ ఖం
డింపఁగాఁ బడుచున్న పడగయును శరీరమును గల సర్పమువలెఁ

గన్పట్టెను. గురుఁడుఁ గర్ణుఁడును నసిచర్మముల రెంటిని దృంప నేల కుఱికి తనగదతో దుర్యోధనకుమారునిం జూర్ణము గావించి యాతనిగదచేఁ దాను మడిసెను. ఇట్లు వైరివీరతిమిరమును హరియించి యభిమన్యుసూర్యుఁడు గ్రుంకఁగా బాండవహృదయపద్మములును బద్ధములును ముకుళితములయ్యెను. అభిమన్యునివేళ్లు గలశరముల యలుఁగులు విఱిగినశరీరములతోఁ గౌరవులు శిబిరములకు మరలిచనిరి. ఇతరులు శోకశల్యములు గలహృదయములతో మరలిరి. జయద్రథునిచేఁ జింపఁబడిన కవచములను విప్పివైచికొని కూరుచున్న రాజులనడుమ ధర్మరాజు రాత్రి నేలపై దుఃఖించుచుఁ గూర్చుండెను.

అంతఃపురమునఁ బురంధ్రుల కరుణామయాక్రందనము శబరులచే బిడ్డలుకొట్టఁబడఁగా దుఃఖించు కురరులరోదనముం దలఁపించెను. సుభద్ర చెవిని సుతునిపాటు పడఁగనే హృదయమున శోకాంధకారము గ్రమ్మి పిమ్మటఁ బెనుగాలికి వ్రాలులతవలె నేలఁ గూలెను. రాజపత్నులెల్ల వచ్చి శీతలోదకబిందువులచేతను వీజనములచేతను గన్నీటితోడను సేదఁదేర్చినఁ దెలివొంది గ్రమ్ముడిపడి భూమిపైఁ బొరలాడఁ దొడఁగుచు నవ్వీరపత్ని యతికరుణముగ నేడ్చుచుండఁగాఁ గలిగినకంపమున శరీరమునందలి భూషణావళియు శింజితమిషమున నామెతోఁగూడ నేడ్చెను. బిడ్డా! వీరవర్యులచేఁ బడితివా! అనవద్యశయ్యలపైఁ బవళించు నీమేను శరశల్యబాధతోఁ గటికినేలఁ బొరలుచున్నదా! మృదువీజనములచే శాంతిఁ బొందదగు నీరణవిహారణతాపము నీరక్తమాంసము లుప

యోగింపవచ్చు కంకగృధ్రాదుల [illegible]లచే [illegible]దా! బాణముల గఱులచేఁ దుడిచివేయుచుండఁగా [illegible] ఱొమ్ముపైధూళిని వందనానంతరమున నానవల[illegible]కముతోఁ దుడుచునయ్యా! నీకు [illegible] బలసియున్న జంబుకములు భీకరము[illegible]యి పురుషప్రకాండవంద్య! రాత్రులయం[illegible] బడు వారవిలాసినీనృత్య మిప్పుడు [illegible] చాంగనలా చేయువారు! నీయెదుట [illegible] దీపసమమై యుండెడిదో యట్టివాని [illegible]నుగాక! నీవు దివ్యవనితాలోచనా[illegible]డు నిరాటంకముగా భూలోకమున[illegible] కురువంశాంకూరమును దనగర్భమున[illegible] దౌహృదకాంక్షలు పూర్తిచేయకమునుపే [illegible] దగునా తండ్రీ! నీవు పుత్త్రు నొడిఁ[illegible] చూచు భాగ్యము నాయీనిర్భాగ్యపు[illegible]దా! అని యిట్లు వివిధవిధముల విలపించి [illegible] పిమ్మటఁ గొంచెము తెలి[illegible] బడుచుండ శోకాగ్నిచేఁ దప్తను [illegible] ట్లుండెను.

మరలమరల [illegible] వధించి యర్జునుఁడు శిబిరమునకు వచ్చెను. [illegible]! [illegible] నా యెడమకన్ను దరుచున్నయది! మునుపటివ[illegible] లేదు.

విరోధులచే నన్నగారి కేమైన నుపద్రవము రాలేదుగదా! అని నఁ గృష్ణుఁడు, ధైర్యమూనుము, నీయన్నదమ్ముల కేమియు హాని రాదని చెప్పుచుండ నిశ్శబ్దమై మఖనాసంతరసము ద్రమువలె నున్నతనపటగృహముసు సమీపించి రథము డిగి దుఃఖము లోన నడంచుకొనుచు మ్రొక్కిన కంచుకులవంకఁ గాంచక కృష్ణునితోఁ గూడ ధర్మరాజుబసలోనికిఁ జనియెను. అక్కడ వస్త్రాంచలములతో మొగములు గప్పుకొన్న రాజుల నడుమ శరత్కాలమేఘములు గప్పిన సెలయేఱులు వాఱు పర్వతమువలెఁ గన్నీరు వెట్టుకొనుచున్న యన్నంగాంచి నమస్కరించి యతనిప్రక్క నభిమన్యుఁడు లేఁడేమని దగ్గఱవారి నడిగెను. అందఱును ఖిన్నులై శిరంబులు వంచుకొని మాఱువల్కకున్న, దుఃఖమును మోహమును బెనఁగొన ధర్మజుఁడే యీ రెలుంగున నావృత్తాంతముం జెప్పెను. అప్పు డర్జునునిహృదయమునం గలశోకముం గొట్టివైచి రోషము చొచ్చి బాడబాగ్నిని మించి యర్ణవమును హాలాహలము రేఁచినట్లు కలఁతపెట్టఁ బెదవులు చలింప బాష్పములు రాల నొడలు వడఁక బొమలు నడఁ జెమ్మట విజయశ్రీ కభిషేకించునట్లు నెరయ నుఱు మ్రుఱిమినట్లుగా "ఓవీరులార! నాప్రతిజ్ఞ వినుఁడు. తెల్లవాఱినపిమ్మట మరల సూర్యుఁడు గ్రుంకకమున్న సైంధవుని శిరముం దెగవేయువాఁడను. అట్లుచేయ లేకపోయినయెడలఁ గర్ణమిత్త్రుఁ డయినరారాజు నెదుట గాండివముతోఁగూడ నగ్నిలోఁ బడి శరీరమును దగ్ధముచేసికొందును. అని దేవదత్తమును బూరించిన వైరినారీగర్భచ్యుతముం గావించుపాంచజన్యమును కృ

ష్ణుఁ డూఁదెను. భీముఁ డట్టహాసము గావించినఁ దొండములతోఁ బట్టుకొనిన కబళములను క్రిందఁ బడవైచి నాగములు [illegible]పడి యెను. తక్కినరాజులును దమతమశంఖములను వ[illegible]కాలము దాఁటినపిమ్మట గుహలు ప్రతిధ్వనింప వనహస్తులు ఘీంకరించిన ట్లు ఘుమఘుమ నొత్తిరి. అనంతరము రాజుల నందఱను విడిచి లకుఁబంపిన ధర్మరాజు తనశిబిరములోఁ బ్రవేశించునప్పటి కాతని హృదయమున జయద్రథుని భీతి ప్రవేశించినది. కృష్ణుఁ డుచిత వచనంబులఁ జెల్లెలిదుఃఖమును దొలఁగించి "యర్జునా! నీవు తగనిప్రతిజ్ఞ గావించితివి. కోపవశమునఁ బూర్వాపరము లాలోచింపవైతివి. గురుకర్ణప్రముఖులు కురురాజుసేనలో నున్నారని తెలియదా! నీప్రతిజ్ఞ విని దుర్యోధనుఁడు చకితుఁడై ద్రోణాచార్యునియొద్దకేగి వేఁడికొనియె నఁట. అతఁ డభయ మిచ్చె నఁట." అనిన నవ్విజయుఁడు యదునాథ, యీమాటలకేమి, నీపదపద్మములపై నొట్టుపెట్టుకొని చెప్పెదను. సింధురాజును నాజ్వలదస్త్రములు దహించును. ఒక్కమాఁ టెవ్వని పాదరేణువును స్మరించినంతనే దేవతలు దైత్యులను జయించిరో యట్టినీవు నాయండ నుండ నేను ద్రిలోకములను జయింపఁగలను. అనిన విని యాతనిభక్తికి లోన మెచ్చుకొని 'నీవీరాత్రి కుశాసనముపైనుండి శ్రీశంకరుని జపింపుము, నీకు జయ మగు' నని యదునాథుఁడు సెలవిచ్చెను. పిమ్మట నిజగృహమునకుం జని శేషశయ్యవంటి శుభ్రతల్పమునఁ బవ్వళించి పాదము లొత్తుచున్న సూతునితో, దారుక! యీకుడిచేయి రేపు విజయుని దారుణప్రతిజ్ఞను నెఱవేర్ప

నున్నది, కావున, దివ్యశస్త్రకేతువులతోడి రథమును నీ వుదయమున సిద్ధము చేయుము. అని చెప్పి యందఱు నిద్రించుచుండఁగా నర్జునుని సుశాసనమునుండి లేవఁదీసి గగనమున కెగసి యాయా నక్షత్ర మండలములఁ జూపించుచు గణాధిపుఁ డొంటికొమ్ముతోఁ బొడిచిన గోతులు గలకైలాసము మీఁదికిఁ యాదవసింహము దీసికొనిపోయి దించెను.

ఇది కౌండిన్యసగోత్రజుం డగు క్రొత్తపల్లి సూర్యరావుచే నాంధ్రీకరింపఁబడిన యగస్త్యకృత బాలభారతమునం

జతుర్థాశ్వాసము.

శ్రీ ర స్తు.

బాలభారతము.

పంచమాశ్వాసము.

(16) అనంతరము కృష్ణుఁడును బార్థుఁడును గైలాసము మీఁది శివపురముం బ్రవేశించి, ప్రమథగణసమేతము లయినవీథుల వెంబడిని బరమేశ్వరుఁడు నివసించు గృహద్వారముకడ కేగిరి. త్రిశూలధరుఁ డయిన నంది యచ్చటఁ గావలియుండెను. అతఁ డెదురువచ్చి వారిరాకకు హర్షమునొందుచు నానందహృదయులగువారిని బాలాతపమువంటి మణిదీపములు గల కొలువుకూటమునకుఁ గొనిపోయెను. నెమరు వేయుటలో జాఱిన నురువుచేఁ జల్లఁబడిన భూమిపైఁ జిరకాల మొక్క ప్రక్కనే పండుకొనినయలసట దీర్చుకొనుటకై ప్రక్కకు మరలి గ్రీవము వంచి యూర్చిన వృషభేంద్రుని వేఁడియూర్పులు గలవియు, వీణలు చేఁ గొని పాడు సిద్ధవధూకదంబముల సంగీతములు గలవియు నగు నేడు కక్ష్యలు గడచి పోయి వారు పురారాతిని దర్శించిరి. భద్రసింహాసనముపై దేవీసహితుఁడై ప్రమథగణమేకాక వివిధామరకోటియుం గొలువ శ్రీహరదేవుఁడు కూర్చుండెను. వీ రక్కడకుఁ జేరునప్పటికి నారదుఁడు వచ్చి యభిమన్యుపరాక్రమమును దద్వధక్రమము నుగ్గడించుచుండెను. ఆ బాలుని శౌర్యమునకు శూలి

గంగాకల్లోలిని తొలఁకునట్లు దల యూఁచుచుండెను. కృష్ణార్జునులు సన్నిధికిఁ జని దండప్రణామములు గావించి లేచిరి. వారిని బదరికాశ్రమవాసులైన నరనారాయణు లనియు నిమిత్తజన్ములై రనియు నాప్రభు వెఱుఁగును. తనవృత్తాంతమును శివునితో విన్నవించుకొనుటకుఁ బార్థుఁడు స్వామిపాదపీఠసన్నిధికి డాయఁ, గిరాతవేషమునాఁడు తా మొనర్చిన చర్యలు దలంచుకొని దేవియు దేవరయుఁ జిఱునగవులతో నొకరిమొక మొకరు చూచికొనిరి. అంజలిబద్ధమున నిల్చినకౌంతేయునింగాంచి, పార్థ! నిన్నెఱుఁగుదును, నీయాగమనకారణమును విదితమే. ఈప్రక్కనున్న సుధాసరసిలో దైత్యులతో నొనరించిన యుద్ధక్లేశము తొలంగుటకై మునిఁగి యందున్న ధనుర్బాణముల నిటు దెమ్ము. అనిన పరమేశ్వరుని యాజ్ఞపైఁ గృష్ణునితోఁగూడ నం దేగి మునిఁగి వానిని దీసికొని మరల నతనిసన్నిధికి వచ్చెను. ఆమహాదేవునికనుసన్న నొక్క మహాబలశాలి యగుప్రమథుఁడు లేచి పాశుపతిముం బ్రయోగించువిధము నర్జునునకు మూలముట్టుగ బోధించెను. భగవంతుని సెలవుపై వారిరువురును భూలోకమునకు వచ్చిరి. కృష్ణనియోగమున మరలఁ గుశాసనము మీఁదనే మిగిలినరాత్రి యర్జునుఁడు సుభాషితములతోఁ గడపెను.

ఉదయమున ధర్మరాజు యుద్ధమునకు సిద్ధముగం డని యందఱకుఁ దెలియఁ బటహము చఱపించెను. ధర్మరాజు స్నానము చేసి పితృదేవపూజనములు గావించి యుద్ధోచితవేషమును ధరియించి పటగృహము వెడలెను. చంద్రకాంతి గలిగిననాల్గుగుఱ్ఱ

ములును సంశప్తకులరక్తములో నానినచక్రములుగల [illegible] కపిధ్వజమును గలతేరు నారాయణుండు [illegible] గుమ్మముకడకుఁ దోలుకొనివచ్చెను. తన్నుఁ జూచి [illegible] ములు సకిలింప నారథమునకుఁ బ్రదక్షిణమునుచేసి [illegible] ర్వకముగ జయము జయ మని శ్రీకృష్ణుఁడుచ్చరించుచుండ [illegible] సన్ముఖుఁడై శతమఖసూనుఁ డెక్కెను. ఖడ్గములు [illegible] బట్టుటచేఁ గర్కశములైన హస్తములతో నచ్యుతుని [illegible] మాంచముతోఁ గంచుకము దొడిగి శరము లమ్ముల [illegible] వల్మీకము లవంటి తూణీరములను వీఁపునఁ గట్టుకొని [illegible] సాలోల్లిఖిత మైనకిరీటమును దాల్చి త్రిపురారాతి [illegible] రహారుని చూడాతుషారకరపరిమళము గలదియు [illegible] దంగనావైధవ్యదాయిని యు, నయినధనుస్సును [illegible] క్కిడెను. శత్రువ్యూహముఁజొచ్చి ధనుష్టంకారము [illegible] నది యచ్చరలకు వీరస్వయంవరమంగళతూర్య [illegible] మొగ్గరమునకు మొగమున నిలిచిన దుర్జయుఁ డగు [illegible] ర్యునకు మురారియనుమతిని రెండు పాదసమీపమున [illegible] టు నమస్కారబాణములను వదలెను. ఆగుటచేఁ [illegible] రోషావేశముచేఁ జేసినమన్న ప్రతిజ్ఞను రక్షించుట [illegible] స్ఫురన్ముఖుఁడై యాతనితో సమరమునకుఁ గడంగి [illegible] నిలిచి యోధింపఁబడియెను. కుపితస్కంధుండు [illegible] యి కృష్ణుఁ డదుపీలికాఁడు రథనౌకను సైనమనుదళ [illegible] గలవానిని వ్యూహజలధిలోనికి నడపెను. రథవేగముతో నసే

కృష్ణుఁడు వ్యూహమును సగము భేదించెను. పార్థునిశరములచే గృతవర్మబలమును భేదించెను. దానితో సేనలోఁ గలకలమును దుర్యోధనునిహృదయములో నదటును బుట్టెను. తనశరములచేఁ బౌరుషమదము ముడిగి వృద్ధత్వమున జర్జరితతనుఁడై కేతుదండము నానుకొని నిల్చిన భోజుని మోహతిమిరాంధదృశునింజేసి యర్జునుఁ డాతనికి రెండవ కాలుఁడయ్యెను. తనయెదుటం బడినరాజవీరులకెల్ల బాణములచే నమరత్వము సమకూర్చెను. కృష్ణుఁడు ఫల్గునుని విహారమునకుఁ దగినట్లు రథమును వివిధగతులఁ గ్రిందికి మీఁదికి నడిపించెను. వారియుభయులును బత్రోజ్వలమును జవనిర్జితమారుతమునైనరథముచేతను శరప్రకరముచేతను సైన్యాంగముల దారుణరూపములను గల్పించిరి. ఆమోహరములోఁ జొచ్చి నిల్చి యిట్లు బాణజాలములచే విజృంభించిన మధ్యందినసూర్యప్రతాపము గలయర్జునుని వైరివీరులు చూడఁజాలరైరి. గుఱ్ఱములు దప్పిగొన్నట్లు శంకించిన కృష్ణునియభిమతముపై నొక్క బాణమును భూమిలోనికిఁ బఱపి, పూర్వము పాతాళములోని రాక్షసులను జయించిననాఁటి కీర్తిధారవంటి యొక్క స్వచ్ఛజలధారను బైటికిఁ బాండవమధ్యముఁ డుబికించెను. మీఁదికెగసిన యోధాళికి బాణములతో నొకతొట్టెనుగట్టి దివి భువిం గలవారచ్చెరువందఁజేసెను. ఆకౌంతేయుఁడు ప్రయోగించినబాణములకు బాధనొందిన రాజలోకము రాఘవుఁడు ఖరదూషణాదులతోఁ జేసినయుద్ధ మింతటిది గా దనుకొనియెను. కాంభోజభోజయవనాంగకళింగవంగనేపాళమాళవాధిపతులు పఱపినబా

ణములు తురంగమాంగముల నాఁటిన వాని నెల్ల ను గృష్ణుఁడు తనచేతితో నూడఁదీసి యాభాగముల బాధకూడ లేకుండఁజేసి యథేచ్ఛముగా నొక్కసారి నేలఁబడి దొర్లనిచ్చి, లేచి దూఁకను లుపుకొని మెడ లాడించినవానిని గల్లమున గుల్లచేతిచఱపులు చఱచి యవయవము లంటి సంవాహనము చేసి పిమ్మట నమ్ముల తొట్టెలోని నీరు త్రావించెను. తుష్టిచెంది హేషారవముఁజేయు నయ్యశ్వములను బూన్చినరథముపై మరల నమ్మనుఁ జెక్కెను. కృష్ణుఁడు నడపినయారథము చేసిన ప్రచారమునకు సురలు విరు లవాన గురియించిరి. సేనామధ్యమున నున్నయర్జునునివార్త తెలిసికొనఁ గోరిన ధర్మజునియభిప్రాయ మెఱిఁగి భీముఁడు సాత్యకి యు గురుని జయించి వ్యూహమధ్యముఁజొచ్చి పార్థుఁడు మధ్యా పఁగా మిగిలినసేనల లూనము గావించిరి. దుశ్శాసనునితమ్ముల నెమ్మొగముదమ్ముల నలఁపివేయుచున్న భీమగజమునకుఁ గర్ణుఁ డును భూరిశ్రవస్సును నడ్డుచొచ్చిరి. తనతేరిగుఱ్ఱములు నశించి నకర్ణుఁడు సిద్ధమైన రెండవరథ మెక్కి వచ్చి భీమునిరథమును వి ఱుగఁగొట్టి చాపమును ద్రుంచెను. భీముఁ డక్కడనుండి వేఱొక్క మెడ కుఱికి వాయువు మేఘములం దోలినట్లు గజబృందముపైఁ బడి తోలి యడఁచెను. సాత్యకి చాలసేపు రణ మొనర్చి యల సిన వానిం దేరు భగ్నముగావించి క్రిందఁబడవైచి ఖడ్గముతో భూరిశ్రవుఁడు చే యెత్తి నఱకఁ బోవుచుండఁ గృష్ణుఁడు చూచి యర్జునునకుఁ జూపించిన నొక్కబాణము నంపి వానియెత్తినచేయిఁ బడ నతండు నఱకెను. దూరమునం దున్నవానిని నడుమ నున్న

వారినందఱను దప్పుకొనిపోయి యాసాయకము వానిహస్తభు
జగమును భంగముచేయుట యతిచిత్రభంగిగాఁ గనఁబడియెను,
గాని, "యోయి, నీపై రాలేను; అన్యత్ర యుద్ధము చేయు నా
చేయి ఖండించితివి. ఇసీ, పార్థా నీయశస్సున కిది తగ"దని దర్భ
శయనముపై నుండి భూరిశ్రవసుఁడు ప్రాయోపవేశమును గావిం
చెను. కాలమృత్యువు వానసమాచి విడిచినశైనేయుని భీముఁడు
దారుకుఁడు తెచ్చిన రథముపై నెక్కించుకొని యర్జునుని కడకువచ్చె
ను. అర్జునుఁడు వివిధరాజపర్వతములు గలసేనాటవిని గట్టుము
మీఁద దాఁటి తృషితుఁడై వీరప్రకాండ మను పాదపములచే
గుప్తము చేయఁబడిన సైంధవుఁ డనుజలాశయమునకు వచ్చెను.
అస్తపర్వతమునకు దిగుచున్నసూర్యునివలె సుదర్శనమైన సుద
ర్శనముచేఁ గృష్ణుఁడు సూర్యబింబమును మాటుపఱిచి కృపా
దులతోఁ బోరుచున్నయార్జునునకుఁ జూపెను. ప్రొద్దు గ్రుంకిన
యది, బీభత్సుని ప్రతిజ్ఞ భగ్నమైనయది యని పలుకుచు హర్ష
ముతోనుత్క్రీవుఁడై చూచు నాసావీరపతిశిరస్సును బార్థుఁడు
త్రుంచెను. ఆశిరస్సును గృష్ణుఁడు చెప్పినరీతిని రక్తము గాఱుచున్న
దానిఁ గ్రిందఁ బడనీయకుండ బాణముచే గగనమార్గమునసే
సంధ్యాంజలి యిచ్చుచునున్న సైంధవునితండ్రిదోయిటం బడు
నట్లు విసరి యర్జునుఁడు తననిపుణతం గనబఱిచెను. ఇది యేమి
యని యచ్చెరుపాటునఁ జేతఁబడిన తలను గ్రిందవిడిచి యతఁడు
గూడ, నేలఁబడి ప్రాణములు విడిచెను. తన్నుఁగట్టుకొనఁ ద్రాళ్ళు,
తాఁ దెచ్చికొనినట్లు పూర్వ మీతఁడు శివునిచే "నాపుత్రుని

శిరం బెవ్వనిచే నేలఁ గూలునో వాఁడును నేలఁ గూలఁగాక యనువరము బొందియున్నాఁడు. ముంను సైంధవునిశిరము క్రిందఁబడినది. పిదప నస్తాచలముపై నసూర్యబింబమును నట్లాతే నర్జునునిపై గీర్వాణపుష్పవృష్టియుఁ బడినవి. శంఖనాదముచేసిన యర్జునునికీర్తి దశదిక్కులను వ్యాపించెను. కురుసైన్యపు శరీరమునం దంతట భయము ప్రసరించెను. అనంతరము పాండుపుత్రులతో ధృతరాష్ట్రపుత్రులును సైన్యములతో సైన్యములును సంకులసమరము గావించెను. బాణమునకు బాణము నస్త్రమునకు నస్త్రము ఖడ్గమునకు ఖడ్గ శంఖమునకు శంఖమును బాణమున నిరుదెఱఁగులవారును బ్రయోగించిరి. యుద్ధమునఁ జచ్చిపోయిన పెద్దపెద్ద యేనుఁగులతో నావరింపఁబడినది. నాపిలతురుతోఁ గలిసిన కుంభస్థలములలోని ముత్తెములు బాణసమూహములతోడి సంధ్యాకాలనక్షత్రములవలె ప్రకాశించెను. పక్షిసమారుతములతో ధ్వని చేయుచుఁ జిరకాల మంబరమున సంచారముచేసిన బాణపక్షులు రాజులశరీరము లనుగూడుల[illegible] జొచ్చినవి. క్రమక్రమముగా మునుఁగ[illegible]చ్చిన [illegible] ములతో దట్టమైన రక్తప్రవాహములు [illegible] భూభృత్పార్శ్వముల బ్రవహించినవి. [illegible] పుఁబట్టములవలె శూరుల కెంపు శౌరలఁ[illegible] గనుపట్టు[illegible] సాంధ్యవేళఁ జేదీపముల వెలుఁగునఁ గాంచెము సంకోచించుచు విరిసినవి. తొండములు చుట్టఁబెట్టుటచే నివి గొనుఁగులనియు [illegible]చ్చుకొనుటచే నివి శరము లనియు గన్పులుగనఁబడనివేకశీలో[illegible]

తెలిసికొనుచుండ యుద్ధభూమిలోఁ బరాగ మలమికొనియెను. మెరకపల్లములు తెలియనీయని చీఁకటిలో స్వజనము పరజనము ననుభేదము తెలియని తమస్సులో మేఘములోని మెఱుపువలె ఘటోత్కచుఁడు వచ్చి విజృంభించెను. మాయచేఁ దాను గనఁబడకుండ నాకసమున సంచరించుచు సింహనాదమువంటి యట్టహాసముతో విలయవారిధరమువలె నుపలవర్షము గురియుచుఁ బెద్దపెద్దవృక్షములు పెఱికివిసరుచు వైరిసేనావారమును ఘోరముగఁ గలగుండుపఱచుచుండ సుయోధనాదేశమునఁ గర్ణుఁడు కర్ణాంతాకృష్టధనుస్సుతో, నక్షోహిణిసేనం గొని వానిపైకి నడచెను. ఆ మాయావితోఁ జిరకాలము వివిధగతులఁ బోరి చిట్టచివరకు మహేంద్రదత్తమైన శక్తిని బ్రయోగించి యతనివక్షము భేదించెను. ఆశక్తి పైపైఁ దిరుగుచు నెత్తురుచుక్కలు గారుచుండఁగనే యొక్కని ప్రాణముం దీసికొని కింకిణీనాదమిషమున నభశ్చరుల 'అర్జునుఁడు గాఁడు నాచేఁబడిన'దని తెల్పుచు నెప్పటియట్లింద్రునిసన్నిధికిం జనియెను. పాండుతనయులు శోకించుచుండఁ గృష్ణుఁడు పాంచజన్యము నానందముతోఁ బూరించెను. ఇది యేమి? దుఃఖసమయములో నీ కీశంఖధ్వానమున కెట్లు మనసు పుట్టె నని యడిగిన పాండవులకు "వెఱ్ఱులార! అర్జునునిఁ జంపవలె నని యాశక్తి నింద్రు నడిగి కర్ణుఁడు పుచ్చుకొనియెను. అదృష్టవశమున దానిని రాధాసుతుఁడు ఘటోత్కచునిమీఁద విసరెను. ఇపుడు కర్ణునిం గిరణములు లేని సూర్యుఁడు, జ్వాల లుడిగినయగ్ని, గోళ్ళూడిన సింహము, మొదటికే దంతము లూడిన మదగజము, కోరలు

పెటికిన యురగమునుగా నెన్ను చున్నా [illegible]
శోకముచే వందురువారికి మనుపవ [illegible]
ముపై సూర్యుఁడుదయించుచుండ [illegible]
నట్లు మనస్సులలోని దుఃఖములను [illegible]
డుదయించి యంతటను జీఁకటులు [illegible]
పాతభయమునం గాఁబోలు [illegible]
పర్వినఁ గ్రిందిచీఁకటిని మాత్రము [illegible]
డు ద్రోణునిబాణములకు [illegible]
విహ్వలాంగులై సురనా[illegible]
దీర్ఘికలలో మునిఁగి లేచి యుద్ధ[illegible]
మిథునములు నూతనవసా[illegible]
మిని విహరించి యలసి వక్షఃస్థ[illegible]
కుమారులను గుండెల పై నిడుకొ[illegible]
ల్పముపై నిద్ర విశ్రమించెను. [illegible]
రవులు పోరుచుండఁగా రా[illegible]
మాత్రము కాలేదు. నిజముగ [illegible]
ణించిరిగదా యని విచారించుచు [illegible]
గెను. ఏనుఁగుల దంతక్షతములచేతను [illegible]
వీరపురుషులు భోగులవలె మిన్నకుండ [illegible]
చములు విప్పి క్రొత్తవి తొడిగికొనుచుండ [illegible]
పనియోధులతోఁ [illegible]
వముచేఁ గొండఱయొవళ్లు [illegible] రం

-టకయు, బాధ తెలియనీయకయు, మంత్రించి చంపినట్లు గావించి నవి. పాంచాలమాత్స్యయదుమాగధసోమకుల వీరకేళి ద్రోణాచార్యునియొద్దఁ బనికిరాలేదు. పిడుగు పడుచున్నప్పుడు వర్షధారలు చల్లార్పఁగలవా? ఆమహావీరుని బారిఁబడిన వీరశూరులకు మాఱుపుట్టువు లేదు. ప్రళయాగ్నివలెఁ బ్రజ్వరిల్లిన యాద్రోణాగ్నికిఁ బాండవసేన మిడుత లయ్యెనో యంతకంటెను సూక్ష్మరూపము లగు మఱి యేప్రాణు లయ్యెనో తెలియరాదు. భీమునిచే నశ్వత్థామ యను నేనుఁగు చంపఁబడెను. అది మిషగాఁ గృష్ణుని ప్రేరణమున ద్రోణునితో "అశ్వత్థామా హతః పరవారణః" అని స్పష్టముగా ధర్మరాజు పలికెను. ఆతని వాక్యమునందలి విశ్వాసముచే, హా సుత! యని చేతిలోని ధనుస్సు విడిచి, ప్రబలశోకముతో రథముపయిం జదికిలఁబడి యగ్నిధారా తానునుఁడై ప్రాణములను విడిచినపిదప దృష్టద్యుమ్నుఁడు రథమెక్కి తల పట్టి గురునిశిరమును ఖండించెను. ఈవార్త వేఱొక్కపక్కను బోరుచున్న యశ్వత్థామ విని పితృవధముచేఁ గలిగినకోపమున నిష్పాండవము గావించుటకయి యాగ్నేయాస్త్రముం బ్రయోగించెను. ఆదివ్యాస్త్ర మొక్క యక్షౌహిణి సేన నపుడు దహించి యర్జునుఁడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రముచే శాంతి నొందిన యంతట రోషముచేఁ గురుపుత్త్రుఁడు శస్త్రసన్న్యాస మొనర్చెను. అప్పుడు వ్యాసభట్టారకుఁడు ప్రత్యక్షుఁడై, "బ్రాహ్మణుఁడవు. నీకీ దారుణకృత్య మేల? వనమునకుం జని తపం బొనరించి శాంతిం బొందు"మని వారించెను. కోపము పట్టంజాలక మరలసమరము

సకుం గడంగిన, నేఁటికిఁ జాలు నని, సాయంకాల మగుచుండుటచే దుర్యోధనుఁడు సేనలను శిబిరములకు మరలించెను.

(17) మఱునాఁడు గురుతనయుని యుపదేశముచే రారాజు కర్ణునకు సేనాధిపత్యమున కభిషేక మొనరించెను. ఆబలమథనముచే నారాధేయుఁడు భూభారమును దొలఁగించు నను వార్తను దెల్పుచున్నట్లు దిగ్గజములచెవులు చెవుడుపడునట్లు రణభేరి మ్రోగెను. రాజు విజయుని కమ్మని పలుక సతనితమ్ములు శ్వేతాతపత్రము ధరింప రథ మెక్కి కర్ణుఁడు సేనలతో వెడలెను. కురుసైన్య మాకర్ణుని నాయకత్వమున నాయకమణితోడి హారముంబోలి యొప్పెను. వేసవిలోని కృశానునివలె దుస్సహప్రతాపముతో భీష్మద్రోణులు గావించిన పదేనుదినముల సమరముకంటె నధికతరముగ సేనలను బ్రథమదినమునఁ బడల్పఱిచి పడఁగొట్టెను. రెండవనాఁడు నీవు కర్ణునకు సారథివి గ మ్మని రాజు శల్యుని గోరెను. దాని కాతఁడు కోపించి,"కురురాజ! సత్కులుని నన్నెట్లసత్కులునికి సారథ్యము చేయుమంటివి? ఈయవమానము నొందించుటకేనా నన్ను మార్గములో సత్కరించి నీవంకకుఁదెచ్చితివి! చాలు, నీ ప్రయత్నము మాను"మని మద్రరాజు జారకుండఁగా, దుర్యోధనుఁడు, మామ! నామిత్రుఁడు దివ్యుఁడు గాని యుకులుఁడు గాఁడు, మహారథలక్షణోపేతుఁడు, రథకారకులుఁ డెట్లగును! శుభరత్నము నత్తగుల్లలగనిలోఁ బుట్టునా! ఈతఁడు హీనజాతివాఁడే యైనచో భార్గవరాముఁ డేల శిష్యునిగాఁ గొనును. ఇంద్రుఁ డేల శక్తి నొసంగి యుండును. కావున గాండీవధన్వి

కంటె బలవంతుఁడుగానఁ గృష్ణుని మించిననిన్ను సారథిగా నుంఁ డుకొంటిని. పూర్వము పురారికి సరోజభవుఁడు దొరకినట్లు నీవు నాహితునకు యంతవుగా లభించితివి. అనిన మనంబు మట్టుప ఱిచికొని నీసాంత్వనవచనములచే సూతసుతునకు సూతకృత్య ము గావించుటకు సమ్మతించెదను, గాని, నే నుపదేశించునది యాతని కిష్టము లే కున్నను సమ్మతించి కర్ణుఁ డుండవలయును. అనిన నట్లే యుండు నని విజయుని జయించుటయందలి యభిలా షచేఁ గర్ణుఁడు సమ్మతించెను. మద్రమహీశ్వరుఁడు తోలుచున్న కర్ణునిరథముంగాంచి కౌరవులు సంతోషముతో సింహధ్వనులు గావించిరి. ధ్వజపటపవనావఘాతపాంసువగు పార్థునిస్యందనము ను సైన్యమునుం గనుఁగొని సూర్యసుతుఁడు ధనుష్టంకారము చేసి, యామహారథునిపైకి నీవు రథముం దోలుము నా కాతని మీఁదనే యున్నది, రాహుగ్రహము పుష్పవంతులను దక్క వే ఱొక్కరిని బట్టం బోదు. ఎవ్వరు నాకాబలగహనాంతరితుఁ డైన యర్జునుని జూపించెదరో వారికి గజతురగసమేతము సార్థము న గు నగరాజ్య మిచ్చెదను. నరకవైరి సారథి యగుపాండుసూనుఁ డు నాకంటఁ బడినయెడల వానిని నాబాణనాగమునకు యముఁ డు వచ్చి యడ్డుపడినను మానక భక్ష్యము గావించెదను. అనిన విని శల్యుఁడు, నీవు నీయంతరముం బరునియంతరము నెఱుంగ వు, నీవెక్కడ యర్జునుఁ డెక్కడ! నీవు సూతుఁడవు, నతఁడు చం ద్రవంశ్యుఁ డగురాజపుత్రుఁడును. విజయుఁడు త్రిక్క ఖాండవము ను గృశానున కర్పింపఁగలిగినవాఁడు గలఁడా! ద్రుపదరాజపుత్రి

యనుశ్శల్యమునఁ బులకించినదోర్యుగళమున నాతఁడుపరశురాముఁ డొ క్కింటి యెడల వాని యెదుట నిల్చువాఁ డెవ్వఁడు? భూలోకము లోనివా రెవ్వరయిన నిం్ద్రునితో నెదిరింపఁ గలవారు గల రా యితఁడు గాక. నీకుఁ బరశురాముఁడు గురువు. అతనికిఁ బరశు రామునికే కాక త్రిలోకములకు గురుఁడైన హరుఁడు గురుఁడు. అతఁడు తనకంటె మిన్నయై కొట్టినదెబ్బల కతనిని మెచ్చికొ న్నాఁడు. నీమిత్రుని గంధర్వులుకట్టి తీసికొని పోవుచుపుడు నీవేమి చేసితివో యర్జునుఁ డేమిచేసెనో తలంపునకుఁ దెచ్చికొనుము. ఉత్తరునితో గోగ్రహణమునవచ్చి మిమ్మందఱ్ని ద్రిప్పిపుచ్చుచేసిన, భీ ష్మాదులతోపాటు నీవు నోడలు మఱచి సుకేశస్త్రీవేషమైన వసి యున్నప్పటి నీమృత్యుప్రమాదమెట్లు తప్పినదో యూహించుకొ నుము. కుసుమాంగరాగములతో మణిపీఠములపై మృష్టాన్న ములతో నీవు నీతమ్ముఁడు బొర్జునకు సమర్పించుటకే పోషించి తివి. నీధ్వజపటము ప్రతీపవాతములచే నెదురు దిరుగుచున్నది. నీధ్వజయష్టి నిన్ను మరలించుటకుఁ బోలె వంగుచున్నది. నీతేరి గుఱ్ఱములు నీపాటునకుంబలెఁ గన్నుల నీరు వెట్టుచున్నవి. కావు న నతిబలోష్మచే నలరు శ్వేతవాహనునితోడి వైరమును మాను ము. సింగమును జంబుకము గాని సామజమును దోమ గాని ప రాభవింపఁగలవా! అని యిట్లు కఠినముగఁ బలుక మద్రేశ్వరు నివాక్యములు సమయమునుబట్టి సహించి, చాలుఁ జాలు, మాట లకేమి, నీవే యిపుడు నాబలమును బార్థునిబలమును జూచె దవు. తేరు పోనిమ్మని కర్ణుఁడు పలికెను. తరువాత రెండుసేనలు

ను విజృంభించినంతట భీమగజము విజితవీరకుల మను నెత్తురుకొలనిలో దిగి సుయోధనానుజపద్మషండముం బెకలింపఁదొడఁగెను.

ద్రౌపదీవేణీసంహారోత్సవమునకుఁ దగినయుద్ధమున రథగిరినుండి గుమికి సింహము మృగమును బట్టినట్లు దుశ్శాసనుని బట్టికొని రెండుబాహువులను కోలలనడుమునిఱికినవానింగాంచి, యింతకాలమునకు నీవునాబాహువులకతిథివైతివి, నీ వింక నేమి చేయుచున్నవురా, యను భీము, దుశ్శాసనుఁడు, "నోరి, సిగ్గు లేక యిపుడేమనుచున్నాఁడవు? నేను నీయాలినిబట్టి సభలోఁ బరాభవించినపుడు నీవు లేవా? వనములోనికి వైరులను గొట్టివైచిభూమి యంతయుఁ బాలించురాజునకు విరోధి కెదురువడి చచ్చినను నది వీరాధ్వరమే"యనుచుండ-వానిం బట్టికొని నేలంబెట్టి కొట్టి నరసింహునివలె వక్షము చీల్చెను. తనపంతమును గోపమును దీర్చుకొనుటకై యతనిరక్తమును హృదయపాత్రమునుండి దోయిటందీసి కడుపారఁ గ్రోలుచు నేను నాగలోకమునఁ బానము చేసిన దివ్యరసముకూడ నా కింతరుచి యనిపింపలే దని యఱచెను. దుస్ససేను నెత్తురు ద్రావను, నెమ్ములు నములను, మాంసముం దినను జేరిన భూతకోటి యంతయు దూరదూరముగఁ బఱవ వైరిరక్తచందనచర్చితోడి యెఱ్ఱనిదేహము కుసుకులము పైఁ గలక్రోధాగ్ని యాభీమునిదేహముం గౌఁగిలించుకొని యున్నట్లు తోఁప గద భుజమున వైచికొని రుధిరమధుపానముచే నెఱ్ఱవడిన కన్నులతో నేనుఁగులం జదుపుచు దేవతలకుఁ గూడ విస్మయముం గొలుపసాగెను.

అర్జునుఁ డప్పుడ క్కడఁ గర్ణకుమారుఁ డగువృషసేనునిం జంపిన కతంబున మఱింత రోష మెక్కి కర్ణుఁడు సమీపించిన నా పోరు దారుణ మయ్యెను. రణదేవతాకటాక్షముగల సాహసు లగునాప్పీరు లిరువురు నొకరిని మించినవా రొకరై విజయశం ఖములనుం బూరించుచు గాండీవముక్తములుఁ గాలపృష్ఠముక్తములు నగుబాణములచే గగనమును గప్పుచుఁ దమతమశరము లగఱులగాలికైనను నవ శము లేకుండ నాకాశముఁ గావించిరి. కోపము హెచ్చుటకై యచ్యుతుఁడు వెనుకటిమాట లుగ్గడించు చుండఁ గర్ణుఁడు మఱియును జెలరేఁగెను. ఇరువురును జిరిఁగిన బొందళములను విప్పి క్రొత్తవి తొడిగికొనుచు శరీరముల రుధిర ధారలు వెడలఁ—దిమిర, మిహిర, వహ్ని, వారివాహ, హరి, పన్నగ, పన్నగవైరి రూపము లగు నస్త్రములతో హరితతురగ సూనులు గొంతసేపు భీకరముగ దురము సలిపిరి. ఎవ్వరు గెల్చు కొందురో యెవ్వరి ప్రక్కకుఁ బోవలయునో నిశ్చయించుకొన లేక జయలక్ష్మి హృదములోని తరంగములపై నున్నయంచవలెఁ జలించెను. ఇదిగోఁ గర్ణుఁ డర్జునుని జంపెను. అదిగోఁ బార్థుఁడు రాధేయుని జంపె నని యాకసమున వైమానికులు చూచుచుం డిరి. కర్ణుఁడు పార్థప్రాణవాయువులను బీల్చుటకై యురగాస్త్ర ముం బ్రయోగించెను. విషవహ్నికీలలకంటె నెక్కుడుగా వెలుం గు శిరోమణితో నాఫణిశరము యమదండమువలె రాఁగా నమ రులు చూచి యాకులపడిరి. దానికిఁ దుర్యోధనాదులు తూర్య ములు మొరయించిరి. సింహనాదములు చేసిరి. విజయుని శిర

స్సునకు సూటిగా వచ్చునాయస్త్రముం గాంచి కృష్ణుఁడు రథము నుజక్రములు క్రుంగునట్లు క్రిందికి దిగఁద్రొక్కెను. ఆయమృతముఁ జేఁ బూర్వము కృతమత్సరుఁ డయిన శేషునిచే మేరుశృంగము హరింపఁబడినట్లు నాగాస్త్రముచేఁ బార్థునికిరీటము హరింపబడియెను. ఆకిరీటముతోఁ గూడ నేలఁబడి మరల లేచుచున్నయస్త్రముం జూచి కృష్ణునియానతిని దానిని శాత్రవగర్వమునుగూడ నధికతరశక్తిగల తీక్ష్ణాస్త్రముతో గాండివపాణి యడఁగించెను. కర్ణునిసాయకముచే గాండివము నల్లెత్రాఁడు తెగిన మరలఁ గ్రొత్తది కట్టుకొనుట తెలియరాకుండ నంతటివేగమున నాతఁడు పరఁగించిన బాణములచే నా రాధేయుని కేతుదండాగ్రమున నున్నహస్తికక్ష్య యుల్కాపాతమని స్వసైన్యము బెదరునట్లు పడియెను. సూర్యమండలమునుండి జాఱిన కిరణమువంటి యొక్క బాణమును దూణీరమునుండి తీసి కర్ణునిపై విడిచెను. కుపితకాలకటాక్షమునకు మిత్రమయిన యట్టిబాణమును బాణాసనమునఁ దొడిగి యేసినంతనె, యది, నిజసుతక్షేమ మరయవచ్చు సహస్రకిరణునివలెఁ గనఁబడియెను. ఆశరమునఁ గర్ణునితల తెగి భూమిపయిఁ బడియెను. ఆకబంధమునుండి యొకతేజము లేచి సూర్యునిలోఁ గలసిపోయెను. కిరీటములేని యర్జునునిశిరమున దేవతలు పూలవాన గురిసిరి. అంతట దివసావసాన మగుటయు యుద్ధము చాలించిరి.

(18) నీప్రియమిత్రము కర్ణుఁడు మరణించెను. నీ విపు డయిన యుధిష్ఠిరునితో సంధిచేసికొనుట మంచిది యని కృపా

చార్యుఁడు బోధించినను వినక సుయోధనుఁ డాయోధనమునకు మరలఁ గడంగెను. అశ్వత్థామ చెప్పినచొప్పున శల్యుని సేనాధిపతినిగా నభిషేకించెను. రెండుదండులును రణరంగమునకు వచ్చినవి. అమర్షమనుబలవద్వాయువుచేఁ గొట్టఁబడిన లేచి దిక్కుదిక్కులనుండి వచ్చువీరతరంగములు యుధిష్ఠిరసముద్రమునకుఁ జెలియఁ డనుతటంబును దాఁకి విఱిగిపోవుచుండెను. ధర్మరాజు శల్యుని మీఁదికి గదాపాణియై వచ్చెను. శల్యుఁడును దదనుగుణముగా గదం దాల్చెను. గదాకౌశలమున నియువురును గొంతసేపు పోరినపిమ్మటఁ బాండవాగ్రజునిచే శల్యుఁడు హతుఁ డయ్యెను. నాయకుఁడు గతించిన, నావికుఁడు లేనినావ గాలిలోఁ గొట్టుకొనునట్లు సంభవించు స్వసైన్యమునకు దుర్యోధనుఁడు ముందరయై నిలిచెను. సుశర్మను దద్బలమును నిశ్శేషముగావించిన పిమ్మట నకులసహదేవులు శకునితో నతిమశ్చక మగుసమరము నొనరించి హతుం జేసిరి. మహాసముద్రమువంటి కౌరవసేన క్రమక్రమముగా గంగానదివంటిదై చివరకు సన్నగిలి పల్వలప్రాయ మయ్యెను. అర్జునునిచే రథతురగసూతులువిఱిగినగురుపుత్రుఁడుఁ, కృపాచార్యుఁడుఁ, కృతవర్మయు విఱిగి దిక్కామొగములైరి. ఆఘోరము చాలక, చేయునది లేక, కురురా జొకమడుఁగులోఁ మునిఁగెను. అది, యింద్రునిచేఁ బర్వతము లన్నియు ఖండింపఁబడఁగా హిమవత్పుత్రుఁడు సముద్రమున డాఁగినట్లు కనఁబడియెను. పాండవులు దుర్యోధనుఁ డెందుండెనో యని వెదకఁ దొడఁగిరి. ఒక్క వాంశికుఁడు భీమునితో నాతఁడు డాఁగిన చోటును జెప్పెను. కనిన

యసుగులజాడయు వినినవార్తయును గదాపాణి యగుబకారిని సరస్తీరమునకుంగొనిపోయెను. ఘననిస్వనమున భీముఁడు నీటిలో నున్న రారాజునకు వినఁబడునట్లు, "నీతమ్ము లందఱు నాచే మడి సినఁ గోపమును దీవ్రబాణములచేఁ గాక కన్నీటితో శమింపఁ జేసికొనుచున్న వాఁడవా!" అనవుడునామానవంతుఁడు మసుఁగు వెడలి కాళిందీనదిలోనుండి కాళియోరగమువలె రోఁజుచు వచ్చి సరస్వతీతీర్థమునుండి వచ్చిన తనగురుఁ డగుబలరామునకు నమ స్కరించి భీమునితో గదాయుద్ధమునకుఁ దొడంగెను. వారిభ్రమ ణము, వారివిహారమును, వారిహుంకారమును సుభటజనైకదృ శ్యమై విబుధప్రస్తావనాంశ మయ్యెను. గదాయుగళ విఘట్టనల చేఁ బొడము ఘణంఘణ రావమును జకచ్చకితాగ్నికణకాంతియు రెండుపిడుగు లొం డొంటితోఁబోరుచున్న యట్లుండెను. ఎట్లెట్లు దుర్యోధనుఁడు తిరుగునో యట్టట్లు భీముఁడు తిరుగుచుండెను. సభలో భార్యను బరాభవించె ననుకోపము భీముని, రణము లోఁ దమ్ములను జంపె నను రోషము దుర్యోధనుని, నెంతకైనఁ దెచ్చినవి. ఒక్కదుముకు దుమికి గగనమునుండి భీమునిపై కుఱు కు దుర్యోధనునిశక్తియు భీముని యలఁతయుఁ గృష్ణుఁడు గాంచి తొడ చఱచిన నాసంజ్ఞ తెలిసికొని యాతని తొడలు విఱుగఁ గొట్టిన, ఱెక్కలు తెగినపక్షివలెఁ గురురాజు కూలి, గదాఘాత ముచే నడుమువిఱిగిన యురగరాజునోజ నుండెను. అశేషభూ వలయవిభుత్వమున కభిషేకింపఁబడిన యాతని శిరస్సును, నీరు లకు మ్రొక్కుట యెఱుఁగని శిరస్సును, భీముఁడు తనకాలం దన్నె

ను. గదాయుద్ధములో నూరుభంగ మనుచితము, మహారాజు
శిరంబును బదంబునఁ దాఁచుట యసమంజస మని భీమునిపైఁ
గోపించు బలరాముని యుద్రేకమును గృష్ణుఁడు శాంతింబొందిం
చెను. తర్వాత జయభేరి మ్రోగించుచు మిగిలినసేనలతోఁ బాం
డవులు శిబిరములు చేరిరి. చీఁకటి పడనిచ్చి, గురుపుత్రుఁడును
గృపాచార్యుఁడును గృతవర్మయును దుర్యోధనునికడకు వచ్చిరి.
సూర్యరథముమీఁదనుండి పడిన యనూరునివలె నేలఁబడు నత
నిం గాంచి పెదవులు వడఁకుచుండ నస్ఫుటాక్షరములతో నశ్వ
త్థామ, "రాజా, నీవు విచారింపకుము, నేను వీరిరువురు మహాయోధు
లును రెండుబాహువులుగాఁ బాండవశిబిరములఁ బ్రవేశించి యీ
రాత్రి విరోధినిధనము నొనరించెద" ననిన నంతట దుర్యోధనాను
మతమున మేనమామ తనయల్లుని మిగిలిన కురుసైన్యమున
నాయకునిఁగా నభిషేకించెను. నేను నిన్ను దర్శించి సైన్యసంహార
మైన దని చెప్పినపిమ్మట నీవు దివి నలంకరింతువు గాని వేచియుం
డుమని గురుకుమారుఁడు కురుకుమారు నాశ్వాసించి యచ్చట
నుండి కృపకృతవర్మలతోఁ బాండవశిబిరములవంక కరిగెను.

సూర్యుఁ డంతట దుర్యోధనుఁడు హ్రదములోఁ బడినట్లే
పశ్చిమాంబుధిలోఁ బడియెను. సూర్యకిరణములు, సైన్యములు
రణభూమిని విడిచి పోయినట్లే గగనమును విడిచి పోయినపిమ్మ
ట ధృతనవసాంధ్యరాగమైన పగలు ప్రతిదిక్కునను భృంగకాం
తులుగల చీఁకటిని నెత్తురుచేతులతోడి భీముఁడు ద్రౌపది కేశపాశ
ములను బంధించినట్లు బంధించెను. కుంతీనందనులున్న గుడారము

వంకకు గురుతనయుఁడు నడిచి పాండవులను జంపు తలంపుతో శివుని బ్రత్యక్షముచేసికొనఁగోరి యగ్నిజ్వాలలలోఁ దనధనుర్బాణముల వేల్వఁగా సన్నిధిసేసి యన్నందివాహనుఁ డొకకృపాణము నొసఁగి నమస్కరించినగురుతనయున కిట్లనియె. ఓయి! నీసాహసమునకు మెచ్చి దీని నిచ్చితిని. ఇది ప్రథితవిక్రము లగుపాండవులం దక్కఁ దక్కినవారినెల్ల వధించు నని చెప్పి తిరోహితుఁ డైన, దాని నాబ్రాహ్మణకుమారుఁడు మనోరథఫలమునువలెఁ జేకొనియెను. ఈరాత్రి యిక్కడఁ బాండవు లైదుగురునుండుటకూడదు, వీరికంటె వీరితనయులు చచ్చుట మే లని వారినిం దనతమ్మునిం దీసికొని వాసుదేవుఁడు వేఱొక్కతావునకుఁ బోయెను. తనయిరువురు సహకారులతో నశ్వత్థామ యందఱు నిద్రపోవుచున్నశిబిరములలోఁ బ్రవేశించెను. ఆయుర్దాయము లేనివారు గావుననే వారిని జగద్రక్షకుఁ డైననారాయణుఁడును, గాలభైరవుఁడు, విలయమునందు జగత్తు నుపేక్షించినట్లు లుపేక్షించెను. కావునఁ గృష్ణుఁడు నర్జునుఁడును ఖాండవదహనము గావించినట్లు గురుసుతుఁడు శిబిర మంతయు నంతము నొందించెను. ఆశివదత్త మైన కృపాణములం దాల్చినయాబ్రాహ్మణుఁడు సకలరాజకులక్షయము గావించుపరశురామునిం బోలెను. వేఁటకాఁడు గుహలోఁ దూఱి నిద్రించు మృగములను వెదకినట్లు గుడారములలోఁ జొచ్చి వైరులను వెదకఁ జొచ్చెను. ఓరీ గురుహంతకుఁడా, ద్రోహీ, నీకు దండధరుఁడను నేను వచ్చి నిలువఁగా నీకెట్లు సుఖనిద్ర యలవడును, లె మ్మని ధృష్టద్యుమ్ముని ఱొమ్ముపైఁ గ్రుమ్మి, నేను బ్రతికి

యుండ నీకు వైరశుద్ధి గలుగదు, నీకు శస్త్రముతోడి చావు తగ దని ధనుర్గుణముతో బిగించి ముష్టకత్తితోఁ గోసిన నల్లెల్లో వాని కంఠమును దెగఁగోసి సింహనాదము గావించిన నిశ్చయించువా రం దఱును సింహగర్జనముచే నడవిలో మృగములు కలఁగి లేఁగినట్లు లేచిరి. త్రిపురారి యానతిపై లేచిన వీరభద్రునికి బెదరి పఱవెత్తు దేవతలవలెఁ దలపాగయని కంచుకముం జుట్టుకొని ధనువని గదం బట్టుకొనియు రథమని యేనుఁగెక్కియు వచ్చి యెదిరించి వాని చే మడిసిరి. ఉపపాండవు లైదుగురును వచ్చి ద్విపక్షుల గ్రసన వ్యసనుఁ డైనగురుతనయాగ్ని కాహుతులైరి. చీఁకటిలోఁ గనఁ బడినవాని నెల్ల యుగాంతమున మహావరాహము సముద్రముల ను బుడ్డగించినట్లు తనశివప్రసాదకృపాణముచేతఁ గ్రుళ్ళగించివై చెను. శిఖండి లేచివచ్చి వివిధబాణములఁ బరఁగించిన నాగాం గేయపతనకారకుని గూడ గురుహంతకునివలె నిధనముగావించె ను. తప్పిజాఱి యశ్వత్థామకంటఁ బడకుండ ద్వారమునఁ బరు గెత్తి పోఁజూచు కొందఱను ద్వారపాలకులవలె నందుఁ గావలి యున్న కృపకృతవర్మలు ఖండించివైచిరి. అమ్ముగ్గురు వీరులును నరులు నిశ్శేషమైనపిమ్మటఁ గరితురగనికరమును బొడిచి కూల్చి నెత్తురువెల్లువలు పాఱించిరి. ఇంక నాశిబిరములలో సంచరించు పిశితాశములైన పిశాచములు తప్ప నితరులు లేరని నిశ్చయమై నపిమ్మట హ్రదసమీపమునకు వచ్చి వ్యథాయుతుఁడై పడియు న్న దుర్యోధనునకు సకలమును విన్నవించిరి. ఓమహాదర్పులార! మీరు నాకుఁ గావించిన మేలు గురుపితామహులైనను గావిం

పలేను. ఇఁక మీరు విశ్రమింపుఁ డని వారిని దనప్రాణములను గూడఁ బంపివైచెను. బహువిధముల స్త్రీలేడ్చుచున్న హాస్తినాపురమునకుఁ గృపాచార్యుఁడును, హార్దికనందనుఁడు ద్వారకకును, గురుపుత్రుఁడు వ్యాసతపోవనమునకును వెడలి పోయిరి. ఆనుగ్రరుమహారథులచరిత్రమునకునుసాక్షిణియుఁ బాండవబలమునకుఁ గాళరాత్రయు నైనరాత్రి రణక్రతువు ముగించి యవభృథస్నానముచేయఁబోయినదానివలెఁ గడచిపోయెను. ఉదయమున ధృష్టద్యుమ్నుని సారథి వలనఁ గడచిన వృత్తాంతమును విని విధిఁ గడవఁగా దని ధర్మరాజుం దమ్ములును దుఃఖించిరి. ద్రౌపది యేడ్చుచు శిబిరముం బ్రవేశించి యన్నలుం దనయులు బంధువులు గల యది యైరావణముచేఁ ద్రొక్కఁబడిన నందనమువలె నున్నం గాంచి మూర్ఛిల్లి వ్యజనవాయువులచే సేదదేఱి ఱొమ్ము మోఁదికొని కన్నీరు దుడిచికొనుచు భీమునితో, "నాథా! నా బిడ్డలను జంపిన వైరి జీవించియుండఁగా నీ వెట్లుపేక్షించితివి! ఆకఠినుని శిరోమణిం దెచ్చినం గాని నేను నిరశనవ్రతముం బూని మరణించెదను. అనిన విని యతఁడు గురుసుతుఁ డున్నవనమునకు నకులుఁడు సారథి యైన రథ మెక్కి పయన మయ్యెను. ఆ వెనుక నే మేమి జరగునో యని తల్లడిల్లుచున్న దమ్ములుఁ గృష్ణుఁడును వెంబడించిరి. వలదు వలదు, కృద్ధుఁడైన గురుసుతుం జెనక వల దని యెంత వారించినను వినక యాశ్రమముం బ్రవేశించి కుశచీరధారియై ప్రళయముం గావించి శాంతిం బొందిన యగ్ని వలె నున్న యశ్వత్థామను భీముఁడు గాంచెను. వేగవంతుఁడై

వచ్చిన భీమసేనుని పరుషవాక్యములు విని 'భువి యపాండవ మగుం గాక' యని యతఁ డొకయస్త్రము మంత్రించి ప్రయోగించెను. దాని ప్రతాప మెఱిఁగిన మురాంతకుఁడు దానిపై నర్జునునిచే బ్రహ్మశిరోనామకాస్త్రముం బ్రయోగింపించెను. ఆఘోరముం గాంచి నారదుఁడును, వ్యాసుఁడును వచ్చి యస్త్రద్వయమునకు నడుమ మత్తేభములవలె నిలిచిరి. వారిం గనుంగొని గాండీవి తనయస్త్రమును శాంతింపఁజేసెను. మహాత్ముల యాజ్ఞను సజ్జను లతిక్రమింపఁ జాలరుగదా! ద్రౌణి నారదపారాశరసూనులయాజ్ఞపైఁ బంచపాండవులను విడిచి యుత్తరాగర్భమందున్నయర్భకుని మాత్రము ద్రుంపు మని దానిని దత్తాలమునకు నిల్పివైచెను. శ్రీకృష్ణుఁడు నీవు చంపినబిడ్డను నేను బ్రదికించెదను, గాని, భ్రూణఘ్నుఁడవగు నీకు శూన్యకాంతారములు నివాసయోగ్యము లగుంగాక యని యొక్కశాపము నిచ్చెను. ఆశాపాక్షరములచే నుపశమిల్లిన యాతని శిరోమణిని మారుతపుత్త్రుఁడు మొఱరించి మహానాగము శిరస్సునందలి రత్నమును మాంత్రికుఁడు గ్రహించినట్లు తీసికొని యాయస్త్రదక్షులు, యాదవవల్లభుఁడు గూడరా శిబిరములకుఁ దిరిగి వచ్చి పాంచాలిదుఃఖమును బోఁగొట్టిరి.

(19) పుత్త్రులుఁ బౌత్త్రులు బాంధవులు నిశ్శేషముగ హతులయి రని విని దుఃఖించుచున్న ధృతరాష్ట్రుని గాంధారిని, వ్యాసుఁడును విదురుఁడును దత్తదుచితవచనములచే నోదార్చిరి. రణాంగణమునం బడి యున్నవారిం గాంచుటకై స్త్రీ లెల్లరు గొల్లున

నేడ్చుచు బైలువెడలిరి. తలలువిరియఁబోసికొని యేడ్చుచు వివిధగతుల సతులు గాంధారిని నడుమ నిడికొని సమరతలముం జొచ్చి వీణావాదనము ననుకరించు కరుణాపూరితము లగురోదనములతో దిక్కులు నిండించిరి. హానాథ! హామామ! హాతండ్రీ! హాయన్న! హాపుత్ర! యనుప్రలాపములతో, నురస్తాడనములచేఁ గాశ్మీరపంకలగ్నమైన ట్లెఱ్ఱవాఱిన హస్తములతోఁ, గాటుక పుడిచికొనిపోయిన తెల్లనివేఁడికన్నీటితో బహువిధముల విలపించిరి. ఆసమయమునకుఁ బాండవులు పెద్దతండ్రిని దర్శించుటకు వచ్చిరి. ఓధర్మరాజ! ఓయజాతశత్రూ! బంధువు లందఱిను జంపి చేకొన్న రాజ్యమునలన నీకు ఫలమేమి? అని యాతనిం గాంచి మగువ లాదఱు వగనంజొచ్చిరి. ఆమాటలు వినుచు నెల్లగఁ బ్రక్క నొక్కసుతుఁడును లేని ధృతరాష్ట్రుని జేరి కొమ్మలు విఱిగిన మ్రానువలె నున్న వానిని దమతమ పేరులు చెప్పుకొనుచుఁ బాండవులు సాష్టాంగముగాఁ బడి మ్రొక్కిరి. మొదట ధర్మజుని కౌఁగిలించుకొని, భీముఁ డేఁడీ యని కొడుకులఁ జంపినాఁ డనుక్రోధమునఁ బిలిచిన నన్న కృష్ణుఁ డెఱిఁగి వానికి బదులుగ నినుపభీముని దగ్గఱఁ బెట్టిన నది భీముఁడే యనుకొని ప్రేమమునిమగా గాఢాలింగనముచేసి ధృతరాష్ట్రుఁడు భగ్నముగావించి, హాభీమసేన! యని యేడ్చిన వృద్ధరాజునకుఁ గృష్ణుఁడు- "వలదు, విచారింపకుము, నీచేఁ బడినది ప్రతిమ గాని భీముఁడు గాఁడు. నీతలం పెఱిఁగియే నే నిట్లు పన్నితి" నని చెప్పిన విని సంతసించి తక్కినమువ్వురను మరల భీమునిం గౌఁగిలించుకొని

యన్నలార! గాంధారిని దర్శింపుఁ డని యాజ్ఞాపించెను. పలువురు కోడండ్ర నడుమ నార్తనాదము చేయుచున్న యమ్మహారాజ్ఞికడకుఁ జని మ్రొక్కినఁ, జక్రబృందము చుట్టుకొనియుండిన దివసానసానమునందలి నలినివలె నున్న యాగాంధారి కోపముచే శాపమిచ్చు నని యెఱిఁగి వ్యాసుఁడును వచ్చెను. ఆమెకంటె ముందుగనే ధర్మరాజు, తల్లీ! నూర్గురుతనూజులం జంపుకొన్న యీపాపాత్మురుఁడు నీయెదుట నున్నాఁడు, వీనిని యథోచితముగ శపియింపు మని చేతులు మోడ్చి, వడఁకుచు విన్నవించెను. దానితోఁ గోపము శాంతించినఁ బ్రణామము చేసి శోకప్రమోదములతోడి యామెమోమును యుధిష్ఠిరుఁడు గ్రహణములు పట్టువిడిచిన సూర్యచంద్రులవంటిదానిం గాంచెను. అనంతర మాపతివ్రత ధర్మజాదులను కౌఁగిలించుకొని శస్త్రాస్త్రవ్రణములు గల వారిమేనులు కరపల్లవమున నిమిరెను. ఆర్తప్రలాపములతోడి వక్త్రములును గన్నీటిధారలు గారు నేత్రములును గల దుర్యోధనాదులభార్యల మోములం గాంచి భీమసేనుఁ డానగించెను. అంతట మెల్లగ ధర్మరాజు ధృతరాష్ట్రుని దీసికొని విరోధి రాజపశువులకు సూనరియిల్లయిన ఘోరరణభూమిలోనికి వచ్చెను. గృహాంగణములోని పుష్పములను గోయుటకే నడువఁ దొట్రుపడు రాజరమణులు శరకంటకావృతమైన రణాంగణములోఁ దమవారిని వెదకుటకుఁ గడంగిరి. యుద్ధమునకై బైలుదేఱుచున్నప్పుడు తనచే నిడఁబడిన నఖక్షతములను బట్టి నిరంతరశరవ్రణక్షతవక్షుఁడగు తననాథునొక్క రమణీమణి గుఱుతుపట్టెను.

నఱకఁబడిన తల కంకాళములచేఁ దినివేయఁబడిన వట్టియట్టను గే యూరపుమీఁదఁ జెక్కఁబడిన నామమునుబట్టి తనపతి యని యొక్కసతి గుఱుతు గనుఁగొనియెను. ఒక్కముగ్ధ నాయకునిచేయి యొక్కటి నక్క కొఱకి తీసికొనపోయినఁ బ్రక్కంబడిన యేనుఁగు తొండమును వానిచేయియనుకొని యతుకఁదొడఁగెను. వేఱొకనారి తనకాంతుఁడు మదగజమురెండుకొమ్ములనడుమను గ్రుచ్చుకొన్ననుఁ గత్తిచే దానికుంభములం బొడిచినంతటఁ బొడమిన ముత్తెములచేరుచే నలంకరింపఁబడిన కంఠముగలవానింగాఁ గాంచి యానందించెను. కృష్ణునిచే నొసఁగఁబడిన దివ్యదృష్టిగల గాంధారి ఘోరమగునారణభూమిని జూచి సమీపమున నున్న యా వాసుదేవునితో ని ట్లనియెను. చూడుము పంకజనాభా! యీ యిరావంతుఁడు భీష్మునిచేఁ జంపఁబడి యధోముఖుఁడై మరలఁ బాతాళగర్భమును జొచ్చువానివలె నున్నాఁడు. యదునాథ! చూడుము, శస్త్రాస్త్రశిఖాకలాపముచే విరోధిసేనావిపినమును గాలిచిన యీశాంతనవకృశానుఁడు శాంతించి సుయోధనుఁడు తెచ్చిన నీరుం ద్రావకపార్థాస్త్రముచేఁబొడమినయుదకముం ద్రావి శరతల్పమున సుఖముగా బాణోపధానముననిద్రించుచున్నాఁడు. ఈపౌండ్రకుని భార్యలం గనుము, వాఁడికత్తులచేఁ దెగిన వాని నఖములను సీమంతశూన్యము లగు తమతలలపై బెట్టుకొనుచున్నారు. ఈకాళింగుఁడు గజస్కంధగతుఁడు కాఁగా నాతనికాంత యతని నాలింగనము చేసికొనుచున్నది. ఈకాశీరాజుతల నొక్కపిశాచము కేళికందుకముగా నాడుచుండఁ గాంచిన యతనిసతుల

కు మఱింతదుఃఖము గలుగుచున్నది. ఈ యేనుఁగుమీఁదనుండి పడి పోయిన మగధరాజును వెదకుచున్న యాతనికాంత యొక్కసారి కనఁబడి యొక్కసారి కనఁబడక మేఘములలోని మెఱుపువలె నున్న ది. పరాసుఁ డయ్యు నింకను నొప్పుచెడని యీలక్ష్మణకుమారు నిముఖము గ్రద్దలచే సగము పొడిచి తినఁబడినను జాంబూనద యమ ష్టమినాఁటిచంద్రునిచూపుచున్నది. వక్షమున నున్నకొనియ ను మును గష్టమున నూడఁబెఱికి నీమేనల్లు నీయుత్తర మున్నాను చు న్నది చూచితివా ! అర్జునునిచే ఖండింపఁబడిన బాహుశాఖలు గల యీవిందానువిందులు పూర్వము శైశవమున నీచేఁబడఁగొ ట్టఁబడిన యమలార్జునములవలె నున్నారు. ఈభూరిశ్రవసుని భా ర్యలు చచ్చియు విడువని వానిచేతిఖడ్గమునుబుచ్చి యొక్కతె వానిహస్తమును గుండెలపైఁ బెట్టుకొనుచున్నది. ఈనాకూఁతు రు దుశ్శల తనపెనిమిటితలం గానక తాళఫలములవంటియితరుల తలలం దెచ్చి యిదిగో దిదిగో దని యేఱిపైచుచున్నది. ఈహిం డింబ తనకుమారుని గాంచి నిమీలితాక్షియై మూర్ఛిలి పిశాచ కాంతలు నెత్తురుచల్లి యేనుఁగుచెవివిసనకఱ్ఱలతో విసరిన దేఱు చున్నది. ఇరువురకును దలలునరసి యున్నవిగావున విరాటద్రుప దుల తలలను వారియంగనలు తెలిసికొనలేక కబంధములతో వ్యత్యస్తముగా నదుకుచున్నారు. ధర్మజాదులచేఁ బూజింపఁబడి శిరములం దాల్పఁబడిన యీగురునిపాదములను జంబుకములు లాగుచున్నవి. ఇట్టివానితలయును బరులచే స్పృశింపఁబడుటయా తని సిగ్గుచే బలెఁ గన్నులు మూసికొని యశ్రుధారలచేఁ గృపి

యాబ్రాహ్మణునిముఃశిరస్సును శుద్ధిచేయుటకుబలెఁ గడుగుచున్నది. భీమునిచేఁ బీల్పఁబడిన దుశ్శాసనుని యొమ్మునుండి యింకను నాహారుఁడు త్రావఁగా మిగిలినరక్త మూరుచున్నది. ద్రుపదనందన కేశములను బట్టిలాగిన యాదుర్వినీతునిచేతులు పాండవహితముం జేయువానివలెనె రాబందులు కొఱికికి యీడ్చుకొనిపోవుచున్నవి. ఎవనిని దలఁచుకొని పనుమూఁడేఁడు లజాతశత్రుఁడు నిద్రపోకుండ బెదరుచుండెనో యాకర్ణుఁడు కొట్టఁబడి పడియున్నాఁడు. కను మీావృషసేనమాత తనయుంకతలమున నతనిశిరస్సునుంచికొనివణఁకుచున్న యంగుళులతో ధూళి తుడుచుచున్నది. గృహమయూరములను గ్రీడామృగములను దోలుటకెఁ బెదరుచుండెడు నాయీకోడలు తనపతిమేనుం దినుచున్న నక్కలను దోలుచున్నది. వీఁడె సుపర్వముక్త సుమవర్షములోఁ బ్రియురాలివలె భూమినిగౌఁగిలించుకొని సరస్తీరమున దుర్యోధనుఁడు పడియున్నాఁడు. పూర్వము వీనియెదుట బద్ధాంజలులై రాజులు చాటువాక్యములం బలుకుచుండెడివారు. ఇప్పుడు సృగాలసంతతి దర్పముగా నఱచుచున్నది. ఏడ్చియేడ్చి ధైర్యముం దెచ్చికొని భానుమతి యాతనిశిరస్సును దొడపైఁ బెట్టుకొని చేలాంచలమున విసరుచున్నది. ఇన్నిదుఃఖవిషయములను గాంచుచున్న నాహృదయమును బద్మభవుఁడు వజ్రసారమును గావించినాఁడు, లేకున్న వేయితునుకలు గాకుండునా! నీ వుపేక్షించుటచేతనే యిట్టియన్యోన్యవైరములచేఁ గౌరవపాండవులకు ఘోరమగు రణముజరగినది. కావున, నీయాదవులు నీరీతినే యందఱు

ను నిహతులయ్యెదరని కృష్ణుని శపియించి గాంధారి యుపశాంతిం బొం
డెను. ఆపురుషోత్తముఁడు భూభారావతరణమునకై పుట్టినవాఁ
డు గావున నామెశాపమును బ్రసాదముగానే తలంచెను.

శ్రీకృష్ణునిచే నాజ్ఞాపింపఁబడిన ధర్మజుఁడు బ్రాహ్మణుల
సహాయమునఁ జందనాగురుకాష్ఠములు సంగ్రహించి మృతుల
కగ్నిసంస్కారములు గావించెను. రాజులయంగములన్నియు న
గ్నిజ్వాలలలో దగ్ధములయినపిమ్మట ధృతరాష్ట్రుని గూర్చి గం
గానది కెల్లరును స్నానములకుం జనిరి. సన్ననికంఠములతో నే
డ్చుచు గంగాతటమునకుం జను స్త్రీల లక్షోపలక్షలు గల పావ
ములచే భూమి మరల రక్తార్ద్రమైన రణభూమివలెఁ దోఁచెను.
భీష్ముఁడు మరణించె ననుదుఃఖాతిశయమున నేడ్చుచు గంగ
నను నయించుటకుం బలె భారతవంశధుర్యులు స్త్రీపురుషులు పై
లుదేఱిరి. స్నానముచేయుటను దిగిన స్త్రీల కబరీభారములచే గం
గానది కాళిందీనదివలె నపుడయ్యెను. మృతిచెందినవారికిం బర
లోకక్రియ లొనరించి నివాపాంజలు లిచ్చుసమయమునఁ గుంతి
కర్ణుఁడును మీయన్నయే, వానికిని జలాంజలి విడువు మని ధర్మ
రాజునకుఁ జెప్పెను. బాంధవులకు యథావిధిగా విభవానుకూ
లముగఁ గ్రియాకలాపము నడపి చంద్రవంశ్యులచేఁ బాలింపఁ
బడుచున్న హాస్తినాపురమున కందఱును మరలివచ్చిరి. పిమ్మట
ధౌమ్యుఁడు పయోధులనుండి సువర్ణకలశములతో జలముం దె
ప్పించి ధర్మరాజునకఖిలరాజ్యపట్టాభిషేకమును గావించెను. తరు
వాత శరతల్పశాయి యగు శాంతనవునికడకుఁ జనినంతట వా

రిలో నున్న శ్రీకృష్ణుని దర్శించినంతట నాతఁ డుపశమితనారాచ పీఁడ్లై ప్రక్కనున్న యజాతశత్రునితో ని ట్లనియెను. "ఆర్య, నీకు, నీభుజంగరాజోపమ బాహువునకు జయమగుంగాక! ఈభూభారనిస్తారకుఁ డయిననారాయణునిదయ నీ కీగౌరవముం దెచ్చినది. భీముని ప్రతిజ్ఞయు నిర్విఘ్నముగఁ జక్కనిచ్చానికాఁకునడుపు నోడ సముద్రము నొడ్డెక్కుచేసినో యట్లే యొడ్డెక్కినది. ఉత్తటజ్యాతటిను గ్రఘోషముయి శరవర్షముం గురిసి నిపాతితకృపాణాశనులు గల యీగాండీవిమేఘము శాంతించినది. ఈకోడలి శుభకరములయిన చికురములయందు యమునాప్రవాహమున గంగోర్మికలు కలసినట్లు మాల్యము లలంకరింపఁబడినవి." అనిపఁ బితామహునివాక్యములను ధర్మసుతుఁడు, తాత! యీమాయభివృద్ధియు విజయము సంతయు మీయాశీర్వాదమునకు వివర్తమే గదాయనియెను. "భూదేవివంటి యీపాంచాలపుత్రియందు మీరైదుగురును సుఖభోగముల ననుభవింపుఁడు. మీనిమిత్తమై యేయేరాజులు తృణప్రాయముగ రణమునఁ బ్రాణము లర్పించిరో వారిపుత్రులకు రాజ్యములు నిలిపి కృతజ్ఞులలో నగ్రగణ్యులు గండు. ధర్మజా! నీవు సమస్తుఁడవైనను, నీమంత్రులతోఁ గలసియే వ్యవహారము చేయుచుండుము. శేషుఁడు భూవహానసమర్థుఁడయినను దిగ్గజములతోఁగూడఁ దా నొకబుజము వైచుచున్నాఁడు గదా! ఒకదాని నొకటి మించి వృద్ధినొందుచుండు ధర్మార్థముల తోఁ గామము నొక్కపుడును జేరనీయకుము. వృక్షములు తమ తమ కాలములయందె కాయలు కాచును, అట్లే మేఘములును

జలముం గురియుచుండును. నీవును స్వధాసంతర్పణము చేయుటలో
సమయ మెఱింగి చేయుచుండుము. దానాంబురాశి నుదయించి-
న సుకృతచంద్రబింబమును రాజ్యలక్ష్మితోడ నామోదింపఁజేయుము.
అధ్వరధూమములు సర్వదిక్కులనువ్యాపించి రాజునకుఁ గీర్తియశ-
స్సును జిత్రవర్ణములుగలదానినిగాఁ జేయుచుండవలెను." అని
సురనదీసూనుఁడు బోధించినఁ బ్రసాదంబుగ యుపదేశములను స్వీ-
కరించి ధర్మజుఁడు హస్తినాపురమునకు వచ్చి పిమ్మట దక్షిణాయ-
నము గడచి యుత్తరాయణము ప్రవేశింపఁగనే భీష్ముఁడు దేహ-
ముం జాలించెను. ఎదురుచూచుచున్న యున్నతగగనసుపర్వులఁ
గలసికొనియెను. స్వజనకు దూరమును, స్వమనమునకు భాగ్య-
మును, విజయశీలమునైన యామహాపురుషుని దేహము నగ్నికి
విషయముగావించి శమితాశ్రువృష్టియై యూర్ధ్వదైహికములు శ్రద్ధతోఁ
జొనరించెను. ఉత్తరగర్భమునుండి గురుపుత్రాస్త్రాగ్నిచేఁ జచ్చి
పుట్టిన పరీక్షితుని గాంచి సుభద్ర నామనుమఁడు మృతుఁడ-
య్యె నని యేడ్చుచున్న, శ్రీకృష్ణభగవానుఁడు, సాయంకాలపద్మి-
ని ఖేదము నుదయభానుఁడు శమింపఁజేసినట్లు బాలుని బ్రదికిం-
చి యామెఖేదము నుడిగించెను. అభిమన్యుపుత్రుఁడు వర్ధమానుఁ-
డగుచుండఁగా ధర్మరా జశ్వమేధమునకై గాండీవిసహాయముగ న-
శ్వమును విడిచెను. సముద్రము చుట్టునారియున్న భూమినెల్ల నె-
క్కడఁగాంచినను దదశ్వఖురరేఖలు గనఁబడిన నవి యనన్యసా-
ధారణభోగమునకుఁ జిహ్నములుగా భూపతు లిడిన నఖక్షతము-
లవలెఁ గనఁబడియెను. మార్గములో నర్జునుఁడు బభ్రువాహను

నితోఁ బోరుటలో మోహమునొంది యులూపిచే లబ్ధసంజ్ఞుఁడై తానొనర్చిన తీర్థయాత్రలకు ఫలము సమకూడిన దని యభినందించుచు గుఱ్ఱముతో స్వపురమునకు వచ్చెను. విధివంతముగా నశ్వమేధమును బూర్తిచేసి యవభృథస్నానము గావించినధర్మరాజునను జ్ఞ వడసి సకలమునిజనసమేతుఁడై శ్రీకృష్ణుఁడు నిజరథముపైఁ దనపురమునకు వేంచేసెను.

(20) అనంతరము స్వశౌర్యముచే నార్జింపఁబడిన శ్వేతాతపత్రచ్ఛాయవంటి యష్టాదశద్వీపవృతమైన భూమి ధర్మరాజును విడువదయ్యెను. ఇంకను గిరీటమును శిరమునఁ బెట్టిన మోహఁజాలని రాజకుమారులు బంధువులప్రేరణపై ధర్మజునకుఁ జేతులెత్తి మ్రొక్కిరి. యుధిష్ఠిరుఁడు తాను సమర్థుఁడయ్యును బెద్దతండ్రిని రాజ్యాధికారినిగా నియమించి యాతనియాదేశమునఁ జాతుర్వర్ణ్యమును ధర్మానురోధముగఁ బాలించెను. అజాతశత్రుఁడును సత్యవాదియు నగుధర్మతనయుని శుశ్రూషచే వృద్ధుఁ డయిన ధృతరాష్ట్రుఁడు నూర్గురుపుత్రులమరణమును మఱచిపోయెను. అన్నగారి ననుసరించి యొక్క భీముఁడు దప్పఁ దక్కినతమ్ములు నవరోధజనమును ధృతరాష్ట్రుని వైరముమాటను మఱచి వానిని సేవించిరి. భీముఁడు నిత్యమును "గర్వయుతులైన ధార్తరాష్ట్రులు దేనిచేతవిలయమునొందిరో యట్టియీనాబాహుయుగ్మమునకుఁ గంకణములు నుంగరములును దొడిగి పూజింపవలయును. వస్త్రములను విప్పినదుశ్శాసనుని వక్షఃపాటనము గావించి విస్రగంధమగు రక్తపానమును నావక్త్రముచేసినది. కావున స్వచ్ఛకీర్తివంటి

పులకండమును దానికందింపవలయును. రెండు [illegible] పుడమిపైఁ బడిన దుర్యోధనుని శిరస్సును దన్నిన నా[illegible]లికి నొప్పి పోవున ట్లింకఁ జందనపంకచర్చ గావించెదను." అనుచుండ వృద్ధదంపతులు వినుచుండియు నగ్నిగర్భమైన వృక్షముల వలె లోలోనఁ దుఃఖము నడంచుకొని యుండిరి. భీముని మొత్తి పోటుమాటలును ధర్మజు భక్తిపూరితసపర్యలును [illegible]మున రెండయును వెన్నెలయురువలెనుండెను. ఎంతగాఁ బె[illegible]డుకు పూజించుచు బతిమాలుచున్నను వారి [illegible] విడువలేదు. సత్పురుషులకు సమయానుకూలకార్యము విడువఁదగినది కాదు గదా? శుభముహూర్తమున వనమునకు సభార్యుఁడై భవనమునుండి ధృతరాష్ట్రుఁడు వెడలి, [illegible]లను బాండవులను బురమునకు మరలించి, విదురసంజయులు సహాయులుగా నంటఁ గడపుచుండెను. లబ్ధరాజ్యలయిన పుత్రులనుగూడ విడిచిపెట్టి కుంతియును వారితోడఁ గాననమునకుం జనియెను. అంబికేయుఁడు గంగాతటమున బహువిధోగదీర్ఘ మైన యారాత్రి గడపి యక్కడనుండి కురుక్షేత్రమున కుత్తరముగా నడిచెను. మార్గమధ్యమునఁ దాపసబృందసంకులము నపోషవ్యసనప్రసంగము నగు శతయూపుఁ డను ఋషియాశ్రమమునకు వచ్చెను. అక్కడ జటాచ్ఛల్లములను దాల్చి తానును గాంధారియుఁ గుంతియుఁ జిరకాలము తపస్సుచేసి రాజర్షి నామము సంపాదించుకొని దురాపమయిన తపంబున వన్యమృగంబులతో సఖ్యము గావించెను. అంతఃపురసహితుఁ డైనధర్మరాజు వారిం

గాంచుటకయి వనములోనికి వచ్చి తత్పర్ణశాలకు సమీపమున నొక్కమాసము నివాసముచేసెను. ఒక్కనాఁడు దిగంబరుఁడై ధరాపరాగదిగ్ధాంగుఁడై మృగములకొమ్ములచే గోఁకబడుచున్న శరీరముగల విదురుని దర్శించెను. అతఁడును మృగమువలెనే ధర్మజుని జూచి వానితోపాటు పరుగెత్తుచుండ, నార్య నేను యుధిష్ఠిరుఁడను, అజాతశత్రుఁడనని పేరుచెప్పుకొనుచు నతఁడు వానివెంటఁబడియెను. వానియెదుట నిలువఁబడి విదురుఁడు ప్రాణములను యోగబలముచే విడిచెను. ఆకళేబరములోనుండి యొకకళవచ్చి ధర్మజునిలోఁ బ్రవేశించెను. ఆశవమునకుఁ బాండవాగ్రజుఁ డగ్ని సంస్కారముచేయ నుండఁగా వల దని గగనవాణి నివారించెను. ఈచిత్రవార్త పర్ణశాలకు వచ్చి పెద్దతండ్రితో నతఁడు చెప్పెను. వ్యాసుఁడు వచ్చి, యంజలి యొసఁగినధృతరాష్ట్రుని మేను నిమురుచు, రాజర్షివర! నాగాయుతబలుఁడవు, తపస్సుచేతనా, తపోవిఘ్నముచేతనా కృశించుచున్నాఁడవు. నాతోఁజెప్పుము. నీకహితులున్న వారిని శపించెదను. అనిన వ్యాసునిభావము నెఱిఁగి "మహాత్మా! యీనీకోడలు నేనెంత యూశ్వాసించినను బుత్రశోకమునఁ గృశించుచునే యుండును. అది సింధువును బడబానలమువలె మమ్ముఁ గృశింపఁజేయుచున్నది. జపము చేయునపుడైనఁ దనపుత్రశతమునామములనే పల్కుచుండును. ధ్యానమునను వారియాననములనే ధ్యానించుచుండును. దేవా! యొక్కనిమేషమాత్రము మాపుత్రులదర్శనము మాకబ్బఁ జేయుము. గురువు, బంధువు నీకంటె మాకన్యులు లేరు." అనిన ధృతరాష్ట్రుని ప్రార్థన

మును విని యమ్మహర్షి మీరు భాగీరథీతీరమునకు రండు. నేను నక్కడకు నీముద్దుసూనులను, మఱితక్కిన మృతబాంధవులను దీసికొనివచ్చెద నని చెప్పిపోయెను. ధృతరాష్ట్రుఁడు సపరివారుఁడై యక్కడకు నడిచెను. ఆదివ్యతపస్వి మఱునాఁడు వచ్చి నదిలో దిగి మునిఁగి లేచి, యుద్ధమునఁ మరణించినవారి నందఱను రం డని పిలిచెను. ఆగంగానదిలోనుండి భయంకరమైన పెద్ద ధ్వని పుట్టెను. వెల్లగొడుగులతో నుఱుఁగువలెను, సన్నాహములతో నల్లకలువలవలెను గంగ కలంకారముగాఁ బదునెనిమిది యక్షౌహిణులబలమును బైకివచ్చెను. అక్కడఁ గనఁబడిన వారి కొకరితో నొకరికిఁ గలపూర్వవైరము నుడిగి పోయినది. వ్యాస ప్రసాదముచే దివ్యదృష్టి గలిగిన యాగాంధారియు ధృతరాష్ట్రుఁడును దమపుత్రమిత్రబాంధవులను గనుఁగొని సంతసము నొందిరి. ఆరాత్రి వారందఱును దమతమతల్లిదండ్రులతోను సంతానముతోను భార్యలతోను సంతోషముగాఁ గడపి తెల్లవాఱునప్పటి కెక్కడివార లక్కడికి బంధువులతోఁగలసి భాగీరథిలో నీరగడులు కలసినట్లు కలసికొనిపోయిరి. వ్యాసుఁడును వారిశోకమును వారించి యంతర్హితుఁడైన పిమ్మట వృద్ధరాజదంపతులు వనాంతరమునకుం జని యుండొకనాఁడు దావాగ్నిచేఁ గాల్పఁబడిరి. తనతల్లిదండ్రులందఱును వనవహ్నికాహుతులైరని మునులవలన ధర్మరాజు విని దుఃఖించి వారికి యథావిధిగాఁ బితృక్రియలొనర్చెను.

ఒక్కనాఁడుద్వారకకుఁ గౌశికనారదాదు లయిన ఋషులు కృష్ణదర్శనమునకు వచ్చిరి. యుయుధానాదు లగు యాదవబా

లురు సాంబునికి స్త్రీవేషమువేసి వారికి మ్రొక్కించి త్రికాలవే దు లగుమీ రీబభ్రునిపత్ని యేబిడ్డను బ్రసవించునో చెప్పుఁ డని యడిగిరి. అది వారిని గేలిచేయుటగా నెఱిఁగి "యీకన్య యొక ముసలమును బ్రసవించును. అది యాదవకులము నంతము చే యు" నని చెప్పిరి. ఈరీతిగా శపించి ఋషు లంతర్ధానము నొందిన పిదప సాంబునికిఁ బెద్దయయోదండము పుట్టెను. భయపడి కొం దఱావార్త కృష్ణునకుం దెలిపిరి. ఇది సమయమునకుఁ దగినట్లు కలిగినది. దీని నీశ్వరుఁడును వారింపలేఁ డని కృష్ణుఁడు ముసల మును జూర్ణముచేయించి యబ్ధిలోఁ గలిపించెను. నిజోపద్రవ శంకితుఁడై యదుపతి యట్లుచేయించినను, దరంగవశమున నా క్షోదము దరికిఁజేరి తుంగయై మొలచినది. అయ్యుఁగఁదీసి విడిచిన చిన్నయినుపముక్క వలలోఁ దగుల్కొనిన యొకచేఁపకడుపులో నొక్కనికిదొరకెను. ఆతఁడు దానిని దనబాణము ములికిగాఁ జే యించుకొనియెను. తనయొద్దనున్న యాయుధము లన్నియు దివ మున కెగిరిపోయినంతటఁ గృష్ణుఁడు యాదవులను బ్రభాసోత్స వమునకు రమ్మని వారిధితీరమునకుఁ బిలిపించెను. నిఖిలబంధువు లను క్షయముచేయుటకే శౌరి యీయుత్సవమును బ్రకటించెను. యాదవులెల్లరు యాదోనిధికడకుఁ జేరి సభార్యులై విహరించు చుఁ బానగోష్ఠి సలుపుచు రక్తమాల్యములు, రక్తాంబరములు, కాశ్మీరపంకములతోడివారిని గృష్ణుఁడు వధ్యచిహ్నములు, దా ల్చినవారింగా నెంచెను. సభామధ్యమున మధుపాత్రహస్తులై యాడుచుఁ బాడుచుఁ బానసేవ, వారు చిత్రముగా నొనరించిరి.

త్రాగుటచే నొడలెఱుఁగక నవ్వు నవ్వులు పుచ్చులై వేళాకోళ ములు, దెబ్బలు, తిట్లు, చివరకుఁ గొట్లాటలోనికిఁ దిగెను. ఒక రినొకరు దూషించుకొనుచు రోషమున నక్కడఁ బెరిగిన తుంగఁ బీఁకి దానితోఁ గొట్టుకొని చచ్చిరి. స్వకులనాశము గాంచుచు న్నహలపాణి బలరాముఁడు సముద్రతీరమున విరక్తుఁడై శరీరము ను విడిచిపెట్టి తనయంశమును బురాణపురుషునిలో నెప్పటియ ట్లు చేర్చివైచెను. ఆతనిముఖమునుండి శేషుఁడు వెడలి సహస్ర ముఖములతో సహస్రముఖములు గలగంగానది సముద్రము జేరిన ట్లంబురాశిలోఁ జేరిపోయెను. శ్రీకృష్ణుఁడు చిరకాలము క్రిం దట విడిచిపెట్టిన దివమునకుఁ బోఁదలఁచిన వాఁడై యుష్ణతోఁ దేజమును విడిచిన సూర్యునివలె నిస్తేజుండయ్యెను. తాను లే నినాఁడు ద్వారవతిని సముద్రము ముంచివేయు నని యర్జునుని చేఁ బౌరులను బైటికిఁ గొనిపోఁజేయ నెంచి యాతని బిలుచుటకు దారుకుని బంపెను. తానొక్క వనములో వనదేవతలచేఁ గల్పింపఁ బడిన తమాలపల్లవశయ్యపైఁ బయోధిపూరములో వటపత్ర ముమీఁద నున్నట్లు యోగనిద్రలోఁ బవ్వళించెను. దూరము నుండి యామహాత్ముని పాదమును గాంచి మృగ మనుభ్రాంతిచే ముసలశేషమువలనఁ గావించికొనిన యలుఁగుతో నొక వ్యాధుఁ డు గొట్టెను. ఆదెబ్బకు భిన్నమైన యమ్మహనీయునిపదము సూ ర్యకిరణముచే విరిసినపద్మమువలెఁ బ్రకాశించెను. తత్క్షణము కిరా తునకుఁ జతుర్బాహుఁడును, కౌస్తుభరత్నధారి, పీతాంబరుఁడును, నగునంబుజాక్షుఁడు కనఁబడియెను. వాఁడు తొట్రుపాటుతో శర

ము నూఁడంబెజికి నెత్తురును దుడిచి యాపాదారవిందమును, శిర స్సున ధరించి, దేవ, నాయపరాధమును క్షమింపు మని ప్రార్థించెను. భూభారమును వారించుటకై యంగీకరించిన దివ్యమూర్తి గావునఁ దన షోడశసహస్రాంతఃపుర లావణ్యాభారమును గూడ భూలోకమునుండి హరియించెను. అనంతరము సురకుసుమవృష్టితో నాగాంతక మగు సుపర్ణాశ్వముపై దిక్పాలక సేవాంజలిదంతురమైన దివ్యపథమున వైకుంఠుఁడు వైకుంఠమునకు వేంచేసెను. భూలోకముతోఁ దమకుఁ బారిజాతమువలె సమస్తసుఖప్రదుఁడైన యామహాత్ముని వెంబడింపఁజాలక ద్వారవతిలోని నారీమణులు భృంగారవసదృశమైన రోదనముతోఁ బురమును మారుమ్రోయించిరి. దారుకునిమాటపై నివ్వచ్చుఁడు విష్ణుఁడై సముద్రము ముంచివేయకమున్న దుఃఖపూరముచే ముంచివేయఁబడిన హృదయములతోడి పౌరులు గలద్వారకకు వచ్చి సింహము లేనిగుహఁ జొచ్చినట్లు కృష్ణునికొలువుకూటముచు జొచ్చినటుధైర్యశాలి గావున శోకమును స్తంభింపఁజేసికొని, వృష్ణివృద్ధుల నూరార్చి యమరరత్నరాశినంతను వెలిఁగించు కృష్ణవ్రజము హరింపఁబడుటచే, నొక్క ద్వారకయే కాదు, ధారుణియంతయు శోభాహీనమయ్యె నని,యేనుఁగులపై ధనాదిభండారమును గృష్ణభార్యలను బంధువులను బౌరులను దీసికొని హస్తినాపురమునకు బైలుదేఱెను. క్రమక్రమముగా సముద్రవేల పెరిఁగి పెరిఁగి యాపురముపైఁబడి ముంచివైచెను. క్రమప్రయాణముల తో సులభమార్గముల లతామండపమందిరములలో బసచేయు

చు హస్తినకువచ్చుపౌరులు వనమధ్యమునందుండి యుద్యానవను మఱచిపోయిరి. అర్జునరక్షితులైన వృష్ణిస్త్రీలను [illegible] ధనా శచేఁ గిరాతసేన వారిపైఁబడి [illegible] ధనాదులను హరించినపుడు హా! ఫల్గున, హా కిరీటీ! యని వారెల్లను [illegible]. అనేకరాజులయొద్దనుండి తెచ్చి గుప్తముచేయఁబడిన ధనమును గొందఱును యమకాంతలను గొందఱును హరించిరి. ఆదుష్టుల ను నివారించుటకై యర్జునుఁడు ధనుస్సును వంచను గాని యది సిగ్గుచేతనే వంగిపోయెను. శబ్దభేదులైన యతనిబాణములు తన యెదుట నున్న దొంగలలో నొక్కనినైనను గొట్టలేకపోయెను. అంతియకాక విడిచినఁ బోయినవిపోయినవే మరల [illegible], [illegible] ని, తూణీరములకుఁ జేరలేదు. అది యాశ్చర్యమగుటయు. [illegible] పాటు తానును బాహ్య ఋష్యమే కొంతపనిచేయ [illegible] తముకాఁగా శేషించినధనమును స్త్రీజనమును [illegible] చేఁ గొలుపలవెంటఁ బాఱింపఁగా మిగిలిన [illegible] ఘనాగమము సముద్రమును జేర్చునట్లు తనపురమున కర్జునుఁడు చేర్చెను.

శూరవంశతరుపల్లవమైన వజ్రుని దక్షరాజ్యమునకుఁ బట్టముగట్టి ధర్మరాజు, కృష్ణుఁడు లేని యీలోకములోఁ దానుండఁదాదని పరీక్షిత్తును దమరాజ్యమునకుఁ బట్టాభిషిక్తుని చేసి భూలోకమునుండి మహాప్రస్థానమునకుఁ దానును దమ్ములును ద్రౌపదియు వల్కలములు ధరియించి పురంబు వెడలినఁ బౌరలోకము కన్నీరు వెట్టుకొనియెను. వారి నూరార్చి నడచునప్పు డాస్తి

కుక్క కూడ వారిని వలదన్నను మానక వెంబడించెను. భూప్ర దక్షిణము చేయఁగోరి యాధర్మరాజు తొలుతఁ దూర్పుదిక్కునకు మరలెను. చాపశంఖచక్రచిహ్నితములయిన శునకపదవిన్యాసముచే సుస్పష్టమైన వారిపదచిహ్నములను బట్టి వారి నెఱిఁగి మానసములోని యూర్ధ్వజనులు మ్రొక్క సాగిరి. వారియశ్రాంతప్రయాణము మహాక్రాంతమహీభృద్వాహినీనిస్తరణముచేఁ బూర్వసముద్రమాత్రరతెఁ గన్పట్టెను. మార్గమధ్యమున దర్శన మిచ్చిన వహ్నిదేవునకుఁ దన గాండీవమును దూణీరద్వయమును సమర్పించి సముద్రపు టొడ్డుననే ప్రాచి నవాచిఁ బ్రతీచిం గడచి యుదీచికి మరలిరి. అనేకదినములు వివిధారణ్యములు దాటి భాగీ[illegible] మిగిలి సోప్రమాడిరి. ఉపవాసకర్శితములగుశరీరములతో నున్నవారు గావున మొదట ద్రౌపది, పిమ్మట సహదేవుఁడును, ననంతరము నకులుఁడునుఁ, బదంపడి యర్జునుఁడు నేలంబడిరి. దక్షాగ్రగణము నడుగు వడనుడికి బహుభర్త్రాసక్తియు, మహాగర్వమును, రాజాజ్ఞయును గారణము లని, క్రిందఁబడిన [illegible]తనికి ననుతాశిత సోతు వని చెప్పి యం దందు వారిని విడిచి [illegible]మాత్రము తన్నంటి నడునఁ బోవుచున్న యజాతశత్రుని గాంచి యింద్రుఁడు "రమ్ము రథ మెక్కుము, స్వర్గమార్గనిరోధముఁ జేయు నీసారమేయమును దఱిమివేయుము. చిత్రభుజాపదానులగు నీతమ్ములను ద్రౌపదిని దివ్యదేహుల నక్కడఁ గాంచెదవు రా ర"మ్మని పిలిచెను. చిరాశ్రిత మైన యీశునకమును నే నోసు

నాకేర విడువఁజాలను. ఇది రానిదే నాకు స్వర్గలోక మక్కర రుచింపదు. భాతృసమాగమాభిలాషము నన్నిట్లు చేసినది." అని పల్కు ధర్మరాజునకుఁ గుక్కరూపమును విడిచి ప్రత్యక్షమైన నింద్రుఁడు ధర్మజుని ధర్మునిగూడఁ దన రథముపై స్వర్గమునకుఁ గొనిపోయెను. అభ్రసరిత్తరంగములచేఁ గడఁగు కల్పవృక్షములు ప్రసూనవృష్టిచే ధర్మరాజును గౌరవించెను. స్వర్గముల్లోనుండి బైలువెడలిన పాంచాలియుఁ గన్పించె భ్రాతృవర్గము ను బంధువులనుగూడి గంగాస్నానముచే మానవదేహము విడిచి ధర్మరాజు శ్రద్ధమైన దివ్యాకృతిం దాల్చెను.

ఇది కౌండిన్యసగోత్రజుం డగు క్రొత్తపల్లి సూర్యారావుచే నాంధ్రీకరింపఁబడిన యగస్త్యకృత బాలభారతమునందు

సర్వంబును బంచమాశ్వాసము.